
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 18 సంచిక: 208

SUNDAY Special | ఆదివారం 19-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆరోగ్యానందాలు

ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే మంచి పోషకాహారం, ధ్యానం వంటి వాటితోపాటు కొన్ని విషయాలపై శ్రద్ధ పెట్టాలి. వీటి 'సైడ్ ఎఫెక్ట్స్' జీవితాన్ని మార్చేస్తాయి అంటున్నాయి ప్రపంచ వ్యాప్తంగా చేసిన అనేక పరిశోధనలు.

- వివరాలు 2లో



మీ ఆలోచనలే..

అసమాన నాయకత్వ ప్రతిభ కనబరిచే టీమ్ లీడర్లు బయటి నుంచి ఎదురయ్యే సవాళ్ల వల్ల కాకుండా.. తమ అతి ఆత్మవిశ్వాసం వల్ల విఫలం అవుతుంటారని 'హార్వర్డ్ బిజినెస్ రివ్యూ' విశ్లేషించింది.

- వివరాలు 18లో

న్యూస్‌రీల్

ఎంపీలుండే అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం



ఢిల్లీలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల నివాసాలుండే అపార్ట్‌మెంట్‌ల సముదాయంలో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగనప్పటికీ ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ ఎంపీ ఫ్లాట్‌లోని సామగ్రి కాలి బూడిదైంది.

- వివరాలు 6లో ▶

ఇక ఎక్కడిదక్కడే ఆపేయండి



రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని ఇరుదేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పిలుపునిచ్చారు. ఇంతవరకు జరిగిన రక్తపాతం చాలని.. ఇకనైనా ఎక్కడిదక్కడే ఆపేసి వెనక్కు తగ్గాలని సూచించారు.

- వివరాలు 6లో ▶

కొత్త ముసుగులో 'జంగిల్‌రాజ్'



బిహార్‌లో 'జంగిల్‌రాజ్' కొత్త ముసుగు ధరించి వచ్చిందని విపక్ష ఆర్జేడీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ఆర్జేడీ పాలనలో చెలరేగిపోయిన అరాచక శక్తులు మరో రూపంలో వస్తున్నాయని ఆరోపించారు.

- వివరాలు 6లో ▶

బంద్ సంపూర్ణం

బీసీ జేఏసీ పిలుపునకు రాష్ట్రమంతటా మద్దతు

- బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్న రాజకీయ పార్టీలు... మద్దతుగా ప్రజా సంఘాలు, కుల సంఘాలు
- రోడ్డెక్కని బస్సులు... స్తంభించిన రవాణా వ్యవస్థ
- ముందస్తుగా సెలవు ప్రకటించిన ప్రైవేటు విద్యా సంస్థలు
- చాలాచోట్ల స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపారులు
- అన్ని పక్షాల మద్దతుతో ప్రశాంతంగా బంద్



రాష్ట్ర బంద్ కారణంగా ప్రయాణికులు లేక వెలవెలబోతున్న హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ వెనుకబడిన తరగతుల ఐక్య కార్యాచరణ సమితి (బీసీ జేఏసీ) శనివారం నిర్వహించిన రాష్ట్ర బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు ఈ బంద్‌లో పాల్గొనడంతో జనజీవనం స్తంభించింది. ఎక్కడా హింసాత్మక ఘటనలు లేకుండా బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రైవేటు విద్యా సంస్థలు ముందస్తుగా సెలవు ప్రకటించగా... వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు ప్రకటించారు. తెల్లవారుజాము నుంచే బీసీ జేఏసీ నేతలు, పార్టీల నాయకులు బస్సు డిపోలు, బస్ స్టాండ్‌ల ఎదుట బైఠాయించారు. అన్ని జిల్లాల్లోనూ నాయకులు బంద్ విజయవంతానికి సహకరించారు. దీంతో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. ఎంజీబీఎస్, జేబీఎస్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని బస్‌డిపోల వద్ద నిరసన కార్యక్రమాలతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు కొనసాగినప్పటికీ... బస్సులు లేకపోవడంతో విద్యార్థులు హాజరు కాలేదు. మరోవైపు జేఏసీ నేతలు వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి బంద్ పాటించాలని కోరుతూ వాటి కార్యకలాపాలను అడ్డుకున్నారు. ప్రధాన రహదారులు, చౌరస్తాల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి నిరసన తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని

మిగతా 2వ పేజీలో ▶

ఓ యువతికి గ్రూప్–2 నియామక పత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి పొన్నం, మండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు



ఉద్యోగులే మా వ్యవస్థ

'కొలువుల పండుగ'లో సీఎం రేవంత్

- కలుషితాహారం, రోడ్డు ప్రమాదాలపై విపక్షాలది రాద్ధాంతం.. ప్రజల చావు కోరుకుని రాజకీయాలు చేస్తున్నాయి
- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- గ్రూప్–2 ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాల అందజేత
- ప్రతిబిడ్డనూ ఇంగ్లిష్ మీడియంలో చదివిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ నేతలు పైశాచికానందంలో మునిగితేలుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కలుషితాహారం, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనలు జరిగిన వెంటనే అక్కడ వాలిపోయి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి ఘటనలు జరగకుండా అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, ఉద్యోగుల కృషి వల్లే ప్రభుత్వానికి మంచిపేరు

మిగతా 7వ పేజీలో ▶

రెండేళ్లయినా పనితీరు మారలేదు

- సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు
- కొందరు అధికారుల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి అసహనం
- సీఎస్, సీఎంఓ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం

7లో

మన భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్

- తీవ్రస్థాయిలో రసాయన మూలకాలు
- మానవ ఆరోగ్యానికి హానికారకాలు
- నల్లగొండ జిల్లాను వెంటాడుతున్న ఫ్లోరైడ్, గద్వాలలో క్లోరైడ్, నాగర్‌కర్నూల్‌లో నైట్రేట్ తీవ్రత
- కేంద్ర జలశక్తి శాఖ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూగర్భ జలాల్లో పరిమితులకి మించి ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్‌తోపాటు ఇతర రసాయన మూలకాలున్నట్టు కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాల పరిశీలన కోసం బావుల నుంచి 2024లో వానాకాలానికి ముందు 412, వర్షాల తర్వాత 375 నీటి నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని రీజనల్ కెమికల్ ల్యాబొరేటరీలో పరీక్షించి ఈ మేరకు ఓ నివేదికను రూపొందించింది. చాలా జిల్లాల్లోని భూగర్భ జలాల్లో మనుషుల ఆరోగ్యానికి హానికరమైన మూలకాలున్నట్టు ఈ పరీక్షల్లో తేలింది. రాష్ట్రంలోని భూగర్భ జలాలు ప్రధానంగా క్యాల్షియం బైకార్బొనేట్ రసాయన పదార్థాన్ని అధిక మోతాదులో ఉన్నట్టు తేలింది. అధిక మోతాదులో క్యాల్షియం తీసుకుంటే మూత్రపిండాలు, మూత్రాశయంలో రాళ్ల వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని కేంద్రం తెలిపింది.

19% జలాల్లో మోతాదుకి మించి ఫ్లోరైడ్

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల ప్రకారం లీటర్ నీళ్లలో మిల్లీగ్రామ్ కంటే తక్కువగా ఫ్లోరైడ్ ఉంటేనే తాగడానికి అత్యంత సురక్షితమైన నీటిగా పరిగణిస్తారు. వర్షాలకి ముందు తీసిన 252 నమూనాలు (61.2శాతం), వర్షాకాలం తర్వాత తీసిన 252 నమూనాలు(67.2శాతం) ఈ పరిమితికి లోబడే ఉన్నాయి. లీటర్ నీళ్లలో 1.01–1.5 మిల్లీగ్రామ్ ఫ్లోరైడ్ ఉంటే అనుమతించదగినదిగా భావిస్తారు. వర్షాకాలానికి ముందు తీసిన 79 నమూనాలు (19.2శాతం), వర్షాకాలం తర్వాత తీసిన 50 నమూనాలు (13.3శాతం) ఈ మేరకు అనుమతించదగిన స్థాయిల్లో

మిగతా 7వ పేజీలో ▶

బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను పరిశీలిస్తున్న రాజ్‌నాథ్, యోగి ఆదిత్యనాథ్



పాక్‌లో ప్రతి అంగుళం 'బ్రహ్మోస్' పరిధిలోనే..

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ

- ఆపరేషన్ సిందూర్ ఒక ట్రైలర్ మాత్రమే
- యుద్ధంలో భారత్ విజయం యాదృచ్ఛికం కాదు.. అదొక అలవాటు
- భారత్ వైపు కన్నెత్తి చూడొద్దని పాకిస్తాన్‌కు పరోక్ష హెచ్చరిక
- లక్నోలో తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులు సైన్యానికి అప్పగింత

6లో

ఒకే రక్త పరీక్షతో 50 కేన్సర్ల గుర్తింపు!

- కొత్త తరహా రక్త పరీక్ష విధానాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు
- కేన్సర్‌ను తొలిదశల్లో వేగంగా గుర్తించేందుకు మార్గం సుగమం

6లో

మూలవిరాట్టును వీడియో తీయడమా?

- ఎల్‌ఈడీ తెరల్లో రాజన్న దర్శన నిర్ణయంపై అర్చకుల అభ్యంతరం
- అలా చేయడం ఆగమ శాస్త్ర నిబంధనలకు విరుద్ధమని మండిపాటు
- అభివృద్ధి పనుల నేపథ్యంలో వేములవాడ ఆలయం మూసివేత



సాక్షి, హైదరాబాద్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి మూలవిరాట్టు దర్శనం విషయంలో అధికారులు చేసిన ప్రకటన వివాదాస్పదమవుతోంది. ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నందున పనులు పూర్తయ్యే వరకు ప్రధాన ఆలయంలో దర్శనాలను నిలిపివేయాలని ఇప్పటికే నిర్ణయించారు. అప్పటి వరకు సమీపంలోని భీమేశ్వరాలయంలోని మూర్తినే సాధారణ భక్తులు దర్శించుకుని పూజాధికాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై కొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజన్న దర్శన భాగ్యాన్ని కల్పించకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రధాన దేవాలయ మూలవిరాట్టు దర్శనాన్ని ఎల్‌ఈడీ తెరల ద్వారా కల్పించాలని నిర్ణయించినట్లు దేవాదాయశాఖ ఇటీవల ప్రకటించింది. ఇప్పుడు ఈ విషయంపై అర్చకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ భారత్‌లోని ప్రధాన దేవాలయాల్లో స్వామి, అమ్మవారి మూలవిరాట్టు చుట్టూ విద్యుత్తు కాంతులు కూడా ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. కేవలం నూనె దీపం వెలుగులోనే దేవుళ్ల దర్శనాలుంటాయి. మూల విరాట్టు వీడియోలు, ఫొటోలు తీయడం కూడా నిషేధం. ఎల్‌ఈడీ తెరలపై స్వామి వారి దర్శనం కల్పించాలంటే కచ్చితంగా వీడియో తీయాలి. స్వామివారి మూలవిరాట్టుపై విద్యుత్తు కాంతి ప్రసరించడం, వీడియో తీయడం... ఇలా రెండు అపచారాలకు కారణమవుతుందని అర్చకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఫొటోలు, వీడియో తీయరాదని హెచ్చరిక బోర్డులు పెట్టే దేవాదాయశాఖనే దానిని ఎలా ఉల్లంఘిస్తుందని ప్రశ్నిస్తున్నారు. దీంతో దేవాదాయ శాఖ

మిగతా 7వ పేజీలో ▶

ప్రాణం పోతున్నా పట్టదా?

- మానవత్వాన్ని ప్రశ్నార్థకం చేసిన నిజామాబాద్ కానిస్టేబుల్ హత్యోదంతం
- చుట్టూ జనం ఉన్నా సాయానికి ఒక్కరూ ముందుకు రాని వైనం

7లో

ఇంకా చెప్పాలంటే



హ్యాపీ దీపావళి!

మూసీ.. మూసేసి..

నదీ గర్భంలో మూడెకరాలు ఆక్రమించి భారీ వెంచర్

- ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని మంచిరేవులలో శ్రీ ఆదిత్య హోమ్స్ నిర్వాకం
- యథేచ్ఛగా ఎన్‌ఓసీలు జారీ చేసిన వివిధ విభాగాలు
- ఎగువన పలు ప్రాంతాలకు పెరిగిన ముంపు ముప్పు
- ఆక్రమణలను గుర్తించిన హైడ్రా.. ప్రాథమిక విచారణ పూర్తి చేసిన అధికారులు
- చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్న కమిషనర్ రంగనాథ్

సాక్షి, హైదరాబాద్: మూసీనదిని మూసేసి అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నార్సింగి ఎగ్జిట్ సమీపంలోని మంచిరేవులలో శ్రీ ఆదిత్య హోమ్స్ నిర్మించిన వాంటేజ్ వెంచర్‌పై సమగ్ర విచారణ జరుపుతోంది. ప్రాథమికంగా సేకరించిన వివరాల ప్రకారం ఈ సంస్థ మూసీ నదీ గర్భంలో దాదాపు మూడు ఎకరాలు కబ్జా చేసినట్లు గుర్తించింది. ఈ వ్యవహారంపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ 'సాక్షి'కి తెలిపారు.

ఓఆర్ఆర్‌లో భూమి పోవడంతో..

శ్రీ ఆదిత్య హోమ్స్ సంస్థ మంచిరేవులలో వెంచర్ నిర్మించడానికి గతంలో దాదాపు పది ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అయితే, అందులోని ఆరు ఎకరాలను ఓఆర్ఆర్, సర్వీసు రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించింది. కానీ, రికార్డుల్లో మాత్రం రెండు ఎకరాలను మాత్రమే సేకరించినట్లు చూపారు. ఇక్కడే భూ యజమాని తెలివిగా ఆలోచించి పక్కనే ఉన్న మూసీపై కన్నేశాడు. భూసేకరణలో రెండు ఎకరాలు మాత్రమే పోయినట్లు చూపించి మూసీ నదీగర్భంలోకి చొరబడి ఏకంగా మూడు ఎకరాలను ఆక్రమించాడు. దీనిపై వివిధ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు.. హెచ్ఎండీఏ నుంచి అనుమతి తీసుకున్న శ్రీ ఆదిత్య సంస్థ వాంటేజ్

మిగతా 7వ పేజీలో ▶



వరదలతో బండారం బట్టబయలు

ఇటీవల మూసీ పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో వాంటేజ్ టవర్స్‌లోకి భారీగా వరదనీరు వచ్చింది. ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలటంతో మూసీలో ప్రవహించాల్సిన నీరు.. ఎంఎఫ్ఎల్‌తోపాటు బఫర్ జోన్ ఆక్రమణకు గురి కావడంతో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును సైతం ముంచేసింది. ఎగువన అనేక ప్రాంతాలకు పొంచి ఉన్న ముంపు ముప్పును ఎత్తి చూపింది. దీంతో ఆ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమగ్ర విచారణకు ఆదేశించారు.


పత్తి కొనుగోలు మరింత లేటు!

- ఇప్పటికీ తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- రాష్ట్రంలోని 220 జిన్నింగ్ మిల్లులు కొనుగోళ్లకు ఎంపిక
- 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా నమోదైన రైతుల నుంచే సేకరణ
- ఇప్పటికే కొన్ని మార్కెట్లకు పత్తి
- వర్షాలతో నాణ్యత దెబ్బతినడంతో రూ.6 వేలకే కొంటున్న దళారులు

5లో



ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే మంచి పోషకాహారం, ధ్యానం వంటి వాటితోపాటు కొన్ని చిన్న చిన్న విషయాలపై శ్రద్ధ పెట్టాలి. వీటి 'సైడ్ ఎఫెక్ట్స్' జీవితాన్ని మార్చేస్తాయి అంటున్నాయి ప్రపంచవ్యాప్తంగా చేసిన అనేక పరిశోధనలు, అధ్యయనాలు. 'చిన్నగా మొదలుపెట్టి.. వాటిని కొనసాగించడం'.. ఇదే ఆరోగ్యవంతమైన జీవితానికి కొత్త సూత్రం అంటున్నారు వైద్యులు, మానసిక నిపుణులు.



ఆరోగ్యానందాలు

ఈ ఆరింటి సైడ్ ఎఫెక్ట్స్!

రాత్రి నిద్రకు అలారం



సాధారణంగా అందరూ ఉదయం లేవడానికి అలారం పెట్టుకుంటారు. కానీ, రాత్రి ఎప్పుడు పడుకుంటాం అనే దానికి ప్రాధాన్యత ఇవ్వరు. స్మార్ట్‌ఫోన్లు, ఓటీటీ వేదికలు, స్నేహితులు లేదా బంధువులతో పిచ్చాపాటీ.. ఇవన్నీ ప్రాధాన్యతలుగా మారిపోయి నిద్రా సమయం వెనక్కిపోతోంది. అందుకే, ఎన్ని గంటలకు నిద్ర పోవాలనుకుంటున్నారో అలారం పెట్టుకోవాలి. అలారం మోగగానే.. ఏ పనిచేస్తున్నా ఆపేసి నిద్రకు ఉపక్రమించాలి. అలా అలారం పెట్టుకుని పడుకున్నవాళ్లకు ప్రశాంతమైన నిద్ర పట్టడమే కాకుండా.. మర్నాడు రోజంతా చురుగ్గా ఉన్నారని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యయనం వెల్లడించింది.

ప్రకృతిని పలకరించండి

ప్రతిరోజూ కనీసం 10–20 నిమిషాలు ప్రకృతిని ఆస్వాదించండి. దగ్గరలోని పార్కుకు వెళ్లండి. అలా రోడ్డుమీదకు వెళ్లి చుట్టూ ఉన్న చెట్లు, మొక్కలు, పక్షులను చూడండి. దగ్గరిలోని చెరువుకు లేదా నదికి వెళ్లండి. మేడమీదకు వెళ్లి పరిసరాలు, మేఘాలు అన్నింటినీ ప్రశాంతంగా చూడండి. 2019లో యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ నిర్వహించిన అధ్యయనం.. ప్రకృతిని మాత్రగా (నేచర్ పిల్) అభివర్ణించింది.

స్నాక్టివిటీ.. వర్కవుట్ స్నాక్స్!

ఆరోగ్యం కోసం రోజూ జిమ్‌లో కఠినమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదు. రోజులో వీలు చిక్కినప్పుడల్లా శరీరానికి 'వర్కవుట్ స్నాక్స్' ఇవ్వండి. చిన్న చిన్న వ్యాయామాలుగా పిలిచే ఈ 'స్నాక్టివిటీ' చేస్తే చాలు. మీకు తెలియకుండానే వారానికి '150 నిమిషాల వ్యాయామం' కింద పోగుపడతాయి. ఎక్సర్‌సైజ్ స్నాక్స్ అనే పదాన్ని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కి చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ హోవర్డ్ హార్ట్‌లీ మొట్టమొదట ఉపయోగించారు. ఫోన్ మాట్లాడేటప్పుడు కూర్చుని కాకుండా.. అలా నడుస్తూ మాట్లాడండి. అన్ని సార్లూ లిఫ్ట్‌లో వెళ్లకుండా రోజులో రెండు మూడుసార్లు.. మీరుండే ఫ్లోరును బట్టి మెట్లు ఎక్కి, దిగండి. మీకు నచ్చిన పాట చూస్తూ 5–10 నిమిషాలు మామూలుగా డ్యాన్స్ చేయండి. రోజువారీ జీవితంలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఇలాంటివి ఎవరికి వారే వెతుక్కోవాలి.





భోజనం చేశాక నడవండి

భోజనం పూర్తయిన కాసేపటి వరకు కూర్చుంటే ఫర్వాలేదు గానీ.. ఎక్కువ సమయం కూర్చోవడం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. తిన్న కాసేపటి తర్వాత కనీసం ఓ 10 నిమిషాల పాటు అలా నెమ్మదిగా నడిస్తే మంచిదట. రాత్రుళ్లు టీవీల ముందు కూర్చుని భోజనం చేసే సంస్కృతి పెరిగాక భోజనం అయిపోయినా కుర్చీలోంచి లేవడం లేదు.. చూస్తున్న కార్యక్రమం అయ్యాకే లేస్తున్నారు. ఇది మంచిది కాదు.

నైట్ టైమ్.. నో ఫోన్



రాత్రిపూట బెడ్‌రూముల్లో టీవీలు చూస్తూ లేదా స్మార్ట్ ఫోన్లు చూస్తూ పడుకోవడం పెరిగిపోయింది. ఇది కంటికి మంచిది కాదనీ, వీటివల్ల 'నాణ్యమైన నిద్ర' ఉండటం లేదని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. 2024లో అమెరికాలో జరిగిన ఒక అధ్యయనంలో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు చూడకుండా పడుకున్నవారు రాత్రుళ్లు వేగంగా నిద్రపోవడమే కాదు, ఉదయాన కూడా త్వరగా లేస్తున్నారని తేలింది. చాలామందికి అర్ధరాత్రి నీళ్లు తాగడానికో బాత్‌రూముకో వెళ్తారు. అలా లేవగానే స్మార్ట్‌ఫోన్‌నే చూస్తుంటారు. అక్కడితో వదిలేయరు. లేచిన పని పూర్తయ్యాక మళ్లీ ఫోన్ అందుకుంటారు. ఇది కూడా కంటికి, నిద్రకు మంచిది కాదు.

బ్రష్ చేసే చేతిని మార్చండి



మనం రోజూ చేసే పనుల్లో కొన్నింటిని.. నెలకో రెండు నెలలకో ఒకసారి వినూత్నంగా చేయడం మన మెదడును మరింత చురుగ్గా పనిచేసేలా చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరానికి వ్యాయామాలు ఎలా అవసరమో.. మెదడుకూ అలాగే అవసరం. అలాంటి వాటిలో ఒకటి.. బ్రష్ చేసే చేతిని మార్చడం. మీరు ఇప్పటివరకూ చేస్తున్న చేతితో కాకుండా.. రేపటి నుంచి రెండో చేతితో చేయడం ప్రాక్టీస్ చేయండి.

– సాక్షి, స్పెషల్ డెస్క్

క్లుప్తంగా...

కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసింది


బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కొన్ని రాజకీయ పార్టీలు లీకులు ఇస్తున్నాయని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఉద్దేశించి బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు రాజ్యాంగపరంగా వచ్చే హక్కులు కావాలని డిమాండ్ చేశారు. బీసీలకు అనుకూలం అని చెబుతూనే.. మరోవైపు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీల నోటి దగ్గర ముద్దను ఎవరు లాక్కున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఏ రోజూ బీసీలకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 42% పదవులను బీసీలకు ఎందుకు ఇవ్వ లేదని నిలదీశారు. రాష్ట్రబంద్ ద్వారా బీసీల ఆకాంక్షలు ప్రజలకు అర్థం అయ్యాయని అన్నారు.

నోటీసులివ్వకుండా సేల్‌డీడ్‌ల రద్దు చెల్లదు

సబ్‌రిజిస్ట్రార్ ఉత్తర్వులు కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో భూములకు సంబంధించి నోటీసులు జారీ చేయకుండా సేల్‌డీడ్‌లు రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తేల్చిచెప్పింది. 2017లో సబ్‌రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది. అయితే, సర్వే నంబర్ 38, 54, 55, 56లలో చట్టప్రకారం కలెక్టర్ చర్యలు చేపట్టవచ్చని, దానికి తాము ఇస్తున్న ఉత్తర్వులు ఎలాంటి అడ్డంకి కాదని చెప్పింది. ఈ మేరకు పలు పిటిషన్‌లను అనుమతిస్తూ విచారణను ముగించింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రాసిన లేఖ ఆధారంగా శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ 2017లో 17 సేల్ డీడ్‌లను రద్దు చేశారు. అయితే దీనిని సవాల్ చేస్తూ పి.ధీరజ్ రంగారెడ్డి సహా పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తమకు, విక్రేతలకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా రద్దు చేయడం చెల్లదన్నారు. తిరిగి సేల్‌డీడ్‌లను పునరుద్ధరించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టి తాజాగా తీర్పు వెలువరించారు. నోటీసులు కూడా జారీ చేయకుండా, సేల్‌డీడ్‌లు రద్దు చేయడం చెల్లదన్నారు. సబ్‌రిజిస్ట్రార్ ఉత్తర్వులను రద్దు చేసి, చట్టప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు తేల్చిచెప్పారు.



హైదరాబాద్‌లో ఎంజీబీఎస్ వద్ద జరిగిన ధర్నాలో మహేశ్‌గౌడ్, మందకృష్ణ, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద బంద్‌లో పాల్గొన్న తలసాని, గంగుల, శ్రీనివాస్‌గౌడ్, ముఠా గోపాల్, పల్లె రవి తదితరులు



జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన బంద్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బంద్ సంపూర్ణం

▶ మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చాలని నినదించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అన్ని పక్షాల మద్దతుతో సంపూర్ణ బంద్ జరగడం ఇదే తొలిసారి. అధికార, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా అన్ని పార్టీలు ఈ బంద్‌లో పాల్గొనడం గమనార్హం.

- బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, వందలాది బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, బీసీ ఉద్యమ గీతాలతో ఆటపాటలు, ధూంధాం నిర్వహించారు.
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడతామని పలువురు మంత్రులు నినదించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్‌తోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే అన్ని పార్టీలు మద్దతు పలికాయని తెలిపారు. కానీ, బీజేపీ ఇక్కడ రాష్ట్రంలో బీసీలకు మద్దతు అంటూ కేంద్రంలో మాత్రం వ్యతిరేకంగా పనిచేస్తోందని విమర్శించారు.
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుంటోందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఆయన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో, నాగర్‌కర్నూల్‌లో, కల్వకుర్తిలో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్నారు.
- ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి పాల్గొన్నారు. తెలంగాణలో చట్టబద్ధంగా చేసిన సవరణల ఆధారంగా రిజర్వేషన్ల ఆమోదానికి మోదీ కృషి చేయాలని తుమ్మల కోరారు.
- మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించిన ర్యాలీలో కార్మిక, గనులు, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. బీసీ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌లో పాల్గొన్నారు.
- మంత్రి కొండా సురేఖ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు బంద్‌లో పాల్గొన్నారు. ఆమె రిజర్వేషన్లపై అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తొక్కిపెట్టిన బీజేపీకి బీసీల పాపం తగులుతుందన్నారు.
- ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌యాదవ్, ముఠాగోపాల్, గంగుల కమలాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బంద్‌లో పాల్గొన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి షెడ్యూల్ 9లో చేరిస్తేనే చట్టబద్ధత వస్తుందని తెలిసీ కూడా జీవో తీసుకుని ఎన్నికలకు వెళ్లేలా నోటిఫికేషన్ ఇచ్చి, న్యాయస్థానాలు కొట్టేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని విమర్శించారు.
- సికింద్రాబాద్‌లో నిర్వహించిన బీసీ బంద్‌లో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు కమిషన్లు వేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని విమర్శించారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో వద్ద జరిగిన నిరసన కార్యక్రమం స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. బస్సులు రోడ్డెక్కకుండా అడ్డుకునేందుకు బీసీ జేఏసీ నేతలు యత్నించగా పోలీసులు వారిని నిలువరించేందుకు చేసిన చర్యలతో తోపులాట చోటుచేసుకుంది.
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారంలో కల్వకుంట్ల కవితతోపాటు ఆమె కుమారుడు పాల్గొన్నారు.
- బంద్‌కు మద్దతుగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. నారాయణగూడ నుంచి కోఠి వరకు జరిగిన ర్యాలీలో సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, న్యూ డెమోక్రసీ అధికారప్రతినిధి జేవీ చలపతిరావు, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ పి.సంధ్య, పీడీఎస్‌యూ నాయకులు మహేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఎల్బీనగర్ చౌరస్తాలో బీసీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, టి.చిరంజీవులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పాట్లు..

రాష్ట్ర బంద్ నేపథ్యంలో బస్‌డిపోలు, బస్టాండ్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు జోరందుకోవడంతో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. దీంతో రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీపావళి పండుగ పురస్కరించుకుని ఊళ్లకు వెళ్లేవారు, రోజువారీ జీవనోపాధి కోసం ప్రయాణించే వాళ్లు బస్సుల కోసం బస్టాండ్ల వద్ద పడిగాపులు కాశారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకున్న ప్రైవేటు వాహనదారులు రెట్టింపు డబ్బులు దండుకునే ప్రయత్నం చేశారు. చాలాచోట్ల ఆటోలు, ట్యాక్సీలు, ఇతర ప్రైవేటు వాహనదారులు అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 4గంటల తర్వాత బస్సులు రోడ్డెక్కడంతో ప్రయాణికులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం వాణిజ్య సముదాయాలు తెరుచుకున్నాయి.

బంద్ విజయవంతం: ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, గ్రామాల్లో బీసీ జేఏసీ తలపెట్టిన బంద్ విజయవంతమైందని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ఈ బంద్‌కు అన్ని పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతిచ్చాయని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మీడియా సమావేశంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, కో–చైర్మన్ దాసు సురేశ్, కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. స్కూళ్లు, కళాశాలలు, ఆర్టీసీ ఉద్యోగులు, 135 కులసంఘాలు, ప్రతి ఒక్కరూ బీసీ బంద్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. బీసీల ఆకాంక్షల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరావాలన్నారు. 76 ఏళ్ల నుంచి బీసీలకు మోసం జరుగుతూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం లాగా, సాగర హారం, మిలియన్ మార్చ్ లాంటి కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. చట్ట సభల్లో తమ రిజర్వేషన్లు సాధించే వరకు తెగించి పోరాడుతాం అని స్పష్టం చేశారు.



నారాయణగూడలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ. చిత్రంలో కె.నారాయణ, కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు



శనివారం బంద్ కారణంగా బస్సులు లేకపోవడంతో సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మా జెండా.. ఎజెండా ఒక్కటే

విపక్షాలు కట్టుకథలు మాని అభివృద్ధికి సహకరించాలి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కేబినెట్‌లోని మంత్రులందరం రాష్ట్రాభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేస్తున్నామని, భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో అహర్నిశలు శ్రమిస్తున్నామని, మంత్రులకు ప్రత్యేక ఎజెండా ఏమీ లేదని, తమ జెండా, ఎజెండా ఒకటేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, తాము వర్గాలుగా విడిపోయి గొడవలు పడ్డామంటూ కట్టుకథలు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కథలు సృష్టించే వారంతా సినిమాల్లో రచయితలుగా ప్రయత్నిస్తే మంచిదని శనివారం ఆయన ఒక ప్రకటనలో హితవు పలికారు. దండుపాళ్యం పాలన ఎవరిదో అందరికీ తెలుసునని, అందుకే వారికి ప్రజలు కర్రు కాల్చి గట్టిగా వాతలు పెట్టారని ఎద్దేవా చేశారు. తాము పాలనను గాలికి వదిలేస్తే గత 20 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేవా? అని ప్రశ్నించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఆకర్షణలో తెలంగాణ ముందంజలో ఉందని, గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రాష్ట్రానికి రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐలు వచ్చాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెపుతారని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

'సాక్షి'పై పథకం ప్రకారమే కుట్ర..

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



విరాహత్ అలీ

సాక్షి, హైదరాబాద్: 'సాక్షి' దినపత్రికపై పథకం ప్రకారమే ఏపీలోని కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. ఆయన శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇలాంటి కుట్రలు ఈ ఒక్కసారే కాదు.. ప్రతిసారీ ఏదో విధంగా వేధిస్తూనే ఉన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్య విలువలను హరిస్తున్నారు. అందుకు ఉదాహరణ 'సాక్షి' పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసులు పెట్టడమే' అని పేర్కొన్నారు. దీన్ని తాము సీరియస్‌గా పరిగణిస్తున్నామని, ఏదో సాకుతో కేసులు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. 'సాక్షి'కి, జర్నలిస్టులకు బాసటగా నిలబడతామని అంటూ, రాజ్యాంగంపై చంద్రబాబుకు ఏ మాత్రం గౌరవం, విశ్వాసం ఉన్నా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలి



బసవ పున్నయ్య

ఏపీ కూటమి ప్రభుత్వంపై వార్తలు రాస్తోందని సాక్షి పత్రిక, ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూడటం సరైంది కాదని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ఒక ప్రకటనలో ఖండించారు. తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియాకు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. వార్తలు, కథనాలు, ప్రసారాలపై అభ్యంతరాలుంటే ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని, అలా కాకుండా 'సాక్షి'పై పదేపదే కేసులు పెట్టడం దారుణమని ఆయన అన్నారు.

ఎడిటర్‌కు నోటీసులు.. మీడియా స్వేచ్ఛను హరించడమే..



మారుతిసాగర్

ప్రచురితం చేసిన వార్తా కథనాలకు సంబంధించి ఆధారాలు వెల్లడించాలంటూ ఎడిటర్‌పై పోలీసులు ఒత్తిడి చేయడం, నోటీసులు జారీచేయడం మీడియా స్వేచ్ఛను హరించడమేనని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(హెచ్ 143) ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎడిటర్ ధనంజయరెడ్డికి పలుమార్లు నోటీసులు జారీ చేయడం, ప్రచురితమైన వార్తలకు సంబంధించి సోర్స్‌ను బహిర్గతపరచాలని హుకుం జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి చర్యల్ని జర్నలిస్టు సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు.

ఆ రెండు పార్టీలు తలచుకుంటే ఆపేదెవరు?

బీసీ రిజర్వేషన్లపై మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపు పేరిట కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు ఆడుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మద్దతు ఇస్తే బీసీ రిజర్వేషన్ల పెంపుదలను ఎవరు ఆపగలరు? అని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటులో బీజేపీకి 240, కాంగ్రెస్‌కు 99 మంది ఎంపీల బలం ఉన్నా బీసీలను మభ్య పెడుతూ ఢిల్లీలో కొట్లాడకుండా గల్లీలో డ్రామాలు చేస్తున్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయని కాంగ్రెస్, నాలుగేళ్లుగా జనగణనను వాయిదా వేస్తూ వచ్చిన బీజేపీ.. బీసీలపై కపట ప్రేమ చూపుతున్నాయని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీలకు మంత్రిత్వ శాఖను కోరిందే కేసీఆర్: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలని 2005లోనే కేసీఆర్ కోరారని, బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ అసెంబ్లీలో రెండు సార్లు తీర్మానం చేయడంతో పాటు ప్రధానిని కూడా స్వయంగా కలిశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. జనాభా సంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్లు కావాలని కోరుతున్న రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రైవేటు బిల్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదని నిలదీశారు.

ఇక 20% టెక్ సిలబస్

ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో కూడిన బోధనాంశాలు

- ప్రపంచ శ్రేణి కాలేజీలతో అనుసంధానానికి రోడ్‌మ్యాప్
- కొత్తగా రీజనల్ అకడమిక్, ఇన్నోవేషన్ క్లస్టర్లు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యాసంస్థల్లో ఆధునిక సాంకేతికతపై బోధన పెంచుతామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో అన్ని స్థాయిల్లోనూ 20 శాతం మేర కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ టెక్నాలజీ సిలబస్‌తో కూడిన బోధనాంశాలు ఉంటాయని చెప్పారు. కాలానుగుణంగా నైపుణ్యాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలి పురోగతిపై బాలకిష్టారెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉన్నత విద్యా సంస్థలను ప్రపంచశ్రేణి విద్యాసంస్థలతో అనుసంధానించేందుకు రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రీజనల్ అకడమిక్, ఇన్నోవేషన్ క్లస్టర్లను కొత్తగా తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత పాలనా వ్యవస్థను విస్తరిస్తామని తెలిపారు. ఓపెన్-యాక్సెస్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలను ప్రవేశపెట్టబోతున్నట్లు ఆయన వివరించారు. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాలతో ముందుకెళ్తామని.. డ్యూయల్ డిగ్రీ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

డీమ్డ్, ప్రైవేటు వర్సిటీల కట్టడి

రాష్ట్రంలోని డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీల ఫీజుల నియంత్రణ చేపట్టాలని అన్ని వర్గాలు కోరుతున్నందున ఈ అంశాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రస్తుతం వర్సిటీల్లో పరిశోధనల స్థాయి తగ్గిందని.. వాటిని తిరిగి పెంచేందుకు అధ్యాపకులకు అవార్డులు ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు. డిగ్రీ కోర్సుల్లో ఇకపై గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని సిలబస్ తయారు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కాలేజీ 'న్యాక్' అక్రెడిటేషన్ పొందేందుకు కృషి చేస్తామని.. 'న్యాక్'కు దరఖాస్తు చేసే కాలేజీలకు రూ. లక్ష ప్రోత్సాహకం ఇస్తామని బాలకిష్టారెడ్డి అన్నారు.

అందుబాటులో ఆంగ్ల విద్య

విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఆంగ్ల విద్యపై పట్టు సాధించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. దీనికోసం సరళమైన భాషలో పీడీఎఫ్, ఆడియోతో కూడిన ఆన్‌లైన్ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. 'అవసరం ఉన్న వారి వద్దకు ఆంగ్ల విద్య' అనే పేరుతో దీనిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ కౌన్సిల్ వెబ్‌సైట్‌కు లాగిన్ అయి ఈ మెటీరియల్ ఉచితంగా పొందొచ్చని సూచించారు. విలేకరుల సమావేశంలో మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ పాల్గొన్నారు.

తుది దశకు ఇంజనీరింగ్ ఫీజులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారం దాదాపు కొలిక్కి వచ్చినట్టు కన్పిస్తోంది. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్‌ఆర్‌సీ) చైర్మన్‌తో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన శనివారం భేటీ అయ్యారు. కాలేజీల వారీగా ఇప్పటికే ఖరారైన ఫీజులపై ఆఖరుగా కొంత కసరత్తు చేసినట్టు సమాచారం. కొన్ని కాలేజీలకు ఫీజులు పెంచడం, మరికొన్నింటికి తగ్గించినట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయి ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఇప్పటికే చేరింది. ప్రభుత్వ స్థాయిలో కొంత ఒత్తిడి రావడంతో స్వల్ప మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీపావళి తర్వాత ఫీజులపై ప్రభుత్వం జీవో ఇచ్చే అవకాశం ఉంది. ఎఫ్‌ఆర్‌సీ చైర్మన్‌తో భేటీ అనంతరం యోగితా రాణాను ఈ విషయమై మీడియా ప్రశ్నించగా, 'ఎఫ్‌ఆర్‌సీ చైర్మన్‌ను అడగండి' అంటూ దాటవేశారు. ఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరించారు.

పీఆర్సీకి డిసెంబర్ 6 డెడ్‌లైన్


పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి



సిద్దిపేట జోన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీని డిసెంబర్ 6వ తేదీలోగా ప్రకటించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి హెచ్చరించారు. సిద్దిపేటలో శనివారం జరిగిన జిల్లా సంఘం సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్‌లోగా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విస్మరించిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని దామోదర్‌రెడ్డి గుర్తుచేశారు. సీపీఎస్ రద్దు, మంచి ఫిట్‌మెంట్ పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రెండేళ్లయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షం, ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.









ప్రతివాడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితము వలన సుఖమనుభవించుట దేవుడిచ్చు బహుమానమే అని తెలిసికొంటిని.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం,
తిథి: బ.త్రయోదశి ప.1.35 వరకు, తదుపరి చతుర్దశి,
నక్షత్రం: ఉత్తర రా.6.34 వరకు, తదుపరి హస్త,
వర్జ్యం: రా.3.32 నుండి 5.15 వరకు,
దుర్ముహూర్తం: సా.4.01 నుండి 4.46 వరకు,
అమృత ఘడియలు: ప.11.02 నుండి 12.41 వరకు,
మాస శివరాత్రి, నరకచతుర్దశి.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం : 5.348
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సిద్ధరామయ్య (కర్ణాటక సీఎం) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మనం ఏదైనా ఒకటి బలంగా అనుకున్నప్పుడు, దానిని నెరవేర్చటానికి పంచభూతాలన్నీ కలసికట్టుగా ఒక్కటై మనకు సహాయం చేస్తాయని అంటారు!


ఈ మాట హైందవ పురాణ ప్రబోధమా, పవిత్ర ఖురాన్ సందేశమా, లేక పరిశుద్ధ గ్రంథ వచనమా అన్నది నాకు తెలియదు కానీ... మత విశ్వాసాలను గౌరవించటానికి ఆస్తికులు కానవసరం లేదు కనుక నేను ఈ మాటను గట్టిగా నమ్ముతాను.

నాకు ఇంకొక మాట మీద కూడా గొప్ప నమ్మకం ఉంది.

పదవి కోసం కాచుకొని కూర్చుండే మనుషులు ఆ పదవిలో ఉన్నవారిని తప్పించాలని బలంగా సంకల్పించినప్పుడు ఆ మహత్కార్యాన్ని పూర్తి చెయ్యటానికి గొలుసుకట్టుగా అంతా ఒక్కటవుతారని!

సీఎంగా నిన్న మొన్న నేను చేసిన ప్రమాణ స్వీకారానికి అప్పుడే రెండున్నరేళ్లు పూర్తి కావస్తున్నాయి. 'రొటేషనల్ ఫార్ములా' ప్రకారం మిగతా రెండున్నరేళ్ల ముఖ్యమంత్రిగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వస్తారని పార్టీలో కొద్ది రోజులుగా టాక్ నడుస్తోంది.

అసలు రాజ్యాంగంలోనే రొటేషన్ అన్నది లేనప్పుడు ఫార్ములా ఎక్కడి నుంచి వస్తుంది?!



శనివారం రాత్రి, అత్యవసరంగా డిన్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి మినిస్టర్లందర్నీ పిలిపించాను. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఒక్కరే రాలేదు.

"డీకే డిన్నర్‌కి ఎందుకు రాలేదో కనుక్కోండి పరమేశ్వర గారూ" అన్నాను.

ఆయన స్పందించలేదు. పరమేశ్వర హోమ్ మినిస్టర్. శివకుమార్ లాగే ఆయన కూడా సీఎం అవ్వాలని కోరుకుంటున్నారు.

శివకుమార్‌కి ఫోన్ చేసే ఉద్దేశాన్ని పరమేశ్వర కనబరచకపోవడంతో నేనే శివకుమార్‌కి ఫోన్ చేసి, "ఎక్కడున్నారు డీకే? మీకోసం అందరం ఎదురు చూస్తున్నాం. మీరొస్తే డిన్నర్ స్టార్ట్ చేద్దాం" అన్నాను.

"రాత్రి పూట భోజనం మానేసి రెండున్నరేళ్లు అవుతోంది సిద్ధరామయ్య గారూ! మీరంతా ఉన్నారు కదా, కానిచ్చేయండి" అన్నారు శివకుమార్.

పెద్దగా నవ్వాన్నేను. ఆయనా నవ్వారు తప్పితే వస్తున్నానని మాత్రం అనలేదు.

మెల్లిగా భోజనాలు మొదలయ్యాయి.

"చెప్పండి మిత్రులారా... పార్టీలో ఏం జరుగుతోంది? ఏం జరగబోతోంది?" అని నేనూ మొదలు పెట్టాను.

"నవంబర్ 20 తర్వాత సీఎంగా మీ ప్లేస్‌లోకి శివకుమార్ వస్తారని వినిపిస్తోంది సీఎం గారూ" అన్నారు ఎమ్మెల్సీ బోసురాజు. సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ ఆయన.

"ఇంకా...!" అన్నాను.

"మనలోనే కొందరు శివకుమార్‌తో టచ్‌లో ఉన్నట్లు వినిపిస్తోంది సీఎం గారూ" అని ఎనర్జీ మినిస్టర్ జోసెఫ్ జార్జి అన్నారు.

"శివకుమార్‌తో టచ్‌లో ఉంటున్న ఆ కొందరు ఇప్పుడీ డిన్నర్ మీటింగ్‌లో ఉండి వుండవచ్చా జోసెఫ్ జార్జ్?" అని అడిగాను.

డైనింగ్ హాల్ మొత్తం ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది. హోమ్ మినిస్టర్ పరమేశ్వర అయితే మొదటి నుంచీ సైలెంట్‌గానే ఉన్నారు.

"ఈ భోజన సమావేశంలో, ఆ కొందరు ఉన్నారో లేదో చెప్పలేను కానీ... 'ప్రభు రాత్రి భోజనం' గురించి మాత్రం చెప్పగలను సీఎం గారూ" అన్నారు జోసెఫ్ జార్జి.

"చెప్పండి" అనలేదు నేను.

శిష్యులలో ఒకరు క్రీస్తును పట్టించిన 'ద లాస్ట్ సప్పర్' గురించి ఆయన చెప్పబోతున్నట్లు నాకు అర్థమైంది.

భోజన సమావేశం ముగిసి అందరూ వెళ్లిపోతున్నప్పుడు పరమేశ్వరను ఆపాను.

"డీకేకి మీరు ఫోన్ చేయకపోతే పోయారు. కలిసినప్పుడు మాత్రం ఆయనకో మాట చెప్పండి. ఇంకో రెండున్నరేళ్లు ఆయన తన రాత్రి భోజనాన్ని మానేయవలసి ఉంటుందని చెప్పండి" అన్నాను.

ఆ మాట డీకేకి, పరమేశ్వరకి కూడా!

రాజ్యాంగం వెర్సస్ రైఫిల్

అభిప్రాయం



దానీ

మల్లోజుల వేణుగోపాల రావు లొంగిపోవడం మీద మావోయిస్టు అభిమానులకు కూడా సానుభూతి ఉంది. కానీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి పక్కన నిలబడి ఏదో ఘన విజయాన్ని సాధించినట్టు పళ్ళు ఇకిలించి నవ్వితే సహజంగానే వాళ్ళ మనోభావాలు దెబ్బతింటాయి. ఒకరు నవ్వినా మరొకరు ఏడ్చినా జరగాల్సిందే జరుగుతోంది!

మావోయిస్టు గెరిల్లాలు 70 మంది తుపాకులు తెచ్చి ముఖ్యమంత్రికి స్వాధీనం చేసి వారి చేతుల మీదుగా రాజ్యాంగ ప్రతుల్ని అందుకున్నారు. ఇదొక పారడాక్సీ వేడుక. రాజ్యాంగం వెర్సస్ రైఫిల్! ఆ వెంటనే ఛత్తీస్‌గఢ్‌లో ఆశన్న బృందం లొంగుబాటు. ఇలాంటి వేడుకలు సమీప భవిష్యత్తులో ధారావాహికంగా మరికొన్ని జరగవచ్చు.

చాలామంది మరచిపోయినట్టున్నారుగానీ, దేశంలో రక్తపాత విప్లవాన్ని నివారించడానికే రాజ్యాంగం రూపుదిద్దుకుంది. నిజాం సంస్థానంలోని తెలంగాణలో 1946 జూలై 4న రైతాంగ సాయుధ పోరాటం ఆరంభం అయింది. ఆ ఏడాది డిసెంబరు 9న భారత రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగింది. నాలుగు రోజుల తరువాత డిసెంబరు 13న జవహర్‌లాల్ నెహ్రూ లక్ష్య ప్రకటన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

రక్తపాత విప్లవ నివారణకే...

రాజ్యాంగంలో పొందుపరచిన ప్రతి ఆదర్శం వెనుక రక్తపాత విప్లవాన్ని నివారించాలనే లక్ష్యం ఉంది. అంబేడ్కర్ ఈ విషయాన్ని స్పష్టంగానే చెప్పారు. ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే బాధితులు తిరగబడి ప్రజాస్వామిక భవనాన్ని పేల్చి పడేస్తారు అని రాజ్యాంగ సభలో చేసిన తన చివరి ప్రసంగంలో హెచ్చరించారు.

మన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్ప ఆదర్శ ప్రకటనగా రూపొందడానికి కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ఒక కారణం అంటే అతిశయోక్తి కాదు. నక్సలైట్ పోరాటాల వ్యాప్తిని నిరోధించడానికే భూపరిమితి, అటవీ భూములు, ఆదివాసుల హక్కుల రక్షణ వగైరా చట్టాలు రూపొందాయి. రాజ్యాంగ తొలి ఆదర్శాలైన సమానత్వం సోదర భావాలకు మరింత స్పష్టతను చేకూర్చడానికి రాజ్యాంగ పీఠికలో మతసామరస్యం, సామ్యవాదం ఆదర్శాలు చేరింది కూడా నక్సలైట్ల భయంతోనే! అందుచేత నక్సలైట్ల పోరాటాలు, ప్రాణ త్యాగాలు వృథా ప్రయాసలు అనడానికి వీల్లేదు.

రెండు అధ్యాయాలు

వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను మన ఆసక్తి మేరకు వంద సంకలనాలుగా రాయవచ్చు. రెండు అధ్యాయాల్లో రాయాలంటే మాత్రం దానికో ప్రమాణం ఉంది. అది: 1990లకు ముందు, 1990ల తరువాత.

పెట్టుబడిదారీ సమాజం రెండు పనులు చేస్తుంది; యంత్రాల వినియోగాన్ని పెంచి సంపదని విపరీతంగా సృష్టిస్తుంది; అదే సందర్భంలో సృష్టికర్తలకు యజమానులకు మధ్య శత్రుత్వం కూడా విపరీతంగా పెంచుతుంది. ఈ రెండు ధోరణులు సమాజాన్ని అనివార్యంగా సామ్యవాదం వైపునకు నడిపిస్తాయనేది మార్క్సిస్టు మూల సిద్ధాంతం. వైచిత్రి ఏమంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రామికులు, యజమానుల మధ్య శత్రుత్వాన్ని పెంచకుండానూ బతకలేదు; పెంచినా బతకలేదు. తెలివిగా తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అది నిరంతరం సృజనాత్మకంగా జీవన్మరణ పోరాటాన్ని సాగిస్తుంటుంది.

అయితే, అంతర్గత బలహీనతలు, లోపాలు, శాపాలు కమ్యూనిస్టులకు బోలెడు ఉన్నాయి. 1990లకు కొంచెం అటూ ఇటుగా తూర్పు యూరప్‌లోని సోషలిస్టు దేశాలు పతనమయ్యాయి. సోవియట్ రష్యా విచ్ఛిన్నమైంది. చైనాలోనూ సోషలిస్టు ధోరణులు తగ్గి పెట్టుబడిదారీ ధోరణులు పెరిగాయి. ఫలితంగా, కమ్యూనిజానికి ఆమోదాంశమే ఇరుకున పడిపోయింది.

'పెట్టుబడిదారులారా... ఏకం కండి!'

సరిగ్గా ఇలాంటి సందర్భం కోసమే ఎదురుచూస్తున్న ప్రపంచ పెట్టుబడిదారులు ఏకం అయ్యారు. అప్పటికే క్లాస్ మార్టిన్ స్క్వాబ్ వంటివారు ప్రపంచ ఆర్థిక వేదికను నడుపుతున్నాడు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ 'నిర్మాణాత్మక సర్దుబాట్లు' సిద్ధాంతాన్ని రూపొందించాయి. మరోవైపు, 'వాషింగ్టన్ ఏకాభిప్రాయం' విధానం వచ్చింది. ఇదే అదనుగా, గ్యాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ సూదర్‌ల్యాండ్ ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్మాణానికి నడుం బిగించాడు. చాలాకాలం ముందే ఆస్ట్రియా రాజకీయార్థికవేత్త జోసెఫ్ షుంపీటర్ 'సృజనాత్మక విధ్వంసం' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. జోయెల్ మోక్యర్, ఫిలిప్ అఘియన్, పీటర్ హోవిట్ త్రయం దీనికో రోడ్ మ్యాప్ గీసిపెట్టారు. 2025 నోబెల్ బహుమానం ఇచ్చింది ఈ ముగ్గురికే!

వీళ్ళందరూ తెలివైనవాళ్ళు. ఎక్కడా సామ్యవాదానికి వ్యతిరేకులం అని చెప్పరు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగానూ మాట్లాడరు. మార్కెట్ ప్రజాస్వామ్యం, పర్యావరణ రక్షణ వంటి అందమైన పదాల్ని వాడుతుంటారు. మార్క్సిస్టులు సామాజిక పరిణామాలకు కొలబద్దగా భావించే ఉత్పత్తి విధానాన్ని వాళ్ళు, కమ్యూనిస్టు పార్టీలకే అర్థం కాని ఒక మార్మిక వ్యవహారంగా మార్చేశారు. ఒకరోజు మార్కెట్లో వెలిగిన బ్రాండు మరునాడు కనిపించదు. ఒకదాన్ని అర్థం చేసుకునేలోపునే దాన్ని తీసివేసి దాని స్థానంలో మరోదాన్ని ప్రవేశ పెడుతుంటారు. దీనికి వాళ్ళు పెట్టిన అందమైన పేరు 'సృజనాత్మక విధ్వంసం'!

దీనికి తోడు అనేక దేశాల్లో మతతత్త్వాలను రెచ్చగొట్టడం మొదలెట్టారు. దీనితో రాజకీయ లబ్ధిని సులువుగా పొందడమేగాక కొత్త తరాలు సామ్యవాదం వైపునకు మరలకుండా అడ్డుకోవడమూ సాధ్యం అవుతుంది. దీనికి సమాంతరంగా సామాజిక ఉనికివాద ఉద్యమాలు తలెత్తి సన్నివేశాన్ని ఇంకా సంక్లిష్టంగా మార్చాయి. ఇంత జరిగిపోతున్నా సైద్ధాంతిక రంగంలో పెట్టుబడిదారీ వ్యూహకర్తల్ని ఢీకొనే ఆలోచనాపరుల్ని కమ్యూనిస్టు పార్టీలు సృష్టించుకోలేకపోయాయి. దానికి ప్రధాన కారణం కమ్యూనిస్టు పార్టీల్లో కొనసాగుతున్న ఏకేశ్వరోపాసన!

పార్లమెంటరీ పంథా ప్రత్యామ్నాయమేనా?

ప్రపంచ పెట్టుబడిదారులు ఇంతగా విజృంభిస్తున్న సమయంలో, ఇండియాలో ప్రధాన నక్సలైట్ పార్టీగా భావించే పీపుల్స్ వార్ పార్టీ నాయకత్వ పోరులో నిండా మునిగి వుంది. ముందు కేజీ సత్యమూర్తిని తరిమేశారు. అవే పద్ధతుల్లో కొండపల్లి సీతారామయ్యను బయటికి పంపించారు. నిజానికి కొండపల్లి, సత్యమూర్తి కలిసి కొనసాగినా విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలో అనూహ్య మార్పులు ఏమీ వచ్చేవి కావు. వాళ్ళు చేయగలిగింది చేసేశారు. చరిత్రలో వాళ్ళ పాత్రలు అక్కడికే పరిమితం.

ఆ తరువాత విప్లవ పార్టీలకు నాయకత్వం వహించినవాళ్ళు ఆపాటి సమర్థులు కూడా కాదు. పెట్టుబడిదారీ సమాజంలో అతి వేగంగా జరిగిపోతున్న పరిణామాలను అర్థం చేసుకుని విరుగుడు కనిపెట్టే శక్తి వాళ్ళకు లేకపోయింది. బ్రిటిష్ కాలంలో 303 రైఫిల్ గొప్పది. ఓ నలభై ఏళ్ళ క్రితం ఏకే 47 గొప్పది. ఇప్పుడు మానవ రహిత డ్రోన్లు, యుద్ధ విమానాలు వచ్చేశాయి. పాత అవగాహనలతో, పాత ఆయుధాలతో కొత్త శక్తుల్ని ఎదుర్కోవడానికి సిద్ధమైతే అది దుస్సాహసం అవుతుంది!



◆ బ్రిటిష్ కాలంలో 303 రైఫిల్ గొప్పది. ఓ నలభై ఏళ్ళ క్రితం ఏకే 47 గొప్పది. ఇప్పుడు మానవ రహిత డ్రోన్లు, యుద్ధ విమానాలు వచ్చేశాయి. పాత అవగాహనలతో, పాత ఆయుధాలతో కొత్త శక్తుల్ని ఎదుర్కోవడానికి సిద్ధమైతే అది దుస్సాహసం అవుతుంది! కొత్తతరాల్ని ఆకర్షించలేకపోతే విప్లవ పార్టీలు వృద్ధాశ్రమాలుగా మారిపోతాయి. ఆయుధాలను ఉపయోగించడం అటుంచి వాటిని మోయడం కూడా సాధ్యం కాదు.

ఏ ఉద్యమంలో అయినా విధిగా మూడు తరాలుండాలి. యువతరం, మధ్యతరం, అనుభవతరం. అనుభవతరం బండిని లాగుతుండాలి. యువతరం బండిని గెంటుతుండాలి. కొత్త తరాల్ని ఆకర్షించలేకపోతే విప్లవ పార్టీలు వృద్ధాశ్రమాలుగా మారిపోతాయి. ఆయుధాలను ఉపయోగించడం అటుంచి వాటిని మోయడం కూడా సాధ్యం కాదు.

ఒక వ్యూహం ప్రకారం ఉద్యమాల్లోనికి యువతరం రిక్రూట్మెంటును ఆపగలిగినవాళ్ళు... కల్లోల ప్రాంతాల్లో ప్రాణరక్షణ మందుల సరఫరానూ ఆపేశారు. వృద్ధాప్యంలో వచ్చే జీవనశైలి వ్యాధులకు అడవిలో మందులు అందకపోతే అల్లకల్లోలం జరిగిపోతుంది. గ్లూకోజ్ స్థాయిలు పెరిగి రెటీనోపతితో అంధులైన నాయకులు దారి కనిపించక పోలీసులకు దొరికిపోతున్న బాధాకరమైన కేసులు ఇటీవలి కాలంలో అనేకం ఉన్నాయి.

అణగారిన సమూహాల సహజమైన ఆప్షన్ సమసమాజమే. ఆ లక్ష్య సాధన కోసం పుట్టిన పార్టీలు బలహీనంగా ఉన్నప్పుడే మరోవైపు చూడాల్సి వస్తుంది. సాయుధ పోరాటానికి ప్రత్యామ్నాయం రాజ్యాంగం అనడం కూడా ఇప్పుడు సమంజసం కాకపోవచ్చు. పాలకులు మంచోళ్ళయితే చెడ్డ రాజ్యాంగం కూడా ప్రజలకు మంచిదయిపోతుంది; పాలకులు చెడ్డోళ్ళయితే మంచి రాజ్యాంగం కూడా ప్రజలకు చెడ్డదయిపోతుందని అంబేడ్కర్ చెప్పి ఉన్నారు. ఇప్పుడు సమస్య రాజ్యాంగం మంచిదా, కాదా అన్నది కాదు; పాలకుల స్వభావం ఏమిటి అన్నదే అసలు సమస్య!

మన రాజ్యాంగానికి ప్రాణం ప్రజాస్వామిక ఎన్నికలతో కూడుకున్న పార్లమెంటరీ వ్యవస్థ. ఈ రెండింటినీ, కార్పొరేట్ మతతత్వ నియంతృత్వం భ్రష్టు పట్టించింది. ఆయుధాలు అప్పగించిన మావోయిస్టులు పార్లమెంటరీ పంథా చేపడతారా? అక్కడ మార్పులు తేగలుగుతారా? దానికి సమాధానం కోసం మరికొంతకాలం వేచిచూడాలి.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

రాజ్య ప్రాయోజితం

అభిప్రాయం



పాణి

తాత్కాలిక సాయుధ పోరాట విరమణ పేరుతో ఇద్దరు మావోయిస్టు నేతలు ప్రభుత్వానికి ఆయుధాలు అప్పగించి లొంగిపోవడం సంచలనం రేపింది. విప్లవకారులు గతంలో ఎందరో లొంగిపోయారు. కానీ, వీళ్ల లొంగిపోయిన తీరు అనేక ప్రశ్నలను లేవదీసింది. సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహావేశాలు వెల్లడవుతున్నాయి. దీనికి ప్రతిగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. లొంగిపోయి ప్రాణాలు కాపాడుకోవాలనుకోవడం తప్పా? జీవిత పర్యంతం విప్లవం చేయాలని నిర్దేశించడానికి మీరెవరు? విప్లవకారులు కలలో కూడా ఆయుధం వదలకూడదనే హక్కు ఉన్నదా? అనే నైతిక ప్రశ్నలు సంధిస్తున్నారు.

విప్లవ సిద్ధాంతాన్ని ఎదుర్కోలేకే...

విప్లవంలో అలసిపోయో, అనారోగ్యంతోనో, ఇష్టం తగ్గిపోయో ఇంటికి వచ్చిన వాళ్లను ఎవరేమంటారు? అంటే తప్పు. కానీ ఈ నాయకులు అంత సాధారణంగా ఉద్యమం నుంచి బయటికి రాలేదని గడ్చిరోలిలో, జగ్దల్‌పూర్‌లో జరిగిన లొంగుబాటు సన్నివేశాలు చూసిన వాళ్లెవరైనా గ్రహించగలరు. విప్లవోద్యమం వెనుకపడ్డానికి మావోయిస్టు పంథాయే కారణమని, తాత్కాలిక సాయుధ పోరాట విరమణ చేసి బయటికి రావాలని అనుకున్నట్లు వాళ్ల ప్రకటనలను బట్టి తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికే ఈ పని చేస్తున్నామని కూడా అన్నారు. ఇంతకుమించి ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలకు ఎట్లాంటి ప్రత్యామ్నాయమూ ప్రతిపాదించలేదు. వాళ్లు లొంగిపోయిన తీరు దాన్ని బలపరిచింది. 'తాత్కాలికం' పేరుతో శాశ్వతంగా ఆయుధాలు వదిలేయడం తప్ప, ఇంకో ఆలోచన ఏదీ లేదని స్పష్టమైపోయింది. వాళ్లు మావోయిస్టు పంథాను వ్యతిరేకించి బయటికి వచ్చారని అనుకున్న విప్లవోద్యమ విమర్శకులను నిరాశకు గురి చేశారు. 'సాయుధ పోరాట విరమణ' ప్రభుత్వ ప్రాయోజితమని తేటతెల్లమైపోయింది. ఆ సన్నివేశాల్లో కలిసిన ఇరుపక్షాలే దాన్ని నిరూపించుకున్నాయి. ఈ విషాదకర పరిణామాలు 'ఆపరేషన్ కగార్' అనే అంతర్యుద్ధం మధ్యలో జరిగాయి. ఎందుకిలా జరిగింది? అనేది ప్రత్యేక చర్చనీయాంశం.

ఈ కగార్ మారణకాండ ఆగాలని మార్చి నెల చివరిలో మావోయిస్టులు కాల్పుల విరమణను ప్రతిపాదించారు. శాంతి చర్చల కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. ప్రభుత్వం పట్టించుకోకపోగా గడువులోపే మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తానని అన్నది గాని, అది అంత తేలిక కాదని అర్థమైంది. తుపాకులను, తలకాయలను లెక్కించుకుంటూ రాజ్యం సరిపెట్టుకోదు. లక్షల సైనిక బలగాలతో, ఆధునాతన సాంకేతికతతో మనుషులను చంపుతున్నంత సులభంగా విప్లవ సిద్ధాంతాన్ని ఎదుర్కోవడం సాధ్యం కాదు. బయటి యుద్ధానికి లోపలి యుద్ధం తోడు కావాలి. మావోయిస్టు పంథా పూర్తి తప్పనీ, మారుతున్న ప్రపంచం గురించి ఆ ఉద్యమానికి ఏమీ తెలియదనీ, కేవలం సైనిక చర్యలుగా మిగిలిపోయిందనీ, కాబట్టి ఆయుధాలు వదిలేయాలనే వాదన లోపలినుంచే రావాలి. తద్వారా మావోయిస్టు పంథా తన సంబద్ధతను కోల్పోయేలా చేయాలి. రాజ్యం జాగ్రత్తగా ఆ పని చక్కపెట్టింది. కగార్ యుద్ధానికి కొనసాగింపే సాయుధ పోరాట విరమణ అనే వాదనతో కగార్ వ్యతిరేక ప్రజాస్వామిక ఆందోళన కూడా పక్కకు పోయింది.

◆ మనుషులను చంపుతున్నంత సులభంగా విప్లవ సిద్ధాంతాన్ని ఎదుర్కోవడం సాధ్యం కాదు. మావోయిస్టు పంథా తప్పనీ, కాబట్టి ఆయుధాలు వదిలేయాలనే వాదన లోపలి నుంచే రావాలి. మావోయిస్టు పంథా తన సంబద్ధతను కోల్పోయేలా చేయాలి. రాజ్యం జాగ్రత్తగా ఆ పని చక్కబెట్టింది.

ఆదివాసుల అస్తిత్వం ఏమైపోతుంది?

ఈ మొత్తం వల్ల సరికొత్త చర్చ ఆరంభమైంది. కగార్‌ను విస్మరించి మావోయిస్టు పంథా తప్పని చెప్పడానికి చాలా మంది ఉత్సాహపడ్డారు. రాజ్య దుర్మార్గాన్ని మాట్లాడటం మర్చిపోయారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ఆగిపోతే, అక్కడ ఉండే ఆదివాసుల పరిస్థితి ఏమిటి? దానికి రాజ్యం ఏమైనా హామీ పడుతుందా? ఈ పరిణామాల్లో ప్రజలను కేంద్రంగా చేసుకోవాల్సి ఉన్నది. ఆయుధాల అప్పగింత మీద ఒకింత ఆగ్రహంగా మాట్లాడినవాళ్లను ఉద్దేశించి 'అయితే మీరు వెళ్లి ఆయుధాలు పట్టుకోండి మరి' అన్నారేగానీ, కార్పొరేట్ల కోసం చుట్టుముట్టిన లక్షల సైనిక బలగాల మధ్య ఆదివాసుల అస్తిత్వం ఏమైపోతుంది? అని ప్రశ్నించుకోలేదు.

విప్లవోద్యమానికి ఆయుధాలు సెంటిమెంట్ కాదు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధమంటే రాజకీయార్థిక సాంస్కృతిక సైనిక విధానం. ఆయుధాలు కేంద్రంగా మావోయిస్టు ఉద్యమాన్ని చూసేవాళ్లకు ఇది తెలియదు. విప్లవాన్ని ప్రజల వైపు నుంచి చూడాలి. సమకాలీన సామాజిక పరిణామాలు, నానాటికీ బలపడుతున్న రాజ్యం, ప్రజల దుర్భరస్థితి సాయుధ పోరాట అవసరాన్ని పెంచుతున్నాయి. ప్రజాస్వామిక పోరాటాలకు కనీస అవకాశం లేని, ఏ పోరాటమూ కొద్ది కాలం కూడా స్థిమితంగా కొనసాగలేని పరిస్థితుల్లో రాజ్యాంగబద్ధ పోరాటాల, సాయుధ పోరాటాల మేళవింపుతోనే ఈ స్థితిని అధిగమించడం, ప్రజల్ని సమీకరించడం సాధ్యం. నిరంతర ఆత్మవిమర్శతో ఉద్యమాలు తప్పొప్పులను పరీక్షించుకోవాలి.

ఈ వైపు నుంచి చూస్తే కొత్త చారిత్రక ప్రపంచంలో విప్లవం చేస్తున్నామనే ఎరుక ఉన్నదని మావోయిస్టులు తమ ఆచరణతో ఇప్పటికే రుజువు చేసుకున్నారు. గత ఇరవై ఏళ్ల ప్రపంచ విప్లవోద్యమాల్లో మావోయిస్టు పంథా కొన్ని విజయాలు సాధించింది. అయినా వాళ్ల ముందు అనేక ఆచరణాత్మక సవాళ్లు ఉన్నాయి. రాజ్య నిర్బంధం వల్ల ఇటీవల కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యారు. ఈ లొంగుబాట్లతో మరింత కుంగిపోవచ్చు. కొందరు దీనికంతా విప్లవోద్యమ పంథా కారణం అంటున్నారు. మావోయిస్టు పంథా ఆరంభమైనప్పుడే ఓడిపోయిందని అంటున్నారు. ఈ చమత్కారాన్ని వాస్తవ చరిత్ర అంగీకరించదు!

వ్యాసకర్త 'విరసం' సభ్యులు

ఏ స్థాయికి ఎదిగినా వివక్ష తప్పదా?

అభిప్రాయం



డా॥ గుర్రం సీతారాములు

దేశంలో మనువాదం తన ప్రభావాన్ని ఏమాత్రం కోల్పోలేదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన బూటు దాడి ప్రయత్నం మరోసారి నిరూపించింది. అలాగే గవాయ్ తల్లిని ఈ దాడికి ముందే ట్రోల్ చేయడం చూస్తే... అణగారిన వర్గాల వారు స్వేచ్ఛగా సొంత నిర్ణయాలు తీసుకుంటే సనాతనవాదులు ఇబ్బంది పెడతారని స్పష్టమవుతోంది. జస్టిస్ గవాయ్ కుటుంబంపై జరిగిన వివక్షా పూరిత భౌతిక, మానసిక దాడులను ఈ కోణంలోనే చూడాలి.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్లు నిండిన సందర్భంగా మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించనున్న సభకు జస్టిస్ గవాయ్ తల్లి 'కమలతి థాయి'ని ప్రధాన వక్తగా ఆహ్వానించారు. ఆహ్వాన పత్రంలో ఆమె పేరు కూడా వేశారు. అయితే ఆమె అనుమతితోనే ఆమె పేరును ఆహ్వాన పత్రంలో వేశారో లేదో గానీ... విషయం తెలుసుకున్న ఆమె సదరు సభకు తాను రాలేను అని నిర్వాహకులకు ఉత్తరం రాశారు. తన కుటుంబం దశాబ్దాలుగా అంబేడ్కర్ ఆలోచనల భావజాలంతో పనిచేస్తున్నదని అంటూ... తన భావజాలానికి భిన్నమైన వేదికను పంచుకోవడం తనకు ఇష్టం లేదని ఆమె స్వాభిమాన ప్రకటన చేశారు. ఈ ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. బీఆర్ గవాయ్ తండ్రి రామకృష్ణ సూర్యభన్ గవాయ్... అంబేడ్కర్ స్థాపించిన 'రిపబ్లికన్ పార్టీ' వ్యవస్థాపక సభ్యులు. 'బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక సమితి' నాగపూర్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. అంబేడ్కర్ తన చివరి రోజుల్లో వేలాదిమందితో కలిసి నాగపూర్‌లో 'దమ్మ దీక్ష' తీసుకున్నప్పుడు ఆయనతో పాటు బౌద్ధాన్ని స్వీకరించిన పాతికేళ్ల యువకుడు.

ఇటువంటి కుటుంబ నేపథ్యం ఉన్న కమలతి థాయి తిరస్కారాన్ని నిర్వాహకులు అవమానంగా భావించి సామాజిక మాధ్యమాలలో విపరీతంగా ట్రోల్ చేశారు. ఆమెను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేశారు. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే సుప్రీంకోర్టులో తన కొడుకు అయిన చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మీద దాడి ప్రయత్నం జరిగింది. అంత ఉన్నత పదవిలో ఉన్నా ఆయనపై పాదరక్షతో ఎందుకు దాడి ప్రయత్నం జరిగినట్లు?



జస్టిస్ బీఆర్ గవాయ్

◆ ఆనాడు అంబేడ్కర్‌కు జరిగిన అవమానం, నేడు గవాయ్ కుటుంబానికి జరిగిన అవమానం రెండింటికీ ప్రాచీన కాలం నుంచి నేటికీ కొనసాగుతున్న వివక్ష జాడ్యమే కారణం.

ప్రసిద్ధ ఖజురహో పర్యాటక ప్రాంతంలో '10–12 శతాబ్దాల కాలానికి చెందిన ప్రాచీన విష్ణుమూర్తి విగ్రహానికి మరమ్మతులు జరిపించేలా కోర్టు ఆర్డర్ ఇవ్వాలి' అని ఓ న్యాయవాది ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. సదరు విగ్రహం పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉండటం మూలంగా దాని మీద కోర్టుల జోక్యం కుదరదని చీఫ్ జస్టిస్ గవాయ్ అన్నారు. సదరు పిటిషన్ వేసిన న్యాయవాదికి ఆ విషయం తెలియంది కాదు. వాస్తవానికి అది కోర్టు పరిధిలో లేని అంశం. తెలిసి కూడా పదే పదే వాదన చేస్తున్న అతణ్ణి ఉద్దేశించి 'వెళ్ళి ఆ దేవుడినే ప్రార్థించండి' అన్నారు. ఆ ఘటన తర్వాత ఆ మాటను అవమానంగా భావించిన మరో వకీలు రాకేశ్ కిశోర్ చీఫ్ జస్టిస్ మీద దాడి చేశాడు.

ఆర్‌ఎస్‌ఎస్ ఉత్సవాలకు చీఫ్ జస్టిస్ గవాయ్ తల్లిని వక్తగా పిలిచినట్టే... సరిగ్గా ఎనభై తొమ్మిదేళ్ల కింద 'జాత్ పాక్ తోడక్ మండల్' అనే సంఘం తమ వార్షిక ఉత్సవానికి అంబేడ్కర్‌ను ముఖ్యవక్తగా లాహోర్ ఆహ్వానించారు. కుల అసమానతలు తొలగించే లక్ష్యంతో ఏర్పాటు అయిన ఆ సంఘ బాధ్యులు మీటింగ్ జరగడానికి ముందే బాబా సాహెబ్‌ను తన ప్రసంగ పాఠాన్ని పంపించాల్సిందిగా కోరారు. ఆ ప్రసంగ పాఠాన్ని ముందే చదివిన నిర్వాహకులు అందులో ఉన్న అంశాల పట్ల అంగీకారం లేదని మీటింగ్‌నే రద్దు చేసుకున్నారు. ఆనాడు అంబేడ్కర్ కుల నిర్మూలన పట్ల తనకు ఉన్న మేధను జోడించి రాసుకున్న ఆ ప్రసంగ పాఠమే 'కుల నిర్మూలన'. ఆనాడు అంబేడ్కర్‌కు జరిగిన అవమానం, నేడు గవాయ్ కుటుంబానికి జరిగిన అవమానం రెండింటికీ ప్రాచీన కాలం నుంచి నేటికీ కొనసాగుతున్న వివక్ష జాడ్యమే కారణం.

వ్యాసకర్త ఇండిపెండెంట్ రిసెర్చర్ । 77805 87586

హరిత దీపావళి చేద్దాం!

దీపావళి– ఆనందం, కాంతి, సంపద, ఐక్యతకు ప్రతీక. భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రముఖ పండుగలలో దీపావళి ఒకటి. ప్రజలు తమ ఇళ్లను, వీధులను దీపాలు, వెలుగులు, రంగోలీలతో అలంకరించి, ధార్మిక ఆచారాల్లో పాల్గొంటారు. బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం, కొత్త ఆశలు, సానుకూల ఆరంభాలను పంచుకోవడం దీపావళి వేడుకలో భాగం.

కానీ, పెద్ద మొత్తంలో పటాకులు కాల్చడం వలన వాయు, శబ్ద కాలుష్యం తీవ్రంగా పెరుగుతుంది. పరిశోధనల ప్రకారం... దీపావళి రోజుల్లో కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి హానికర వాయువులు అధికంగా విడుదలవుతాయి. ఇది ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సమస్యలు, కంటి మంటలు, చర్మ వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. జంతువులు, పక్షులు కూడా శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ఈ సమస్యకు పరిష్కారం గ్రీన్ క్రాకర్స్! ఇవి వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. అల్యూమినియం, బేరియం, పొటాషియం నైట్రేట్ వంటి హానికర రసాయనాలు పరిమితంగా ఉంటాయి. నీటి ఆవిరి విడుదల ద్వారా ధూళి కణాలను గాలిలో ఎగరనివ్వకుండా చేస్తాయి. అలాగే లిథియం, ఆర్సెనిక్, సీసం వంటి హానికర పదార్థాలు ఉండవు.

గ్రీన్ క్రాకర్స్‌ను భారతదేశంలో సీఎస్ఐఆర్–ఎన్ఈఈఆర్ఐ వంటి సంస్థలు అభివృద్ధి చేశాయి. సఫల్, శ్వాస్, స్టార్ వంటి రకాలు సాధారణ పటాకులతో సమాన ఉత్సాహాన్ని ఇస్తూ, వాతావరణ కాలుష్యాన్ని 30% వరకు తగ్గిస్తాయి. వాటిని గుర్తించడానికి సీఎస్ఐఆర్ – ఎన్ఈఈఆర్ఐ గ్రీన్ లోగో, క్యూఆర్ కోడ్‌లు ఉంటాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ధ్రువీకరణ పొందవచ్చు.



మనందరం ఈ దీపావళిని పచ్చదనం, ప్రకృతి అనుకూలతలతో జరుపుదాం. తక్కువ పటాకులు లేదా గ్రీన్ క్రాకర్స్ వాడటం, మట్టి దీపాలు వెలిగించడం, చెట్లను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు. సుఖసంతోషాలతో నిండి, ఆరోగ్యానికి హానికరం కాని హరిత దీపావళిని జరుపుకోవడం మనందరి బాధ్యత. ప్రకృతిని రక్షిస్తూ, వెలుగులను పంచుదాం!

– డా॥ కృష్ణ కుమార్ వేపకొమ్మ
ప్రొఫెసర్ – ప్రిన్సిపాల్ (రిటైర్డ్)

పత్తి కొనుగోలు మరింత లేటు!

ఇప్పటికీ తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు

- రాష్ట్రంలోని 220 జిన్నింగ్ మిల్లులు కొనుగోళ్లకు ఎంపిక
- 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా రిజిస్టర్ అయిన రైతుల నుంచే సేకరణ
- ఇప్పటికే కొన్ని వ్యవసాయ మార్కెట్లకు పత్తి
- వర్షాలతో నాణ్యత దెబ్బతినడంతో రూ. 6 వేలకే కొంటున్న దళారులు


పత్తి యార్డులో కొనుగోళ్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి పంట సేకరణ వేగవంతమైనప్పటికీ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదు. దళారీ వ్యవస్థను, జిన్నింగ్ మిల్లుల అక్రమ దందాను నిరోధించేందుకు సీసీఐ తెచ్చిన కొత్త నిబంధనలతో తలెత్తిన వివాదంతో మిల్లర్లు ఈనెల మొదటి వారందాకా పత్తి కొనుగోళ్ల టెండర్లలో పాల్గొనలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చొరవతో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు కొనుగోళ్లకు ముందుకొచ్చినప్పటికీ మిల్లులను నోటిఫై చేసే ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో దీపావళి మరుసటి రోజు నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ చెబుతున్నప్పటికీ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఇప్పటికే పత్తికి పెద్ద మార్కెట్ అయిన వరంగల్ జిల్లాలోని ఎనుమాముల పత్తి లోడ్‌లతో నిండిపోయింది. వచ్చిన పత్తిని జిన్నింగ్ మిల్లుల ఏజెంట్లు, దళారీలు తక్కువ ధరకే కొంటున్నారు. పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110 ఉండగా, రూ. 6వేల లోపే కొంటున్నారు. సీసీఐ కొనుగోళ్లు ఆలస్యమయ్యే కొద్దీ రైతులు దళారులను ఆశ్రయించడం పెరుగుతోంది.

ఎల్–1, ఎల్–2 మిల్లుల ఎంపిక తరువాతే...

పత్తి జిన్నింగ్ కోసం సీసీఐ విడుదల చేసిన టెండర్‌లో లింట్ శాతం, ఎల్–1, ఎల్–2 కింద మిల్లుల కేటాయింపు, అలాట్‌మెంట్ స్లాట్ బుకింగ్, ఏరియా మ్యాపింగ్ కోసం ఉన్న నిబంధనలను మిల్లర్లు తొలుత వ్యతిరేకించారు. దాంతో రెండుసార్లు టెండర్లు ఆహ్వానించినా, పాల్గొనలేదు. ఈనెల 6న మంత్రి మిల్లర్లతో సమావేశమై భరోసా ఇవ్వడంతో మిల్లులు టెండర్లు దాఖలు చేశాయి. రాష్ట్రంలోని 30 జిల్లాల్లోని 343 మిల్లులకు పత్తిని జిన్నింగ్ చేసే సామర్థ్యం ఉండగా, ఇప్పటివరకు 22 జిల్లాల కలెక్టర్లు 220 మిల్లులను నోటిఫై చేశారు. మిగతా 8 జిల్లాల్లో నోటిఫై కావాల్సి ఉంది. మిల్లులను నోటిఫై చేశాక ఎల్–1, ఎల్–2 కింద ఎంపిక చేయాల్సి ఉంది. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా రైతులు తాము విక్రయించాల్సిన పత్తి కోసం స్లాట్ బుక్ చేసుకుంటే, ముందుగా ఎల్–1 కింద మిల్లులకు పత్తిని కేటాయిస్తారు. ఎల్–1లోని మిల్లుల కెపాసిటీకి తగినంత పత్తిని పంపాక, ఎల్–2 మిల్లులకు పంపిస్తారు.

వర్షాలతో దెబ్బతిన్న పంట

రాష్ట్రంలో రెండు నెలలుగా కురుస్తున్న అకాల వర్షాలతో చాలాచోట్ల పత్తి పంట దెబ్బతింది. పత్తి చేన్లలో నీరు నిలిచి దిగుబడిపై ప్రభావం చూపినట్లు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మొదటి విడత పికింగ్ (ఏరిన) పత్తిని రైతులు తమ వద్ద నిల్వ చేశారు. రాష్ట్రంలో ఈసారి 46 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. అయితే వర్షాల కారణంగా దెబ్బతినడంతో అది 25 లక్షల మెట్రిక్ టన్నుల లోపే ఉండొచ్చని భావిస్తున్నారు. గత ఏడాది 44.73 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయగా, 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.

క్వింటాల్‌కు రూ.1,300 నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 8 శాతం తేమ ఉన్న పత్తికి రూ.8,110 చెల్లించి సీసీఐ కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం అదే క్వాలిటీ ఉన్న పత్తికి ప్రైవేటు వ్యాపారులు రూ.6,800 చెల్లిస్తున్నారు. అంటే క్వింటాల్‌కు రూ.1,300 వరకు నష్టపోతున్నాం. – రవి, పత్తి రైతు చౌళ్లపల్లి, ఆత్మకూరు మండలం, హనుమకొండ జిల్లా

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



సీసీఐ లేకపోవడం వల్ల పత్తి నాణ్యత ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర చెల్లించడం లేదు. సీసీఐ ఉంటే క్వింటాకు రూ.వేయి అదనంగా వస్తుంది. అందువల్ల వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. – పల్లెశ్యాం, పత్తి రైతు తోగరు రామయ్యపల్లె, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా

యాప్‌లో నమోదు చేసుకోవాలి



పత్తి రైతులు తమ పంట వివరాలను మండల వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలి. తాత్కాలికంగా నమోదు ప్రక్రియ పూర్తయితే మరోసారి నమోదు చేసే అవకాశాల్లేవు. యాప్‌లో నమోదు చేసుకోకుంటే కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు తప్పవు. – ఉప్పల శ్రీనివాస్, ఆర్‌జేడీఎం, వరంగల్

లొంగు'బాట'లో మరికొందరు

- ప్రయత్నాల్లో బస్తర్ ఆవలి దళాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టుల లొంగుబాటు పరంపర ఇప్పుడే ఆగేలా లేదు. ఆ పార్టీ మాజీ అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, తక్కళ్లపల్లి వాసుదేవరావు బాటలో ఆయుధాలు వదిలేందుకు బస్తర్ ఆవల ఉన్న దళాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ మేరకు ఉదంతి ఏరియా కమిటీ నుంచి సునీల్ పేరుతో శనివారం ఓ లేఖ విడుదలైంది. 'సాయుధ పోరాటాన్ని కొనసాగించడంలో విఫలమైనట్టు సెంట్రల్ కమిటీ ప్రకటించింది. లొంగిపోవాలంటూ దళ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఇప్పటికే ఆలస్యమైంది. మనం ప్రాణాలతో ఉంటే భవిష్యత్‌లో పోరాటం కొనసాగించవచ్చు. గరియాబంద్ జిల్లాలో లొంగిపోయేందుకు మా దళం వెళ్తోంది. సమీపంలో ఉన్న గోబ్రా, సీనాపాలి, సీతానది, ఉత్తర ఒడిశా దళాలు కూడా మాతో కలవాలని కోరుతున్నాం. లొంగిపోయేందుకు వచ్చేవారు తమ వెంట ఆయుధాలు తీసుకుని రావాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఒడిశాలో ఇతర ప్రాంతాల్లో ఉన్న దళాలు కూడా ఆయుధాలు వదిలేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాబోయే రెండు వారాలపాటు ఈ లొంగుబాట్ల ప్రక్రియ వేర్వేరు ప్రాంతాల్లో జరిగే అవకాశముందని సమాచారం.

ధరణిమాత కన్నుమూత

- ధర్మసాయి ట్రస్టు ద్వారా ధార్మిక, సామాజిక సేవలు
- గణిత మేధావి శకుంతలాదేవికి స్వయానా సోదరి



శంషాబాద్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సాయిబాబా భక్తురాలు ధరణిమాత శనివారం ఉదయం తన స్వగృహంలో కన్ను మూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన బాబా భక్తులు, మాత పరి చయస్తులు ఆమెకు ఘనంగా నివాళులర్పించా రు. ధరణిమాత బెంగళూరుకు చెందిన కన్నడ బ్రాహ్మణులైన సుందరరాజారావు, సుందర మ్మల కుమార్తె. గణిత శాస్త్ర మేధావి, హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలాదేవి ధరణిమాతకు స్వయానా సోదరి. తొలి నుంచి సాయిబాబా భక్తురాలైన ధరణిమాత 1990లో ప్రస్తుత శంషాబాద్ పట్టణంలోని ఎత్తైన కొండ ప్రాంతంలో ధర్మగిరి దేవాలయాన్ని స్థాపించారు. ఆమె అంత్యక్రియలు ఆలయం పక్కనే ఉన్న స్థలంలో కుమారుడు, ఆలయ ట్రస్టీ శివదత్తసాయి, కుటుంబసభ్యులు పూర్తి చేశారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తాం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం ప్రజాభవన్‌లో తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ గణన, ప్రొబేషన్ డిక్లరేషన్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, స్పోర్ట్స్ కోటాలో 98 మందిని విధుల్లోకి తీసుకోవడం, మెడికల్ బిల్లుల క్లియరెన్స్, స్పౌస్, మ్యూచువల్ బదిలీలు.. తదితర సమస్యలను ప్రస్తావించారు. పంచాయతీ కార్యదర్శుల వినతి పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి, ఆయా అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజనను ఆదేశించారు. పీఆర్ శాఖ పరిధిలో పరిష్కరించదగిన సమస్యలపై వెంటనే ఫైలును సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అన్ని అంశాలపై నిర్ణయాలు తీసుకుంటామని సంఘం ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో ఫెడరేషన్ ప్రతినిధులు ఎ.శ్రీకాంత్‌గౌడ్, ఎం.శశిధర్, ఎం.హరికృష్ణ తదితరులున్నారు.


రైతులకు విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తి చేసిన విత్తనాలు

- అధికారులతో సమావేశంలో టీజీ సీడ్స్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే యాసంగి సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చేస్తున్న కృషికి ఇతర ప్రభుత్వరంగ సంస్థలుతోడ్పాటు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ యాస్మిన్ బాషా, ఆగ్రోస్ ఎండీ రాములుతో కలిసి సెర్ప్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీ సీడ్స్ పేరిట వరితో పాటు శనగ, వేరుశనగ, మినుము, నువ్వులు, కొర్రలు, పెసర వంటి పంటలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలను సంస్థ ఉత్పత్తి చేసిందని తెలిపారు. వీటిని రైతులకు చేరవేస్తే విత్తనాల కోసం వారు పడే బాధలను దూరం చేసినట్లు అవుతుందన్నారు. రైతు వేదికల ద్వారా రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచే అంశాన్ని వ్యవసాయ శాఖ పరిశీలించాలని కోరారు. అలాగే సహకార సంఘాలు, ఆగ్రోస్, మహిళా సంఘాల ద్వారా విత్తనాల పంపిణీ అవకాశాలను పరిశీలించాలని కోరారు.

ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ల బురిడీ!

- ఫేక్ ఐడీలతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను బెదిరించి రూ.1.07 కోట్లు వసూలు
- హైదరాబాద్‌లో కేసు నమోదు


ఊహా చిత్రం

సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. తాజాగా వారి ఉచ్చులో టీడీపీ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పడ్డారు. ఫేక్ ఐడీలతో బెదిరించి భారీ స్థాయిలో దోచుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెబ్ మీడియా ద్వారా తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. ముంబై సైబర్‌క్రైమ్ అధికారులుగా నటించిన మోసగాళ్లు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌ను మనుషుల అక్రమ రవాణా, మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ బెదిరించి ఆయన నుంచి డబ్బులు గుంజారు. ప్రొవిజనల్ బెయిల్ పేరుతో రూ.1.07 కోట్లను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటున్న ఎమ్మెల్యే పుట్టాకు అక్టోబరు 10 ఉదయం 7.30 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తను ముంబై సైబర్ క్రైమ్ విభాగం అధికారిగా పరిచయం చేసుకున్నారు. ఆపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, 17 ఫిర్యాదులు కూడా అందాయని చెప్పాడు. ఆధార్, సిమ్‌కార్డు వాడి నకిలీ బ్యాంకు ఖాతా కూడా తెరిచారని, ముంబైలో కొనుగోలు చేసిన సిమ్ కార్డు ద్వారా అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు చెప్పాడు. కొద్ది నిమిషాలకు మరో వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్‌లోకి వచ్చాడు. తాను సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అధికారి అని చెప్పి నకిలీ అరెస్టు వారెంట్, సీబీఐ అకౌంట్ ఫ్రీజ్ ఆర్డర్ చూపించి నమ్మించినట్లు సమాచారం. ఏం చేయాలో తెలియక ఎమ్మెల్యే తన ఖాతాకు ఎక్కడి నుంచి డబ్బులు వచ్చిందని అవతలి వ్యక్తిని ప్రశ్నించారు. కెనరా బ్యాంకు ఖాతాలో రూ.3 కోట్లు డిపాజిట్ అయ్యాయని, వాటిని తిరిగి ఇచ్చేలా సహకరించకపోతే అరెస్టు చేస్తామని మోసగాళ్లు బెదిరించినట్లు తెలుస్తోంది. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ అక్టోబర్ 15లోపు రూ.1.07 కోట్లు సైబర్ మోసగాళ్ల అకౌంట్‌కు పంపించినట్లు సమాచారం. కాగా, మరో రూ.60లక్షలు పంపిస్తే కోర్టు క్లియరెన్స్ సర్టిఫికెట్ పంపిస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే, గురువారం రాత్రి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పీక కోసి యువకుడి హత్య

- కాకినాడలో దారుణం.. ప్రేమ వ్యవహారమే కారణం


శామ్యూల్ రాజు

కాకినాడ క్రైం: కాకినాడలో దారుణం చోటు చేసుకుంది. 20 ఏళ్ల యువకుడు 18 ఏళ్ల యువకుడిని దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం మేరకు.. కాకినాడ గ్రామీణ మండలం ఇంద్రపాలెం గ్రామం చాకలిపేటకు చెందిన గంటా శామ్యూల్ రాజు (18), ఎల్విన్‌పేటకు చెందిన 20 ఏళ్ల అభివర్దన్‌కు మధ్య ఓ యువతి కోసం కొన్నాళ్ల క్రితం గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శామ్యూల్ రాజును అభివర్దన్ శుక్రవారం రాత్రి ముత్తా వారధి సమీపంలో సర్కిల్ నుంచి పెద్ద ఇసుక మేటలు ఉన్న ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. శ్రీనివాస్ అనే మరో యువకుడితో కలిసి రాజుతో గొడవపడ్డాడు. ఉద్దేశపూర్వకంగా మాటామాటా పెంచి దాడి చేశాడు. అనంతరం వెంట తెచ్చుకున్న కత్తితో పీక కోసి దారుణంగా హతమార్చాడు. శ్రీనివాస్ సాయంతో రాజు మెడకు తాడు కట్టి అక్కడే ఉన్న పెద్ద డ్రైనేజీలో పడేశాడు. శనివారం ఉదయం స్థానికులు డ్రైనేజీలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం బయటపడింది. కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- తల్లీ కుమార్తె మృతి
- కూతురు గృహప్రవేశానికి వెళ్లిన తల్లిదండ్రులు


రమాదేవి


తేజస్విని

మంచిర్యాల క్రైం: అమెరికాలోని చికాగోలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాలకు చెందిన తల్లీకూతురు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. దీంతో మంచిర్యాలలో విషాదం నెలకొంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని రెడ్డికాలనీకి చెందిన పాత విగ్నేష్, రమాదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు స్రవంతి, తేజస్విని. ఇద్దరికీ వివాహం చేయడంతో అమెరికాలోని చికాగోలో పదేళ్లుగా కుటుంబాలతో ఉంటున్నారు. ఏడాదికోసారి రెడ్డికాలనీలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి వెళ్తున్నారు. తేజస్వినికి భర్త కిరణ్, ఇద్దరు కుమారులు ఉన్నారు. తేజస్విని దంపతులు అక్కడే ఓ ఇల్లు కొనుగోలు చేశారు. ఈ నెల 15న విగ్నేష్, రమాదేవి దంపతులు కూతురు గృహప్రవేశానికి వెళ్లారు. గృహప్రవేశం మూడు రోజుల క్రితం జరిగింది. శనివారం ఉదయం తేజస్విని, కిరణ్, వీరిద్దరి కుమారులతో కలిసి విగ్నేష్, రమాదేవి దంపతులు కారులో తమ పెద్ద కూతురు స్రవంతి కుమారుడి జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వేరే ప్రాంతంలో ఉంటున్న వారి ఇంటికి బయల్దేరారు. వారి కారును భారీ ట్రక్కు ఢీకొనడంతో తేజస్విని(33), రమాదేవి అక్కడికక్కడే మృతిచెందారు. కిరణ్, ఇద్దరు కుమారులు, విగ్నేష్ స్వల్పంగా గాయపడ్డారు.

పరువు హత్య.. కోడలి ప్రాణం తీసిన మామ

- కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడని ఘాతుకం


శ్రావణి

దహెగాం: కొడుకు కులాంతర వివాహం చేసుకున్నాడని ఆ తండ్రి కక్ష పెంచుకున్నాడు. కోడలితో కలిసి అత్తారింటి వద్దే కొడుకు ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా కోడలిని హతమార్చాలని పన్నాగం పన్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిండు గర్భిణి అని కూడా చూడకుండా గొడ్డలితో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. ఈ సంఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గెర్రె గ్రామానికి చెందిన తలాండి శ్రావణి (22), ఇదే గ్రామానికి చెందిన శివార్ల శేఖర్ ప్రేమించుకుని గత సంవత్సరం కులాంతర వివాహం చేసుకున్నారు. దీంతో శేఖర్ తండ్రి సత్తయ్య అప్పటి నుంచి వారిపై కక్ష పెంచుకున్నాడు. భార్య శ్రావణి ఉరఫ్ రాణితో కలిసి శేఖర్ అత్తారింటి వద్దే ఉంటున్నాడు. శనివారం శేఖర్ తన అత్తామామలు చెన్నయ్య, అనూషలతో కలిసి వంట చెరుకు తీసుకురావడానికి గ్రామ సమీపంలోని అడవికి వెళ్లాడు. గర్భిణి అయిన శ్రావణికి వైద్యులు వచ్చే నెల 17న ప్రసవ సమయం ఇచ్చారు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించిన మామ సత్తయ్య గొడ్డలితో ఇంట్లోకి చొరబడ్డాడు. నిండు గర్భిణి అని కూడా చూడకుండా శ్రావణిపై దాడి చేశాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నంలో బయటకు పరుగులు తీసినా వెంబడించి మరీ దాడి వేటువేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ కుమారస్వామి, పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. కాగా, సత్తయ్య పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

పాక్‌లో ప్రతి అంగుళం 'బ్రహ్మోస్' పరిధిలోనే..

'సిందూర్' ఒక ట్రైలర్ మాత్రమే: రాజ్‌నాథ్ వ్యాఖ్య

- భారత్ వైపు కన్నెత్తి చూడొద్దని పాకిస్తాన్‌కు పరోక్షంగా హెచ్చరిక
- లక్నోలో తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులు సైన్యానికి అప్పగింత

లక్నో: రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌ను గట్టిగా హెచ్చరించారు. పాకిస్తాన్‌లో ప్రతి అంగుళం బ్రహ్మోస్ క్షిపణి పరిధిలోనే ఉందని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని అన్నారు. భారత్‌పై మరోసారి కయ్యానికి కాలుదువ్వితే అసలు సినిమా చూపించక తప్పదని పరోక్షంగా తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణుల శక్తిసామర్థ్యాలు ఏమిటో ప్రపంచం చూసిందన్నారు. యుద్ధంలో భారత్ విజయం సాధించడం యాదృచ్ఛికం కాదని, అదొక అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌లో తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులను రాజ్‌నాథ్ సింగ్ శనివారం సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నానాటికీ బలీయమైన స్వదేశీ శక్తిగా ఎదుగుతున్న భారత్‌కు ఈ క్షిపణులు ఒక ప్రతీక అని అభివర్ణించారు. బ్రహ్మోస్ అంటే కేవలం మిస్సైల్ కాదని, భారతదేశ వ్యూహాత్మక విశ్వాసానికి ఆధారమని చెప్పారు. త్రివిధ దళాలకు ఇదొక మూలస్తంభంగా మారిందన్నారు. ''ఆపరేషన్ సిందూర్‌లో జరిగినదంతా ట్రైలర్ మాత్రమే. ఒక కొత్త పాకిస్తాన్‌ను భారత్ సృష్టించగలదని పాకిస్తాన్‌కు తెలిసొచ్చింది. కానీ, 'సమయం వచ్చినప్పుడు'.. ఇంతకంటే ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. మీరంతా తెలివైనవాళ్లని నాకు తెలుసు. చెప్పకుండానే అర్థం చేసుకోగలరు'' అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి

ఆపరేషన్ సిందూర్ భారతీయుల్లో నూతన విశ్వాసాన్ని నింపిందని రక్షణ శాఖ మంత్రి ఉద్ఘాటించారు. ఈ విశ్వాసాన్ని ఇలాగే కొనసాగించడం మనందరి సమ్మిళిత బాధ్యత అని పిలుపునిచ్చారు. మన దేశ శక్తిని ప్రపంచమంతా గుర్తిస్తోందని, కలలను నెరవేర్చుకోగలమన్న విశ్వాసాన్ని బ్రహ్మోస్ క్షిపణులు మరింత బలోపేతం చేశాయని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మనకు అవసరమైన ఆయుధాలు, రక్షణ పరికరాలను మనమే తయారుచేసుకోవాలని సంకల్పించామని తెలిపారు. రక్షణ తయారీ రంగంలో పెరుగుతున్న మన విశ్వాసానికి, సామర్థ్యానికి బ్రహ్మోస్ మిస్సైల్స్ ఉత్పత్తి కేంద్రం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. లక్నో అంటే పార్లమెంట్ నియోజకవర్గం మాత్రమే కాదని, ఈ నగరం తన హృదయంలో ఉందని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలతోపాటు ఆధునిక టెక్నాలజీ, పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా మారిందని ఆనందం వ్యక్తంచేశారు. లక్నోలో బ్రహ్మోస్ క్షిపణు లు ఉత్పత్తి కావడం చూస్తే ఒకనాటి స్వప్నం నేడు నెరవేరినట్లు తేటతెల్లమవుతోందని ఉద్ఘాటించారు. సహనం, కఠోర శ్రమ, అంకిత భావానికి ఈ ప్రాజెక్టును ఒక ప్రతీకగా భావించవచ్చని వివరించారు. ఇక్కడ ప్రతిఏటా దాదాపు 100 క్షిపణులను ఉత్పత్తి చేయొచ్చని, వందలాది మందికి ప్రత్యక్షంగా ఉపా ధి లభిస్తుందని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ యూనిట్ టర్నోవర్ రూ.3,000 కోట్లకు చేరుతుందని, తద్వారా జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రూ.500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు.


లక్నోలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌లో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్, సీఎం యోగి

బ్రహ్మాస్త్రమే



- బ్రహ్మోస్ క్షిపణి సూపర్‌సానిక్ క్రూయిజ్ మిస్సైల్ రకానికి చెందినది.
- దాదాపు 300 కిలోల వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు.
- పొడవు 8.4 మీటర్లు. వ్యాసం 0.6 మీటర్లు. బరువు 3 టన్నులు
- భూ ఉపరితలంపైనుంచి ప్రయోగించే క్షిపణి పరిధి 290 కిలోమీటర్లు. నౌకలపైనుంచి ప్రయోగించి క్షిపణి పరిధి 450 కిలోమీటర్లు. ఈ పరిధిని 800 కిలోమీటర్లకు పెంచడానికి ప్రయోగాలు జరుగుతున్నాయి.
- జీపీఎస్ రాడార్ గైడెన్స్ సిస్టమ్ ఆధారంగా దూసుకెళ్తుంది.
- బ్రహ్మోస్ మిస్సైల్‌లో ఘన ఇంధన బూస్టర్, ద్రవ ఇంధనం క్రూయిజ్ దశ ఉంటాయి.
- గంటకు 3,400 నుంచి 3,700 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు.
- భూఉపరితలంతోపాటు యుద్ధ విమానాల నుంచి, నౌకల నుంచి, జలాంతర్గాముల నుంచి ప్రయోగించవచ్చు.
- 2005 నుంచి బ్రహ్మోస్ క్షిపణులు భారత సైన్యంలో సేవలందిస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయి. పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను, శిక్షణ కేంద్రాలను, పాక్ వైమానిక దళం ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశాయి.

ఆర్థిక రంగానికీ లబ్ధి

దేశీయంగా బ్రహ్మోస్ క్షిపణుల తయారీతో మన రక్షణ రంగంతోపాటు ఆర్థిక రంగానికి సైతం ఎంతో లబ్ధి చేకూరుతుందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. రెండు దేశాలకు క్షిపణులు ఎగుమతి చేయడానికి మన బ్రహ్మోస్ టీమ్ ఒప్పందాలు కుదుర్చుకుందని, వీటి విలువ రూ.4,000 కోట్లు అని వెల్లడించారు. శుభప్రదమైన ధన త్రయోదశి రోజే క్షిపణులను సైన్యానికి అప్పగిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. లక్ష్మీదేవి ఆశీస్సులు రక్షణ రంగంపై, ఆర్థిక రంగంపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. లక్నోలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్ ఈ ఏడాది మే 11న ప్రారంభమైంది.

మొజాంబిక్ తీరంలో పడవ ప్రమాదం..

ముగ్గురు భారతీయులు మృతి ఒకరికి గాయాలు.. ఇద్దరు గల్లంతు

కొచ్చి: మొజాంబిక్‌లో బెయిరా తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు చనిపోగా ఒకరు గాయపడ్డారు. ఈ ఘటనలో మరో ఐదుగురిని సిబ్బంది కాపాడారని అక్కడి భారత దౌత్య కార్యాలయం తెలిపింది. గురువారం సముద్రంలో నిలిపి ఉన్న ఓడలో మెయింటెన్స్ పనికోసం కొందరిని పడవలో పంపించారు. పడవ నుంచి ఓడను చేరుకునేందుకు ప్రయత్నిస్తుండగా తీవ్రమైన అలల తాకిడికి పడవ బోల్తా పడిందని భారత ఎంబసీ తెలిపింది. ఘటన సమయంలో పడవలో 14 మంది భారతీయ సిబ్బంది ఉన్నారని వివరించింది. అయితే, ప్రమాద బాధితుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనలో గల్లంతైన వారిలో ఇద్దరు మలయాళీలు కూడా ఉన్నట్లు కేరళ ఎమ్మెల్యే అనూప్ జాకబ్ శనివారం తెలిపారు. వీరిలో ఒకరు ఎర్నాకులం జిల్లా పిరవోమ్‌కు చెందిన ఇంద్రజిత్(22) కాగా, మరొకరు కొల్లమ్‌కు చెందిన వ్యక్తి అని ఆయన వివరించారు.

ఎంపీలుండే అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఐదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవం పూర్తిచేసుకున్న అధునాతన భవనం ఒకటి అగ్ని ప్రమాదంలో చిక్కుకుపోయింది. కీలకమైన బాబా ఖరాగ్ సింగ్ మార్గ్‌లోని బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఈ భవనంలోనే ప్రభుత్వం కేటాయించిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల నివాసాలు ఉన్నాయి. రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి ఎదురుగానే ఈ అపార్ట్‌మెంట్‌ల సముదాయం ఉంది. శనివారం మధ్యాహ్నం అగ్నికీలలు ఎగసి పడిన ఉదంతంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ పలువురు చిన్నారులు గాయపడ్డారని, వెంటనే లోహియా ఆస్పత్రిలో చేర్పించారని స్థానికులు చెప్పారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి

ఢిల్లీలో ఘటన

చేరుకున్నారు. 14 మంది ఫైర్ సిబ్బంది గంటలోపే మొత్తం మంటల్ని ఆర్పేశారు. దీపావళిని పురస్కరించుకుని అపార్ట్‌మెంట్ వాసులు కొందరు టపాకాయలు కాల్చగా నిప్పురవ్వలు కింది ఫ్లాట్‌లో పడ్డాయని, అందులోని పాత ఫర్నిచర్, సోఫాలు అంటుకుని అగ్నికీలలు వేగంగా వ్యాపించాయని అపార్ట్‌మెంట్‌వాసులు చెప్పారు. కింది ఫ్లోర్‌లో అంటుకున్న మంటల ధాటికి పొగ దట్టంగా నాలుగైదు అంతస్తులకు దాకా వ్యాపించింది. గ్రౌండ్‌ఫ్లోర్ పార్కింగ్ ప్రాంతంలో నిల్వ ఉంచిన పాత ఫర్నిచర్, కలప వస్తువులకు నిప్పంటుకోవడంతో అగ్నికీలలు మరింత ఎగసిపడ్డాయి. పై అంతస్తుల్లో పొగచూరింది. దీంతో సమీపప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ''ఉత్తరాఖండ్ ఎంపీకి సంబంధించిన ఫ్లాట్‌లో మొత్తం సామగ్రి కాలిపోయింది. ఫర్నిచర్, దుస్తులు, డాక్యుమెంట్లు, బంగారం, ఇంటి సామగ్రి మొత్తం కాలిబూడిదయ్యాయి. మొదట నిప్పుకణికలు పాత సోఫాలకు అంటుకోవడంతో మంటలు వేగంగా అంతటా వ్యాపించాయి''అని ఆ ఎంపీ వ్యక్తిగత సహాయకుడు కమల్ వెల్లడించారు. ''కింద నుంచి మూడు అంతస్తులు పూర్తిగా సిబ్బందికే కేటాయించారు. నాలుగో అంతస్తు నుంచే ఎంపీల నివాస ఫ్లాట్‌లు ఉన్నాయి. అంతటి వేడికి అపార్ట్‌మెంట్ పిల్లర్లు వేడెక్కి పాడైపోయి ఉంటాయి. మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఘటనాస్థలికి వచ్చి మా గోడు పట్టించుకోవాలి. కాలిపోయిన ఫ్లాట్‌ల రిపేర్లు పూర్తయ్యేదాకా మాకు మరో చోట వసతికల్పించాలి''అని స్థానికురాలు పూర్ణిమ ఆగ్రహంతో డిమాండ్‌చేశారు. ఈ భవనం నూతన పార్లమెంట్ కాంప్లెక్స్‌కు రెండు కిలోమీటర్లదూరంలో ఉంది.


అపార్ట్‌మెంట్‌లో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

2028 నాటికి దేశీయ 7 నానోమీటర్ చిప్ సిద్ధం

న్యూఢిల్లీ: కంప్యూటర్ చిప్‌లను దేశీయంగానే అభివృద్ధి చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో డిజైన్ చేస్తున్న మొట్టమొదటి 7 నానోమీటర్ కంప్యూటర్ చిప్ 'శక్తి'2028 నాటికి సిద్ధమవుతుందని ఐఐటీ–మద్రాసు బృందం శనివారం అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేసింది. ఈ మేరకు ఆయన ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్థానికంగా అభివృద్ధి చేయనున్న చిప్ ప్లాంట్‌లోనే ఈ నానోమీటర్ చిప్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు తెలియజేశారు. ఐటీ సర్వర్లలో ఉపయోగించే నానో చిప్‌లను దేశీయంగానే తయారు చేసుకోవడానికి చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. ఈ మేరకు ఐఐటీ–మద్రాసు బృందానికి అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్థిక, సమాచార, రక్షణ వంటి కీలక రంగాల్లో నానో చిప్‌ల ప్రాధాన్యత నానాటికీ పెరుగుతోందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, సర్వర్లలో 3 నుంచి 7 నానోమీటర్ల చిప్‌లను ఉపయోగిస్తున్నారు. వీటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటే దిగుమతుల భారం తగ్గుతుందని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది.

ఎక్కడిదక్కడే ఆపేయండి

యుద్ధం ఆపాలని రష్యా, ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడి పిలుపు

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో రెండుగంటలపాటు చర్చలు
- జరిగిన రక్తపాతం చాలు.. ఇక ఆపండని ట్రూత్‌లో పోస్ట్

వాషింగ్టన్: సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని రెండు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పిలుపునిచ్చారు. ఇంతవరకు జరిగిన రక్తపాతం చాలని, ఇకనైనా ఎక్కడిదక్కడే ఆపేసి రెండు దేశాలు వెనక్కు తగ్గాలని సూచించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం (స్థానిక కాలమానం) మధ్యాహ్నం ట్రంప్ సమావేశమయ్యారు. ఇద్దరు నేతల మధ్య దాదాపు రెండుగంటలపాటు చర్చలు జరిగాయి. అనంతరం తన సొంత సోషల్‌మీడియా కంపెనీ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఓ పోస్ట్ చేశారు. 'వారు ఎక్కడిదక్కడే ఆపేయాలి. ఇద్దరూ ఎవరికి వారే యుద్ధంలో గెలిచినట్లు ప్రకటించుకోవచ్చు. అసలు విషయాన్ని చరిత్రకు వదిలేద్దాం'అని పేర్కొన్నారు.

ఇక ఇళ్లకు వెళ్లండి

యుద్ధాన్ని ఆపేసి ఇరుపక్షాలు చర్చలకు ముందుకు రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. వారాంతపు సెలవులు గడిపేందుకు ఫ్లోరిడాకు వచ్చిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఎక్కడికైనా యుద్ధక్షేత్రంలోకి వెళ్లి చూడండి. అంతటా తీవ్రమైన పరిస్థితులే. యుద్ధాన్ని ఎక్కడిదక్కడే ఆపేసి ఇరుపక్షాలు ఇళ్లకు వెళ్లిపోండి. కుటుంబాలతో గడపండి. హత్యలు ఆపండి. ఇరుపక్షాలు ఈ పనిచేయటం మంచిది'అని పేర్కొన్నారు. యుద్ధ విరమణపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ గురువారం ఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ట్రంప్.. గతంలో జెలెన్‌స్కీని తీవ్రంగా విమర్శించగా, తాజాగా పుతిన్‌పై బెదిరింపులకు దిగుతున్నారు. ఉక్రెయిన్‌లో రష్యా ఆక్రమించిన భూభాగాలను వదిలేసి వెనక్కు వెళ్లాలని హెచ్చరించారు. వెనక్కు తగ్గకుంటే ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి అత్యాధునిక తొమహాక్ క్షిపణులు అందిస్తానని రష్యాను హెచ్చరించిన ఆయన.. తాజాగా మాట మార్చి రష్యాను బెదిరించేందుకే అలా చెప్పానని, ఆ క్షిపణులు ఉక్రెయిన్‌కు అవసం లేదని ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. యుద్ధం ఆపాలన్న ట్రంప్ ప్రకటనను జెలెన్‌స్కీ స్వాగతించారు. కాల్పుల విరమణ ప్రకటించి, చర్చలు జరిపేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.


ఢాకా ఎయిర్‌పోర్టులోని కార్గో ఏరియాలో వ్యాపించిన అగ్నికీలలు

ఢాకా ఎయిర్‌పోర్ట్‌లో అగ్ని ప్రమాదం

విమానాల రాకపోకలకు అంతరాయం

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని హజ్రత్ షాహ్‌జలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని సరకు రవాణా విభాగకేంద్రంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో దట్టంగా కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతమంతా ధూళితో నిండిపోయింది. చివరకు విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. అగ్నిప్రమాదానికి కారణాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కార్గో కాంప్లెక్స్‌లో ప్రమాదం సంభవించిందని సమాచారం అందగానే అగ్నిప్రమాద సిబ్బంది వెంటనే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ''36 అగ్నిమాపక బృందాలు శ్రమించి ఈ మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ బృందాలకు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్ బలగాలు సైతం సాయపడ్డాయి. తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నాం. అగ్ని ప్రమాద ఘటనాస్థలిలో ఎలాంటి విమానాలు లేవు. అన్నీ భద్రంగా ఉన్నాయి''అని బంగ్లాదేశ్ పౌరవిమానయాన అధీకృత సంస్థ పేర్కొంది.

రక్త పరీక్ష 1 గుర్తించగల క్యాన్సర్లు 50

- కొత్త తరహా రక్త పరీక్ష విధానాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు
- క్యాన్సర్‌ను తొలిదశల్లో వేగంగా గుర్తించేందుకు మార్గం సుగమం

వాషింగ్టన్: ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అనే సామెత వినే ఉంటారు. ఇక్కడ ఒకే ఒక రక్త పరీక్షకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 50 రకాల క్యాన్సర్‌లను గుర్తించవచ్చు. పలు రకాల క్యాన్సర్‌లకు తొలి దశలో ఎలాంటి లక్షణాలు బయటకు కనబడవు. అలాంటి క్యాన్సర్ ముదరబోతోందనే హెచ్చరిక సంకేతాన్ని సైతం ఈ రక్తపరీక్ష అందివ్వగలదు. ఉత్తరఅమెరికాలో ఇటీవల జరిపిన సంబంధిత ప్రయోగం విజయవంతమవడంతో బహుళ వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షకు బాటలుపడ్డాయి. ఈ 50 క్యాన్సర్‌లలో దాదాపు మూడు వంతుల క్యాన్సర్‌లకు ఎలాంటి నిర్ధారణ పరీక్షలు లేవు. కానీ ఈ బ్లడ్‌టెస్ట్‌తో వాటి ఆనవాళ్లను సైతం ముందే కనిపెట్టవచ్చు. సగం క్యాన్సర్‌లను తొలిదశలోనే గుర్తించవచ్చు. దీంతో వాటికి వీలైనంత త్వరగా చికిత్స మొదలెట్టి వాటి బారి నుంచి తప్పించుకోవచ్చు. అమెరికాకు చెందిన 'గ్రెయిల్'ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఈ బ్లడ్ టెస్ట్‌కు 'గ్యాలెరీ'అని పేరుపెట్టింది. క్యాన్సర్ కణితి నుంచి ముక్కలై విడివడి మానవ రక్తప్రవాహంలో చక్కర్లు కొడుతున్న డీఎన్ఏ అవశేషాలను ఈ రక్తపరీక్ష ద్వారా గుర్తించవచ్చు. ఈ డీఎన్ఏ అవశేషాలు ఏ అవయవం నుంచి వస్తుందనేది కూడా ఈ బ్లడ్‌టెస్ట్ ద్వారా తెలుస్తుంది. బ్రిటన్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్ఎస్) ద్వారా సేకరించిన వేలాది మంది పౌరుల రక్తనమూనాలను పరిశీలించి ఈ బ్లడ్‌టెస్ట్ సామర్థ్యాన్ని గణించారు. అమెరికా, కెనడాల్లో 25,000 మంది యుక్తవయసు వాళ్ల రక్తాన్ని సైతం సేకరించి నూతన తరహాలో రక్త పరీక్ష చేశారు. వీరిలో ప్రతి 100 మందిలో దాదాపు ఒక శాతం మంది క్యాన్సర్‌బారిన పడబోతున్నట్లు తేలింది. వీరిలో తర్వాతి కాలంలో 62 శాతం మందికి క్యాన్సర్ లక్షణాల బయటపడటం విశేషం. ''క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల్లో ఇదొక మైలురాయి. ముదరక ముందే క్యాన్సర్‌ను కనిపెట్టడంతో దానికి చికిత్స చేయడం అత్యంత సులభమవుతుంది. చికిత్సలో విజయశాతాలు అద్భుతంగా ఉంటాయి''అని అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఒరెగాన్ హెల్త్, సైన్స్ యూనివర్సిటీలో రేడియేషన్ మెడిసిన్ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నిమా నబాబిజదేహ్ చెప్పారు. ''క్యాన్సర్ ఉండకపోవచ్చు అని దాదాపు 99 శాతం మందిలో సాధారణ రక్తపరీక్షల్లో 'నెగెటివ్'అని రాగా, అది తప్పు అని మా రక్తపరీక్ష నిరూపించింది'' అని వివరించారు.


రెచ్చగొడితే నిర్ణయాత్మక ప్రతిస్పందన

భారత్‌పై నోరుపారేసుకున్న పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ మరోసారి నోరుపారేసుకున్నారు. భారత్ తమను ఏమాత్రం రెచ్చగొట్టినా నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందని అన్నారు. తాము ఎవరికీ భయపడబోమని చెప్పారు. బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్యానించారు. తమను రెచ్చగొడితే వెంటనే తగిన బుద్ధి చెప్తామని వెల్లడించారు. నేటి అణ్వాయుధాల వాతావరణంలో యుద్ధాలకు తావులేదని, ఈ విషయంలో భారత సైనికాధికారులు తెలుసుకోవాలని సూచించారు. శనివారం పాకిస్తాన్ మిలిటరీ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో అసిమ్ మునీర్ మాట్లాడారు. కొన్ని నెలల క్రితం భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణలో అద్భుతమైన సామర్థ్యాలు ప్రదర్శించామని, లక్ష్యాలను ఛేదించామని అన్నారు. కేవలం అంకెల్లో గొప్పగా కనిపిస్తున్న ప్రత్యర్థిపై విజయం సాధించామని స్పష్టంచేశారు. భారత్‌ను అస్థిరపర్చడానికి భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఒక ఆయుధంగా వాడుకుటోందని అసిమ్ మునీర్ ఆరోపించారు. పిడికెడు మంది ఉగ్రవాదులు తమను ఏమీ చేయలేరని తేల్చిచెప్పారు. అఫ్గానిస్తాన్ గడ్డపై నుంచి పాకిస్తాన్‌పై దాడులు చేస్తున్న వారిని మట్టిలో కలిపేస్తామని పరోక్షంగా తెహ్రీక్–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)ని హెచ్చరించారు.

కొత్త ముసుగులో 'జంగిల్‌రాజ్'

బిహార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: అమిత్ షా



పట్నా: బిహార్‌లో 'జంగిల్‌రాజ్'కొత్త ముసుగు ధరించి మళ్లీ వచ్చిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సూచించారు. విపక్ష ఆర్జేడీపై విరుచుకుపడ్డారు. ఆర్జేడీ పాలనలో అరాచక శక్తులు చెలరేగిపోయాయని ఆరోపించారు. ఇప్పుడు అవే శక్తులు మరో రూపంలో వస్తున్నాయని దుయ్యబట్టారు. అప్పటి రాక్షస పాలన మళ్లీ రావడాన్ని ప్రజలు అంగీకరించబోరని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. విపక్ష 'ఇండియా'కూటమిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. శనివారం బిహార్ రాజధాని పట్నాలో ఓ వార్తా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 'బిహార్ సమాగం'లో అమిత్ షా మాట్లాడారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులు కొనసాగాలంటే ఎన్డీయేను గెలిపించాలని చెప్పారు.

బెంగాల్‌లో చొరబాటుదారులకు రెడ్ కార్పెట్

బీజేపీ పాలిత అస్సాంలో అక్రమ చొరబాట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేసినట్లు అమిత్ షా తెలిపారు. అస్సాం పొరుగు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లోకి చొరబాట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ వలసదారులకు బెంగాల్ ప్రభుత్వం రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతోందని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారుల పేర్లను తొలగించడానికే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభించినట్లు స్పష్టంచేశారు. ఎస్ఐఆర్ పేరిట ఓట్ల చోరీ జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు.

జమ్మూకశ్మీర్‌కు సరైన సమయంలో రాష్ట్ర హోదా

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించే విషయంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. సరైన సమయంలో రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెప్పారు. అలాగే లద్దాఖ్ ప్రజల డిమాండ్లకు తగిన పరిష్కార మార్గం చూపుతామని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి వేగం పుంజుకుందని తెలిపారు. అక్కడ ప్రజాస్వామ్యం బలోపేతం అయ్యిందని స్పష్టంచేశారు.

పేట్రేగిపోయిన పాక్

- అఫ్గానిస్తాన్‌పై వైమానిక దాడులు
- ముగ్గురు క్రికెటర్లు సహా పలువురు మృతి

ఇస్లామాబాద్: తమ దేశంలో తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) ఉగ్రసంస్థను ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలతో అఫ్గానిస్తాన్‌పై దాడులతో తెగబడుతున్న పాకిస్తాన్ శనివారం మరోసారి దాడులుచేసింది. పాక్టికా ప్రావిన్స్‌లోని ఉర్గాన్, బార్మల్ జిల్లాల్లో జరిపిన దాడుల్లో ముగ్గురు స్థానిక క్రికెటర్లుసహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు సైతం ఉన్నారు. ఉర్గాన్ జిల్లాలో ఒక క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్ ఆడాక ఇంట్లో కూర్చుని ముగ్గురు క్రికెటర్లు భోజనం చేస్తున్న సమయంలో ఆ ఇంటిపై పాక్ వైమానిక దాడి చేసింది. దీంతో క్రికెటర్లు కబీర్ అఘా, సిఘాతుల్లాహ్, హరూన్ ప్రాణాలు కోల్పోయారని అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది. వీళ్లతోపాటు అక్కడే ఉన్న ఐదుగురు పౌరులు సైతం చనిపోయారు. ముగ్గురు యువ క్రీడాకారులు చనిపోవడం అత్యంత విషాదకరమని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ సైతం తీవ్ర సంతాపం వ్యక్తంచేసింది. అఫ్గాన్, పాక్ తాత్కాలిక కాల్పుల విరమణ వేళ పౌరులపై పాక్ వైమానిక దాడులకు పాల్పడటంతో దోహాలో చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు దాడులను పాక్ సమర్థించుకుంది. ''జనావాసాలపై దాడులు చేయలేదు. కేవలం ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాలపై వైమానిక దాడులు జరిగాయి. కనీసం 70 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం''అని పాకిస్తాన్ తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది.

బ్రిటన్ పౌరులకూ 'ఆధార్'

- భారత్ మోడల్‌తో 'బ్రిట్ కార్డ్'పై దృష్టి
- అక్రమ వలసదారుల గుర్తింపే లక్ష్యమంటున్న ప్రధాని స్టార్మర్

లండన్: భారత్‌లో ఆధార్ కార్డు మాదిరిగా బ్రిటన్ పౌరులకు కూడా ప్రత్యేక గుర్తింపు కార్డును జారీ చేసేందుకు కీర్ స్టార్మర్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. భారత్‌లో ఆధార్ డిజిటల్ బయోమెట్రిక్ వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని ఇటీవల ముంబైలో పర్యటన సమయంలో బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్ ప్రశంసించారు. దాదాపుగా ఇదే విధమైన డిజిటల్ గుర్తింపును తమ పౌరులకు కూడా బ్రిట్ కార్డు పేరుతో ఇవ్వాలని యోచిస్తున్నామని తెలిపారు. భారత్‌లో 15 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చిన ఆధార్ వ్యవస్థ ప్రస్తుతం సుమారు 140 కోట్ల మంది భారత పౌరులకు ఉపయోగపడుతోంది. బ్యాంకింగ్, సంక్షేమ, తదితర సేవలు ఆధార్‌లోని 12 అంకెల డిజిటల్ బయో మెట్రిక్ సంఖ్యతో సులభంగా మారాయి. అయితే, తాము జారీ చేయాలనుకుంటున్న 'బ్రిట్ కార్డు'అక్రమ వలసదారులను గుర్తించేందుకేనని స్టార్మర్ వివరించారు. ఇతర వివరాలను తెలుసుకునేందుకు ఆయన స్వయంగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్‌ను కార్యరూపంలోకి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించిన నందన్ నీలేకనితోనూ భేటీ అయ్యారు.

భారత్‌లో అభ్యంతరాలు..అనుకూలతలు

ఆధార్ పేరిట పౌరుల కుటుంబ, సామాజిక, ఆర్థిక స్థితిగతులను పూర్తిగా వెల్లడించాల్సి రావడంపై భారత్‌లో ఇప్పటికే పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యక్తిగత గోప్యతకు ఆధార్‌తో భంగం వాటిల్లుతోందంటున్నారు. ఆధార్ లేదనే నెపంతో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతోపాటు ఇతర సేవలను కూడా నిరాకరిస్తున్నారని ది గార్డియన్ పేర్కొంది. ఇన్ని ప్రతికూలతలున్నప్పటికీ పౌరులతోపాటు ప్రభుత్వానికి కూడా ఎంతో మేలు జరుగుతోందని ఆ పత్రిక తెలిపింది. ప్రత్యేకంగా ధ్రువపత్రాల జారీ వంటి వాటితో అవసరం లేకపోవడంతో యంత్రాంగంలో అవినీతి తగ్గిందని, ఆర్థిక వ్యవస్థకు సైతం కోట్లాది రూపాయల మేర భారం తగ్గిందని పేర్కొంది.

భారత్ అనుభవం జోడించి..

ఆధార్ జారీ, అమలుకు సంబంధించిన భారత్ అనుభవాలను ఉపయోగించుకుంటామని ప్రధాని స్టార్మర్ చెప్పారు. అక్రమంగా ఉద్యోగాలు చేసే వలసదారులకు బ్రిట్ కార్డుతో చెక్ పెడతామని ప్రధాని స్టార్మర్ అన్నారు. ప్రతిపాదిత బ్రిట్ కార్డు కోసం బయోమెట్రిక్ వివరాలను సేకరించబోమని, ఇది వేరే డిజైన్‌లో ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

క్లుప్తంగా...

గాజుల సంబరానికి పిలవలేదని లీగల్ నోటీసులు



నోటీసులు చూపుతున్న మహిళలు

కోరుట్ల: గాజుల సంబరానికి పిలవలేదని..ఓ మహిళ తన సంఘం సభ్యులకు నోటీసులు పంపించిన వైనం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన ఓ మహిళా సంఘం సభ్యులు ఈ నెల 15వ తేదీన స్థానిక శివాలయంలో గాజుల సంబరాలు నిర్వహించుకున్నారు. అయితే సంఘంలోని ఓ మహిళా సభ్యురాలు తనను గాజుల సంబరానికి ఎందుకు పిలవలేదని పేర్కొంటూ అడ్వకేట్ ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. దీంతో తాము పిలిచినప్పటికీ సంఘ సభ్యురాలు గాజుల సంబరానికి హాజరు కాలేదని, తాము సంఘం పరంగా సంబరాలు చేయలేదని స్నేహితులతో కలిసి చేసుకున్నామని మహిళా సంఘం ప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఈ విషయానికి లీగల్ నోటీసులు పంపించడం ఎంతవరకు సమంజసమని సదరు మహిళా సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తగా దీపావళి జరుపుకోండి

అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటిస్తూ.. పండుగ జరుపుకోవాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్ మాన్ సూచించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణ, ప్రమాదాలు జరిగితే వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 8,019 తాత్కాలిక బాణాసంచా దుకాణాలకు లైసెన్స్‌లు జారీ చేసినట్టు తెలిపారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టెండర్లను ముఖ్యమైన ప్రాంతాల్లో అందుబాటులో పెట్టనున్నట్టు వివరించారు. 24 గంటలపాటు ఫైర్ కంట్రోల్ రూం కూడా పనిచేస్తుందని తెలిపారు. అత్యవసరంలో 101, 112 లేదా 9949991101 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆరుగురు డీపీవోలకు పోస్టింగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సేవల్లో భాగంగా ఆరుగురు జిల్లాపంచాయతీ అధికారులకు (డీపీవో) పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. కొత్తగా రిక్రూట్ అయిన వారిలో.. భద్రాద్రి కొత్త గూడెం డీపీవోగా బోపన్న అనూషకు, ములుగు డీపీవోగా యాదారి రేవంత్, సిద్దిపేటకు గొండ్లోళ్ల వినోద్ కుమార్, వనపర్తికి వనం తరుణ్ చక్రవర్తి, జనగామకు అంగరాజ్ నవీన్, మహబూబ్‌నగర్ డీపీవోగా భాగం నిఖిలశ్రీలకు పోస్టింగ్‌లు ఇస్తూ శనివారం ఆయన ఉత్తర్వులు జారీచేశారు. టీజీపీ ఎస్సీ నుంచి నియామక లేఖ, గతనెల 29న ఆరుగురిని డీపీవోలుగా ప్రభుత్వం చేర్చుకున్న దరిమిలా, వీరికి పోస్టింగ్‌లపై పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ పంపించిన ప్రతిపాదనలను పరిశీలించాక ముఖ్యకార్యదర్శి తదుపరి చర్యలు తీసుకున్నారు.

చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ అధీనంలోని రోడ్ల పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లకు బకాయి ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డీవీఎన్ రెడ్డి, సురేందర్ కోరారు. ప్రభుత్వం కొత్తగా హ్యామ్ మోడల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ పనులు మొదలయ్యేలోపు ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.కోటి వరకు ఉన్న బకాయిలు చెల్లించాలని ఒక ప్రకటనలో విన్నవించారు. రూ.కోటి లోపు బిల్లులు ఉన్న తమ మొత్తం బకాయిలు రూ.800 కోట్ల వరకు ఉన్నాయని గుర్తుచేశారు. ఒక్కొక్కరికి రూ.కోటి లోపు బకాయి ఉన్న మొత్తాన్ని త్వరలోనే విడుదల చేస్తామని గతేడాది జనవరిలో హైటెక్స్‌లో జరిగిన బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న సమయంలో సీఎం తెలిపారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ఇంతకాలం ఒత్తిడి చేయలేదని చెప్పారు.

మూలవిరాట్టును వీడియో తీయడమా?

▶ మొదటి పేజీ తరువాయి

అయోమయానికి గురవుతోంది.

శృంగేరీ స్వామి సూచనల మేరకు...: శృంగేరి దక్షిణామ్నాయ శ్రీ శారదాపీఠం జగద్గురు శంకరాచార్య శ్రీ విదుశేఖర భారతి స్వామి ప్రస్తుతం రాష్ట్ర పర్యటన లో ఉన్నారు. ఆయన ఆదివారం రాత్రి వేములవాడకు చేరుకోనున్నారు. విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి తగు సూచనలు తీసుకుని ఆ మేరకే చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులు నిర్ణయించారు. ఆయన నిర్ణయాన్ని రాజకీయ పార్టీలు కూడా వ్యతిరేకించవని భావిస్తున్నారు. దేవాలయాల్లో దర్శనాలు, వైదిక కార్యక్రమాలన్నీ శాస్త్రబద్ధంగానే కొనసాగాల్సి ఉంటుందని ప్రముఖ పౌరాణికులు బాచంపల్లి సంతోష కుమారశాస్త్రి పేర్కొన్నారు.



'సిక్' లీవ్ అని చెప్పేద్దామా?

మానసిక అనారోగ్యాన్ని బయట పెట్టేందుకు జంకుతున్న భారతీయులు

వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సమస్యలు భారతీయుల్లోనే అధికం!

అయినా సెలవుకు మానసిక ఆరోగ్య కారణాలను వెల్లడించడానికి ఇష్టపడని ఉద్యోగులు..


ఇటీవల 80 పరిశ్రమలలోని 19,650 మంది వృత్తి నిపుణులపై నౌక్రీ పల్స్ సర్వే

సాక్షి, హైదరాబాద్: భారతీయుల్లో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సమస్యలు అధికంగా బయటపడుతున్నాయి. దాదాపు 75 శాతం మంది వృత్తి నిపుణులు మానసిక ఆరోగ్యం సరిచేసుకునే విషయంలో వెనుకబడుతున్నారు. ఇటీవల నిర్వహించిన నౌక్రీ పల్స్ 2025 సర్వేలో పాల్గొన్నవారిలో నలుగురు ఇండియన్లలో ముగ్గురు సెలవుకు మానసిక ఆరోగ్య కారణాలను వెల్లడించడానికి ఇష్టపడటం లేదని తేలింది. పనిలో మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాల్లో... పేలవమైన పని-జీవిత సమతుల్యతలో 39%తో భారత్ వృత్తి నిపుణులు ముందువరసల్లో నిలుస్తున్నారు. దాదాపు 80 పరిశ్రమలలో 19,650 మంది వృత్తి నిపుణులపై ఈ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో... 30 శాతం కంటే ఎక్కువ మంది నిపుణులు మానసిక ఆరోగ్య కారణాల వల్ల సెలవు తీసుకోవడానికి సంసిద్ధంగానే ఉన్నట్టుగా తెలుస్తోంది. అయితే డిజైన్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లో ఇది అధికంగానే ఉన్నట్టుగా తెలిసింది. ఈ విషయంలో ఫ్రెషర్లు, కెరీర్ ప్రారంభంలో ఉన్న నిపుణులు (0–5 సంవత్సరాల పని అనుభవం) ఎక్కువగా సంకోచిస్తారు.

ఉద్యోగులు వెనుకాడడానికి కారణాలు...

- మానసిక ఆరోగ్యం సరిగాలేని కారణంగా సెలవు తీసుకుంటే తమను అసమర్థులుగా చూస్తారని 31 శాతం మంది ఉద్యోగులు భయపడుతున్నారు
- తమ విషయంలో సహోద్యోగులు ఏమని ఆలోచిస్తారోననే ఆందోళనతో 27% మంది ఉన్నారు
- సెలవు తీసుకునేందుకు తాము సాకులు వెతుకుతున్నామని 21% మంది ఆందోళన చెందుతున్నారు
- ఇది కెరీర్ వృద్ధిని ప్రభావితం చేస్తుందని 21% మంది నమ్ముతున్నారు

మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే అంశాలు...



వాస్తవాలకు బదులు సెలవుకు చెబుతున్న కారణాలు...				
	తమ మానసిక ఆందోళనలతో తలెత్తిన పరిస్థితిని 45% జనరల్ సిక్ లీవ్‌గా పరిగణన	28% ఇతర కారణాలు	19% సెలవులకు దూరం	9% ఇతర కారణాలు చూపుతున్నారు...





మూసీ.. మూసేసి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మాణాన్ని చేపట్టింది. అంతకు ముందే మూసీ నదిలో ఓ రిటైనింగ్ వాల్ నిర్మించింది. అది వివాదాస్పదం కావడంతో హెచ్ఎండీఏ వాంటేజ్ నిర్మాణానికి అనుమతులను రద్దు చేసింది. దీంతో రిటైనింగ్ వాల్‌ను కూల్చేసిన శ్రీ ఆదిత్య సంస్థ.. అనుమతుల రద్దును సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళ్లింది. న్యాయస్థానం నుంచి అనుకూలంగా ఆదేశాలు పొందియధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తోంది. ఈ కబ్జాపై కొన్నేళ్లుగా ఫిర్యాదులు అందుతున్నా.. ఏ అధికారి కూడా వాంటేజ్ జోలికి వెళ్లలేదు. కొన్ని నెలలుగా ఈ నిర్మాణంపై ప్రజాప్రతినిధులతో పాటు స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి.

మ్యాప్స్‌తో కీలక ఆధారాలు

హైడ్రా బృందాలు వాంటేజ్ వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోలు, విలేజ్ క్రెడెస్టియల్ మ్యాప్స్‌తోపాటు గూగుల్ హిస్టారికల్ శాటిలైట్ ఇమేజెస్‌ను అధ్యయనం చేసి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్నారెస్సీ) రూపొందించిన డిజిటల్ ఎలివేషన్ మోడల్ (డీఈఎం) మ్యాప్స్‌తో మూసీ పరీవాహక ప్రాంతాన్ని సరిచూశారు. దీంతో శ్రీ ఆదిత్య హోమ్స్ సంస్థ వాంటేజ్ కోసం మూసీలో మూడు ఎకరాలు కబ్జా చేసినట్లు తేలింది. దీనిపై మరికొన్ని ఆధారాలు సేకరించిన తర్వాత ఆ సంస్థకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ విషయంపై రంగనాథ్ 'సాక్షి'తో మాట్లాడుతూ... 'ఉస్మాన్‌సాగర్ నుంచి ఇటీవల దిగువకు వదిలిన నీరు దాని సామర్థ్యంలో పావు వంతు మాత్రమే. ఆ వెంచర్ చేసిన కబ్జా కారణంగా ఆ నీరు కూడా దిగువకు వెళ్లలేక ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును ముంచేసింది. ఉస్మాన్‌సాగర్ నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదలైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. నోటీసులు జారీచేసి చట్ట ప్రకారం ముందుకు వెళ్తాం. చెరువులు, కుంటల కబ్జా కంటే మూసీ కబ్జా వల్ల నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది'అని పేర్కొన్నారు.

ప్రాణం పోతున్నా పట్టదా?

మానవత్వాన్ని ప్రశ్నార్థకం చేసిన నిజామాబాద్ కానిస్టేబుల్ హత్యోదంతం

చుట్టూ జనం ఉన్నా సాయానికి ఒక్కరూ ముందుకు రాని వైనం

ఎస్ఐ అరగంటపాటు బతిమాలినా అడుగు ముందుకేయని జనం

మొబైల్స్‌లో ఫొటోలు, వీడియోలు తీస్తూ బాధ్యతారాహిత్యం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆపద వస్తే పోలీసు కావాలి.. వెంటనే రావాలి.. అలాంటి పోలీసుకు ప్రాణాపాయ స్థితి వస్తే మాత్రం చోద్యం చూడాలి.. నిజామాబాద్ నగరం నడిబొడ్డున శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో జరిగిన కానిస్టేబుల్ ప్రమోద్ హత్యోదంతం సమాజంలో కొడిగడుతున్న మానవత్వాన్ని, పౌర బాధ్యతలను మరోసారి ఎత్తిచూపింది. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ గుండెల్లో దుండగుడు కత్తితో పొడిస్తే చుట్టూ వందలమంది గుడ్లప్పగించి చోద్యం చూశారే తప్ప ఏ ఒక్కరూ స్పందించలేదు. ప్రమోద్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సాయం చేయాలని పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విఠల్ అరగంటపాటు బతిమాలినా ఒక్కరూ అడుగు ముందుకేయలేదు. పైగా ఏదో వేడుక జరుగుతున్నట్లు తమ మొబైళ్లలో వీడియోలు, ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ గడిపారు. ఆటోవాలాలు సైతం సహాయం చేసేందుకు ముందుకు రాలేదు. సుమారు 30 నిమిషాలపాటు ఎస్ఐ విఠల్ ఎంత మొత్తుకున్నా ఎవ్వరూ స్పందించలేదు. అటువైపు నుంచి వెళ్తున్న ఓ అంబులెన్స్‌ను ఆపినప్పటికీ ఆపకుండా వెళ్లడం గమనార్హం.

చివరికి ఆదుకున్నది పోలీసే..

వినాయక నగర్ మీదుగా తన వాహనంలో వెళ్తున్న మోపాల్ మండల సబ్‌ఇన్‌స్పెక్టర్ సుస్మిత జనం గుమిగూడి ఉండడాన్ని చూసి ఆగారు. కత్తిపోటుకు గురైంది కానిస్టేబుల్ ప్రమోద్ అనే విషయం తెలియకపోయినా తన వాహనంలో ఎక్కించుకుని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికే పరిస్థితి విషమించి ప్రమోద్ మార్గమధ్యలోనే మరణించాడు. ఈ ఘటనలో ప్రజల తీరుపై పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాజానికి భద్రత కల్పిస్తున్న తమకే ఆపదలో సహాయం చేయటానికి ఒక్కరూ ముందుకు రాలేదని ఓ అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ కన్నీరుమున్నీరయ్యాడు.


ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగొద్దు

పోలీసు కానిస్టేబుల్ ప్రమోద్ దారుణ హత్యకు గురికావడం తీవ్ర విచారకరం. ఈ చర్యను ఖండిస్తున్నాం. విధి నిర్వహణలో ప్రమోద్ చేసిన త్యాగం అత్యున్నతమైనది. సీఎం రేవంత్ రెడ్డి చేతిలో ఉన్న శాంతిభద్రతల విభాగంలో పోలీసు సిబ్బందికే భద్రత లేకుండా పోయింది. రౌడీషీటర్లు స్వేచ్ఛగా తిరిగే స్థాయికి శాంతిభద్రతలు దిగజారడం శోచనీయం. రౌడీషీటర్ షేక్ రియాజ్‌ను తక్షణమే పట్టుకోవాలి. అమరుడైన కానిస్టేబుల్ కుటుంబానికి త్వరగా న్యాయం చేయాలి. ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగకుండా, కరడుగట్టిన నేరస్తులకు అత్యంత కఠిన శిక్ష విధించేలా ప్రభుత్వం ముందుకెళ్లాలి.

– ధర్మపురి అర్వింద్, ఎంపీ

కానిస్టేబుల్ హంతకుడిని పట్టిస్తే రూ.50 వేలు

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన పాత నేరస్తుడు రియాజ్‌ను పట్టిస్తే.. రూ.50 వేల రివార్డు ఇవ్వనున్నట్లు సీపీ సాయి చైతన్య ప్రకటించారు. నిందితుని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఆచూకీ తెలిసిన వారు 87126 5993 లేదా 87126 59777 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. డయల్ 100 కూడా సమాచారం ఇవ్వొచ్చని సూచించారు.



పాత నేరస్తుడు రియాజ్

దరఖాస్తులు తగ్గినా.. ఆదాయం తగ్గలేదు!

2025–27 సంవత్సరాలకు వైన్ షాపుల లైసెన్సుల కోసం 85 వేలకు పైగా దరఖాస్తులు

గత రెండేళ్ల లైసెన్సుల కోసం 1.32 లక్షల దరఖాస్తులు.. రూ.2,645 కోట్ల ఆదాయం

ఈసారి దరఖాస్తులు తగ్గినా.. ఫీజు పెంచిన నేపథ్యంలో ఆదాయం మాత్రం అదే స్థాయిలో..

23 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు.. 27న లాటరీ ప్రక్రియ

సాక్షి హైదరాబాద్: ఊహించినట్టే జరిగింది. రాబోయే రెండేళ్ల కాలానికి (2025–27)గాను రాష్ట్రంలో వైన్ షాపుల లైసెన్స్ కోసం ఎక్సైజ్ శాఖ ఆహ్వానించిన దరఖాస్తులు భారీ సంఖ్యలో తగ్గాయి. గత రెండేళ్ల లైసెన్సుల కోసం వచ్చిన దరఖాస్తుల కంటే దాదాపు 47వేల దరఖాస్తులు తగ్గాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తొలుత నిర్దేశించిన గడువు శనివారంతో ముగియగా.. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో గడువు పొడిగించినట్టు తెలుస్తోంది. దీంతో 23న జరగాల్సిన లాటరీ ప్రక్రియను ఈనెల 27న నిర్వహించనున్నారు.

గతం కంటే భిన్నం..: గత రెండేళ్ల కాలానికి లైసెన్స్ ఫీజు రూ.2 లక్షలు కాగా, ఈసారి ఆ ఫీజును ఎక్సైజ్ శాఖ రూ.3 లక్షలకు పెంచింది. ఫీజు పెంచినప్పుడే దరఖాస్తులు తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయం బహిరంగ మార్కెట్‌లో వ్యక్తమైంది. కానీ మద్యం షాపులకు తీవ్రమైన పోటీ ఉంటుందని, ఈసారి కూడా లక్షకు మించి దరఖాస్తులు వస్తాయన్న అంచనాతో అధికారులు లైసెన్స్ ఫీజును పెంచారు. కానీ మార్కెట్లో నగదు లభ్యత లేకపోవడంతో దరఖాస్తులు భారీ స్థాయిలో తగ్గిపోయాయి. ఈ కారణంగానే భారీఎత్తున సిండికేట్లుగా ఏర్పడి వేసే దరఖాస్తుల్లో లోటు కనిపించింది. గత రెండేళ్ల కాలానికి లైసెన్స్ కోసం 1,32,000 దరఖాస్తులు రాగా, ఈసారి దాదాపు 47 వేలు తక్కువగా 85 వేలకుపైగా మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. శనివారం రాత్రి వరకు 85,363 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ దరఖాస్తు ఫీజు పెంచడంతో ప్రభుత్వ ఆదాయానికి మాత్రం తగ్గలేదు. గత రెండేళ్ల కాలనికి దరఖాస్తు ఫీజు రూపంలో రూ.2,645 కోట్ల ఆదాయం రాగా.. ఈసారి రూ.2,560 కోట్ల ప్రభుత్వ ఖజానాకు చేరాయి. కాగా, రాష్ట్రంలో వైన్ షాపుల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు కూడా దరఖాస్తు చేశారు. ఒక మహిళ ఏకంగా 50 షాపులకు దరఖాస్తు చేసినట్టు తెలుస్తోంది.

ఉద్యోగులే మా వ్యవస్థ

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుందని అన్నారు. శనివారం శిల్పకలావేదికలో జరిగిన కొలువుల పండుగ కార్యక్రమానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరై గ్రూప్–2 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం కొత్తగా ఉద్యోగాలు పొందినవారిని ఉద్దేశించి మాట్లాడారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాలి

అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు నిరుద్యోగుల గురించి ఆలోచించలేదని సీఎం విమర్శించారు. 'వాళ్ల (గత పాలకులు) కుటుంబంలో ఖాళీగా ఉన్నవారికి ఉద్యోగాలు (పదవులు) ఇచ్చారు. కరీంనగర్ ఎంపీగా ఓడిన వ్యక్తికి రెండు నెలల్లో, నిజామాబాద్ ఎంపీగా ఓడిన బిడ్డకు రోజుల వ్యవధిలోనే కొలువులు ఇచ్చారు. కానీ, రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న వాళ్లను నిలువునా ముంచారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యోగాల భర్తీని వేగవంతం చేశాం. ఏడాదిలోపే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. గ్రూప్స్ ఉద్యోగాలను కూడా అవరోహణ క్రమంలో భర్తీ చేస్తున్నాం. మొన్న గ్రూప్–1, ఈరోజు గ్రూప్–2, త్వరలో గ్రూప్–3.. ఇలా భర్తీ చేస్తున్నాం. ఉద్యోగాలు సాధించిన వారిని తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములను చేస్తున్నాం. నిరుద్యోగుల జీవితాల్లో చీకటి రోజులు పోయి వెలుగు నిండాలి. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో మాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అలాంటి వ్యవస్థ మాకు లేదు.. మీరే మా వ్యవస్థ. ఈ రోజు నుంచి మీరు ఆఫీసర్లు. మీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి రైజింగ్ తెలంగాణ–2047 విజన్‌కు అనుగుణంగా పనిచేయాలి. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలపాలి. రక్తాన్ని చెమటగా మార్చి మిమ్మల్ని ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. వారిపట్ల నిర్లక్ష్యం వహిస్తే మీ నెలవారీ జీతం నుంచి 10 నుంచి 15 శాతం కోతపెట్టి ఒకటోతేదీన వారి ఖాతాల్లో జమచేస్తాం. గత పాలకులు దోపిడీ చేసిన సొమ్మును పంచుకోవడంలో లొల్లి జరుగుతోంది. ఆ విషయాన్ని వారి కుటుంబ సభ్యులే చెబుతున్నారు. రాష్ట్రంలో మళ్లీ సెంటిమెంట్‌ను రాజేసి అధికారంలోకి వచ్చేందుకు కుట్ర చేస్తున్నారు. అలాంటి వారిపట్ల అధికారులంతా జాగ్రత్తగా ఉండాలి. ప్రమాదాలు, ఫుడ్ పాయిజన్‌తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలి'అని సీఎం సూచించారు.

మానవ వనరులను ఖాళీగా ఉండనీయం: భట్టి

రాష్ట్రంలోని మానవ వనరులను వృథాగా ఉంచలేమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బడికన్నా వెళ్లాలి... లేదా ఉద్యోగమన్నా చేయాలి అని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు బడికి రావాలని, వచ్చిన ప్రతిబిడ్డ ఇంగ్లిష్ మీడియంలో చదువుకుని నైపుణ్యాలు పొందాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఒక యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే రోజు 783 మందికి గ్రూప్– 2 నియామక పత్రాలు అందించడం రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండేళ్లయినా పనితీరు మారలేదు

సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు

కొందరు అధికారుల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక

సీఎస్, సీఎంఓ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశంలో సీఎం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని విభాగాల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, విభాగ అధిపతులను హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా కొందరు అధికారుల పనితీరులో మార్పు లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వం వీడాలని హితవు పలికారు. ఎవరికివారు సొంత నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దని, అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎంఓ కార్యదర్శులతో శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విషయంలో అధికారులు మరింత చురుగ్గా పని చేయాలని చెప్పారు. అన్ని విభాగాల కార్యదర్శుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా ఫైలు ఆగిపోవడానికి, పనులు ఆగిపోవడానికి వీల్లేదని స్పష్టంచేశారు. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావాల్సిన నిధులను రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఏయే పథకాల్లో రాష్ట్ర వాటా చెల్లిస్తే, కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందో, వాటికి తొలుత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇకపై సీఎస్‌తో పాటు సీఎంవో అధికారులు తమ పరిధిలోని విభాగాలపై ప్రతి వారం తనకు నివేదికలు ఇవ్వాలని, తానే స్వయంగా వాటిపై సమీక్ష నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు.

కానిస్టేబుల్ హత్యపై డీజీపీ సీరియస్

ఘటనా స్థలంలో పరిస్థితులను పర్యవేక్షించాలని ఐజీకి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ సీసీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రమోద్‌పై ఒక చైన్ స్నాచర్ దాడి చేసి హత్య చేసిన సంఘటనను డీజీపీ బి.శివధర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. సిన్సియర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్ మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్ నేరాలను చేస్తున్న నిందితుడు షేక్ రియాద్‌ను సమాచారం లభించిన వెంటనే పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొస్తున్న కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి హత్య చేసి పరారైన నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించాలని, వారికి అవసరమైన సహాయం చేయాలన్నారు. లభించిన ఆధారాలను బట్టి గాలింపు చేపట్టాలని, నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

మన భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్

▶ మొదటి పేజీ తరువాయి

ఫ్లోరైడ్‌ను కలిగి ఉన్నట్టు తేలింది. వర్షాకాలానికి ముందు తీసిన 81 నమూనాలు(19.7శాతం), వర్షాకాలం తర్వాత తీసిన 73 నమూనాలు(19.5శాతం) అనుమతించదగిన స్థాయికి మించి ఫ్లోరైడ్‌ను కలిగి ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. తాగునీళ్లలో అధిక మోతాదులో ఫ్లోరైడ్ ఉంటే మనుషులను ఎముకల గూళ్లుగా మార్చే ఫ్లోరోసిస్ అనే వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉంది. దంతాల సమస్యలూ ఉత్పన్నమవుతాయి.

ఫ్లోరైడ్ నల్లగొండలోనే అత్యధికం..

నల్లగొండ జిల్లాలో వర్షాలకి ముందు తీసిన భూగర్భ జలాల నమూనాల్లో అత్యధికంగా లీటర్‌కి 5.84 మి.గ్రా. ఫ్లోరైడ్ ఉన్నట్టు తేలింది. రాష్ట్రంలోనే అత్యధిక పరిమాణంలో ఫ్లోరైడ్ కలిగి ఉన్న జిల్లా ఇదే. అయితే, వర్షాల తర్వాత 3.55 మి.గ్రా.కు తగ్గింది. ఇతర జిల్లాల్లో చూస్తే.. వర్షాలకి ముందు యాదాద్రి భువనగిరిలో 4.42, వర్షాల తర్వాత 2.69.. వరంగల్‌లో వర్షాలకి ముందు 2.48, వర్షాల తర్వాత 5.59, హనుమకొండలో వర్షాలకి ముందు 4.34, వర్షాల తర్వాత 2.34, ఆదిలాబాద్‌లో వర్షాలకి ముందు 3, వర్షాల తర్వాత 5.5 మి.గ్రా. ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. రాష్ట్రంలో పరిమితికి మించి ఫ్లోరైడ్ కలిగిన జిల్లాలు 2017లో 26 ఉండగా, 2024లో 24కి తగ్గాయి.

గద్వాలలో అత్యధికంగా క్లోరైడ్

బీఐఎస్ ప్రమాణాల ప్రకారం లీటర్‌కి 250 మిల్లీగ్రామ్ క్లోరైడ్ కలిగిన జలాలను సరక్షితమైనవిగా పరిగణిస్తారు. ప్రత్యామ్నాయ తాగునీటి సదుపాయం లేని ప్రాంతాల్లో లీటర్‌కి 1000 మి.గ్రా. వరకు ఫ్లోరైడ్‌ను అనుమతిస్తారు. క్లోరైడ్ పరిమాణం అంతకు మించితే నీళ్లు తాగడానికి పనికిరావు. వర్షాకాలానికి ముందు జరిపిన పరీక్షల్లో రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో లీటర్ భూగర్భజలాల్లో ఏకంగా 7657 మి.గ్రా. క్లోరైడ్ ఉన్నట్టు తేలింది. ఇతర జిల్లాల్లో పరిశీలిస్తే నల్లగొండలో 2947, భువనగిరిలో 884, సంగారెడ్డిలో 869, రంగారెడ్డిలో 794, మెదక్‌లో 716, ఖమ్మంలో 714, నాగర్‌కర్నూల్‌లో 554 మి.గ్రా. క్లోరైడ్ ఉన్నట్టు ర్ధారణ జరిగింది. గుండె, మూత్రపిండాలు, అజీర్ణం వంటి రోగాలతో బాధపడే వారికి మోతాదుకి మించిన క్లోరైడ్ ప్రమాదకరం.

జూపల్లిలో నైట్రేట్ తీవ్రత అధికం..

బీఐఎస్ ప్రమాణాల ప్రకారం గరిష్టంగా లీటర్‌కి 45మి.గ్రా. నైట్రేట్ కలిగి ఉన్న జలాలనే తాగడానికి సురక్షితంగా పరిగణిస్తారు. అధిక మోతాదులో నైట్రేట్ కలిగి ఉన్న తాగునీటితో నవజాత శిశువుల్లో మెథెమోగ్లోబినెమియా అనే రక్త రుగ్మత, పెద్దల్లో ఉదరకోశ క్యాన్సర్లతోపాటు కేంద్ర నాడి వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని జూపల్లిలో అత్యధికంగా వర్షాలకి ముందు లీటర్‌కి 249.6 మి.గ్రా.లు, వర్షాల తర్వాత లీటర్‌కి 533.2 మి.గ్రా. నైట్రేట్ ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన నమూనాల్లో 34.7శాతం మోతాదుకి మించి నైట్రేట్‌ను కలిగి ఉన్నట్టు వెల్లడైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మినహా అన్ని జిల్లాల్లోని భూగర్భ జలాలు మోతాదుకి మించి నైట్రేట్‌ను కలిగి ఉన్నాయి.

టీజీపిక్స్‌గా మారిన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరును తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీపిక్స్)గా మారుస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయని కార్పొరేషన్ ఎండీ ఎం.రమేశ్ తెలిపారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్పొరేషన్ ముఖ్యంగా సాంకేతికత ఆధారిత, వ్యాపార కార్యకలాపాల నిర్వహణ, విస్తరణ, సాంకేతిక సదుపాయాలను అందించడం, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ నిర్వహణ, సాంకేతిక సలహాలు, డిజైన్లు, నిర్మాణ సేవలు, క్రీడా సంబంధిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, లాజిస్టిక్స్ సంబంధిత రంగాల్లో కన్సల్టెన్సీ సేవలను అందిస్తుంది. కాగా కార్పొరేషన్ పేరును సవరించడానికి ప్రభుత్వాన్ని అనుమతి కోరినట్టు తెలిపారు. అందుకు అనుగుణంగా జీఓ ఎంఎస్ నంబర్ 121 జారీ అయినట్టు పేర్కొన్నారు. పేరు మార్పు శనివారం నుంచి అమల్లోకి వస్తుందని రమేశ్ వెల్లడించారు.



సాక్షి, హైదరాబాద్: కుంగుబాటు, మానసిక ఒత్తిడి సమస్యలు పురుషుల కంటే మహిళల్లో రెండురెట్లు అధికంగా ఉన్నాయని ఓ అంతర్జాతీయ అధ్యయనం తేల్చింది. స్త్రీలలో ఉండే వేలాది ప్రత్యేకమైన జన్యు వైవిధ్యాలే ఇందుకు కారణమని గుర్తించారు. ఈ ప్రత్యేక జన్యు నిర్మాణం మహిళలను సామాజిక, పర్యావరణ ఒత్తిళ్లకు అధికంగా ప్రభావితం చేస్తోంది. ఇటీవల నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన 'సెక్స్–స్ట్రాటిఫైడ్ జీనోమ్–వైడ్ అసోసియేషన్ మెటా–అనాలిసిస్ ఆఫ్ మేజర్ డిప్రెసివ్ డిజార్డర్' అనే పరిశోధన పత్రంలో ఈ అంశం వెల్లడైంది. మేజర్ డిప్రెసివ్ డిజార్డర్ (ఎండీడీ)తో ముడిపడి ఉన్న ఏడు వేల కంటే ఎక్కువ జన్యు వైవిధ్యాలు పురుషుల్లో ఉంటే.. అందుకు అదనంగా మహిళలు ఆరు వేల జన్యు వైవిధ్యాలను కలిగి ఉన్నారని తేలింది. ఈ అధ్యయనంలో భాగంగా కుంగుబాటు (డిప్రెషన్)తో బాధపడుతున్న 1.3 లక్షల మంది మహిళలు, 65 వేల మంది పురుషుల జన్యు డేటాను పరిశోధకులు విశ్లేషించారు. అలాగే డిప్రెషన్‌లో లేని 2.9 లక్షల మందికి చెందిన జన్యు డేటాను కూడా విశ్లేషించారు. ఈ సర్వేలో ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, యూకే, యూఎస్‌లకు చెందినవారు అధికంగా పాల్గొన్నారు.

ఏమిటీ జన్యు వైవిధ్యాలు?

➤ జన్యు వైవిధ్యం అంటే కేవలం డీఎన్‌ఏ క్రమంలో మార్పు. వీటిలో కొన్ని వైవిధ్యాలు అంత ప్రమాదకరం కాదు. మరికొన్ని కుంగుబాటు, నిరాశతో సహా అనారోగ్యాల ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ వైవిధ్యాలు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా రావొచ్చు లేదా ఆకస్మికంగా సంభవించవచ్చు. మహిళల్లో ఈ వైవిధ్యాలు మెదడు అభివృద్ధి, హార్మోన్లు, జీవక్రియ వంటి ప్రక్రియలతో సంకర్షణ చెందుతాయి. దీనివల్ల వారు కుంగుబాటుతోపాటు ఇతర రుగ్మతలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

కుంగుబాటుతో బరువు పెరుగుదల, నిద్రలేమి..

➤ కుంగుబాటు, ఒత్తిడితో బాధపడుతున్న మహిళలు బరువు పెరగటం, నిద్రలేమి, అలసట వంటి సమస్యలు ఎదుర్కొంటారని సర్వేలో పేర్కొన్నారు.

➤ మహిళల నిరాశ లక్షణానికి జన్యు మార్పులు కారణమని పరిశోధకులు కనుగొన్నారు.

➤ దీనికి విరుద్ధంగా నిరాశతో బాధపడుతున్న పురుషులు తరచుగా కోపం, దూకుడు ప్రదర్శిస్తారు

➤ డిప్రెషన్-లింక్డ్ డీఎన్‌ఏ తేడాలు వారసత్వంగా రావచ్చు లేదా ఆకస్మికంగా సంభవించవచ్చు.

➤ ఇవి పుట్టుకతో వచ్చే డీఎన్‌ఏ తేడాలు అని పరిశోధకులు చెప్పారు.

➤ ఈ పరిశోధన ఫలితాలు కుంగుబాటు నిర్ధారణ, చికిత్సకు లింగ నిర్దిష్ట విధానాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి.

➤ ఉదాహరణకు మహిళలకు జీవక్రియ మార్గాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మంచి చికిత్స అందించవచ్చు

➤ పురుషులకు వారి ప్రవర్తన లేదా న్యూరోకాగ్నిటివ్ నమూనాలపై దృష్టి పెట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు.

మహిళా వర్సిటీ తెలంగాణకు గర్వకారణం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఘనంగా మహిళా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వరప్రసాద్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): మహిళా విశ్వవిద్యాలయం తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో 20వ స్నాతకోత్సవం జరిగింది. వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, శాంతా బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు విద్యావంతులు అయితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతకు సంకల్పం ముఖ్యమని అన్నారు. తన తల్లి శాంత ప్రోత్సాహం ఈ రంగాన్ని ఎంచుకునేలా చేసిందన్నారు. 360 మంది అధ్యాపకులు, 6 వేల మంది విద్యార్థులతో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం చరిత్రలో నిలుస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమానికి తనను ఆహ్వానించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ములుగారం, ప్రిన్సిపాల్ లోకపావని, పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బాబు దగా

దీపావళి పండుగ పూట వంచన | **రాగానే ఐఆర్ ఇస్తానన్న హామీకి మంగళం**

పీఆర్సీ ఊసే లేదు.. హెల్త్ స్కీమ్ సంగతి తేల్చలేదు.. రూ.30 వేల కోట్లకు పైగా బకాయిల మాటే లేదు



నేను రాగానే మంచి పీఆర్సీ ఇస్తాను.. ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) ఇస్తాను.. మీకు రావాల్సిన డబ్బులన్నీ వెంటనే ఇచ్చేస్తాను.. తక్కువ ధరకే ఇంటి జాగాలు ఇస్తాను.. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సమస్య లేకుండా చేస్తాను.. ఎర్న్‌డ్ లీవ్‌లు, సరెండర్ లీవ్‌లు, ఇతరత్రా బకాయిలన్నీ ఇచ్చేస్తాను.. పోలీసులకు కూడా శని, ఆదివారాలు సెలవు ఇస్తాను.. హోం గార్డుల జీతాలు పెంచుతాను.

\- ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు

ఇతర రాష్ట్రాలు ఉద్యోగుల ఖర్చును భారీగా తగ్గించుకుంటున్నాయి.. ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఉద్యోగుల జీతాల ఖర్చు ఎక్కువగా ఉంది.. పైగా ఆర్టీసీ ఉద్యోగులను తీసుకొచ్చి ప్రభుత్వంలో కలిపేశారు.. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అదనపు ఖర్చు వస్తోంది.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే బాగోలేదు.. ఖర్చులు పెరిగిపోతున్నాయి.. సీపీఎస్ వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది.. పీఆర్సీకి మరింత వెసులుబాటు కావాలి.. ఉద్యోగులు రాష్ట్ర పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలి. అయినా దీపావళి కానుకగా ఒక్క డీఏను ఇస్తున్నాం.

\- అధికారంలోకి వచ్చిన 16 నెలల తర్వాత సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన దీపావళి కానుక తుస్సుమంది. అప్పుడు కాదు ఇప్పుడు అంటూ ఎన్నికలకు ముందు ఊరించి, లెక్కలేనన్ని హామీలు గుప్పించి.. వారితో ఓట్లు వేయించుకుని.. తీరా గద్దెనెక్కాక హామీల సంగతే మరిచారు. నెల కాదు.. రెండు నెలలు కాదు.. ఏకంగా 16 నెలలైనా ఇచ్చిన హామీలకు దిక్కులేదని ఉద్యోగులు రోడ్డెక్కుతుంటే నాలుగు డీఏలకు గాను ఒకే ఒక్క డీఏ ఇస్తామని.. ఇంతకంటే ఎక్కువగా ఆశించవద్దన్నట్లు చెప్పుకొచ్చారు. ఎప్పటిలాగే ఓ వైపు గత ప్రభుత్వంపై నిందలేస్తూ.. మరో వైపు ఉద్యోగుల ఖర్చు తగ్గిస్తానంటూ షాక్ ఇస్తున్నారు. అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలన్నీ వెంటనే తీరుస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు పూర్తి స్థాయిలో వారిని దగా చేశారు. నమ్మించి ఓట్లు వేయించుకుని నిండా ముంచారు. 16 నెలలుగా ఒక్కటంటే ఒక్క హామీ అమలు చేయకుండా కాలం గడుపుతూ చెవిలో పువ్వు పెట్టారు. ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీల్లో కొన్నయినా అమలు చేస్తారని ఉద్యోగులు ఎదురు చూస్తుంటే ఒకే ఒక్క డీఏతో సరిపెట్టారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతుంటే ఒక్కటి మాత్రమే ఇస్తానని చెబుతూ ఆ ఖర్చు కూడా దండగేనని ఉద్యోగ సంఘాల సమావేశంలోనే చెప్పడం గమనార్హం. ఇతర రాష్ట్రాలు ఉద్యోగుల ఖర్చును భారీగా తగ్గించుకుంటున్నాయని, తాను కూడా అదే పని చేస్తానని చెప్పడంతో డీఏ ఏమో గానీ, మున్ముందు తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 27 శాతం ఐఆర్ ప్రకటించారు. కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ తల్లకిందులైనా పీఆర్సీ అమలు చేశారు. కానీ చంద్రబాబు తాను వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సినవన్నీ ఇస్తానని చెప్పి ఆ మాటే మరచిపోయారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారి గురించి ఆలోచన కూడా చేయలేదు. ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నిసార్లు అడిగినా వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. వారి ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతుండడం, వేలాది మంది టీచర్లు రోడ్డెక్కి భారీగా ధర్నా చేయడంతో ఉలిక్కిపడ్డారు. ఎలాగోలా వారిని ఆందోళనను తగ్గించడానికి తనకు అలవాటైన రీతిలో మభ్యపెట్టే ప్రణాళిక రచించారు. అందులో భాగంగానే శనివారం ఉద్యోగ సంఘాల నాయకులతో గంటల తరబడి సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాల నాయకుల్లోనే తమకు అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి చెందిన బాకా నాయకుడితో ఈ సమావేశంలో రెండు డీఏలు ఇస్తే చాలని, ఇంకేమీ వద్దని చెప్పించారు. చివరికి కంటి తుడుపుగా ఒక డీఏ ఇస్తానని, ఆర్థిక పరిస్థితి అస్సలు బాగోలేదంటూ సూక్తులు చెప్పి తప్పించుకున్నారు.

అధికారంలోకి వస్తూనే పీఆర్సీ ఇస్తానన్నారుగా..

నిజానికి ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వచ్చీ రావడంతోనే మంచి పీఆర్సీ ఇస్తానని చెప్పి, ఇప్పుడు దాని గురించి తనకు వదిలేయాలని, ఆర్థిక పరిస్థితి బాగున్నప్పుడు దాని గురించి ఆలోచిస్తానని చెప్పడంతో ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. నిజానికి ఉద్యోగులు పీఆర్సీ సంగతి దేవుడెరుగు కనీసం రాజీనామా చేసిన పీఆర్సీ కమిషనర్ స్థానంలో కొత్త కమిషనర్‌ను నియమించాలని కోరుతుంటే ఆ విషయాన్నే పట్టించుకోలేదు. అధికారంలోకి రాగానే చేస్తానని చెప్పిన మాటను ఆయన నీటి మీద రాతగా మార్చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తామని చెప్పి దానిపైనా నోరు మెదపలేదు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను తాను వచ్చిన 6 నెలల్లో పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని 16 నెలలుగా పట్టించుకోకుండా ఇప్పుడు మరో 6 నెలల్లో చేస్తానని చెప్పడంతో అది జరిగేది కాదేమోనని ఉద్యోగులు వాపోతున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు ఆ విషయం సుప్రీంకోర్టులో ఉందని అబద్ధం చెబుతూ తప్పించుకుంటున్నారు. చైల్డ్ కేర్ లీవులు 180 వాడుకోవచ్చని చంద్రబాబు చెప్పినా, నిజానికి అది జగన్ హయాంలోనే అమల్లోకి వచ్చింది. తక్కువ రేటుకు ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీ ఊసే లేకుండా పోయింది.

అన్ని ఉద్యోగాలిస్తే ఎలా!

తన ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలిస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకపోగా, జగన్ హయాంలో 1.26 లక్షల శాశ్వత ఉద్యోగాలివ్వడాన్ని చంద్రబాబు తప్పు పట్టడడం గమనార్హం. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా అంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను ఒకేసారి ఇవ్వడాన్ని ఆయన అనవసరమని చెప్పడం చూసి ఉద్యోగులు విస్తుపోతున్నారు. తద్వారా ఉద్యోగుల పట్ల తనకున్న చులకన భావాన్ని సీఎం బయట పెట్టుకున్నారు. సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతగా మేలు జరిగిందో చంద్రబాబు మరచిపోయారని, లేదా ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యవస్థను తక్కువ చేసి మాట్లాడుతున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని, ప్రైవేటు ఏజెన్సీల కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవస్థ స్థానంలో ఆప్కాస్‌ను ప్రవేశ పెట్టడాన్ని కూడా చంద్రబాబు తప్పు పట్టడం పట్ల ఆయా ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వారి వల్ల వేల కోట్ల రూపాయల వ్యయం పెరిగిపోయిందని చెప్పి వారిని కించపరిచారు. ఇంతా చేసి.. ఇప్పుడు మొక్కుబడిగా ఒక డీఏతో దీపావళి కానుక అంటున్న సీఎం మాటలు, వ్యాఖ్యలను బట్టి తమ పరిస్థితి మున్ముందు మరింత దారుణంగా ఉంటుందనే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లు వీరే!

- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సహా 40 మందికి చోటు
- జాబితా విడుదల చేసిన ఏఐసీసీ

సాక్షి, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తమ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. నవంబర్ 11న జరగనున్న ఈ ఉప ఎన్నిక కోసం మొత్తం 40 మందితో కూడిన జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951, సెక్షన్ 77(1) ప్రకారం ఈ జాబితాను విడుదల చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ జాబితాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు అధిష్టానం చోటు కల్పించింది.


జాబితాలోని ముఖ్య నేతలు వీరే..

జాబితాలో మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, డి.అనసూయ (సీతక్క), కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులున్నారు. వీరితోపాటు పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేతలు పి.విశ్వనాథరెడ్డి, సీహెచ్.వంశీచంద్‌రెడ్డి, రేణుకాచౌదరి, వి.హనుమంతరావు, మొహమ్మద్ షబ్బీర్ అలీ, మధుయాష్కీగౌడ్, విజయశాంతి, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, జెట్టి కుసుమ్‌కుమార్, దానం నాగేందర్, సి.ఎస్.రెడ్డి, బాబా ఫసియుద్దీన్ సహా మొత్తం 40 మంది పేర్లను ఏఐసీసీ ఖరారు చేసింది. వీరంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం నిర్వహించనున్నారు.

ప్రధాని భద్రతలో అలసత్వం!


భద్రతా వలయంలోకి ఆహ్వానేతరులు • నకిలీ ఆధార్‌తో వీఐపీ పాస్‌లు

ఆత్మకూరు రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ నంద్యాల జిల్లా శ్రీశైలం పర్యటనలో ఆహ్వానితులు కాని ఇద్దరు వ్యక్తులు ప్రధాని భద్రతా వలయంలోకి ప్రవేశించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రధానికి ఆహ్వానం, వీడ్కోలు పలికే సందర్భాల్లో ఎంపిక చేసిన వ్యక్తులకు వీఐపీ పాస్‌లు జారీ చేస్తారు. అయితే, సున్నిపెంటలోని హెలిప్యాడ్ వద్ద ప్రధానికి వీడ్కోలు పలికే వ్యక్తుల జాబితాలో ఇద్దరు బీజేపీ నాయకుల స్థానంలో మరో ఇద్దరు చేరడం భద్రతా లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఆత్మకూరుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, విశ్వరూపాచారి, రాష్ట్ర మైనారిటీ విభాగం ఇన్‌చార్జి షబానా, మరొకరికి ప్రధానమంత్రి శ్రీశైలం పర్యటనలో పాల్గొనేందుకు ఆహ్వానాలు వచ్చాయి. వీరందరినీ శ్రీశైలం వచ్చి సిద్ధంగా ఉండాలని సూచించారు. అయితే.. ప్రధాని పర్యటన ముందు రోజు రాత్రి ఆత్మకూరు నుంచి శ్రీశైలం వెళ్లిన బీజేపీ నాయకులలో ముగ్గురికి మాత్రమే జిల్లా అధ్యక్షుడు పాస్‌లు పంపించి వారు సున్నిపెంటలో ప్రధాని తిరుగు



6.	Shri Inty Adinarayna, ex-Parliament Coordinator, BJP
7.	Shri Boreddy Lakshmi Reddy, BJP Leader, BJP
8.	Shri Challa Damodhara Reddy, State Council Member,
9.	Shri Nimmakayala Sudhakar, District Vice President, BJ
10.	Shri Thumu Shiva Reddy, Senior Leader, BJP

లిస్ట్‌లో తూము శివారెడ్డి సంఖ్య 10



11.	Shri Akkannagri Siva Krishna, District General
12.	Shri Viswaroopa Achari, Senior Leader, BJP
13.	Smt. Shabana, State Minority Morcha Incharge,
14.	Shri Mayaluri Venkatesh, District Vice Presiden

ప్రధానికి వీడ్కోలు తెలిపే నాయకుల లిస్ట్‌లో 12 సంఖ్యగా ఉన్న విశ్వరూపాచారి

ప్రయాణమైనప్పుడు హెలిప్యాడ్ వద్ద ఉండాల్సిందిగా కోరినట్టు తెలిసింది. అయితే.. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడైన విశ్వరూపాచారికి మాత్రం పాస్ పంపలేదు. ఆయనకు మరుసటి రోజు ఇస్తామని చెప్పినట్టు తెలుస్తోంది. మరుసటి రోజు ఉదయం విశ్వరూపాచారికి వీఐపీ పాస్ కాకుండా గ్యాలరీ పాస్ మాత్రమే పంపారు. ప్రధానికి వీడ్కోలు తెలిపే చోట హెలిప్యాడ్ వద్ద విశ్వరూపాచారి స్థానంలో శ్రీశైలానికి చెందిన బీజేపీ స్థానిక నేత చిక్కుడుచెట్టు వెంకటేశ్వర్లు ఉండటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అదేవిధంగా జిల్లాకు చెందిన మరో సీనియర్ నాయకుడు తూము శివారెడ్డి స్థానంలో బీజేపీ నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు డ్రైవర్ బాలు కనిపించాడు. ఇలా ఎంతమంది మరొకరి పేరుతో వీవీఐపీల కోటాలో ప్రధాని భద్రతా వలయంలోకి చేరారోనన్న అనుమానం కలుగుతోంది. ప్రధానికి వీడ్కోలు తెలిపేందుకు ఎంపికైన నాయకుల జాబితాలో తూము శివారెడ్డి సంఖ్య 10 కాగా.. విశ్వరూపాచారి సంఖ్య 12. జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నప్పటికీ పాస్‌లు వేరే వారు తీసుకుని రావడంపై దర్యాప్తు జరపాలని పలువురు కోరుతున్నారు. పాస్‌లను మార్చేందుకు ఆధార్‌ను టాంపరింగ్ చేసి ఫొటోలు మార్చి ఉంటారనే అనుమానం కలుగుతోంది.



తూము శివారెడ్డి స్థానంలో ప్రధానికి అభివాదం చేస్తున్న అభిరుచి మధు డ్రైవర్ బాలు (మధ్యలో ప్రధానికి సమీపంలో ఉన్న వ్యక్తి)



విశ్వరూపాచారి స్థానంలో ప్రధాని ముందు నిలబడిన చిక్కుడు చెట్టు వెంకటేశ్వర్లు (మహిళా నాయకురాలు షబానా తరువాత నిలుచున్న వ్యక్తి)

టీటీడీ ఉద్యోగిని... హోం మంత్రికి చాలా క్లోజ్

- వీఐపీలకు నేనే ప్రొటోకాల్ దర్శనం చేయిస్తా
- భక్తులను మభ్యపెట్టి ముంచేసిన టీడీపీ నాయకుడు
- రూ.4 లక్షలకు కుచ్చుటోపీ



హోం మంత్రి అనితతో అశోక్‌రెడ్డి

తిరుమల: 'నేను టీటీడీలో ఉద్యోగిని. రాష్ట్ర హోం మంత్రి అనితకు బాగా క్లోజ్. ఆమె తరఫున వచ్చే వీఐపీలకు నేనే ప్రొటోకాల్ దర్శనం చేయిస్తా' అంటూ భక్తులకు మాయమాటలు చెప్పి మోసం చేసిన టీడీపీ నాయకుడి గుట్టు రట్టయ్యింది. తిరుపతి జిల్లా, చంద్రగిరి రెడ్డివీధికి చెందిన బురిగాల అశోక్ రెడ్డి గత టీడీపీ హయాం నుంచి తిరుమలలో దళారీగా చలామణి అవుతున్నాడు. టీడీపీ సీనియర్ నేత కళా వెంకటరావు, హోం మంత్రి వంగల పూడి అనితతోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి దిగిన ఫొటోలు చూపిస్తూ భక్తులను మోసగిస్తుంటాడు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను టార్గెట్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు. తెలంగాణకు చెందిన భజరంగ్ అమన గోయల్, పది మంది కుటుంబ సభ్యులకు సుప్రభాతం, తోమాల, అభిషేకం సేవలతో పాటుగా బ్రేక్ దర్శనం కల్పిస్తానని హామీ ఇచ్చాడు. ఈ దర్శనాలకు చాలా ఖర్చవుతుందని నమ్మించాడు. తిరుమలకు రాకముందే బేరసారాలు సాగించాడు. ఫైనల్‌గా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.4 లక్షలు వసూలు చేశాడు. ఇటీవల భక్త బృందం తిరుమలకు రాగానే అదనంగా రూ.10 వేలు తీసుకున్నాడు. వెంటనే అక్కడి నుంచి జారుకున్నాడు. బయటకు వెళ్లిన వెంటనే మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. ఎన్ని సార్లు చేసినా ఫోన్ తీయకపోవడంతో మోసపోయామని గ్రహించి భక్తులు శుక్రవారం ఈ–మెయిల్ ద్వారా టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ వింగ్ ఏవీఎస్‌ఓ ఫిర్యాదు మేరకు తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు.

బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిన వాళ్లే ధర్నాలో పాల్గొంటే ఎలా?

- టీజేటీఎఫ్ ఆవిర్భావ కార్యక్రమంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిన వాళ్లే ధర్నాలో పాల్గొంటే ఎలా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. బీసీ బంద్ కార్యక్రమంలో తన కుమారుడు పాల్గొనటంపై ఆమె స్పందిస్తూ.. కేవలం సామాజిక బాధ్యత నేర్పే క్రమంలోనే తన కొడుకును బీసీ బంద్ కార్యక్రమానికి తీసుకొచ్చానని చెప్పారు. శనివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ (టీజేటీఎఫ్)ను కొత్తగా ఏర్పాటు చేశారు. ఫెడరేషన్ లోగోను జాగృతి కార్యాలయంలో కవిత ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ టీచర్లకు ఇవ్వాల్సిన పీఆర్సీతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తన ఫేవరెట్ టీచర్ ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని చెప్పారు. టీచర్స్‌కు హెల్త్ కార్డులు లేకపోవటం దారుణమన్నారు. కేజీబీవీ టీచర్లకు రెండు నెలలుగా జీతాల్లేవని, దీపావళి లోపైనా వారికి జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీజేటీఎఫ్ అధ్యక్షుడు మోరం వీరభద్రరావు, అడ్‌హక్ కమిటీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ సైన్యమంతా ఇక్కడే!

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార బరిలోకి మాజీ మంత్రులు
- బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా 60 మంది కీలక నేతలు
- ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను వడపోస్తున్న వైనం
- పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జీలతో కేటీఆర్ ముఖాముఖి



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్‌ఎస్ ప్రచారపర్వంలో సర్వశక్తులూ ఒడ్డుతోంది. నియోజకవర్గం పరిధిలోని ప్రతీ ఓటరును కలవడం లక్ష్యంగా ప్రచార వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఓ వైపు నామినేషన్ల పర్వం కొనసాగుతుండగా మరోవైపు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు సుమారు 60 మంది క్షేత్రస్థాయి ప్రచారంలో పాల్గొంటున్నారు.

స్థానిక కేడర్‌తో సమన్వయం

జూబ్లీహిల్స్ నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరు డివిజన్లలో సంపూర్ణంగా, మరో మూడు డివిజన్లలో పాక్షికంగా విస్తరించి ఉంది. యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావు నగర్, షేక్‌పేట, బోరబండ డివిజన్లు పూర్తిగా, శ్రీనగర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ డివిజన్లు పాక్షికంగా ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. డివిజన్ వారీగా ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. వీరు స్థానిక నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. బయటి నియోజకవర్గాల నుంచి వచ్చిన 60 మంది ముఖ్యనేతలకు మూడు లేదా నాలుగు పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ముఖ్యనేత తమతోపాటు వచ్చిన అనుచరులతో కలిసి తమకు కేటాయించిన బూత్‌లలో ప్రచారం చేస్తున్నారు. అలాగే, బయటి నుంచి సుమారు వేయి మంది జెడ్పీటీసీ, ఎంపీపీ స్థాయి నేతలు ప్రచారానికి తరలివచ్చినట్లు సమాచారం. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బూత్‌ల వారీగా ముఖాముఖి సమావేశం నిర్వహించి ఇన్‌చార్జీలకు ప్రచార వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. భారీగా నకిలీ ఓటర్లు నమోదయ్యారని ఆరోపిస్తున్న బీఆర్‌ఎస్ ఓటరు జాబితాను వడపోస్తూ అసలైన ఓటర్లను చేరుకోవాలని భావిస్తోంది.

సాదాసీదాగా నామినేషన్

నగరంలో నెలకొన్న ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాన్ని సాదాసీదాగా సాగేలా బీఆర్‌ఎస్ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే మూడు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈ నెల 19న మరో సెట్ దాఖలు చేయనున్నారు. 19న భారీ ర్యాలీ నిర్వహించాలని భావించినా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత కేటీఆర్, హరీశ్‌రావు రోడ్ షోలు, హాల్ మీటింగ్స్‌లో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

దర్శనం మొగులయ్యకు కేటీఆర్ భరోసా

ఇంటి స్థలం సమస్య, కంటి చికిత్స బాధ్యత తీసుకున్న కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య ఎదుర్కొంటున్న ఇంటి స్థలం సమస్యతో పాటు కంటి చికిత్స బాధ్యత తీసుకుంటున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భరోసా ఇచ్చారు. దర్శనం మొగులయ్య శనివారం కేటీఆర్‌ను కలిసి ప్రభుత్వం తనకు కేటాయించిన భూమిని కాపాడుకోవడంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. హయత్‌నగర్ మండలంలో తనకు కేటాయించిన 600 గజాల స్థలంపై కొందరి నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసులను తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం చుట్టూ తాను నిర్మించిన గోడలను కూడా కొందరు కూల్చి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని మొగులయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే స్పందించిన కేటీఆర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. మొగులయ్య భూమికి, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు కేటీఆర్ సూచించారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మొగులయ్య కంటి చికిత్స బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు కేటీఆర్ ప్రకటించారు.



బంజారాహిల్స్‌లో..

ధన్‌తేరస్ స్పెషల్

ధనత్రయోదశి కావడంతో శనివారం నగరంలో బంగారం కొనుగోళ్లు మామూలు రోజుల కంటే కాస్త ఎక్కువగా జరిగాయి. ఈ ఏడాది ధర అధికంగా ఉండడంతో జ్యువెలరీ షాపుల్లో అంతగా సందడి కన్పించలేదు. బంజారాహిల్స్, అమీర్‌పేట, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా బంగారం కొనుగోలు చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో

గరిష్టం/కనిష్టం
31.0/21.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటిపూట పొడి వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

127కు చేరిన నామినేషన్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం నామినేషన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. శనివారం ఒక్కరోజే 48 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు మొత్తం నామినేషన్ల సంఖ్య 127కు చేరింది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల సంఖ్య 94కు చేరింది. నామినేషన్లకు ఆదివారం, సోమవారం సెలవు దినాలు కాగా, మంగళవారం ఒక్కరోజే నామినేషన్లకు తుది గడువు కాగా ఆ రోజు ఎంతమంది వేస్తారనేది చూడాల్సి ఉంది.

అర్ధరాత్రి వరకు 'మద్యం' దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: మద్యం దుకాణాల కోసం శనివారం అర్ధరాత్రి వరకు దరఖాస్తులు పోటెత్తాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని సుమారు 698 వైన్‌షాపుల కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. శనివారం చివరి తేదీ కావడంతో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం వరకు మూడు జిల్లాల్లో కలిపి సుమారు 12 వేలకు పైగా దరఖాస్తులు రాగా, శనివారం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కొంత మంది దరఖాస్తుదారులు ఒకటి కంటే ఎక్కువ షాపుల కోసం పోటీపడ్డారు. రిజర్వేషన్ కేటగిరీకి చెందిన షాపుల కోసం కూడా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కానీ గతేడాది కంటే ఈసారి పోటీ తక్కువగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఓటరు జాబితాపై తప్పుడు ప్రచారం.. వ్యక్తిపై కేసు

ఫిలింనగర్: ఓటరు గుర్తింపు కార్డులో తప్పుడు చిరునామాలు, రాజకీయ నాయకుల పేర్లు, ఫొటోలు మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేయడమే కాకుండా..ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గత కొద్ది రోజులుగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టిస్తున్నాడని, సామాజిక మాధ్యమాల్లో ఓటరు జాబితాపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ సర్కిల్–19 అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బాలరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎంజీబీఎస్ వద్ద నిలిచిపోయిన బస్సులు



జేబీఎస్ డిపోలో నిలిచిపోయిన బస్సులు

నగరంలో బంద్ ప్రశాంతం

పలుచోట్ల ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు

- ఆందోళనల్లో పాల్గొన్న పలు పార్టీల ప్రముఖులు
- నల్లకుంటలో స్వల్ప ఉద్రిక్తత



ఎంజీబీఎస్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



నారాయణగూడలో వామపక్ష నేతల ర్యాలీ

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో బీసీ సంఘాల బంద్ శనివారం ప్రశాంతంగా జరిగింది. ప్రజారవాణా స్తంభించింది. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతునిచ్చారు. స్కూళ్లు, కాలేజీలు, తదితర విద్యాసంస్థలు మూసివేశారు. వ్యాపార, వాణిజ్య కేంద్రాలను మధ్యాహ్నం వరకు మూసివేశారు. బంద్ సందర్భంగా అధికార కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, వామపక్షపార్టీలు, బీసీసంఘాలు, ప్రజాసంఘాలు,మహిళా, కార్మికసంఘాలు, ఎమ్మార్పీఎస్ తదితర సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు. జూబ్లీ బస్‌స్టేషన్‌లో బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఖైరతాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొని కేంద్రం వైఖరిని నిరసించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా వర్సిటీ, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తదితర విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సెంట్రల్ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను కేంద్రం వెంటనే ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు.

పలు చోట్ల ఉద్రిక్తత...

బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ చెదురుమొదురు ఘటనల నడుమ ప్రశాంతంగా ముగిసింది. అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంట పరిధిలో బంద్ స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. శంకరమఠం మార్కెట్ సమీపంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంపై రాళ్లతో దాడి చేసిన ఆందోళనకారులు షో రూం అద్దాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నల్లకుంట పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నల్లకుంట రత్నానగర్ సమీపంలోని పెట్రోల్‌బంక్ తెరిచి ఉండడంతో బీసీ సంఘాల నాయకులు దాడికి పాల్పడ్డారు. బంకులోని ఫ్యూయల్ మెషిన్లను ధ్వంసం చేశారు. సత్యానగర్ వద్దకు చేరుకున్న ఆందోళనకారులు అక్కడ తెరిచి ఉన్న రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌పై దాడి చేశారు.

మధ్యాహ్నం తెరుచుకున్న దుకాణాలు..

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బంద్ సంపూర్ణంగా జరిగింది. మధ్యాహ్నం తరువాత దుకాణాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు యథావిధిగా తెరుచుకున్నాయి. క్రమంగా రోడ్లపైన వాహనాల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డిపోలకే పరిమితమైన బస్సులు ఆ తరువాత రోడ్డెక్కాయి. దీంతో పలు ప్రాంతాల్లో వాహనాల రద్దీ భారీగా పెరిగింది.

ఎన్నికల వేళ ఆయుధాల డిపాజిట్



జూబ్లీహిల్స్ సెగ్మెంట్ పరిధిలో 234 లైసెన్స్‌డ్ వెపన్స్

- 80 శాతం డిపాజిట్ పూర్తి
- మిగతా వారికీ నోటీసులు ఇచ్చిన పోలీసులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక నేపథ్యంలో అనుమతి పొందిన ఆయుధాలను లైసెన్స్‌దారులు తమ సమీప ఠాణాల్లో అప్పగిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం వెపన్ లైసెన్స్ హోల్డర్లు తమ ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు వెపన్ లైసెన్స్‌దారులకు గత రెండు నెలల నుంచే ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు సమాచారం ఇచ్చారు. వాటిని ఠాణాల్లో గానీ, గుర్తింపు పొందిన సంబంధిత ఆయుధ విక్రయ కేంద్రాల్లో గానీ డిపాజిట్ చేసేందుకు అవకాశం కల్పించారు. శాంతి భద్రతలు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే దిశగా ఎన్నికల సమయంలో తుపాకులను డిపాజిట్ చేయాలనే నిబంధనే ఉన్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో దీని పరిధి కిందికి వచ్చే పోలీస్ స్టేషన్లలో లైసెన్స్‌దారులు గత కొద్ది రోజుల నుంచి వాటిని అప్పగిస్తున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధి కిందికి పంజగుట్ట, మధురానగర్, బోరబండ, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, టోలిచౌకి, గోల్కొండ, సనత్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్లు వస్తాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధిలోని ఎనిమిది ఠాణాల పరిధిలో 234 లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం లైసెన్స్‌డ్ తుపాకులు తెప్పించుకుని పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయిస్తున్నారు. రాజకీయ నాయకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు, సెలబ్రిటీలు, రియల్టర్లు ఈ ఆయుధాలను కలిగి ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తుపాకులు ఉన్నవారు బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉండడంతో ఎన్నికలు అయ్యే వరకు పోలీసులు వాటిని డిపాజిట్ చేసుకోవాలని ఎన్నికల సంఘం నిబంధనలు తెలియజేస్తున్నాయి. ఆయుధ లైసెన్స్ ఉన్నవారి వివరాలను నేషనల్ డేటా బేస్ ఆఫ్ ఆర్మ్స్ లైసెన్స్ వెబ్‌సైట్‌లో పొందుపరచడమే కాకుండా లైసెన్స్ కలిగిన ప్రతిఒక్కరికీ ఐడీ నెంబర్ కేటాయించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 234 మంది లైసెన్స్‌దారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి తుపాకులను డిపాజిట్ చేయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే 80 శాతం ఆయుధాలు డిపాజిట్ చేయడం జరిగింది.

ఏ ఠాణా పరిధిలో ఎన్ని తుపాకులు..

పోలీస్‌స్టేషన్	ఆయుధాలు	డిపాజిట్ చేసినవి
పంజగుట్ట	26	19
మధురానగర్	23	17
బోరబండ	37	27
జూబ్లీహిల్స్	27	23
ఫిలింనగర్	6	5
టోలిచౌకి	106	96
సనత్‌నగర్	2	2
గోల్కొండ	7	7

క్రిమినల్ కేసులు నమోదైతే లైసెన్స్ రద్దు..

ఆయుధ లైసెన్స్ కలిగిన వ్యక్తులపై ఏదైనా సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదైతే వారికి ఆయుధ లైసెన్స్‌ను రద్దు చేయనున్నారు. అంతేకాకుండా ఆయుధాన్ని అనవసరంగా ఉపయోగించినా రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. అనుమతి పొందిన ప్రాంతం కంటే ఇతర ప్రాంతాల్లో ఆయుధం సంచరించినా లైసెన్స్‌ను రద్దు చేస్తారు.

సదర్‌కు సిద్ధం



సదర్ వేడుకల్లో పాల్గొనేందుకు తీసుకువచ్చిన 'ఆల్ ఇండియా చాంపియన్ బుల్స్'కు శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాచిగూడలో స్వాగతం పలికారు. దీపావళి సందర్భంగా సదర్ వేడుకలు నిర్వహించే యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

వేస్ట్ టు ఎనర్జీ!

వ్యర్థాల నుంచి ముల్లర్ 3ఏ విధానంలో బయో సీఎన్‌జీ, కంపోస్ట్ ఉత్పత్తి

- డ్రై బయో మెథనేషన్ సాంకేతికతతో దుర్గంధం లేకుండా ప్రక్రియ
- జవహర్‌నగర్ ప్లాంట్‌లో ఏర్పాట్లు



ప్లాంట్ నమూనా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ త్వరలో అందుబాటులోకి రానుంది. డ్రై బయో మెథనేషన్ సాంకేతికతతో, ముల్లర్ 3ఏ విధానంలో (ఏరోబిక్–ఎనరోబిక్ – ఏరోబిక్) పనిచేయనున్న ఈ ప్లాంట్ పనులు జవహర్‌నగర్ చెత్తశుద్ధి కేంద్రంలో దాదాపుగా పూర్తయ్యాయి. ఆయా ప్రభుత్వశాఖల నుంచి అనుమతులన్నీ పూర్తికాగానే త్వరలో అందుబాటులోకి రానుంది. నగరం నుంచి జవహర్‌నగర్‌కు చేరుతున్న చెత్తలో రోజుకు 300 మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ వ్యర్థాల్ని ఈ ప్లాంట్‌లో ప్రాసెస్ చేస్తారు. ఆధునిక డ్రై బయో మెథనేషన్ సాంకేతికతతో బయో–సీఎన్‌జీ, నాణ్యమైన కంపోస్టు ఉత్పత్తి అవుతుంది. ఇందుకు ఎక్కువ నీరు అవసరం ఉండదు. శుద్ధి ప్రక్రియ సరళంగా ఉంటుంది. ఎలాంటి దుర్వాసన రాదని అధికారులు తెలిపారు.

ముల్లర్ 3ఏ విధానం ఇలా..

మూడుసార్లు శుద్ధి: మొదట ఆక్సిజన్‌తో (ఏరోబిక్), తర్వాత ఆక్సిజన్ లేకుండా(ఎనరోబిక్) చివరికి మళ్లీ ఏరోబిక్ విధానంలో శుద్ధి ప్రక్రియ జరుగుతుంది. ఫర్మెంటేషన్ ప్రక్రియ ద్వా రా బయోగ్యాస్ ఉత్పత్తి కి 21–27 రోజుల సమయం పడుతుంది. 60 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద హైజెనైజేషన్‌తో చివరి దశలో వ్యర్థం ఇంధనంగా మారుతుంది. పూర్తిగా మూసివేసిన వ్యవస్థలో జరిగే శుద్ధి ప్రక్రియతో దుర్వాసన రాదు. ఉత్పన్నమయ్యే బయోగ్యాస్‌ను బయో సీఎన్‌జీగా మార్చి వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తారు.

కంపోస్ట్‌గా..

మిగిలిపోయిన వ్యర్థాల్ని పోషకతతో కూడిన కంపోస్ట్‌గానూ మారుస్తారు. ఈ విధానం వల్ల వ్యర్థాల శు ద్ధి, ఇంధన ఉత్పత్తితోపాటు పర్యావరణ పరిరక్షణ కూ ఉపకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. యూరోపియన్ దేశాల్లో ఇప్పటికే అమలవుతున్న ఈ విధానం నగరంలో తీవ్ర సమస్యగా మారిన చెత్త నిర్వహణకు కొంతమేర ఉపశమనం కలిగించనుంది. మరికొన్ని దేశాల్లోనూ ముల్లర్ 3 ఏ డ్రై బయో మెథనేషన్ టెక్నాలజీకి మంచి స్పందన లభిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడిగా కె.బాలక్రిష్ణ



సాక్షి,సిటీబ్యూరో: షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడుగా కె. బాలక్రిష్ణ నియమితులయ్యారు. గత 40 ఏళ్లుగా ఆయన సంఘంలో పనిచేస్తూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సామాజిక, ఆర్థిక, సాంఘిక న్యాయం కోసం పోరాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కారంచేడు, చుండూరు, నీరుకొండ, పాదిరికుప్పంలలో జరిగిన దళితుల మారణకాండను నిరసిస్తూ జరిగిన ఉద్యమాల్లో బాలక్రిష్ణ ముఖ్యపాత్ర వహించారు. మొదటి తరం దళిత ఉద్యమాల్లో ఆయన ప్రధాన భూమిక పోషించారు. దళిత ఉద్యమనేత దివంగత బొజ్జ తారకంతో కలిసి లక్ష్మీపేట ఘటనపై ఉద్యమించారు. నిరుపేద దళితుల పక్షాన పోరాడి తిలక్ నగర్, పాటిగడ్డ, అంబేడ్కర్ నగర్, జామ్సింగ్‌టెంపుల్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో పేదలకు నివాస వసతులు కల్పించారు.

నిమ్స్‌లో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



లక్డీకాపూల్ : ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైన సంఘటన శనివారం నిమ్స్ మార్చురీ సమీపంలోని స్టాఫ్ పార్కింగ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే ఆస్పత్రిలో పని చేస్తున్న అన్‌స్కిల్డ్ వర్కర్ బాలచందర్ తన ఈవీ బైక్‌ను స్టాఫ్ పార్కింగ్‌లో పార్క్ చేసి విధులకు హాజరయ్యాడు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పార్క్ చేసిన వాహనం నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన నిమ్స్ సెక్యూరిటీ అధికారి రామారావు వాహనాన్ని సిబ్బంది సహాయంతో స్టాఫ్ పార్కింగ్ నుంచి బయటకి తీయించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆ వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది.

జిమ్ నిర్వాహకుడిపై కేసు



సాక్షి, సిటీబ్యూరో: మందుల తయారీ, నిల్వలు, వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ సాహ్నవాజ్‌ఖాసిం అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పరిధిలోని నామాలగుండులో ఓ జిమ్‌పై దాడులు నిర్వహించిన అధికారులు పెద్ద మొత్తంలో అక్రమంగా నిల్వ ఉంచిన మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్డియాక్ స్టిమ్యులేట్ అవసరాలకు వినియోగించే మందును జిమ్‌లో బాడీ బిల్డర్స్‌కు అక్రమంగా విక్రయిస్తున్నారని గుర్తించారు. దీంతో జిమ్ నిర్వాహకుడు నరేష్‌పై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. దాడుల్లో డి.సరిత, గోవింద్ సింగ్, రేణుక, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్: డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం గండిమైసమ్మ చౌరస్తాలోని డీపోచంపల్లి యూటర్న్ వద్ద బైక్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అన్నారం గ్రామానికి చెందిన కుమారస్వామి(38)గా గుర్తించారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుల నిలువు దోపిడీ

బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్న ప్రైవేట్ వాహనాలు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు
- దీపావళి సందర్భంగా సొంత ఊళ్లకు తరలిన జనం ఇక్కట్లు



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ వాహనాలు బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్నాయి. దీపావళి వేడుకలు, వరుస సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు బయలుదేరిన నగరవాసుల పైన దారిదోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలపైన రెట్టింపు వసూలు చేశాయి. బంద్ సందర్భంగా సిటీబస్సులతో పాటు దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం నిలిచిపోయాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితమయ్యాయి. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్ల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించే బస్సులను కూడా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అప్పటికే బస్‌స్టేషన్‌లకు చేరుకున్న ప్రయాణికులు ఏదో ఒకవిధంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో క్యాబ్‌లు, టాటాఏస్‌లు, మ్యాక్సీక్యాబ్‌లు, తదితర వాహనదారులు అడ్డగోలుగా దోచుకున్నాయి. గత్యంతరం లేకపోవడంతో ఎక్కువ చార్జీలను చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. బీసీ బంద్ దృష్ట్యా హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే సుమారు 3500 బస్సులు స్తంభించాయి. మరోవైపు నగరంలోని 25 డిపోల్లో మరో 2850 కి పైగా సిటీ బస్సులు సైతం డిపోలకే పరిమితమయ్యాయి. వీకెండ్ కావడంతో వివిధ అవసరాల నిమిత్తం ఇంటి నుంచి బయటికి వచ్చిన జనాన్ని ఆటోవాలాలు దోచుకున్నారు.సెవెన్ సీటర్ ఆటోలు, శేర్ ఆటోల్లో సైతం రెట్టింపు చార్జీలు వసూలు చేశారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు...

ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి సంస్థలతో అనుసంధానమయ్యే క్యాబ్ డ్రైవర్‌లు తమ వాహనాలను బంద్ దృష్ట్యా జిల్లాలకు మళ్లించారు. మరోవైపు పలు ఐటీ సంస్థలకు వాహనాలను నడిపే ట్రావెల్ ఏజెంట్‌లు సైతం దీపావళి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు రోడ్డెక్కాయి. ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్, ఆరాంఘర్, బీఎన్‌రెడ్డినగర్, తదితర ప్రాంతాల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించాయి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ క్యాబ్‌లు బారులు తీరాయి. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి హన్మకొండ వరకు ఆర్టీసీ లగ్జరీ బస్సుల్లో రూ.250 నుంచి రూ.300 వరకు చార్జీ ఉంటుంది. సాధారణ రోజుల్లో ఈ రూట్‌లో రాకపోకలు సాగించే క్యాబ్‌లు సైతం ఈ చార్జీలను వసూలు చేస్తాయి. కానీ బంద్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని క్యాబ్‌వాలాలు రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేయడం గమనార్హం. ఎల్బీనగర్ నుంచి విజయవాడ, ఖమ్మం, సూర్యాపేట్, నల్లగొండ, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం ఇదేవిధంగా క్యాబ్‌వాలాల దారిదోపిడీకి గురయ్యారు.

మెట్రోలు ఫుల్...

బీసీబంద్ దృష్ట్యా మెట్రో రైళ్లు కిక్కిరిశాయి. నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-ఎంజీబీఎస్ రూట్‌లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్‌లకు వెళ్లే ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయించారు. మరోవైపు ఆటోరిక్షాలకు సైతం డిమాండ్ పెరిగింది. ఓలా, ఉబెర్, ర్యాపిడో ఆటోల్లోనూ చార్జీలు అమాంతంగా పెరిగాయి.బంద్ కారణంగా ఆసుపత్రులకు వెళ్లే వారు, అత్యవసర పనుల పైన బయటకు వెళ్లిన వాళ్లు పెద్ద మొత్తంలో సమర్పించుకోవాల్సి వచ్చింది.

బంద్‌లో పలువురు నేతలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతుగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రజారవాణా స్తంభించినప్పటికీ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, తదితర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం, తదితరులు నారాయణగూడ వైఎంసీఏ నుంచి కాచిగూడ చౌరస్తా, కోఠీ , సుల్తాన్ బజార్, రామకోఠీ, బొగ్గులకుంట మీదుగా అబిడ్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అరుణోదయ సాంస్కృతి సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, సీపీఐ సీనియర్ నాయకులు నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ , సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు గోవర్దన్, తెలంగాణ జన సమితి నాయకులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, సీపీఐఎల్ ఎల్ మాస్ లైన్ హన్మేష్, గడేగోని రవి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల అక్రమ రవాణా

నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రేషన్ సరుకులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సిటీ-1 విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వారాసిగూడకు చెందిన షేక్ మస్తాన్ చుట్టుపక్కల కాలనీవాసుల నుంచి రేషన్ సరుకులను సేకరించి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకునేవాడు. శనివారం 7.86 క్వింటాళ్ల బియ్యం, 100 కిలోల గోధుమలను తరలిస్తుండగా సమాచారం అందుకున్న అధికారులు సీతాఫల్‌మండిలోని టీఆర్టీ క్వార్టర్-14లో ఆకస్మిక దాడులు నిర్వహించి నిందితుడు మస్తాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి సరుకులను స్వాధీనం చేసుకుని సర్కిల్-9 సివిల్ సప్లయి విభాగానికి అందించారు. మస్తాన్‌ను చిలకలగూడ పోలీసులకు అప్పగించారు.

మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్..

రెండు యూట్యూబ్ చానళ్లపై కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియాలో స్వేచ్ఛ ఉంది కదా అని.. ఏ తరహా కంటెంట్ అయినా చేస్తామంటే కుదరదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్ చేసిన రెండు యూట్యూబ్ చానళ్లపై హైదరాబాద్ సైబర్ క్రై మ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వ్యూస్, లైక్స్ తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం చిన్నారులతో అసభ్యకర కంటెంట్ చేయకూడదన్నారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదని చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలు చేసే వారిపై పోక్సో, జువైనల్ జస్టిస్ యాక్ట్ తదితర చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు దృష్టికి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

ఖైరతాబాద్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 1.253 కిలోల గంజాయిని ఖైరతాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద శుక్రవారం ఖైరతాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. హోండా డియో ద్విచక్రవాహనంపై వెళ్తున్న సంగారెడ్డి జిల్లాకు చెందిన శ్రీను అలియాస్ రాథోడ్ శ్రీనివాస్, కారు డ్రైవర్, సేల్స్‌మెన్‌గా పనిచేసే సూర్య అలియాస్ జాదవ్ సురేష్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 1.243 కిలో గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆకాష్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అతడు అంతర్రాష్ట్ర మాదకద్రవ్య సరఫరా నెట్‌వర్క్‌లో సభ్యుడని పోలీసులు భావిస్తున్నారు.

పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి హల్‌చల్

- ల్యాంకోహిల్స్‌లో సెక్యూరిటీ గార్డులపై దాడి
- 15 మందిపై కేసు నమోదు
- ఐదుగురి అరెస్ట్



దాడి చేసేందుకు వచ్చిన వ్యక్తులు

గచ్చిబౌలి: పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ల్యాంకోహిల్స్ బ్లాక్ 3ఎల్‌హెచ్‌లో మహరాష్ట్ర కేడర్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి తల్లి అద్దెకు ఉంటోంది. ఈ నెల 15న ఉదయం వినాయక రెడ్డి అనే వ్యక్తి ల్యాంకోహిల్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 1703కి వెళ్లేందుకు వచ్చాడు. విజిటర్స్ లైన్‌లో కాకుండా రెసిడెన్సీ లైన్‌లో వెళ్లడంతో సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. పాస్ ఇవ్వడం లేదని చెప్పడంతో ఫ్లాట్ నెంబర్ 1703 నుంచి మురళి అనే వ్యక్తి కిందికి వచ్చాడు. వచ్చీరావడంతో అతను గొడవకు దిగడంతో సెక్యూరిటీగార్డు బాలకృష్ణ అతడిని తోశాడు. దీంతో మురళి సెక్యురిటీ గార్డుపై చేయడంతో అతను ప్రతి దాడి చేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన మురళి సాయంత్రం మరి కొందరితో కలిసి వచ్చి సెక్యూరిటీ గార్డులైన బాలకృష్ణ, చంద్‌లపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దాదాపు 15 మంది పాల్గొన్నట్లు ఆరోపిస్తూ బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు 10 మందికి నోటీసులు ఇచ్చి పంపారు. మరో ఐదురుగురు పరారీలో ఉన్నారు. ఇది ఇలా ఉండగా దాడి చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సెక్యూరిటీ గార్డులు శనివారం ల్యాంకోహిల్స్‌కు వెళ్లే దారిలో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని, మరో ఐదుగురు పరారీలో ఉన్నారని రాయదుర్గం పోలీసులు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే పరారీలో ఉన్న ఐదుగురు వ్యక్తులు పోలీస్ స్టిక్కర్‌ఉన్న కారులో వచ్చి రాయదుర్గం పెట్రోల్ మొబైల్ సిబ్బంది చూస్తుండగానే సిబ్బందిపై దాడికి పాల్పడటంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహరాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ కేసును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నోటీసులతో సరిపెట్టాలని సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులను కోరినా అందుకు నిరాకరించి రిమాండ్ చేసినట్లుగా సమాచారం.


ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ



పట్టుబడిన ఏఈ అమర్‌సింగ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ హిమాయత్‌సాగర్ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అమర్‌సింగ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ ఏసీబీ సిటీ రెంజ్ డీఎస్పీ .శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏఆర్‌సీకే అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్ ఏఈ అమర్ సింగ్‌ను సంప్రదించగా అతను రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం సదరు కాంట్రాక్టర్ శనివారం అసిస్టెంట్ ఇంజనీర్ అమర్‌సింగ్‌కు నగదు అందజేస్తుండగా పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఈని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనువాదాల కోసం జీవితాన్ని అంకితం చేశారు



హిమాయత్‌నగర్ : అనువాదాల కోసం నిర్మలానందం తన జీవితాన్ని అంకితం చేశారని పలువురు వక్తలు కొనియాడారు. నిర్మలానందం 90వ జయంతి సందర్భంగా శనివారం రాత్రి బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో రచయిత వాసిరెడ్డి నవీన్ అధ్యక్షతన జరిగిన 'నిర్మలానందం మిత్రుల స్మృతులు' సభలో ప్రముఖ అనువాదకుడు, రచయిత నిర్మలానందం మూడు సంపుటాలైన ఏడు పైసలు, నది మూడవ ఒడ్డు, సరిహద్దు కథలను నిఖిలేశ్వర్ ఆవిష్కరించి మాట్లాడారు. నిస్వార్థంగా రచనలు చేసి ఎంతో మంది రచయితలను ప్రోత్సాహించారన్నారు. అనేక భాషల్లో అనువాదం చేసి అందరి మన్ననలు పొందారని, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేశారని కొనియాడారు. ప్రొ.జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ మంచి అనువాదకుడి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నిర్మలానందం తెలుగు సాహిత్యానికి నెత్తురు ధార పోసిన రచయిత అని అన్నారు. కార్యక్రమంలో శీతా సుభద్రదేవి, భూమన్న, జె.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మణ్ మృతదేహం

సికింద్రాబాద్ : పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెచ్‌సీ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేరేడ్‌మెట్ అంజయ్యకాలనీకి చెందిన ఎం లక్ష్మణ్ (45) డైలీ లేబర్‌గా పని చేసేవాడు. ఈనెల 17న రాత్రి అతను మౌలాలి గేట్ క్యాబిన్ అమ్ముగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను ఎడ్యుకేషన్ టూర్స్‌కు తీసుకెళ్లాలి

విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

లక్డీకాపూల్: విద్యార్థులను తరచూ ఎడ్యుకేషనల్ టూర్స్‌కు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులకు సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థినులు కలెక్టరేట్‌లోని పలు విభాగాలను సందర్శించి, జిల్లా కలెక్టర్‌తో ముఖాముఖి కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని, విద్య విలువైన సంపదని అన్నారు. విద్యార్థులలో అనుభవ పూర్వక అభ్యాసం ఒక పరివర్తనాత్మక విధానాన్ని సూచిస్తుందన్నారు. ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా, హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టరేట్‌ను సందర్శించారు. జిల్లా యంత్రాంగం పరిపాలన ఎలా పని చేస్తుందో.. కలెక్టరేట్ పాత్ర ఏంటో ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం గురించి విద్యార్థులు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

శ్రీనగర్‌కాలనీ: బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎర్రగడ్డలో శనివారం బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బూత్ కమిటీలు సమష్టిగా పని చేస్తే బీఆర్‌ఎస్ భారీ మెజార్టీ సాధ్యమని, బీఆర్‌ఎస్ జెండా మరోసారి ఇక్కడ రెపరెపలాడాలని కోరారు. అనంతరం పలు బస్తీల్లో ప్రచారాన్ని నిర్వహించారు. నేతలు సతీష్ అరోరా, డి.సంజీవ, షరీఫ్ ఖురేషి, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద వ్యర్థాలపై కార్పొరేటర్ అసహనం



రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల వద్ద వ్యర్థాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అసహనం వ్యక్తం చేశారు. ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల ఎదుట పెద్ద ఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పాఠశాల వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలతో పాటు ఆక్రమణలు ఉన్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే వ్యర్థాలను తొలగించడంతో పాటు ఆక్రమణలు తొలగించాలని వీటి వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారులకు తెలిపారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు.

తాగుబోతుల అడ్డాగా జీహెచ్‌ఎంసీ పార్క్



బంజారాహిల్స్: కాలనీవాసులకు ఆహ్లాదం కోసం ఎంతో అందంగా తయారు చేసిన పార్కులు తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్–11లోని ఎకో ఎలెవెన్ పార్కులో కొద్ది రోజులుగా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఉదయం నుచి అర్ధరాత్రి వరకు కొంత మంది మందు సీసాలు తెచ్చుకొని మద్యం సేవించడంతో పాటు రాత్రి వేళల్లో యువకులు ఈ పార్కు వద్దకు చేరుకొని గంజాయి తాగుతున్నారంటూ కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నారు. పార్కు నిర్వహణ అధికారుల నిర్లక్ష్యంతో పాటు పోలీసుల నిఘా లేకపోవడంతో పార్కులో అసాంఘిక కార్యక్రమాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పార్కులోని బెంచీలు విరిగిపోవడంతో పాటు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన పలు నమూనాలను సైతం తాగుబోతులు ధ్వంసం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలింగ్ విధుల్లో.. నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్


- పూర్తి అవగాహనతో పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి
- ఉదయం 7 వరకు మాక్ పోలింగ్ పూర్తి చేయాలి
- పారదర్శకంగా పోలింగ్ జరిగేలా చూడాలి
- విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- జూబ్లీహిల్స్ మొదటి విడత శిక్షణలో ఆర్‌వీ కర్ణన్



శిక్షణకు హాజరైన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11వ తేదీన జరగనుండగా ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయగా యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో డీఆర్‌సీ, స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎంల పంపిణీ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచే జరగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని బంజారాభవన్‌లో శనివారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదర్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీఓల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ హాజరై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణను టీమ్ వర్క్‌గా చేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని కూడా ఆషామాషీగా తీసుకోవద్దని, చిత్తశుద్ధితో వినాలని, సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో పోలింగ్ విధులకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా తటస్థంగా ఉంటూ పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు.

- ఈ సారి ఓటరు ఇన్ఫర్మేషన్ నంబర్ స్లిప్పులు ఓటర్లకు పంపిణీ చేస్తున్నామన్నారు.
- పోలింగ్ కేంద్రం, ఓటరు జాబితాలో ఓటరు సీరియల్ నంబర్ సులభంగా గుర్తించేందుకు స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని, ఇది ఓటర్లకు ఎంతో ప్రయోజనం అన్నారు.
- ప్రతి ఓటరు తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సులభంగా వెళ్లి ఓటు వేసే విధంగా వీటిని తీర్చిదిద్దామన్నారు.
- ఓటు వేసే సమయంలో ఓటరు ఎపిక్ కార్డు లేదా ఈసీఐ సూచించిన ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తేనే ఓటు వేయనివ్వాలన్నారు.
- మాక్ పోలింగ్ చేయడం టీమ్ బాధ్యత అని, ఉదయం 7 గంటలలోపు మాక్ పోలింగ్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ పాల్గొన్నారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,98,982 కాగా ఇందులో పురుషులు 2,07,367, మహిళలు 1,91,590 ఉన్నారు.
- మొత్తం 139 లొకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.



దంతేరస్ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో జూబ్లీహిల్స్‌లోని ఓ బంగారం షాపు

దంతేరస్ ధగధగలు

బంగారం షాపుల్లో జోరుగా కొనుగోళ్లు

బంజారాహిల్స్: దంతేరస్ సందర్భంగా బంగారం షాపులన్నీ కస్టమర్లతో కిక్కిరిసిపోయాయి. ప్రతియేటా దీపావళికి ముందు వచ్చే దంతేరస్‌కు ఎంతో కొంత బంగారం కొనాలనే సెంటిమెంట్ చాలా మందిలో బలంగా ఉండటంతో శనివారం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, సోమాజిగూడలలోని బంగారం షాపుల్లో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిగాయి. ఒక వైపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నా అమ్మకాలు ఏ మాత్రం తగ్గలేదని వ్యాపారులు చెప్పారు. ఒక్క సోమాజిగూడలోని బంగారం షాపుల్లోనే శనివారం ఒక్కరోజే 100 కేజీలకు పైగా బంగారు ఆభరణాల అమ్మకాలు జరిగినట్లు వ్యాపారులు తెలిపారు.



జూబ్లీహిల్స్‌లో ఆభరణాల కొనుగోళ్లు



పంజగుట్టలోని ఓ జ్యువెలరీ షాపులో కొనుగోళ్లు

శ్మశానవాటికల్లో జోరుగా స్వచ్ఛత పనులు



శ్మశానవాటికను శుభ్రం చేయిస్తున్న శ్మశానవాటికల సేవా సంఘం సభ్యులు

బంజారాహిల్స్: దీపావళి పండుగ వస్తుందంటే తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసుకుని, రంగులు వేసి పూజలు చేసుకునే సంప్రదాయం మన హిందూ సమాజంలో ఉంది. పండుగ సమీపిస్తున్న సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12, రోడ్డు నంబర్–13లోని హిందూ శ్మశానవాటికలో దట్టంగా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లను తొలగించే కార్యక్రమాన్ని శ్మశానవాటికల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఈ శుభ్రత కార్యక్రమం పూర్తవుతుందని 'శ్మశానవాటిక సేవా సంఘం' అధ్యక్షుడు ఎంఎస్ రవీందర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం హిందువుల మనోభావాలకు సంబంధించిన విషయమని, ఎటువంటి జాప్యం జరగకుండా నెల రోజుల ముందు నుంచే కమిటీ కార్యవర్గ సభ్యులు జీహెచ్‌ఎంసీ అధికారులు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వినతి పత్రాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. వారి కృషి ఫలితమే పనులు వంద శాతం పూర్తి చేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్.విజయకృష్ణ, ప్రేమ్‌నగర్ ప్రధాన కార్యదర్శి, శ్మశానవాటికల సేవా సంఘం కార్యవర్గ సభ్యుడు కే.భగవాన్‌దాస్, ఆర్గనైజర్ సతీష్, కోశాధికారి జీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజీఐతో మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు



సదస్సులో మాట్లాడుతున్న స్వామి ముద్దం

బంజారాహిల్స్: కృత్రిమ మేధస్సు(ఏఐ) తర్వాత రాబోతున్న కృత్రిమ సాధారణ మేధస్సు(ఏజీఐ) మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని, అయితే దాంతో పాటు మంచి–చెడు పరిణామాలు కూడా తీవ్రంగా కనిపించనున్నాయని జర్నలిస్టు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ మోడ్రన్ జర్నలిజం పుస్తక రచయిత స్వామి ముద్దం హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆఫ్ జర్నలిజం ఇన్ ది ఏఐ ఎరా' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఏజీఐ యుగంలో జర్నలిజం ఎదుర్కోనున్న అవకాశాలు, సవాళ్లను వివరించారు. ఏజీఐ మనిషి మాదిరిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల స్థాయికి ఎదుగుతుందన్నారు. ఈ పరిణామం జర్నలిజంపై నమ్మకం, బాధ్యత, నైతిక విలువలపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ శ్రీనివాస్ వడ్డాణం, డాక్టర్ యాదగిరి, సీనియర్ జర్నలిస్టులు, ఏఐ నిపుణులు పాల్గొన్నారు.

గ్యార్వి వేడుకల్లో విజయారెడ్డి

పంజగుట్ట: ఎర్రమంజిల్‌లో శనివారం గ్యార్వి షరీఫ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మురళి మోహన్, మహ్మద్ ఫైజ్ పర్వేజ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మజ్లిస్‌కు సలాం కొట్టే పార్టీలే..



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: కాంగ్రెస్ అయినా, బీఆర్‌ఎస్ అయినా మజ్లిస్ పార్టీకి సలాం కొట్టే పార్టీలేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో శనివారం రాత్రి బూత్‌కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో ఏది గెలిచినా రౌడీయిజాన్ని పెంచి పోషిస్తాయన్నారు. కొన్నేళ్ల క్రితం పాతబస్తీలో హిందువులు మజ్లిస్ పార్టీ దౌర్జన్యం కారణంగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లారని, ఇక వారి టార్గెట్ జూబ్లీహిల్స్‌పై పడిందని అన్నారు. నేడు కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి 2014లో ఎంఐఎం నుంచి పోటీ చేశాడని, నేడు కాంగ్రెస్ నుంచి చేస్తున్నాడని, కాంగ్రెస్ టికెట్ తీసుకోగానే గాంధీ భవన్‌కు వెళ్లకుండా, దారుసలాంకు వెళ్లాడని, ఇది చెప్పడానికే నాకు సిగ్గనిపిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఆ పార్టీ నియమించలేదని, ఈ నిర్ణయం దారుసలాంలో జరిగి, అసదుద్దీన్ నిర్ణయించాడని అన్నారు. ఇలాంటి దివాలాకోరు రాజకీయాలు ఎన్నడూ చూడలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు కూడా మజ్లిస్ పార్టీ కనుసన్నల్లో పని చేసిందని అన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో మజ్లిస్ పార్టీ ఉంటూ పెత్తనం చేస్తోందని అన్నారు. భారతీయ జనతాపార్టీ పేదల పార్టీ అని, ఎలాంటి కలుషితం లేని స్వచ్ఛమైన పార్టీ అని, రానున్న ఎన్నికల్లో నిజాయితీ పరుడైన, సమస్యలు తెలిసిన నాయకుడు లంకెల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి లంకెల దీపక్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, ఆ పార్టీ సీనియర్ నేతలు గౌతం రావు, కిలారి మనోహర్, రామకృష్ణ, రూప, జబ్బార్ మురళీ, గణేష్, నవీన్‌కుమార్, కరాటే కళ్యాణి, భరత్ రావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడేవి.. శిక్షణ పొందిన చేతులే..

కేర్ హాస్పిటల్ వర్క్‌షాప్‌లో డాక్టర్లు



వర్క్‌షాప్‌కు హాజరైన వైద్య నిపుణులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా సహకారంతో 'బేసిక్స్ టు అడ్వాన్సెస్ ఇన్ ఎయిర్‌వే అండ్ బ్రీతింగ్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో రోగుల వాయు మార్గం, శ్వాస నిర్వహణలో తాజా పద్ధతులు, ప్రొటోకాల్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి మాట్లాడుతూ ప్రతి సెకను విలువైనప్పుడు, శిక్షణ పొందిన చేతులు, స్పష్టమైన విధానాలు మాత్రమే ప్రాణాలను కాపాడగలవన్నారు. కేర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం జోనల్ హెచ్‌ఓడీ, అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ ఎఫెక్టివ్ ఎయిర్‌వే, బ్రీతింగ్ ఇంటర్వెన్షన్ అనేవి ప్రాణాలను రక్షించడంలో తొలి, కీలకమైన దశలుగా పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ వైద్యులకు సైద్ధాంతిక జ్ఞానం మాత్రమే కాకుండా ఆ జ్ఞానాన్ని నిజమైన పరిస్థితుల్లో ఎలా ఉపయోగించాలో నేర్పుతుందన్నారు. జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజునాయర్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి సంబరాలు



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి వేడుకల్లో చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆనందం, ఐక్యతతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ స్పృహతో సంప్రదాయ విలువలను ప్రోత్సహిస్తూనే చీకటిపై వెలుగు విజయం, చెడుపై విజయం సాధిస్తున్న దీపావళి సారాంశాన్ని తెలిపారు. దీపావళి విశేషాలను తెలియజేసే పలు నృత్యాలు, సంగీతం, నాటక ప్రదర్శనలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అబ్బురపరిచారు. విజయవంతో రాముడు అయోధ్యకు తిరిగి రావడాన్ని ప్రదర్శించిన నాటిక రాముడి కథలో ఉన్న నీతి, కరుణ, ఐక్యతా విలువలను సూచిస్తుంది. కార్యక్రమాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారని తెలియజేశారు.

వాకింగ్ చేస్తూ.. ఓటు అడుగుతూ..



కృష్ణకాంత్‌పార్క్‌లో వాకింగ్ చేస్తున్న మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డి

వెంగళరావునగర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలంటూ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రచారాలు ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్‌పార్క్‌లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కార్పొరేటర్ దేదీప్య విజయ్ తదితరులు వాకింగ్ చేశారు. అనంతరం యోగా, వ్యాయామాలు చేశారు. చిల్డ్రన్స్ పార్క్‌లో కొద్దిసేపు జారుడుబండ ఆడారు. పార్కుకు వచ్చిన వారిని పలకరిస్తూ మన చెల్లెమ్మ సునీతను గెలిపించాలని కోరారు.

ప్రశాంతంగా బీసీ బంద్



ఫిలింనగర్‌లో పాఠశాలను మూసేయిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శనివారం ఫిలింనగర్‌లోని పలు వాణిజ్య సముదాయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటులో సైతం తీర్మానం పెట్టాలని అన్నారు.

అన్ని పార్టీల ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్: 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు శనివారం బంద్ చేపట్టాయి. కాంగ్రెస్ పార్టీ సహా ఇతర పార్టీలు, కుల సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటూ జూబ్లీహిల్స్ డివిజన్ బీసీ సంఘం నేత, బీజేఆర్‌నగర్ నివాసి శ్యామ్ డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డిమాండ్ చేశారు. జ్యోతిరావుపూలే విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బంద్‌లో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్



బంద్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు

అసభ్యంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నేతపై కేసు నమోదు

బంజారాహిల్స్: పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కార్పొరేటర్‌తో ఒక కాంగ్రెస్ నేత అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి శనివారం బంజారాహిల్స్ లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ పరిశీలకుడు శక్తిసిన్హ్ గోయల్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో పాటు సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రమణగౌడ్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు హాజరయ్యారు. శక్తిసిన్హ్ గోయల్‌తో సమావేశమయ్యేందుకు వీరంతా ఆయన గది బయట నిలబడి ఉన్నారు. అదే సమయంలో పంజగుట్ట ప్రతాప్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత గడ్డం శ్రీనివాస్ యాదవ్.. వనం సంగీతయాదవ్‌ను చేయిపెట్టి నెట్టివేయడమే కాకుండా అసభ్య పదజాలాన్ని ఉపయోగించాడు. అసభ్యంగా తాకడమే కాకుండా అక్కడే ఉన్న భారతీనాయక్, మహాలక్ష్మీతో సైతం అలాగే ప్రవర్తించాడు. దీంతో వనం సంగీతయాదవ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు కళాకృతి ఆర్ట్, క్రాఫ్ట్ అండ్ టెక్స్‌టైల్స్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారులు మద్దిలేటి, తేజ వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాను వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అబ్దుల్ ఖదీర్‌కు సర్ సయ్యద్ ఎక్స్‌లెన్స్ అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: విద్యారంగంలో విశేష కృషి చేసిన షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్‌కు 'జాతీయ సర్ సయ్యద్ ఎక్సలెన్స్ అవార్డు–2025'దక్కింది. శుక్రవారం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో జరిగిన సర్ సయ్యద్ డే స్మారక వేడుకలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. 1989లో చిన్న గదితో మొదలైన షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ నేడు భారతదేశంలోని 13 రాష్ట్రాల్లో విద్యాసేవలను విస్తరించిందని అబ్దుల్ ఖదీర్ అన్నారు. 20 వేల మందికిపైగా విద్యార్థులు, 500 మందికిపైగా అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో కూడిన ఈ షాహీన్ కుటుంబం కేవలం అక్షరాలను బోధించడం లేదని, వారు కలలను కనడం, వాటిని సాకారం చేసుకోవడం నేర్పుతుందన్నారు.

ప్రమిదలు ఎంతో సంతోషాన్నిస్తాయి..



లక్డీకాపూల్: దివ్యాంగ పిల్లలు దీపావళి పండుగ సందర్భంగా స్వతహాగా తయారు చేసిన ప్రమిదలు ఎంతో సంతోషాన్నిస్తున్నాయని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో దివ్యాంగ విద్యార్థులు కలెక్టర్‌కు ప్రమిదలు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలను కలెక్టర్ అభినందించి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రాజేందర్, మేనేజర్ శాంతి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను క్రమబద్ధీకరించాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో ఏళ్లుగా పని చేస్తున్న 23,667 మంది ఆర్టిజన్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి, ఆయా కార్మికులందరికీ ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్‌ను వర్తింపజేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జేఏసీ ప్రతినిధుల బృందం జెన్‌కో సీఎండీ హరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. విద్యార్హతను బట్టి ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ చేయాలని, మరో 6,500 మంది పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సతీష్‌రెడ్డి, కన్వీనర్లు సాయిలు, ఎస్.చంద్రారెడ్డి, కో చైర్మన్ శ్రీధర్‌గౌడ్, కో కన్వీనర్ చందర్‌సింగ్ ఠాకూర్, ఉపాధ్యక్షులు చింత ఎల్లయ్య, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి అస్వస్థత

టేకాఫ్‌కు ముందు విమానం నిలిపివేత

శంషాబాద్: బోర్డింగ్ అయిన తర్వాత ఓ ప్రయాణికురాలు అనారోగ్య కారణాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో టేకాఫ్‌కు ముందు విమానాన్ని నిలిపివేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి అగర్తలా బయలుదేరేందుకు 6ఈ–6746 విమానంలో 232 మంది ప్రయాణికులు విమానంలోకి ఎక్కికూర్చున్నారు. 52 ఏళ్ల వయసు కలిగిన ఓ ప్రయాణికురాలు మధుమేహం అధికం కావడంతో అపస్మారక స్థితిలోకి చేరింది. దీంతో వెంటనే అపోలో ఆస్పత్రి సిబ్బంది విమానం వద్దకు చేరుకుని ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత విమానం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు

'జూబ్లీహిల్స్'లో స్థానిక సమస్యలు

పక్కదారి

ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర, జాతీయ అంశాలు | అన్ని ప్రధాన పార్టీలదీ అదే దారి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో స్థానిక సమస్యలు పక్కదారి పట్టి రాష్ట్ర, జాతీయ స్థాయి అంశాలు తెరపైకి వస్తున్నాయి. నియోజకవర్గంలో మెజార్టీగా మురికివాడలు, పేద జనం ఏమి కోరుకుంటున్నారనేది ప్రధాన రాజకీయ పక్షాలకు పట్టింపు లేకుండా పోయింది. అధికార, ప్రతిపక్షాలు ఒకరి లోపాలపై మరొకరు ఆరోపణస్త్రాలతో స్థానిక రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపఎన్నిక నేపథ్యంలో అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందన్న స్థానికుల ఆశలు అడియాసలుగా మారుతున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి అంశాలు స్థానిక ప్రజలకు అంతగా అవసరం లేదని, ఇక్కడ వారు నివసించే వారి కోసం ఎలాంటి సంక్షేమాభివృద్ధి చేస్తామని అంశాలపై మాత్రం రాజకీయ పార్టీలు ఫోకస్ చేయడం లేదన్న వాదన వినవస్తోంది.

ఇదీ సంగతి

ప్రధాన రాజకీయ పక్షాలది పాడిందే పాటగా తయారైంది. అధికార కాంగ్రెస్ ఉప ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముగ్గురు మంత్రులు, 18 కార్పొరేషన్ చైర్మన్లు రంగంలోకి దింపి డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో అమలవుతున్న ఆరు గ్యారంటీ పథకాలు, సన్న బియ్యం గురించి పదే పదే ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. నియోజకవర్గంలో పదేళ్లు అభివృద్ధి జరగలేదని, తామే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, తమ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్‌పార్టీ నేతలు ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ బాకీ కార్డును, హామీల అమలులో విఫలం లాంటి విషయాలకు వివరిస్తూ ఓటర్లను ప్రభావితం చేసే పనిలో పడింది. పదేళ్లు సేవ చేసిన దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణికి మద్దతు ఇవ్వాలని సెంటిమెంట్ కోసం వెంపర్లాడుతోంది. అయితే గత పది ఏళ్లల్లో జరిగిన అభివృద్ధి మాత్రం వివరించలేకపోతోంది. కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న నాయకుడు మజ్లిస్ అభ్యర్థి అని ప్రచారం చేస్తూ హిందూత్వ ఎజెండాను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దీర్ఘకాలిక సమస్యలు, ప్రజాభిప్రాయాలు, ప్రజలకు, రాబోయే తరాలకు చేయాల్సిన భవిష్యత్ కార్యాచరణ గురించి చెప్పడంలో ప్రధాన పక్షాలు విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతీ పండుగ పవిత్రమైనదే

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



చెప్పల్‌బజార్‌లో దున్నరాజుకు స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కాచిగూడ: ప్రకృతిలో ప్రతీ పండుగ ఎంతో పవిత్రమైనదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా యాదవ సోదరులు దున్న రాజులతో సదర్ వేడుకలను ఎంతో అద్భుతంగా నిర్వహిస్తారని, దున్న రాజులను ఎంతో ఆకర్షణీయంగా అలంకరించి మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారని ఆయన తెలిపారు. సదర్ వేడుకల్లో పాల్గొనేందుకు తీసుకువచ్చిన 'ఆల్ ఇండియా చాంపియన్ బుల్స్'కు శనివారం కిషన్ రెడ్డి కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో స్వాగతం పలికారు.

దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, సదర్ వేడుకలు నిర్వహించే యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సి.సందీప్ యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, లడ్డూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రమిదల పంపిణీ



దీపావళి పర్వదినం సందర్భంగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ శనివారం అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి రంగు రంగుల మట్టి ప్రమిదల బాక్సులను పంపిణీ చేశారు. అనంతరం ఉద్యోగులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స కోట, సలహాదారు బ్రిగేడియర్ సోమశంకర్, చీఫ్ ఇంజనీర్ బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

42 శాతం రిజర్వేషన్లు సాధించేదాకా పోరు



- బీసీబంద్ సందర్భంగా పీసీసీ చీఫ్, మంత్రులు

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడతామని పలువురు మంత్రులు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన బీసీ బంద్‌లో భాగంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలికాయన్నారు. దానిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించే విధంగా బీజేపీ నాయకులు కృషి చేయాలని కోరారు. పంచాయతీరాజ్ చట్ట సవరణకు కూడా కేంద్రం ఆమోదం తెలుపలేదన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు, కులగణన వంటి ప్రక్రియలను పూర్తి చేసిందని పేర్కొన్నారు. బీసీ బిల్లు ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని అన్నారు. రాష్ట్ర బీజేపీ నేతలే బీసీ బిల్లును అడ్డుకుంటున్నారని విమర్శించారు. బీసీ బిల్లును ఆమోదింపచేసి తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు ఎంపీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజ్వేషన్లు కల్పించేందుకు చేపట్టిన బంద్ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాలు, ఎంఆర్‌పిఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్ అడ్డంకులు

మంత్రి కొండా సురేఖ



బంద్‌లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొక్కిపెట్టిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ బంద్‌లో భాగంగా ఆమె కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో బీజేపీ మద్దతు తెలిపి బయట కుట్రలు చేసి అడ్డుకుంటోందని ఆరోపించారు. బీజేపీకి బీ టీమ్‌గా ఉన్న బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలు చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై ఉన్న ప్రేమతో కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బిల్లును ప్రవేశపెట్టారని అన్నారు. రాష్ట్రంలో జనగణన, కులగణన చేపట్టి దేశానికే రాష్ట్ర ప్రభుత్వం రోల్‌మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. బీజేపీ తలచుకుంటే 5 నిమిషాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయవచ్చని, కానీ బీజేపీ దొంగనాటకాలు ఆడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బద్రీనాథ్ యాదవ్, సంతోష్‌యాదవ్, అర్వింద్‌యాదవ్, శేఖర్ ముదిరాజ్, నందికంటి రవి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లకు దీపావళి వెలుగులు

దుకాణాల్లో సందడే సందడి

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి పండుగంటే కొత్త దుస్తులుండాల్సిందే.. ఇంటికి పండుగ కళ రావాలంటే కొత్త వస్తువులు కూడా కొనుక్కోవాల్సిందే.. అందుకే నగరవాసులు చలో షాపింగ్ అంటున్నారు. దీంతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. మార్కెట్లకు దీపావళి వెలుగులు సంతరించుకున్నాయి. భాగ్యనగరిలో దీపావళి సందడి నెలకొంది. ఏ వీధి చూసినా పూలరాశులు.. తీరొక్క ప్రమిదలు దర్శనమిస్తున్నాయి. నగరం అంతటా దీపావళి సందడితో పూలు, టపాసులు, స్వీట్స్ షాపింగ్ ఊపందుకుంది. పూలు, స్వీట్స్, క్రాకర్స్ దుకాణాలలో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం లక్ష్మీ పూజలు ఉండటంతో శనివారం నుంచే నగర మార్కెట్లలో రద్దీ ఎక్కువైంది. పూజసామగ్రి నుంచి రకాలు వస్తువులు కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది. దీపావళి ఆర్డర్లను అందజేసేందుకు మిఠాయి దుకాణదారులు పనిలో పడ్డారు. కేజీ మిక్స్‌డ్ స్వీట్ రూ. 800–1,000 ఉండగా, బెంగాలీ స్వీట్స్ ధరలు కాస్త ఎక్కువగా కేజీ రూ. 1,000–1,200 వరకు ఉన్నాయి. దీపావళి ముందు వచ్చే దంతేరస్ శనివారం బంగారం షాపుల్లో కొనుగోళ్లు భారీ స్థాయిలో జరిగాయి. ధర కూడా కాస్త తగ్గింది. సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పాతబస్తీల్లోని జ్యువెలరీ స్టోర్ల ముందు జనం బారులు తీరారు. అదేవిధంగా మార్కెట్లలో రకరకాల పటాసులు అందుబాటులోకి వచ్చాయి. ఎన్నో రకాల బ్రాండ్స్ లభ్యమవుతున్నాయి.

నల్లకుంటలో స్వల్ప ఉద్రిక్తత

బీసీబంద్ సందర్భంగా ఓ షోరూం, హోటల్‌పై దాడి



బజాజ్ ఎలక్ట్రానిక్స్‌పై రాళ్లతో దాడి చేస్తున్న ఆందోళనకారులు

నల్లకుంట: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నల్లకుంటలో బీసీ బంద్ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. శంకరమఠం మార్కెట్ సమీపంలో గల బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం తెరిచి ఉండటంతో ఆందోళనాకారులు రాళ్ల దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నల్లకుంట పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. కాచిగూడ పీఎస్ పరిధిలోని హుస్సేన్ సాగర్ నాలా సమీపంలో గల రత్నానగర్ సమీపంలోని పెట్రోల్ బంక్ తెరిచి ఉండటంతో బీసీ సంఘాల నాయకులు దాడికి పాల్పడ్డారు. ఫ్యూయల్ మెషీన్లను ధ్వంసం చేశారు. సత్యానగర్ వద్దకు చేరుకున్న ఆందోళనకారులు అక్కడ తెరిచి ఉన్న రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌పై దాడి చేశారు. కాచిగూడ పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. బజాజ్ షోరూంపై దాడికి పాల్పడిన ఆందోళనకారులపై కేసు నమోదు చేశామని నల్లకుంట ఎస్‌హెచ్‌వో మారుతీప్రసాద్ తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని సీసీ కెమెరాల్లోని ఫుటేజీ ఆధారంగా గుర్తిస్తున్నామన్నారు.

జోరుగా టపాసుల విక్రయాలు

నగరంలో అమ్మకాలు రూ.300 కోట్లు ఉండవచ్చని అంచనా



సాక్షి,సిటీబ్యూరో: టపాసుల మార్కెట్లకు దీపావళి కళ వచ్చేసింది. రకరకాల టపాసులు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. చాలా రకాల బ్రాండ్లు లభ్యమవుతున్నాయి. గతేడాది కంటే ఈసారి అధికంగా క్రాకర్స్ కొనుగోలు చేసే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. నగరంలో ప్రతి ఏడాది క్రాకర్స్‌పై దాదాపు రూ.100 కోట్ల నుంచి 150 కోట్ల వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంటున్నారు. నగరానికి ఎక్కువగా శివకాశి నుంచే అవి దిగుమతి అవుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది అన్ని రకాల టపాసులపై దాదాపు 15–20 శాతం ధరలు తగ్గాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఒక్కో ఐటమ్ ధర రూ.10 నుంచి రూ.11 వేల వరకు ఉన్నట్టు బేగంబజార్‌లోని శాంతి ఫైర్‌వర్క్స్ అధినేత సంజయ్ కె.భూపే తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి వ్యాపారం బాగా తగ్గిందన్నారు. స్టాండర్డ్ కంపెనీలే కాకుండా దాదాపు 500 నాన్ స్టాండర్డ్ కంపెనీలు సైతం ఉత్పత్తులను ప్రవేశపెట్టాయి. నాణ్యమైన ఉత్పత్తులను కొనేందుకు యత్నించాలని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు. వ్యాపారులు ధరల గురించి తెలియజేయకుండా కిలోల చొప్పున అమ్మి అధిక లాభాలు గడిస్తుంటారు. కిలోల చొప్పున కొనడమంటే వినియోగదారులు మోసపోతున్నట్టే. మార్కెట్‌లో నాలుగైదు ప్రముఖ కంపెనీలే స్టాండర్డ్ క్వాలిటీ ఉత్పత్తులు అమ్ముతుంటాయి. ప్రమాణాలు పాటించని కంపెనీ ఉత్పత్తులను కాల్చేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

భాగ్యలక్ష్మి ఆలయంలో ధన్‌తేరస్ పూజలు



భాగ్యలక్ష్మీ అమ్మవారి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



పూజల్లో పాల్గొన్న బండారు దత్తాత్రేయ తదితరులు

చార్మినార్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు శనివారం క్యూ కట్టారు. ధన్‌తేరస్ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజల నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా దన్‌తేరస్‌ను పురస్కరించుకొని ఉదయం 4 నుంచి 5 గంటల వరకు అమ్మవారికి పంచామృతంలో అభిషేకం, ఉదయం 7 గంటలకు హారతి, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. శనివారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, నగర ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు తదితరులు ఆలయాన్ని సందర్శించి భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

నిబద్ధతతో పనిచేసేవారికే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న శక్తిసిన్హ్ గోహిల్

బంజారాహిల్స్: నిబద్ధత, నిజాయతీతో పనిచేసే ప్రతి కార్యకర్తను, నేతను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని రాజ్యసభ సభ్యుడు, ఏఐసీసీ సభ్యుడు శక్తిసిన్హ్ గోహిల్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఖైరతాబాద్ నూతన అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించారు. డీసీసీ అధ్యక్ష పదవిపై ఆసక్తి ఉన్న వారందరి నుంచి నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని తెలిపారు. పారదర్శకతతో డీసీసీ అధ్యక్ష పదవి నియామకం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బూత్ లెవెల్ నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాత నియామకాలు ఉంటాయని తెలిపారు. అభిప్రాయసేకరణలో భాగంగా ముఖ్య కార్యకర్తలు, నేతలకు ఏఐసీసీ నుంచి నేరుగా ఫోన్ కాల్స్ వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి, కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, వనం సంగీతా యాదవ్, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాటకం

- వామపక్షాలు, టీజేఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

గన్‌ఫౌండ్రీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో వామపక్ష పార్టీలు, తెలంగాణ జన సమితి, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ మేరకు శనివారం నారాయణగూడ చౌరస్తా నుంచి అబిడ్స్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎస్సీ, బీసీల వంటి నిరుపేదలకు బీజేపీ వ్యతిరేకమని, బీసీ బందుకు బీజేపీ మద్దతు పలకడం కపట నాటకమని విమర్శించారు. బీజేపీ ద్వంద్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పుడు బీసీ ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ చట్టం చేసి చేతులు దులుపుకోకుండా అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని సూచించారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ నిజంగా బీసీ అయితే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 42 శాతం అమలు జరిగేలా చూడాలని లేని యెడల వారి పదవులకు రాజీనామా చేయాలని హెచ్చరించారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో రిజర్వేషన్లు సాధించే వరకు కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జాతీయ కార్యవర్గ సభ్యులు పి.పద్మ, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమలక్కతో పలు ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి అండగా కవులు

పూలే విగ్రహం సాక్షిగా ప్రతిన...

లక్డీకాపూల్: బీసీల న్యాయబద్ధమైన, రాజ్యాంగపరమైన హక్కుల సాధన ఉద్యమానికి అండగా ఉంటామని పలువురు కవులు, రచయితలు, సాహిత్య సంఘాల నేతలు ప్రకటించారు. అన్ని ప్రజాస్వామిక ఉద్యమాల మాదిరిగానే బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాల కోసం జరిగే ఉద్యమంలో సాహిత్యలోకం అగ్రభాగాన నిలుస్తుందన్నారు. రాష్ట్ర బంద్ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ ముందు ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాపూలే విగ్రహాలకు కవులు రచయితలు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, తెలంగాణ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఆనందచారి, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, పరస ఉపాధ్యక్షుడు బొమ్మగాని నాగభూషణం, ప్రముఖకవి మోహన్ కృష్ణ, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, ప్రముఖ ముద్రాపకుడు బోడ లక్ష్మీనరసు, ఐజేయూ నేత చంద్రశేఖర్, ఆర్.సౌజన్య కుమార్ పాల్గొన్నారు.

దొంగ జీవో.. కపట ప్రేమ

కాంగ్రెస్, బీజేపీలపై ధ్వజమెత్తిన కవిత





నిరసన కార్యక్రమంలో కవిత కుమారుడు ఆదిత్య

వంజగుట్ట: దొంగ జీవో ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లు పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్‌కు మద్దతు పేరుతో కపట ప్రేమ చూపుతుంటే హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం రాష్ట్ర బంద్‌లో భాగంగా తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్‌ల ఆధ్వర్యంలో ఖైరతాబాద్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బీసీ బిడ్డలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే మోసం చేస్తున్నాయని, బీసీలకు న్యాయం జరగాలంటే తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీ ఉద్యమం తీసుకురావాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం సరైన వాదనలు వినిపించడంలేదని, అందుకే బీసీలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పులు వస్తున్నాయని అభిప్రాయడ్డారు. జీవో 9 విషయంలో కూడా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశం తేలేవరకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని, మహారాష్ట్ర, తమిళనాడులో ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించలేదని గుర్తుచేశారు. నిరసన కార్యక్రమంలో కవిత కొడుకు ఆదిత్య పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. మొదటిసారి ధర్నాలో పాల్గొనడంతో రాజకీయాల్లోకి వారసుడిని ఎంట్రీ చేస్తున్నారా.. అన్న చర్చ జరిగింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కవిత కొడుకు

మన సంస్కృతి.. ఘన వైభవం..



సాక్షి, సిటీబ్యూరో: సుసంపన్నమైన కళలు, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన మన దేశ ఘన వారసత్వాన్ని నగర జీవనంతో మమేకం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భిన్న రంగాల ప్రముఖులు స్పష్టం చేశారు. నగరంలోని కింగ్ కోటిలో ఉన్న భారతీయ విద్యా భవన్‌లో శనివారం జరిగిన ఏఎస్‌బీఎల్ సంస్థ 10వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నృత్యప్రియ అకాడమీతో కలిసి పలు కళా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీ కృష్ణ లీలలే ఇతివృత్తంగా సాగిన కళా ప్రదర్శనతో పాటుగా, అంబపరకు, గణేశ పంచరత్నం, జయదేవ అష్టపది, నౌక చరితం వంటి ప్రదర్శనలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ మద్దాలి ఉషా గాయత్రికి, ఏఎస్‌బీఎల్ వ్యవస్థాపకులు, సీఈఓ అజితేష్ కొరుపోలు వంటి సాంస్కృతిక రంగ ప్రముఖులను సన్మానించారు.

నగరానికి అనౌష్కా శంకర్..



సాక్షి, సిటీబ్యూరో: లండన్ నివాసి, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సితార్ కళాకారిణి స్వరకర్త అనౌష్కా శంకర్, కళా రంగప్రవేశం చేసి 30 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా దేశ వ్యాప్త పర్యటన నిర్వహిస్తున్నారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ - సాలిటైర్‌లు సమర్పిస్తున్న ఆరు నగరాల పర్యటన, వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా తొలి ప్రదర్శన హైదరాబాద్‌లోనే జరుగుతుండడం విశేషం. వచ్చే ఏడాది జనవరి 30న నగరంలో అనౌష్కా శంకర్ ప్రదర్శన ఉంటుందని, ఆ తర్వాత బెంగళూరు, ఢిల్లీ, పుణె, ముంబై, కోల్‌కతాలో నిర్వహిస్తామని వివరించారు.

సాంత్వన చేకూర్చిన సంగీతం



అలరించిన హేమంత్‌కుమార్ కర్ణాటక శాస్త్రీయ గానం..

రాయదుర్గం: కేన్సర్‌తో బాధ పడే రోగులు, వారి అటెండర్లు, వైద్య బృందానికి స్వాంతన చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమం అందరినీ అలరించింది. ఆ మధురమైన సంగీతం కొద్దిసేపు రోగుల ఆత్మను తాకి వారి బాధలను మైమరిపించింది. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని స్పర్శ్ హస్పిస్ ఆస్పత్రి క్యాంపస్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో ఈ భక్తి సంగీత కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ధన త్రయోదశిని పురస్కరించుకొని ఆస్పత్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ గాయకుడు విస్సప్రగడ హేమంత్ కుమార్ భక్తి సంగీత కార్యక్రమం ఆ ప్రాంగణాన్ని సంగీత సాగరంలో ముంచెత్తింది. ప్రతి ఒక్కరి హృదయాలను శాంతి, భక్తి, ఆనందంతో నింపింది. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు నీరజ గోడవర్తి, ఇతర సభ్యులు హేమంత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకునేలా లెదర్ బ్యాగ్

రాయదుర్గం: వినూత్న రీతిలో బఫ్ లెదర్‌తో బ్యాగ్ రూపొందించి అబ్బురపరుస్తున్నాడు ఎఫ్‌డీడీఐ విద్యార్థి. ఫ్యాకల్టీ సహకారంతో తాను దీనిని రూపొందించానని, ఇప్పటికే మార్కెట్‌లో అనేక రకాల బ్యాగులు అందుబాటులో ఉన్నప్పటికీ, తాను వినూత్న రీతిలో దీనిని రూపొందించానని రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్‌లో బి.డెస్ కోర్సులో ద్వితీయ సంవత్సరం చదివే ఎం జీవా చెబుతున్నాడు. దీనికి 'బఫ్ లెదర్ సైడ్ స్లింగ్ బ్యాగ్' అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఈడీ డాక్టర్ ఎస్ లోహిత్ రెడ్డి, హోంశాఖ అధికారి వేణుగోపాల్, ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు, ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ మనోహర్ హుస్సేన్, అధ్యాపకులు గోఫ్రాన్, రుచిసింగ్ అభినందించారు.





దీపావళి అంటే ఒక పండుగ మాత్రమే కాదు.. విభిన్న రకాల సంబరాల కలగలుపు వేడుక. బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మొదలు.. క్రాకర్స్ కాల్చడం వరకూ ఈ పండుగ ఆస్వాదించదగిన ఎన్నో అనుభూతులను మనకు అందిస్తుంది. అందుకే ఈ ఫెస్టివల్‌లో మన లుక్స్ ద్వారా గుడ్‌విల్ అందుకోవాలంటే, తగిన వస్త్రధారణ తప్పనిసరి. ఇందుకోసం తరచూ బాలీవుడ్ నటీనటుల స్టైల్స్‌ను సిటీ యూత్ అనుసరిస్తుంటారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన హామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ ఫ్యాకల్టీ అందిస్తున్న కొన్ని సూచనలు.. - సాక్షి, సిటీబ్యూరో

కలర్‌ఫుల్ స్వింగ్.. దివాలి డ్రెస్సింగ్..

రంగు రంగుల దుస్తులతో పండుగ మెరుపులు

- సింపుల్‌గా ఉంటూనే ఫెస్టివల్ లుక్ కూడా
- నగర యువతకు స్ఫూర్తిగా బాలీవుడ్ డ్రెస్సింగ్
- డిజైనింగ్ నిపుణులు అందిస్తున్న సూచనలు ఇవే







బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ధరించిన ఒక డ్రెస్.. ఒక టాంగీ నారింజ మిర్రర్–వర్క్ బ్లేజర్ కోర్డ్ సెట్ దీపావళి పార్టీకి సరైన ఎంపిక. ముఖ్యంగా పండుగ వేళ మెరుపులు విరజిమ్ముతూ.. అదే సమయంలో సౌకర్యవంతంగా ఉండాలనుకునేవారికి ఇవి సరైనవి.

మినిమలిస్ట్ లుక్..

ఉత్తరాది ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించే అనన్య పాండే దీపావళి కోసం మినిమలిజాన్ని సూచిస్తున్నారు. సున్నితమైన తెల్లటి ఎంబ్రాయిడరీతో అలంకరించిన లేత గులాబీ రంగు స్లీవ్‌లెస్ కుర్తాను, మ్యాచింగ్ పలాజో ప్యాంటు జత చేశారు. ఓపెన్ హెయిర్ మినిమల్ మేకప్‌తో, పండుగ డ్రెస్సింగ్‌కు 'తక్కువలో ఎక్కువ' విధానాన్ని సంపూర్ణంగా ప్రతిబింబిస్తున్నాయి.

రెడ్ గ్లామ్ లుక్..

దీపావళికి మరో సిల్వర్ స్క్రీన్ క్వీన్ మౌని రాయ్ లాగా ఆల్–రెడ్ లెహంగాలో అబ్బురపరిచవచ్చు. కాంబినేషన్‌గా ఫుల్–స్లీవ్డ్ బ్లౌజ్, ప్రింటెడ్ బోర్డర్లతో మ్యాచింగ్ స్కర్ట్, గోల్డెన్ షిమ్మర్‌తో అంచులున్న కో–ఆర్డినేటింగ్ దుపట్టా ఉన్నాయి. బంగారు చోకర్ నెక్లెస్, మాంగ్ టిక్కాతో తన అద్భుతమైన ఎథ్నిక్ లుక్ కంప్లీట్‌గా తీర్చిదిద్దుకుంది.

లాంగ్ ఎథ్నిక్ జాకెట్లు..

పొడవాటి ఎథ్నిక్ జాకెట్లు పండుగ వార్డ్‌రోబ్‌కు చక్కదనాన్ని జోడిస్తాయి. సరళమైన కుర్తాపై అందంగా ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్‌ను జత చేయాలి లేదా క్యాజువల్, చిక్ ఫ్యూజన్ లుక్ కోసం క్రాప్ టాప్ స్కర్ట్‌తో స్టైల్ సెట్ చేసుకోవచ్చు. ఈ స్టైలిష్ లేయర్ డ్రెస్సింగ్.. ట్రెండీగా సాయంత్రపు సమావేశాలకు సౌకర్యవంతంగా ఉంటూనే సంప్రదాయాన్ని జోడిస్తుంది.

సింపుల్ లాంగ్ గౌన్లు..

సొగసైన పాస్టెల్ లేదా మ్యూట్ షేడ్స్‌లో ఉన్న పొడవైన, తక్కువగా అలంకరించిన గౌన్లు దీపావళికి స్టైలిష్ ఎంపిక. అవి చక్కదనంపై రాజీ పడకుండా సౌకర్యంపై దృష్టి పెడతాయి. పండుగ రూపాన్ని పూర్తిగా ప్రతిబింబించాలంటే.. దీనికి దుపట్టా లేదా లైట్ జ్యువెలరీ జోడించాలి.

పాతవే కొత్తగా..

ప్రస్తుత వార్డ్‌రోబ్ నుంచి కొన్నింటిని విడివిడిగా తీసి కలపడం ద్వారా అదనపు ఖర్చు చేయకుండా కూడా తాజా పండుగ స్టైల్‌ను సృష్టించవచ్చు. కొత్త పలాజోలతో పాత కుర్తీని జత చేయడం లేదా సరదాగా ఫ్యూజన్ వైబ్ కోసం జీన్స్‌తో భారీ దుపట్టాను కలిపేయడం.. వంటి ట్రిక్స్ ఫాలో అవ్వవచ్చు. ఇది మన డబ్బు ఆదా చేయడమే కాకుండా దుస్తులకు వ్యక్తిగత సృజనాత్మక ట్విస్ట్‌ను అందిస్తుంది.

- బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్‌ని గమనిస్తే.. తరచూ క్లాసిక్ సిల్హౌట్‌లతో సమకాలీన కట్‌లను మిళితం చేస్తాడు. ఇటీవలి దీపావళి లుక్‌లో పొట్టి కుర్తా ఎరుపు రంగు స్ట్రెయిట్ ప్యాంటు నమూనా నెహ్రూ జాకెట్‌తో కలిగి ఉంది ఆధునిక పండుగ డ్రెస్సింగ్‌కి ఇది సరైన ఉదాహరణ.

షరారా సెట్స్.. మరీ సింపుల్‌గా వద్దు అనుకుంటే, అలంకరించబడిన షరారా సెట్‌లు రెడీగా ఉన్నాయి. సీక్విన్స్, జెమ్స్ మెరుపులతో ఇవి లేట్–నైట్ డిన్నర్లు, రూఫ్‌టాప్ పార్టీలకు బెస్ట్. దీని కోసం నటి జాన్వీ కపూర్ డ్రెస్ స్టైల్ పరిశీలించవచ్చు. ఆధునిక, ఆకర్షణీయమైన ట్విస్ట్ కోసం దుపట్టాను కేప్‌గా ధరించవచ్చు.

- బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది లాగా నల్ల కుర్తా స్ట్రెయిట్–ఫిట్ ప్యాంటు లుక్ కూడా బాగుంటుంది. లీనియర్ రెడ్ మోటిఫ్ డీటెయిలింగ్‌తో అలంకరించిన, వదులుగా ఓపెన్ జాకెట్‌తో పొరలుగా ధరించడం ఆధునిక సంప్రదాయాల స్టైలిష్ మిశ్రమం.
- వేదంగ్ రైనా లా నల్ల కుర్తా స్ట్రెయిట్ ప్యాంటులో మెరిసిపోవచ్చు. సమకాలీన పండుగ లుక్ కోసం మెరిసే నల్ల బ్లేజర్‌తో లుక్‌ను మరింత మెరిపించవచ్చు.
- బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్‌లా చాలా సింపుల్ స్టైల్‌ని ఎంచుకోవచ్చు. ఆయన ధరించిన పాస్టెల్–రంగు లినెన్ కుర్తా–పైజామా సౌకర్యం, సరళమైన కాలాతీత శైలి అని చెప్పొచ్చు.

సదర్ సందడి షురూ..

వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి దున్నలు..







ముషీరాబాద్: నగరంలో సదర్ సందడి షురూ అయ్యింది.. ఈ నెల 22న ముషీరాబాద్‌లో జరిగే సదర్ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలకు చెందిన దున్నలు ఇప్పటికే నగరానికి చేరుకున్నాయి. సదర్ ఉత్సవాలకు హరియాణ, పంజాబ్ రాష్ట్రాల నుంచి భారీ దున్నలు నగరానికి చేరుకున్నాయి. ప్రత్యేక కంటైనర్‌లో 1800 కిలోమీటర్లు ప్రయాణించిన ఐదు దున్నలు ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. వీటి బాగోగుల కోసం ఒక్కో దున్నకీ ఒక్కో కార్మికుడు పనిచేస్తున్నారు. భారీ ఆకారంతో చుట్టుపక్కల వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరియాణ దున్నలు (గోలు) వయసు 8 సంవత్సరాలు, ఆరు అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పు, బరువు 2,200 కిలోలు. (భజరంగీ) వయసు ఐదేళ్లు. 6.5 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పు, బరువు 1,900 కిలోలు. (బాద్‌షా) వయసు ఐదేళ్లు. ఎత్తు ఏడు అడుగులు, 15 అడుగుల వెడల్పు, 2,000 కిలోల బరువు ఉన్నాయి. (కోహినూర్) వయసు ఐదేళ్లు. ఎత్తు 6.5 అడుగులు, వెడల్పు 15 అడుగులు, 1,900 కిలోల బరువు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన (రోలాక్స్) వయసు నాలుగేళ్లు, ఎత్తు ఆరు అడుగులు, 14 అడుగుల వెడల్పు, 1,800 కిలోల బరువు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ తెలిపారు.

స్పెషల్ మెనూ..

ఒక్కో దున్నకు ప్రతి రోజూ 20 లీటర్ల పాలు, అపిల్స్, అరటి పండ్లు, కాజు, బాదం, బెల్లం తదితర ఆహార పదార్థాలు అందిస్తారు. ఇందుకోసం ఒక్కో దున్నకి రోజుకు రూ.5 వేలు ఖర్చవుతుంది. రెండుసార్లు స్నానం, అయిల్ మసాజ్ చేస్తారు.

జర జాగ్రత్త..

- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దీపావళి 'స్వీట్' వార్నింగ్
- డ్రైఫ్రూట్స్, మిఠాయిల సెలక్షన్‌లో బీ కేర్‌ఫుల్
- తయారీలో రంగులు, నాణ్యత లోపాలతో ఆరోగ్య సమస్యలు



దీపావళి అనగానే నోరూరించే వివిధ రకాల మిఠాయిలు గుర్తొస్తాయి. టపాసులు ఎంత ఫేమస్సో.. అంతే రీతిలో స్వీట్లు ఫేమస్.. పండగ శుభాకాంక్షలతో పరిశ్రమలు, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు, వ్యాపార వేత్తలు ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి స్వీట్స్ తయారు చేయిస్తున్నారు. ఆది, సోమవారాల్లో నేరుగా వచ్చే వినియోగదారుల కోసం స్వీట్ దుకాణాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సమయంలో వినియోగదారులు జాగ్రత్తగా వ్యవహరించాలి. సందట్లో సదేమియా అన్నట్లు డిమాండ్ ఉన్నప్పుడే నాసిరకం ఉత్పత్తులు తయారు చేసి, ఎక్కువ రోజులు నిల్వ ఉంచుతారు. రుచి, వాసన, జిగేల్ మని మెరిసే రంగుల కోసం వివిధ రకాల రసాయనాలు వినియోగించే అవకాశం ఉందంటున్నారు వైద్యులు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఇంట్లోనే తయారు చేసుకోవడం ఉత్తమమని పలువురు అభిప్రాయపడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

ప్రస్తుతం మార్కెట్‌లో మిఠాయిలకు ఫుల్ డిమాండ్ కనిపిస్తోంది. పండగ రెండు రోజులు ఎగబడి మరీ కొంటారు. అయితే వీటిని తయారు చేసే సమయంలో ఎలాంటి పదార్థాలు వినియోగిస్తున్నారనేది తెలియదు. ఆహార భద్రత అధికారులు సైతం దీనిపై దృష్టిసారించే పరిస్థితి లేదు. దీంతో కల్తీ జరిగే అవకాశాలు ఎక్కువ. ఇటువంటి సమయంలో మితంగా తింటే సరే.. అతిగా తిన్నామా ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. స్వీట్స్‌లో చక్కెర, కొవ్వు పదార్థాలు అధికంగా వినియోగిస్తారు. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. కొవ్వు పదార్థాలు గుండె జబ్బులకు దారి తీయవచ్చు. పిల్లల్లో అవయవాల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంది. వీటన్నింటికీ మించి అవసరాలకు సరిపడా పిండి వంటలను ఇంట్లోనే తయారు చేసుకుంటే మేలు. తద్వారా కల్తీ ఆహార పదార్థాలు, కలుషిత, నిల్వ ఉంచిన వాటి నుంచి జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం..

పిండి వంటల తయారీ ప్రక్రియలో నూనె, చక్కెర, రంగులు, డ్రైఫ్రూట్స్ ఎలాంటివి వినియోగిస్తున్నారో గుర్తించడం కష్టం. రుచి, వాసన, రంగు కోసం కెమికల్స్ వినియోగించే అవకాశం లేకపోలేదు. ఇవి పిల్లలు, గర్భిణులు, వృద్ధులుపై దీర్ఘకాలిక ప్రభావం చూపిస్తాయి. కెమికల్స్, కల్తీ పదార్థాలు తినడం వల్ల ఫుడ్ పాయిజన్ కావచ్చు. దీర్ఘకాలంలో కేన్సర్, లివర్, కిడ్నీపై ప్రభావం చూపిస్తాయి. ఇటువంటి వాటిపై ప్రభుత్వ శాఖాపరమైన పర్యవేక్షణ ఉండాలి. తయారు చేసిన వంటకాల ప్యాక్‌పై వినియోగించిన పదార్థాలు, ఫ్యాట్, ఇతర వివరాలు ముద్రించాలి.



- కిరణ్ కుమార్ మాదాల, ఐఎంఏ తెలంగాణ మీడియా కో–కన్వీనర్



● నరక చతుర్దశి

చెడును నరికేసి... మంచిని వెలిగించి!



ఏదైనా శుభసంఘటన జరిగినప్పుడు కాని, ఎవరైనా మహానుభావులు పుట్టినప్పుడు కాని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకుంటారు. కాని, ఈ సందర్భంలో ఒకరు చనిపోతే అతడి పేరు మీద పండగ చేసుకోవటం జరుగుతోంది. అతడి చావు ఎందుకంతగా సంతోషప్రద మయిందంటే.... నరకుడు అజ్ఞానానికి, పీడనకు, హింసకు ప్రతీక. నరకం అంటే దుర్గతి. అది కలవాడు నరకుడు. అంటే చెడు నడత కలవాడు. ఆ చెడు తన కుమారునిలో ఉందన్న కారణంగానే అతడి సంహారానికి కారణమయింది తల్లి సత్యభామ. తనలా మరే తల్లీ ఎవరి గర్భశోకానికీ కారణం కాకూడదన్న కోరికతో తన కుమారుడి పేరు శాశ్వతంగా నిలిచి పోయేలా వరం కోరుకుంది. అందుకే శ్రీకృష్ణుడు అతడి పేరు మీదుగానే భవిష్యతులో అందరూ 'నరక చతుర్దశి' జరుపుకుంటారని వరమిచ్చాడు.

హిరణ్యాక్షుడు లోకానికి ఉపద్రవంగా భూదేవిని చుట్టచుట్టి సముద్రంలో ముంచినప్పుడు విష్ణుమూర్తి వరాహావతారమెత్తి, ఆ రాక్షసుని సంహరించి భూదేవిని ఉద్ధరించాడు. ఆ సందర్భంగా భూదేవికి విష్ణుమూర్తి వరప్రసాదం వల్ల భీముడనే పుత్రుడు జన్మించాడు. అతనే దుర్మార్గుడైన నరకాసురునిగా పేరొందాడు. నరకుడు ప్రాగ్జ్యోతిషపురం రాజధానిగా కామరూప రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. భూమాత తన కుమారుని రాక్షసత్వానికి దూరంగానే పెంచింది. దురదృష్టవశాత్తు నరకుడు అసుర ప్రభావంలో పడి ఘోరతపస్సు చేసి అనేక వరాలు పొందాడు. తనకు తన తల్లి చేతిలో తప్ప మరణం సంభవించకూడదని కూడా వరం పొందాడు. ఎందుకంటే స్వయానా తన తల్లే తనను చంపదని అతని ధీమా. ఆ వరగర్వంతో అతను చేసిన దుష్కార్యాలు పరాకాష్ఠకు చేరి దేవతలను తీవ్ర అశాంతికి గురి చేసాయి. నరకుడు విష్ణుద్వేషియై దేవతలను హింసించసాగాడు.

దేవమాత అదితి కుండలాలను, వరుణ ఛత్రాన్ని అపహరిస్తే శ్రీ కృష్ణుడు ఇతనిని ద్వంద్వ యుద్ధంలో ఓడించి, వాటిని తిరిగి అదితికి అందజేసాడు. మరొకప్పుడు మదపుటేనుగు రూపంలో విశ్వ కర్మ పుత్రికను చెర పట్టాడు. వీరూవారనే విచక్షణ లేకుండా గంధర్వ, దేవ, మానవ కన్యలను బలవంతంగా అపహరించి, తన అంతఃపుర పంజరంలో బంధించడం వాడికో వ్యసనం. ఇతని దౌర్జన్యాలు అంతటితో ఆగలేదు. చివరకు ఇంద్రునిపైకి కూడా దండెత్తి ఆయన అధికార ముద్రను అపహరించడంతో ఈ రాక్షసాధముని దురంతం పరాకాష్ఠనందుకుంది. ఇంద్రుడు ఆపద రక్షకుడైన శ్రీ కృష్ణుని శరణు వేడగా గోపాలుడు నరకునిపై దండెత్తాడు. అయితే నరకాసురుని విషపుబాణానికి శ్రీ కృష్ణుడు ఒక క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు. అది గమనించి ఆయనతో కూడానే ఉన్న ఆయన సతీమణి సత్యభామ ఉగ్రురాలై భయంకరమైన తన బాణాన్ని ప్రయోగించి నరకుణ్ణి నిలువరించింది. ఆ తర్వాత కృష్ణుడు తేరుకుని సుదర్శన చక్రం ప్రయోగించి అతడిని సంహరించాడు. అలా ఆశ్వీయుజ బహుళ చతుర్దశినాడు లోక కంటకుడైన నరకుని మరణం సంభవించింది. యాదృచ్ఛికంగా నరకాసురుని మరణం సత్యభామ రూపంలో తన తల్లి భూదేవి వల్లనే సంభవించింది.

తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదించాడు శ్రీ కృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, పదహారు వేలమంది రాజ కన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది.

ఈ రోజు ఏం చేయాలి?

ఈ చతుర్దశి యమునికి ఎంతో ఇష్టమైన రోజు. ఈ రోజు సూర్యోదయానికి ముందే నువ్వుల నూనెతో తలంటుకొని, అభ్యంగన స్నానం చేయాలి. ప్రత్యేకించి ఆ వేళ నువ్వులనూనెలో లక్ష్మి, మంచినీటిలో గంగాదేవి కొలువై ఉంటారని శాస్త్రాలు వివరిస్తున్నవి. యమ ధర్మరాజును స్మరించి, నమస్కరించి, యమ తర్పణ చేయడాన్ని విశిష్టంగా పెద్దలు చెబుతారు. అభ్యంగన స్నానానంతరం దక్షిణాభిముఖంగా 'యమాయః తర్పయామి' అంటూ మూడుసార్లు నువ్వులతో యమునికి తర్పణం ఇవ్వడం ఆచారం. యముని పూజించి, మినుములతో చేసిన పదార్థాలు తినడంతో పాటు సూర్యాస్తమయం తర్వాత ముంగిట్లో, పడకగదిలో దీపాలను వెలిగించి, టపాకాయలు కాలుస్తారు. ఈ చతుర్దశి రోజు సాయంత్రం ఎవరైతే దీపాలు వెలిగించి దానధర్మాలు చేస్తారో వారి పితృదేవతలకు నరకబాధ తొలగుతుందని భారతీయుల నమ్మకం.


నరక చతుర్దశినాడు దీపదానం చేస్తే పితృదేవతలందరికీ స్వర్గనివాసం కలుగుతుందని విశ్వసిస్తారు. ఇదేరోజున సాయం సమయంలో నూనెతో తడిపిన, రసాయన ద్రవ్యాలతో తయారు చేసిన కాగడాలను చేతబట్టుకొని తిరిగినట్లయితే పితృదేవతలకు దారి చూపినట్లవుతుందనీ పెద్దలు నమ్ముతారు. నరకచతుర్దశి మరునాడే దీపావళి.

– డి.వి.ఆర్.

● ఆఫీసర్లు

నరకాసురులపై నారీ శక్తి

దుష్ట ప్రవృత్తి గల నరకాసురుడిపై సత్యభామ సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటాం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నేరాలు చేసే ఎందరో నరకాసురులకు సత్యభామలుగా మారిన పోలీసు ఆఫీసర్లు చెక్ చెప్తున్నారు. నేడు నరక చతుర్దశి సందర్భంగా మహిళా పోలీస్ అధికారుల ప్రాధాన్యం గురించి...



















హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడెమీలో (ఎన్‌పీఏ) తాజాగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారుల్లో 36 శాతం మహిళలే. ఎన్‌పీఏ చరిత్రలో ఇదో రికార్డు. దీనికిముందే ఇలాంటి అరుదైన దృశ్యం తెలంగాణలో ఆవిష్కృతమైంది. సెప్టెంబర్‌లో చోటు చేసుకున్న ఐపీఎస్ అధికారుల బదిలీతో రాష్ట్ర పోలీసు విభాగంలోని హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌లో మకుటాలను 33.3 శాతం మహిళలే ధరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1979 వరకు మహిళా ఐపీఎస్‌లే లేరు. ఆ ఏడాది ఎన్‌పీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న హైదరాబాదీ యువతి అరుణ బహుగుణ చిత్తూరు జిల్లా మదనపల్లె అదనపు ఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఇది అప్పట్లో సంచలనం. ఆపై కాలక్రమంలో మహిళ ఐపీఎస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ 2014 వరకు వీరికి సముచిత పోస్టింగ్స్ ఉండేవి కాదు. అత్యవసర సందర్భాల్లో అక్కరకు రావడానికి కమిషనరేట్‌కు ఒక మహిళ ఐపీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చేవాళ్లు. మిగిలిన అధికారుల్ని అంతగా ప్రాధాన్యం లేని పోస్టుల్లో నియమించే వారు.

రానురాను ఆ సీన్ పూర్తిగా మారిపోతూ వచ్చింది. పోలీసు విభాగంలో మహిళ ఐపీఎస్ అధికారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పోస్టింగ్స్ ఇవ్వడం అనివార్యంగా మారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ మహిళ భద్రత విభాగం, షీ-టీమ్స్ ఏర్పాటైన తర్వాత వీటిలో అనివార్యంగా మహిళ ఐపీఎస్‌లకే పోస్టింగ్ ఇస్తూ వచ్చారు. కమిషనరేట్లలో డీసీపీ పోస్టులతో పాటు కొన్ని జిల్లాలకు మహిళల్ని ఎస్పీలుగా నియమించారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. రాష్ట్ర పోలీసు విభాగంలో ఉన్న మూడో వంతు హెచ్‌ఓడీ పోస్టులతో పాటు హైదరాబాద్, రాచకొండల్లోని డీసీపీ పోస్టుల్లో అత్యధికంగా మహిళా ఐపీఎస్‌లే ఉన్నారు. ఎస్సైల నుంచి డీఎస్పీల వరకు శిక్షణ ఇచ్చే తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడెమీకి అభిలాష్ బిస్త్, నేరగాళ్లలో మార్పునకు కృషి చేసే జైళ్లశాఖకు సౌమ్య మిశ్ర, రాష్ట్ర నేర పరిశోధన విభాగానికి (సీఐడీ) చారు సిన్హా, మావోయిస్టు వ్యతిరేక నిఘా విభాగమైన బి.సుమతి, హోంగార్డ్స్ వింగ్‌కు స్వాతి లక్రా నేతృత్వం వహిస్తూ తమ సత్తా చాటుతున్నారు. ఈ ప్రకారం చూస్తే 15 హెచ్‌ఓడీ పోస్టుల్లో ఏడింటికి ఐదుగురు మహిళ ఐపీఎస్‌లు నేతృత్వం వహిస్తున్నట్లు లెక్క. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు శిఖా గోయల్ చీఫ్‌గా, అవినీతి నిరోధక శాఖకు చారు సిన్హా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇక రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో మహిళా పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు ఉన్నత స్థాయిలో కూడా ఉండేవారు కారు. అయితే కాలక్రమంలో వీరి సంఖ్య కాస్త పెరిగినా...

నగరంలో హఠాత్తుగా తలెత్తే పరిణామాలతోపాటు మతకలహాలను అదుపు చేయడం, వేళాపాళా లేని విధులు వీరితో సాధ్యం కాదనే భావన గతంలో ఉండేది. కాలక్రమంలో చోటు చేసుకున్న పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో నగర పోలీసు విభాగంలోనూ ఒక మహిళ ఉన్నతాధికారి ఉండాలని ప్రభుత్వమూ భావించినప్పటికీ చాన్నాళ్ళ వరకు కేవలం నార్త్‌జోన్‌కు మాత్రమే మహిళ అధికారిని నియమిస్తూ వచ్చారు. ఆ జోన్‌కు ఉండే ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సిటీ పోలీసువింగ్‌లో మహిళ ఉన్నతాధికారి పోస్టు ఇదొక్కటే అనే భావన కొనసాగింది.

ప్రస్తుతం పరిస్థితులు మాత్రం పూర్తిగా మారిపోయాయి. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఏడు జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌కు ఒక్కో డీసీపీ నేతృత్వం వహిస్తుంటారు. ప్రస్తుతం ఈ ఏడు జోన్లలో మూడింటికి మహిళ ఐపీఎస్‌లే డీసీపీలుగా ఉన్నారు. మధ్య మండలానికి శిల్పవల్లి, ఉత్తర మండలానికి సాధన రష్మీ పెరుమాళ్, దక్షిణ మండలానికి స్నేహ మెహ్రా డీసీపీలుగా ఉన్నారు. వీరికి తోడు పరిమళ నూతన్, పరిపాలన విభాగం సంయుక్త సీపీగా, రక్షితమూర్తి, సీఏఆర్ హెడ్-క్వార్టర్స్ డీసీపీగా, అపూర్వ రావు- స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా, ఎన్.శ్వేత డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ గా, డి.కవిత,సైబర్ క్రైమ్ విభాగం డీసీపీగా, లావణ్య జాదవ్- ఉమెన్ సేఫ్టీ డీసీపీగా పని చేస్తున్నారు.

హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉన్న సైబరాబాద్‌లోని అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌కు డీసీపీగా రితిరాజ్ వ్యవహరిస్తున్నారు. ఇక రాచకొండలో మొత్తం నాలుగు జోన్లు ఉన్నాయి. వీటిలో మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, మహేశ్వరానికి పద్మజ రెడ్డి, అనురాధ, సునీత రెడ్డి డీసీపీలుగా ఉన్నారు. వీరిలో సునీత రెడ్డి మాత్రమే నాన్ ఐపీఎస్ అధికారి. ఈ జోనల్ డీసీపీలతో పాటు మహిళ భద్రత విభాగం, సైబర్ క్రైమ్ వింగ్స్‌లను ఆఫీసర్స్ నేతృత్వం వహిస్తున్నారు.

– శ్రీరంగం కామేష్, క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్

రావణుడు... మా ఊరి అల్లుడు!

దీపావళి అంటేనే సంబరాలు అంబరాన్ని అంటుతాయి. అయితే రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌కు పది కిలోమీటర్‌ల దూరంలో ఉన్న మండోర్‌లో దీపావళి రోజు దీపాలు వెలిగించడం, బాణసంచ కాల్చడం ఉండదు. నిశ్శబ్దాన్ని పాటిస్తారు. కారణం ఏమిటి? అనే విషయానికి వస్తే స్థానిక పురాణం తెలుసుకోవాల్సిందే. దీని ప్రకారం... రావణుడి భార్య మండోదరి జన్మస్థలం మండేరే. రావణుడు మండోదరిని ఈ గ్రామంలోనే వివాహం చేసుకున్నాడని నమ్ముతారు. మండేరేకి చెందిన మౌద్గిల్ బ్రాహ్మణులు తమను తాము మండోదరి కుటుంబ వారసులుగా భావిస్తారు. అందువల్ల వారు రావణుడిని రాక్షస రాజుగా కాకుండా గౌరవనీయమైన బంధువుగా చూస్తారు!

చీకటి దీపావళి!

దీపావళి వేడుకల తర్వాత హిమాచల్‌ప్రదేశ్‌లో బుద్ది దీపావళి(చీకటి దీపావళి లేదా పాత దీపావళి) జరుపుకుంటారు. దీపావళి తర్వాత మొదటి అమావాస్య రోజు బుద్ది దీపావళి వేడుకలు మొదలవుతాయి. రాముడి రాక వార్త ఒక నెల తర్వాత మాత్రమే హిమాచల్‌ప్రదేశ్‌కు చేరిందట. అందుకే ఆలస్యంగా పండగ జరుపుకునే సంప్రదాయం మొదలైంది అంటారు.

దేవరి రాత్రి

ఛత్తీస్‌ఘడ్‌లోని గోండు తెగలు దీపావళిని 'దేవరి'గా జరుపుకుంటాయి. దేవరి రాత్రి గ్రామంలోని మహిళలు తలలపై ఒక కుండలో నూనె దీపాన్ని వెలిగించి శ్రావ్యంగా పాటలు పాడుతూ, ప్రతి ఇంటి తలుపు తడుతూ తమతో చేరాలని ఆ ఇంటి మహిళలను అభ్యర్థిస్తారు. బియ్యపు పిండితో చేసిన దీపాలను ప్రతి ఇంటి ముందు ఉంచుతారు.

ఆవులను తమపై నడిపించి...

మధ్యప్రదేశ్ ఉజ్జయిని జిల్లాలోని బిదావాద్ గ్రామంలో ఒక వింత ఆచారం ఉంది. దీపావళి రోజు తరువాత నేలపై పడుకొని ఆవులను తమపై నడిపించుకుంటారు. 33 కోట్ల దేవుళ్లు, దేవతలు ఆవులో కొలువై ఉన్నారని, వాటిని తమపై నడిపించుకోవడం ద్వారా దేవతల ఆశీర్వాదం దొరుకుతుందనేది భక్తుల నమ్మకం.

భర్త కోసం రాత్రంతా దీపాలు...

మహారాష్ట్రలో దీపావళి వేడుకలకు సంబంధించి ఒక ఆసక్తికరమైన జానపద కథ ప్రచారంలో ఉంది. వివాహం జరిగిన నాలుగు రోజుల తరువాత చనిపోతాడని యువ రాజుకు శాపం. విషయం తెలిసిన వధువు తన భర్త ప్రాణాలు రక్షించుకోవడం కోసం రాత్రంతా అవిశ్రాంతంగా దీపాలు వెలిగిస్తూనే ఉంటుంది. ఆమె ప్రయత్నాల వల్ల భర్త బతుకుతాడు.

శ్రీవిష్ణువు భూలోకానికి...

గుజరాత్‌లో దీపావళి రోజు కొత్త వ్యాపారాలు ప్రారంభించడం అనేది తరతరాలుగా వస్తోంది. మహాలక్ష్మీదేవి భర్త విష్ణువు భూలోకానికి వచ్చిన గుర్తుగా మధ్యప్రదేశ్‌లో దీపావళి జరుపుకుంటారు. కోల్‌కత్తాలో దీపావళికి కాళీ పూజ చేస్తారు.

సోదర, సోదరీమణులు...

మన దేశంలోని కొన్ని ప్రాంతాలలో దీపావళి అనేది సోదర, సోదరీమణుల అనుబంధానికి ముడి పడి ఉన్న పండగగా జరుపుకుంటారు. దీపావళి తర్వాత రోజు జరుపుకునే ఈ పండగను 'యమ-ద్వితీయ' అని పిలుస్తారు. యమున తన సోదరుడు, మృత్యుదేవుడు యముడికి ఆతిథ్యం ఇచ్చిన రోజు ఇదే అని పురాణ కథలు చెబుతాయి.

లక్ష దీపాల ఆగ్రా కోట

అక్బర్ చక్రవర్తి పాలనలో దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకునేవారు. ఈ సంప్రదాయాన్ని 'జష్నే చిరాఘన్' అని పిలిచేవారు. లక్షలాది దీపాలతో ఆగ్రా కోట వెలిగిపోయేది. కోట ముందు ఉన్న మైదానంలో బాణసంచా కాల్చేవారు.

● కళా స్ఫూర్తి

'ఒక మహిళ పురుషుడి పాత్రలో మెప్పించడం చాలా కష్టం' అంటారు సురభి కళాకారిణి 60 ఏళ్ల పద్మజా వర్మ. ఇప్పటి వరకు కృష్ణుడి పాత్రలో వేదికలపైన 3000కు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చిన పద్మజా వర్మ సత్యభామగానూ మెప్పించారు. ప్రత్యేక పురస్కారాలనూ అందుకున్నారు. నేడు నరకచతుర్దశి సందర్భంగా కృష్ణుడి పాత్రలో జీవించిన పద్మజా వర్మ సాక్షి ఫ్యామిలీతో పంచుకున్న విశేషాలు ...

కృష్ణుడిగా... సత్యభామ!





సురభి పద్మజ వర్మకు దాదాపు 60 ఏళ్ల నాటక రంగ అనుభవం ఉంది. కృష్ణుడి పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తూ, కుటుంబ పోషణలో భాగమయ్యింది. గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా, కోడలిగా కుటుంబ జీవనంలోని సర్దుబాట్లను, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న విధానాన్ని మన ముందుంచారు.

మగవారి మధ్యలో ఒక్కదాన్నే మహిళను

''మగవేషాలంటే చాలా ఠీవిగా నిలబడాలి. హుందాగా కనిపించాలి. కిరీటం పెట్టుకొని వేసే వేషం ఏదైనా కష్టమే. అందులోనూ మహిళ పురుషుడి వేషం వేయడం పెద్ద సవాల్. ఆ సమయంలో స్టేజీపైన చుట్టూతా మగవారే. కృష్ణుడి వేషంలో నేనొక్కదాన్నే మహిళను. నటనలో ఎటువంటి జంకు కనిపించకూడదు. గొంతులో తత్తరపాటు ఉండకూడదు. కిరీటం పక్కకు జరగకూడదు. ఫ్లూట్ పట్టుకోవడంలో నేర్పు ఉండాలి. అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ రెండున్నర గంటల పాటు సీనును రక్తికట్టించాలి. అదో పెద్ద టాస్క్.

బాల్యం నుంచీ...

మూడు నెలల పసిబిడ్డగా ఉన్నప్పుడే మా అమ్మానాన్నలు నన్ను వేదికమీదకు తీసుకెళ్లారు. శ్రీకృష్ణ లీలల్లో భాగంగా బాల కృష్ణుడి పాత్రలను ప్రదర్శించాను. మాకు చదువు అయినా, నటన అయినా కళారంగమే. పన్నెండేళ్ల తర్వాత మాయాబజార్‌లో శశిరేఖగా వేషాలు వేశాను. శశిరేఖగా ప్రదర్శనలో పాల్గొన్నప్పుడు నా పాత్ర పూర్తయ్యాక ఒక వైపు కూర్చొని ఆ నాటక ప్రదర్శన మొత్తం చూసేదాన్ని. శశిరేఖ పాత్ర టీనేజ్ వరకే. ఆ వయసు దాటితే ఆ పాత్ర మరొకరికి ఇచ్చేస్తారు. నాకూ కొంత వయసు వచ్చాక శశిరేఖ బదులు రుక్మిణి, సత్యభామ.. ఇలా మహిళా ప్రాధాన్యత గల వేషాలే ఇచ్చారు.

సత్యభామ.. మీరజాలగలరా..!

కృష్ణుడి పాత్రకు దీటుగా ఉండేది సత్యభామ పాత్రే. సత్యభామగా నటించేటప్పుడు ఆ పాత్రకు ఉన్న హావభావాలన్నీ ముఖంలో పలికించాలి. 'మీర జాల గలడా నా యానతి...' అనే పాటలో నవరసాలు ఒలికించాలి. స్త్రీ పాత్రల్లోనూ మెప్పిస్తూ .. ఒక్కో దశ దాటుతున్న కొద్దీ మహిళా ప్రాధాన్యత ఉన్న పాత్రలు మారిపోతుండటం గమనించాను.

సందేహాలను జయిస్తూ... కృష్ణుడిగా మెప్పిస్తూ!

ఇలాగే ఉంటే కళారంగంలో నా ప్రాధాన్యత ఏముంటుంది అని నన్ను నేనే ప్రశ్నించుకునేదాన్ని. 'పురుష పాత్రలు అయితేనే మార్పు లేకుండా ఎప్పటికీ వేయచ్చు, ఎలాగా...' అని ఆలోచించేదాన్ని. పెళ్లయ్యాక మా మామగారి సొంత నాటక కంపెనీలోనే రకరకాల మహిళా ప్రాధాన్యమున్న పాత్రలు వేశాను. ఒకరోజు కృష్ణ వేషధారి ఆరోగ్యం బాగోలేక రాలేదు. ప్రదర్శన ఉంది. ఎలా అని ఆందోళన పడుతున్న సమయంలో 'నేను కృష్ణుడిగా వేస్తాను' అని మా మామగారికి ధైర్యం చెప్పాను. అలా మాయాబజార్‌లో కృష్ణుడిగా నటించాను. అయితే, పురుషుడిలా డ్రెస్ అవ్వడం.. మామూలు విషయం కాదని ఆ రోజే తెలిసింది. కంస వధ నాటకంలో మాత్రం కొంత టెన్షన్ పడ్డాను. ఎందుకంటే, కంస పాత్రధారి మా మామగారే. కంసుని వధించేటప్పుడు బాహాబాహి తలపడటం, గుండెల మీద కొట్టడం.. వంటివి ఉంటాయి. కానీ, నటనలో రిలేషన్ కాదు ప్రతిభనే చూపాలనుకున్నాను. అక్కణ్ణుంచి ఇక నేనే కృష్ణుడిని. అలా నేటివరకు 3000కు పైగా కృష్ణుడి పాత్రలు వేసిన ఘనత నాకు దక్కింది. నాటకాన్ని చూసిన ప్రేక్షకులు స్వయంగా కలిసి, వారి అభిమానాన్ని తెలుపుతూ ఉంటారు. సాధారణ చీరలో నన్ను చూసినవారు 'మీరేనా కృష్ణుడు' అని ఆశ్చర్యపోతుంటారు. ఎందుకంటే, అలంకరణలో వేదికపైన కృష్ణుడిలా మరో కొత్త జన్మ ఎత్తినట్టుగా ఉంటుంది. అప్పట్లో భయపడి కృష్ణుడి పాత్రను వదిలేసి ఉంటే.. నాటకరంగంలో నా ప్రత్యేకత అంటూ ఏమీ ఉండేది కాదు. నాకు ఈ యేడాది 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ కృష్ణ పరమాత్మ అనుగ్రహం వల్ల మా పిల్లలిద్దరూ జీవితాల్లో బాగానే స్థిరపడ్డారు. ఇక నాకు బాధ్యతలేం లేవు కాబట్టి నా చివరిశ్వాస వరకు కృష్ణుడిలా నాటకరంగంలో మెప్పిస్తూనే ఉంటాను'' అని వివరించారు కృష్ణ పాత్ర ధారి పద్మజావర్మ.

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ / M.Tech, NIT / C.Govt. A.A.O / LIC Dept / 1 Lakh.PM / 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15652]

SC మాల క్రిస్టియన్ / M.Tech, IIT/ Govt. A.E.E / ట్రాన్స్‌కో/కట్నప్రసక్తి లేదు/24 Lakhs PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15652]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/36y/1L PM/Hydలో సొంత ఇల్లు, విలేజ్‌లో 5ఎ. వ్యవసాయ భూమి గల Well Settled హైదరాబాద్ వరుడికి ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [HA-15522]

కుల/కట్న ప్రసక్తి లేదు. 37 సం॥ల రెండవ పెళ్లి, బిజినెస్, తల్లిదండ్రుల ఆస్తులు గల దేవాంగ హిందు వరునికి అందం, చదువున్న వధువు కావలెను. Ph: 8309918060 [HA-124]

★★

SC మాల/M.Tech, Civil, Pvt. Job + బిజినెస్ ఎత్తు 5'6",33 సం॥ అందమైన వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ సంప్రదించండి. 9441286029 [H-783645]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/Age: 45, MBA/ Govt. Job & 7Cr. ప్రాపర్టీస్ గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే)1st & 2nd మ్యారేజ్‌స్ మా వద్ద కలవు. అన్ని వయస్సుల వారికి Ph: 8143226625 [H-783647]

రెడ్డి/2nd (పిల-ఆస్తి) పట్టింపు లేదు/Age: 31, Q: Degree/ Own House Business & Well Property's గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1వ లేదా 2వ సంబంధాలు కలవు. Ph: 8125222667 [H-783647]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Business/B.Tech/MS/1995/6'/500 Cr *94/6'/400Cr *98/6'/400Cr *95/6'/150Cr *94/5'11"/200Cr *91/5'11"/400Cr. * Cont: K.C.Reddy- Hyd. Ph : 9347807015

Reddy/IIT /B.Tech / MS/H1/USA/1997/ 5'7" /500K/20Cr *99/5'10"/170K/50Cr *95/ 5'10"/170K/20Cr *93/5'11"/240K/ 50Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309

Reddy/BS/MS/H1/USA / 1995/5'8"/125K/ 20Cr *96/6'/200K/10Cr *94/5'11"/450K/ 30Cr *93/5'8"/200K/20Cr. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/BS/MS/USA/1995/5'10"/230K/100 Cr *93/6'/450K/100Cr *97/5'9"/5L/M/ 100Cr *94/5'9"/200Cr/ 120K. * Cont: K.C. Reddy -Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/Business/Hyd/1982/5'8/ B.Tech / 400Cr *1990/5'10"/ 25Cr *1995/ 5'10"/ 300Cr *88/5'11"/25Cr. *Cont:K.C. Reddy -Hyd. Ph:9347807015/ 9849321309

Reddy /B.Tech/MS / Job-Hyd/ 1997 /6'/15Cr/16L/M/ and one Cr/yr/ Family-Income. *Cont : K.C. Reddy - Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/MBBS / MD / 1996/6'/50Cr *1995/5'10"/200Cr * Cont: K.C. Reddy- Mar-Bureau-Pvt Ltd-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/Divorcee *MBBS/MD/1994/ 5'9"/ 50Cr *1988/5'9"/80Cr *MBA/1981/ 5'8"/ 1000 Cr *86/ 5'5"/1000Cr *79/5'8"/300Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph : 9849321309

Reddy/BE (BITS) MBA (IIM)/Job- Hyd/ 1994/5'11"/60L/yr/25Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt.Ltd- Hyd-Ph: 9347807015/9849321309

Reddy/BS/MBA(ISB)/1995/5'7"/2000C r * B.Tech/Business/ Bangalore/ 1990/ 6'/ 1000Cr. *88/5'10/100Cr/UG- * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy /UG/2003/5'/100Cr *2000/ 5'3"/Industrialist/B.Tech/MS/*2001 /MS /USA /5'4" /Ric. *Cont: K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/M.Arc/1998/5'8"/50Cr *2000/ MBBS / 5'6"/100Cr *1999/5'7"/ B.Tech/ 100Cr *2000/5'3"/BS/30Cr *B.Tech/ 2001/ 5'3"/20Cr. * Cont : K.C. Reddy -Hyd-Ph:9849321309

Reddy/ MBBS / MS / 1999 / 5'7"/5Cr *1998/5'5"/MD/50Cr *1998/5'5"/BDS/20Cr *MD/1998/5'7"/80Cr *IIT/2000/5'7"/10Cr. Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/BS/MS/ USA/1998/5'5"/ 200K/ 30Cr *B.Tech/MS/USA/ 2001/5'4"/5Cr *1999/5'2"/15Cr *2002/5'6"/20Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/BS/MS/USA/1999/5'5"/100Cr *1998/5'1"/3Cr *1999/5'2"/15Cr *98/ 5'4"/10Cr *IIT/MS/1996/5'7" * Cont: K.C.Reddy - Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/USA / 1997/5'5"/ 10Cr*95/5'6"/200K/5Cr*96/5'5"/10Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd - Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/MBA / Very Big Business/1995/5'5"/100Cr/60L/yr/*BBA/MBA/1997/5'4"/150Cr/12L/M-Rents.* Cont: K.C. Reddy-Hyd-Ph:9347807015

Reddy/MBBS/Very Rich Family/ 1997/5'6"/500Cr-Needs any well settled. * Cont: K.C.Reddy - Hyd - Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech / MS / Job-Hyd-Most Beautiful/Divorcee/1988/5'5"/1.5 Cr/ yr/ 15Cr. *Cont:K.C. Reddy -Mar - Bureau - Hyd - Ph: 9347807015 / 9849321309

Reddy/B.Tech/MBA/Most Beautiful/ 1995/5'4"/25Cr *1994/5'4"/90Cr *MBA/ 1995/5'5"/100Cr. * Cont: K.C. Reddy - Hyd- Ph: 9849321309/9347807015

[D-582]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6' 1", Engineer, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 10", Analytics Consultant, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 32, 5' 7", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", Sr. SWE, Very Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", Amazon, SWE, 140 K, 4 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 28, 5' 7", Business Analyst, 8 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి CA, MS, 28, 5' 7", Financial Analyst, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 33, 5' 8", SWE, H1, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 6' Doctor, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 29, 6' 1", Engineer, 400 K, H1, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5", Sr. SWE, H1, 120 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 6", Engineer, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS, MBBS, 28, 5' 4", USA, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెండో పెళ్లి/విడో /50y / Fair గుంటూరు/Own Complex (రెంట్స్), ల్యాండ్స్ కోట్ల ప్రాపర్టీస్ ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (సపోర్ట్ ఉండును) Ph: 7997175318 [H-783647]

49y/విడో/5'3"/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/ 80,000 Rs/సొంత ఇల్లు/కోచింగ్ సెంటర్ /1,00,000 Rs/అందమైన వధువుకి వరుడు కావలెను/కుల ప్రసక్తి లేదు. 9392791032 [H-783647]

కుల పట్టింపు లేదు/48y/C.Govt.Job/PM 70వేల / 1 గ్రా. గోల్డ్ బిజినెస్/రెంట్స్/పొలాలు 30ఎ/తోటలు/30Cr ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను/పిల్లలు ఉన్నా. ఇల్లరికం ఓకే. 6309480414 [H-783647]

పద్మశాలి/50y/విడో/5'4" /NTPCలో జాబ్/ 1L-PM/2 సొంత ఇల్లులు/సిమెంట్ బిజినెస్/1L/- PM/కుల ఆస్తి పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. 8121487795 [H-821215]

హిందూ మాదిగ / B.Tech / C.Govt. P.O/ SBI /60,000/-PM / 6'ఎత్తు/29 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15652]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/B.Tech, NIT/ C.Govt. ట్యాక్స్ Asst./ఇన్‌కమ్ ట్యాక్స్ Dept / 60,000/-PM/5'4" ఎత్తు/ 32 సం॥ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 9550166072 [HA-15652]

క్రిస్టియన్ మాదిగ/M.Sc, B.Ed/C.Govt. టీచర్/కేంద్రియ విద్యాలయ/50,000/-PM/ 5'5"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15652]

ముదిరాజ్/ B.Tech / Govt. అకౌంటెంట్ ఆఫీసర్/జెన్‌కో /32000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15652]

వడ్డెర/B.Tech /సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/ 80,000/-PM /5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15652]

SC మాల/ B.Tech / C.Govt. బ్యాంక్ P.O/ SBI/55000/-PM/5'4"/ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15652]

రెడ్డి, కాపు మొదటి సంబంధం, 10th to డిగ్రీ, సొంత ఇల్లు, ఫాదర్ వ్యవసాయం, 1 బ్రదర్ మ్యారీడ్, ఏజ్ : 26 to 45 సం॥ గల అమ్మాయిలకి వరులు కావలెను. సెల్ : 80088 31764. [A-1698]

ఆచారులు (విశ్వబ్రాహ్మిన్స్), గౌడ్స్, 1st మ్యారేజ్, 10th to డిగ్రీ, వయస్సు 25 to 35 సం॥ ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ కుటుంబపు వరులు కావలెను. సెల్: 80088 31764. [A-1698]

బలిజ, లింగబలిజ, శెట్టి బలిజ, లింగాయత్‌లు మొదటి సంబంధం, 26 to 35 సం॥, చదువు 10th to డిగ్రీ, వ్యవసాయం ఉన్న వారికి వరులు కావలెను. సెల్: 80088 31764. [A-1698]


పద్మశాలి, పట్టుశాలి మొదటి సంబంధం, సొంత ఇల్లు, 10th to డిగ్రీ, ఫాదర్ కులవృత్తి గల అమ్మాయికి 25 to 35 సం॥, వయసుగల అబ్బాయిలు కావలెను. సెల్: 80088 31764. [A-1698]

కమ్మ (చౌదరి), మొదటి సంబంధం, 10th to B.Tech, ఏజ్: 25 to 32 సం॥ ప్రైవేట్ టీచర్, సాఫ్ట్‌వేర్స్‌గా ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్: 80088 31764. [A-1698]

★★

మాల క్రిస్టియన్స్, 2nd మ్యారేజ్, 43 సం॥లు 5.3H, B.Tech., డిస్కంటిన్యూ వధువుకి వరుడు Govt / సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి హిందూ/ క్రిస్టియన్ కావలెను. ✆ : 77949 11019 [R-1256378]

వేదికలు



OC, BC, SC, ST, అన్ని ఇతర కులాల Govt, SWE, డాక్టర్స్, ఇంజినీర్స్, బిజినెస్, Pvt జాబ్, Any మంచి సంబంధాల కొరకు సంప్ర : 9502732389 [HA-15652]

5వ TS&AP కమ్మర, శాలివాహన వధూవరుల పరిచయ వేదిక. తేది : 26.10.2025 హైదరాబాద్. www.shalivahanamatrimony.com నిర్వాహకులు : ఇటికాల వీరయ్య. Ph: 8978845656 [HA-15652]

జై శ్రీరామ్-సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, బిజినెస్, VIP అబ్రాడ్ వారికి 1, 2 వ పెళ్ళి సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో కుదర్చబడును. పూర్ణ మ్యాట్రిమోని,తిరుపతి,సంప్ర: 7093722724. [T-3295]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1765]

★★

ఓన్లీ నూర్‌బాషా ముస్లిం (దూదేకుల) ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక దేశ విదేశాలలో జాబ్ చేయు SWE, డాక్టర్, Govt, C.Govt, బిజినెస్ వధూవరుల సంబంధాలకై సంప్ర : భాను మ్యారేజ్ బ్యూరో. Hyd. 7337413827/9948820402 [HA-1534]

ఈసారైనా భత్యం ఇస్తారా సారూ..

గోపాలమిత్రల వినతి

సాక్షి, హైదరాబాద్: గాలికుంటు వ్యాధి టీకా.. పశువైద్య భాషలో ఎఫ్‌ఎండీ అని పిలిచే ఈ టీకాను పశువులకు ఇచ్చే కార్యక్రమం రాష్ట్రంలో జోరుగా సాగుతోంది. ఈనెల 15వ తేదీ నుంచి టీకాల కార్యక్రమం ప్రారంభమైంది. నవంబర్ 14వ తేదీ వరకు జరగనున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమంలో రాష్ట్రంలో అక్కడక్కడా గోపాలమిత్రలు పాల్గొనడం లేదని తెలుస్తోంది. గతంలో ఈ టీకాలు వేసినప్పుడు ప్రభుత్వం తమకు మంజూరు చేసిన భత్యాన్ని పశువైద్య సిబ్బంది సరిగ్గా ఇవ్వలేదని, అందుకే ఈసారి టీకాల కార్యక్రమంలో పాల్గొనడం లేదని వారంటున్నారు. వ్యాక్సిన్ వేసి, పశువుకు ట్యాగ్ వేసి, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసినందుకు ఒక పశువుకు రూ.5 చొప్పున ప్రభుత్వం ఇస్తుందంటున్నారు. ఇందుకు తమకు కనీసం రూ.5 వేల వరకు వస్తాయని చెబుతున్నారు. సొంత బైక్ మీద పెట్రోల్ పోసుకుని వెళ్లి పని చేసుకునే తమకు రావాల్సిన వాటిలో కూడా కోత పెట్టారని వాపోతున్నారు. కరీంనగర్, నల్లగొండ, వరంగల్ తదితర జిల్లాల్లో ఈ సమస్య ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గోపాలమిత్రలు పాల్గొనని చోట్ల.. రైతులు ఈ టీకాల కోసం ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నట్టు సమాచారం. ఈ విషయంలో పశువైద్య శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని.. ఈ సారైనా తమ కష్టానికి తగినట్టు భత్యం ఇప్పించాలని గోపాలమిత్రలు డిమాండ్ చేస్తున్నారు.

సర్వేయర్ల వ్యవస్థ భేష్

భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: లైసెన్సుడ్ సర్వేయర్ల వ్యవస్థను అమల్లోకి తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ వ్యవస్థ తెలంగాణలో ఉండాలని గత ఏడాది ప్రభుత్వానికి సూచించామని తెలిపారు. ఈ నేపథ్యంలో నాలుగు వేల మంది వరకు లైసెన్సుడు సర్వేయర్లు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి లైసెన్సులు తీసుకోబోతున్నందున వారందరికీ అభినందనలు తెలిపారు. వీరి నియామకం ద్వారా భూభారతి చట్టంలోని రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కంటే ముందు సర్వే తప్పనిసరనే నిబంధన అమల్లోకి రావాలని, భూ సమస్యలు పరిష్కారం కావాలని శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

కొత్తగా రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

సాక్షి హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను సర్కారు మంజూరు చేసింది. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో కొత్త కళాశాల ఏర్పాటు చేస్తూ వేర్వేరు జీవోలను జారీ చేసింది. అయితే ఈ రెండు కళాశాలలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమవుతాయి. ఇక నారాయణపేట జిల్లా ధన్వాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణానికి రూ.6.1 కోట్లు మంజూరు చేస్తూ మరో జీవోను జారీ చేసింది.

ముగిసిన రాంచంద్రారెడ్డి అంత్యక్రియలు



కట్టా రాంచంద్రారెడ్డి మృతదేహం

కోహెడ రూరల్ (హుస్నాబాద్): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రాంచంద్రారెడ్డి అలియాస్ కోసా అలియాస్ రాజు దాదా అంత్యక్రియలు సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో శనివారం ముగిశాయి. ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 22న పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రాంచంద్రారెడ్డి మృతదేహన్ని కడసారి చూసేందుకు పలు విప్లవ, ప్రజా పౌరహక్కుల సంఘాలు, రాజకీయ పార్టీల నేతలతో పాటు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. 'కట్టా'మృతిపై అనుమానం ఉన్నట్టు కుటుంబ సభ్యులు వేసిన కేసు సుప్రీం కోర్టులో నడుస్తుండటంతో.. రీ పోస్టుమార్టం చేయడానికి అనుగుణంగా మృతదేహాన్ని పెట్టెలో పెట్టి సమాధి చేశారు. కాగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారుడు నందిని సిధారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అటవీ ✗ రెవెన్యూ

ఇంకా కొలిక్కి రాని భూముల పంచాయితీ.. రెండు శాఖల జాయింట్ సర్వేపై కొరవడిన స్పష్టత

పదిన్నర లక్షలకు పైగా ఎకరాల్లో వివాదం ఏర్పడిందంటున్న అటవీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ–అటవీశాఖల మధ్య నెలకొన్న సరిహద్దుల పంచాయితీ ఎంతకీ కొలిక్కి రావడం లేదు. ఈ రెండు శాఖల మధ్య కొన్నేళ్లుగా కొనసాగుతున్న భూవివాదాలు ఇప్పట్లో సమసిపోయేలా లేవు. సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు భూముల సంయుక్త సర్వే చేపడతామని చెబుతున్నా, అది ఆచరణలోకి రావడం లేదు. ముందుగా ఏవి అటవీ భూములు, ఏవి రెవెన్యూ భూములు అన్న దానిపై స్పష్టత సాధించే విషయంలోనే అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.



అటవీభూమి 60 లక్షల ఎకరాల్లో...

తెలంగాణలో 60.64 లక్షల ఎకరాల మేర తమ శాఖ భూములు ఉన్నట్టుగా రికార్డుల్లో ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు. ఇందులో 49.80 లక్షల ఎకరాల భూముల్లో ఎలాంటి వివాదాలు లేకపోగా, రికార్డుల పరంగా క్లియర్‌గా ఉన్నాయంటున్నారు. గతంలోనే సిద్ధం చేసిన లెక్కల ప్రకారం..ప్రధానంగా పదిన్నర లక్షల ఎకరాల పరిధిలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య సరిహద్దు వివాదాలు నెలకొన్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వీటిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం కోసం సంబంధిత శాఖలు ఎదురుచూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాం నాటి గణాంకాలను బట్టి చూస్తే...

- మహబూబాబాద్ జిల్లాలో 3.44 లక్షల ఎకరాలుండగా, అందులో అత్యధికంగా 2.89 లక్షల ఎకరాలు వివాదాల్లో ఉన్నట్టు తెలిసింది.
- వరంగల్ రూరల్ జిల్లాలో 38 వేల ఎకరాలుండగా, వాటిలో 26వేల ఎకరాల్లో భూ వివాదాలున్నాయి.
- కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 5.29 లక్షల ఎకరాలుండగా, వివాదాల్లో 1.86 లక్షల ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో 4.33 లక్షల ఎకరాలకుగాను 1.50 లక్షల ఎకరాల్లో వివాదాలు, వికారాబాద్ జిల్లాలో 1.08 లక్షల ఎకరాలకుగాను 42 వేల ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 3.16 లక్షల ఎకరాలకుగాను 70 వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 1.42 లక్షల ఎకరాలుండగా వాటిలో 35 వేల ఎకరాల దాకా, నల్లగొండ జిల్లాలో 52 వేల ఎకరాలకుగాను 13 వేల ఎకరాలు భూ వివాదాల్లో ఉన్నట్టుగా తెలిసింది.
- అటవీశాఖకు చెందిన ఎలాంటి వివాదాలకు తావులేని భూమిగా గుర్తించిన 49.80 లక్షల ఎకరాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎల్ఆర్ఎంఎస్–నోషనల్ ఖాతా మార్కింగ్)లో మెజారిటీ భూములు రికార్డుకాగా, కొంతమేర నోషనల్ ఖాతా మార్కింగ్ చేపట్టాల్సి ఉంది.

పక్కాగా స్థిరీకరణకు సర్కార్ దృష్టి

రెండేళ్ల కాలంలో పోడు సమస్యతోపాటు, వివాదాలున్న అటవీ భూముల సమస్యను కూడా పరిష్కరించే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టలేదనే విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ భూమిని, రెవెన్యూ రికార్డులతో సరిచూసుకొని ఇకపై పక్కాగా స్థిరీకరించుకోవాలని, భవిష్యత్‌లో ఎలాంటి ఆక్రమణలకు తావు ఇవ్వకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. దానికి తగ్గట్టుగానే పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో అటవీ అధికారులు పనిచేసేలా చర్యలు చేపట్టాలని యోచిస్తున్నట్టుగా తెలిసింది. అటవీ భూముల సరిహద్దులు లెక్క తేల్చి, సరిహద్దుల గుర్తింపు, కంచె లేదా కందకాల ఏర్పాటు ద్వారా భవిష్యత్ ఆక్రమణలు అడ్డుకోవచ్చునని అటవీ అధికారులు సూచిస్తున్నారు. రెవెన్యూ శాఖ అధీనంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూములపై తాజాగా అన్ని జిల్లా స్థాయిల్లో ఇటీవల సర్వే ప్రారంభమైంది. అయినా, ఇంకా పూర్తి స్పష్టత రాకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. రెండు శాఖల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెడితేనే ఇది పరిష్కారమయ్యే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లెక్కల రికార్డులేవి?

- అటవీ, రెవెన్యూ రికార్డుల్లో ఆయా శాఖలకు సంబంధించి ఎంత భూములున్నాయన్న దానిపైనా ఇంకా పూర్తి స్పష్టత లభించలేదని అధికార వర్గాల సమాచారం. కొన్నేళ్లుగా ఈ భూముల పంచాయితీకి తెర దించాలని తాము చూస్తున్నా, రెవెన్యూశాఖ పెద్దగా స్పందించడం లేదని అటవీశాఖ అధికారులు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే ఏ శాఖకు ఆ శాఖ వేర్వేరుగా రికార్డులను నిర్వహించడంతోపాటు, వాటి నమోదు కూడా సరిగా చేయకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో అటవీ భూముల సర్వే చేయకపోవడం, రెండు శాఖలు ఆయా జిల్లాల్లో తమ భూమి అంటే తమ భూమి అని రికార్డులకు ఎక్కించడం వల్ల ఎదురైన వివాదాల పరిష్కారానికి సామరస్యంగా చర్యలు చేపట్టాలనే అభిప్రాయంతో వారున్నారు.

రోడ్ల విస్తరణకు రూ.868 కోట్లు

- సీఆర్ఐఎఫ్ కింద రాష్ట్రానికి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- పరిపాలన అనుమతులు జారీ చేస్తూ ఉత్తర్వు విడుదల
- 34 రోడ్ల విస్తరణ, పటిష్ట పరిచే పనులకు త్వరలో శ్రీకారం
- రూ.60 కోట్లతో కొడంగల్‌లో రోడ్డు విస్తరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోడ్లను వెడల్పు చేయటంతో పాటు పటిష్టపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్)నుంచి రూ.868 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 34 రోడ్లను వెడల్పు చేయటంతోపాటు అవసరమైనచోట వంతెనలు నిర్మించనున్నారు. ఈ మేరకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ రోడ్లు భవనాల శాఖ ఉత్తర్వు జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ వసూలు చేస్తున్న సెస్‌లో రాష్ట్రాల వాటాగా కేంద్రం సీఆర్ఐఎఫ్‌కు జమచేసి విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. తాజా విడతలకు సంబంధించి ఈ మొత్తం మంజూరైంది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో ఆయా పనులు చేసి యూసీలు సమర్పిస్తే, అంత మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. ఈ పనులకు సంబంధించి త్వరలో టెండర్లు పిలవనున్నారు. చాలాకాలంగా రాష్ట్రంలో రోడ్లను వెడల్పు చేయకపోవటంతో పలు ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఆయా ప్రాంతాల్లోని కీలక రోడ్లను ఈ నిధులతో మెరుగుపరచనున్నారు.

చేపట్టనున్న పనులు ఇవే..

- హైదరాబాద్–కరీంనగర్ రోడ్డు నుంచి కరీంనగర్–కామారెడ్డి రోడ్డును అనుసంధానిస్తూ రూ.77 కోట్లతో భారీ వంతెన నిర్మించనున్నారు. మధ్యలో మానేరు బ్యాక్ వాటర్ ముంపు వల్ల ఈ రెండు రోడ్ల అనుసంధానం లేదు. రాజీవ్ రహదారి మీదుగా కామారెడ్డి వెళ్లాలంటే కరీంనగర్ పట్టణంలోకి వెళ్లి మళ్లాల్సి వస్తోంది. దీంతో బావాపేట–ఖాజీపేట– పోతూరు–గుండ్లపల్లి మీదుగా వంతెనను నిర్మించి రెండు రోడ్లను అనుసంధానించనున్నారు.
- మహబూబ్‌నగర్–నల్లగొండ రోడ్డును 13.2 కి.మీ. మేర రూ.50 కోట్ల వ్యయంతో మెరుగుపరచనున్నారు. కనగల్ కూడలి నుంచి నాగార్జునసాగర్ కూడలి వరకు ఈ పనులు జరుగుతాయి.
- మంథని–రామగుండం రోడ్డును రూ.21 కోట్లతో 13.1 కి.మీ. మేర అభివృద్ధి చేస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ రోడ్డు నుంచి దెద్రా గ్రామం వరకు 20 కి.మీ. మేర కొత్త రోడ్డును రూ.30 కోట్లతో నిర్మించనున్నారు. మంచిర్యాల జిల్లా టేకుమట్ల సమీపంలో, కుందారం ఎస్సీ కాలనీ సమీపంలో, నక్కలపల్లి పవనూర్ రోడ్డు మీద కిష్టాపూర్ గ్రామం సమీపంలో... మూడు హైలెవల్ వంతెనలకు రూ.20 కోట్లు కేటాయించారు.
- జగిత్యాల జిల్లాలోని మ్యాకవెంకయ్యపల్లి–పత్తిపాక మధ్య ఎల్లాపూర్ మీదుగా 11.5 కి.మీ. మేర రూ.20 కోట్లతో రోడ్డును వెడల్పు చేయనున్నారు.
- మొయినాబాద్–సురంగల్–శ్రీరామ్‌నగర్–వెంకటాపూర్‌ల మీదుగా చందానగర్ టూ కవేలిగూడ రోడ్డును 14 కి.మీ. రోడ్డును రూ.30 కోట్లతో వెడల్పు చేయనున్నారు.
- కరీంనగర్, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, వనపర్తి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో 34 రోడ్లను వెడల్పు చేస్తూ అవసరమైన చోట్ల వంతెనలు నిర్మించనున్నారు.
- కొడంగల్ పట్టణంలోని లహోటీ కాలనీ పార్క్ నుంచి వినాయక చౌరస్తా, శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయం మీదుగా బాపల్లి తండా జంక్షన్ వరకు రూ.60 కోట్లతో రోడ్డు విస్తరణకు పరిపాలన అనుమతులు ఇస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) కింద ఈ పనులు చేపడుతారు.


కోర్టు భవన నిర్మాణానికి భూమి పూజ



శంకుస్థాపన కార్యక్రమంలో హైకోర్టు జడ్జీలు జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ సుద్దాల చలపతిరావు

జనగామ: జనగామ జిల్లా కేంద్రం చంపక్‌హిల్స్‌లో 10 ఎకరాల్లో రూ.81 కోట్లతో నిర్మించనున్న జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణ పనులకు హైకోర్టు జడ్జీలు జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు, జస్టిస్ సుద్దాల చలపతిరావులతో కలిసి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి శనివారం భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి మాట్లాడారు. కోర్టు దేవాలయం లాంటిదన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదులు మరింత చురుగ్గా ఉండాలని సూచించారు. కోర్టుకు వచ్చిన కక్షిదారులు తమకు న్యాయం జరిగిందని సంతోషంగా వెళ్లేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనగామ కోర్టు జడ్జి బి.ప్రతిమ, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి



రామాలయంలో కుటుంబ సభ్యులతో జస్టిస్ జె.శ్రీనివాసరావు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ జె.శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఈఓ దామోదర్‌రావు, అర్చకులు స్వాగతం పలికి దేవస్థానం విశిష్టతను వివరించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మూలమూర్తులను దర్శించుకున్న జడ్జికి లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

సీనియర్ ఐపీఎస్ రవి గుప్తా వీఆర్ఎస్..



సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐపీఎస్ అధికారి రవి గుప్తా వీఆర్ఎస్ (సర్వీసు నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ) తీసుకున్నారు. ఈ మేరకు రవి గుప్తా చేసిన వీఆర్ఎస్ విజ్ఞప్తి శనివారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, 1990 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా ప్రస్తుతం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31న పదవీ విరమణ పొందాల్సి ఉండగా.. ముందస్తుగా స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం ఇవ్వాలని రవి గుప్తా ఈనెల 15న ప్రభుత్వానికి లేఖ రాశారు. ఐపీఎస్ సర్వీస్ రూల్స్ ప్రకారం మూడు నెలల ముందస్తు నోటీసులు ఇవ్వాలన్న నిబంధనను మినహాయిస్తూ తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని అందులో రవి గుప్తా కోరారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం ఆయన వీఆర్ఎస్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రవి గుప్తా ఇన్‌చార్జి డీజీపీగా, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు.



ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్‌లో జ్యోతిసురేఖకు కాంస్యం

భారత టాప్ ఆర్చర్ వెన్నం జ్యోతిసురేఖ మరో కొత్త ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ కప్ ఫైనల్ ఈవెంట్ (కాంపౌండ్ విభాగం)లో పతకం నెగ్గిన తొలి భారత మహిళా ఆర్చర్‌గా రికార్డు సృష్టించింది. చైనాలోని నన్‌జింగ్‌లో జరిగిన ఈ పోటీల్లో సురేఖ కాంస్య పతకం గెలుచుకుంది. ఎనిమిది మంది అగ్రశ్రేణి ఆర్చర్లు పాల్గొన్న ఈ పోటీల సెమీఫైనల్లో సురేఖ 143–145 స్కోరుతో వరల్డ్ నంబర్‌వన్ ఆండ్రియా బెకెరా (మెక్సికో) చేతిలో ఓటమిపాలైంది. అయితే కాంస్యం కోసం జరిగిన పోరులో సురేఖ 150–145 తేడాతో వరల్డ్ నంబర్ 2 ఎలియా గిబ్బన్ (గ్రేట్ బ్రిటన్)పై విజయం సాధించింది. ప్రస్తుత ఆసియా క్రీడల విజేత అయిన సురేఖ 15 బాణాలను ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా పక్కాగా సంధించి అందుబాటులో ఉన్న 150 పాయింట్లనూ సాధించడం విశేషం. గతంలో రెండు సార్లు వరల్డ్ కప్ ఆర్చరీ ఫైనల్ (2022, 2023) ఈవెంట్లో పాల్గొన్న సురేఖ పతకం సాధించడంలో విఫలమైంది. మరో వైపు పురుషుల కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం కోసం జరిగిన పోరులో భారత ఆటగాడు రిషబ్ యాదవ్ అతి స్వల్ప తేడాతో మైక్ స్కాలెసర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడి పతకాన్ని చేజార్చుకున్నాడు.

హర్మన్ బృందానికి పరీక్ష

నేడు ఇంగ్లండ్‌తో కీలక పోరు

- ఓడితే సెమీస్ అవకాశాలు సంక్లిష్టం!
- మ.గం.3.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



హర్మన్‌ప్రీత్



సివర్ బ్రంట్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు అత్యంత కీలక పోరుకు సిద్ధమైంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఇంగ్లండ్‌తో తలపడుతుంది. తొలి రెండు మ్యాచ్‌లలో శ్రీలంక, పాకిస్తాన్‌లను ఓడించి సానుకూలంగా టోర్నీని మొదలుపెట్టిన భారత్ ఆ తర్వాత తడబడింది. రెండు పటిష్ట జట్లు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. ఇప్పుడు మరో కఠిన ప్రత్యర్థి ఇంగ్లండ్ రూపంలో ఎదురైంది. ఇటీవలి కాలంలో ఈ జట్టుపై మన రికార్డు బాగున్నా... వరల్డ్ కప్ ఒత్తిడిని అధిగమించి పైచేయి సాధించడం ముఖ్యం. ఈ మ్యాచ్‌లో ఓడితే తర్వాతి రెండు మ్యాచ్‌లు న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లపై భారత్ తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. మరో వైపు నాట్ సివర్ నేతృత్వంలోని ఇంగ్లండ్ ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి (ఒకటి రద్దు) జోరు మీదుంది.

అమన్‌జోత్ స్థానంలో రేణుక!

తొలి మూడు మ్యాచ్‌లతో పోలిస్తే ఆస్ట్రేలియాపై భారత్‌కు మెరుగైన ఆరంభం లభించింది. స్మృతి మంధాన, మరో ఓపెనర్ ప్రతీక కూడా అర్ధసెంచరీలు సాధించారు. హర్లీన్, జెమీమా కూడా కీలక పరుగులు సాధించారు. అయితే హర్మన్ మరోసారి అంచనాలకు తగినట్లు ఆడటంలో విఫలమైంది. రిచా ఘోష్ దూకుడుగా ఆడటం పెద్ద సానుకూలాంశం. దీప్తి చాలా కాలంగా బ్యాటింగ్‌లో ఆకట్టుకోలేకపోతోంది. మరో సారి ప్రధాన బ్యాటర్లంతా మెరుగ్గా ఆడితే భారీ స్కోరుకు అవకాశం ఉంది. అయితే ఆసీస్‌పై 330 పరుగులు చేసి కూడా భారత్ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది. ఇలాంటి స్థితిలో బౌలింగ్ బలహీనత బయటపడింది. ఐదుగురు రెగ్యులర్ బౌలర్లు విఫలమైనా మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. అయినా సరే అదే వ్యూహాన్ని జట్టు కొనసాగించే అవకాశం ఉంది. హర్మన్ ఎలాగూ కొన్ని ఓవర్లు బౌలింగ్ చేయగలదు. ఆల్‌రౌండర్ అమన్‌జోత్ స్థానంలో పేసర్ రేణుక జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. యువ బౌలర్లు క్రాంతి, చరణి ఒత్తిడిని అధిగమించాల్సి ఉంది. చరణితో పాటు దీప్తి, స్నేహ్ స్పిన్‌తో ఇంగ్లండ్‌కు కట్టడి చేయాలని భారత్ భావిస్తోంది.

ఫామ్‌లో కెప్టెన్...

పాకిస్తాన్‌తో గత మ్యాచ్ వర్షంతో రద్దు కాగా, అంతకు ముందు బలహీన బంగ్లా, శ్రీలంకను ఇంగ్లండ్ ఓడించింది. తొలి పోరులో దక్షిణాఫ్రికాను 69కే కుప్పకూల్చినా... జట్టు బ్యాటింగ్ అంత గొప్పగా ఏమీ లేదు. కెప్టెన్ సివర్ బ్రంట్, హీతర్ నైట్ మాత్రమే ఫామ్‌లో ఉన్నారు. ఎమీ జోన్స్, బీమాంట్‌లలో ఇంకా తడబాటు కనిపిస్తోంది. సోఫీయా డంక్లీ, ఎమా ల్యాంబ్‌లనుంచి జట్టు మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. బ్యాటింగ్‌తో పోలిస్తే ఇంగ్లండ్ స్పిన్ బౌలింగ్ కూడా బలంగా ఉండటం విశేషం. భారత్‌పై పలు మార్లు చక్కటి ప్రదర్శన కనబర్చిన సోఫీ ఎకెల్‌స్టోన్‌తో పాటు మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ లిన్సీ స్మిత్ కూడా వరల్డ్ కప్‌లో చక్కగా రాణిస్తున్నారు. ప్రధాన పేసర్ లారెన్ బెల్ ఆరంభంలో ప్రత్యర్థిని నిలువరించగలదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ఫైనల్లో తన్వీ

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో... భారత యువ షట్లర్ తన్వీ శర్మ అదరగొడుతోంది. 17 ఏళ్ల భారత నిరీక్షణకు తెరదించుతూ... ఈ టోర్నీలో పతకం ఖాయం చేసుకున్న ఈ 16 ఏళ్ల అమ్మాయి... ఇప్పుడు ఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో శనివారం టాప్ సీడ్ తన్వీ శర్మ 15–11, 15–9తో లియు సి యా (చైనా)పై విజయం సాధించింది. తద్వారా భారత్ నుంచి ఈ టోర్నీ ఫైనల్‌కు చేరిన మూడో ప్లేయర్‌గా తన్వీ నిలిచింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి అపర్ణ పోపట్ (1996లో రజతం), సైనా నెహ్వాల్ (2006లో రజతం, 2008లో స్వర్ణం) మాత్రమే పతకాలు గెలిచారు. నేడు జరగనున్న ఫైనల్లో రెండో సీడ్ అన్యాపత్ ఫిచిత్‌ఫోన్ (థాయ్‌లాండ్)తో తన్వీ అమీతుమీ తేల్చుకోనుంది. సెమీఫైనల్లో తన్వీకి ప్రత్యర్థి నుంచి పెద్దగా పోటీ ఎదురుకాలేదు. తొలి గేమ్‌లో తన్వీ 7–3తో స్పష్టమైన ఆధిక్యం కనబర్చగా... కాస్త పోరాడిన ప్రత్యర్థి 7–8తో తన్వీని సమీపించింది. ఆ తర్వాత తప్పిదాలకు అవకాశం ఇవ్వని భారత షట్లర్... వరుస పాయింట్లతో విజృంభించింది. రెండో సెట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తూ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

మరోవైపు డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట పరాజయం పాలైంది. శనివారం పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–23, 21–18, 16–21తో టకురో హోకి–యుగో (జపాన్) ద్వయం చేతిలో ఓడింది.

భారత్ X ఆస్ట్రేలియా

నేడు తొలి వన్డే

- గిల్ కెప్టెన్సీలో తొలి సిరీస్
- రోహిత్, కోహ్లిలపై అందరి దృష్టి
- ఉ.గం.9.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



ట్రోఫీతో మార్ష్, గిల్

ఆసియా కప్ టి20ల్లో అజేయంగా ట్రోఫీ గెలుపు, అంతకు ముందు ఇంగ్లండ్‌తో టెస్టుల్లో అద్భుత ప్రదర్శన...ఇప్పుడు కొంత విరామానంతరం భారత జట్టు మూడో ఫార్మాట్‌లో పెద్ద టీమ్‌తో సమరానికి సిద్ధమైంది. ఈ సారి ఎదురుగా ఉంది వన్డే ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా. ఆసీస్ గడ్డపైనే జరిగే ఈ మూడు వన్డేల పోరులో పైచేయి సాధించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. కొత్త కెప్టెన్ గిల్ నేతృత్వంలో ఈ సమరానికి భారత్ సిద్ధం కాగా... ఈ ఫార్మాట్‌లో ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాళ్లలో ఇద్దరైన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల ఆటపైనే అందరి దృష్టీ నిలిచింది. మరో వైపు పలువురు కీలక ఆటగాళ్లు దూరమైనా... ఆసీస్ తమ స్వదేశంలో పటిష్టమైన బలగంతోనే బరిలోకి దిగుతోంది.

పెర్త్: చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన దాదాపు ఏడు నెలల తర్వాత భారత జట్టు వన్డేల్లో బరిలోకి దిగుతోంది. ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మధ్య నేడు (ఆదివారం) తొలి మ్యాచ్ జరుగుతుంది. ఇరు జట్లు చివరిసారిగా తలపడిన వన్డేలో (చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్) భారత్ 4 వికెట్ల తేడాతో గెలిచింది. టీమిండియాకు సంబంధించి కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ రావడం ప్రధాన మార్పు కాగా...గాయంతో ప్యాట్ కమిన్స్ తప్పుకోవడంతో మిచెల్ మార్ష్ ఆసీస్ సారథిగా బాధ్యతలు చేపట్టాడు.

ఆటగాళ్లంతా ఫామ్‌లో...

చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ 2027 వరల్డ్ కప్ జట్టు విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వకున్నా...దానికి చాలా సమయం ఉందని కోచ్ గంభీర్ చెబుతున్నా వాస్తవ పరిస్థితి ఏమిటో సగటు క్రికెట్ అభిమానులందరికీ తెలుసు. ఈ సిరీస్ గెలిచినా గెలవకపోయినా స్టార్ బ్యాటర్లు కోహ్లి, రోహిత్ ఎలా ఆడతారనేదే అన్నింటికంటే ముఖ్యం. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఇంతకంటే ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నా...ఇలాంటి అనుభవం పూర్తిగా భిన్నం. వీరిద్దరు పరస్పర కెప్టెన్సీలో కాకుండా మరో సారథి (ధోని) నాయకత్వంలో ఆడి తొమ్మిదేళ్లయింది. ఇప్పుడు ఎంతో జూనియర్ అయిన గిల్ కెప్టెన్సీలో ఆడటంతో పాటు కచ్చితంగా రాణించాల్సిన స్థితిలో వీరిద్దరు ఉన్నారు. ఆట, అనుభవం విషయంలో కొత్తగా చెప్పాల్సింది లేకపోయినా, ఇక్కడా బాగా ఆడాలని అంతా కోరుకుంటున్నారు. ఇతర బ్యాటర్లలో గిల్, శ్రేయస్, రాహుల్ కీలకం కానున్నారు. వన్డే టీమ్‌లోనూ జట్టులో పలువురు ఆల్‌రౌండర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. అక్షర్, వాషింగ్టన్ సుందర్ రూపంలో ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లతో పాటు ఆంధ్ర ఆటగాడు నితీశ్ రెడ్డి బరిలోకి దిగడం కూడా ఖాయం. రెగ్యులర్ స్పిన్నర్‌గా కుల్దీప్ ఆడతాడు. బుమ్రా వన్డే సిరీస్‌కు లేకపోవడంతో ప్రధాన పేసర్‌గా సిరాజ్ బాధ్యతలు తీసుకోనుండగా, ఆసీస్ పరిస్థితులను బట్టి చూస్తే రెండో పేసర్‌గా ప్రసిధ్ లేదా అర్ష్‌దీప్‌లలో ఒకరికి చాన్స్ దక్కుతుంది. మొత్తంగా జట్టు అన్ని విధాలా పటిష్టంగా కనిపిస్తోంది.

కొత్త ఆటగాళ్లతో...

వేర్వేరు కారణాలతో పలువురు ఆస్ట్రేలియా రెగ్యులర్ వన్డే ఆటగాళ్లు ఈ మ్యాచ్‌కు దూరమయ్యారు. వారి స్థానాల్లో యువ ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రెన్‌షా, ఓవెన్ వన్డేల్లో అరంగేట్రం చేయనున్నారు. ఆసీస్ టాప్ పేసర్లు స్టార్క్, హాజల్‌వుడ్‌తో పాటు కమిన్స్ గైర్హాజరు ఎలిస్‌కు అవకాశం ఇస్తోంది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు హెడ్, మార్ష్ తమ దూకుడైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ప్రభావితం చేయగలరు. మిగతా ప్రధాన బ్యాటర్లకు పెద్దగా అనుభవం లేకపోయినా సొంత గడ్డ అనుకూలత వారికి బలం కానుంది.

పిచ్, వాతావరణం

ఆప్టస్ స్టేడియం బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించే మైదానం కాదు. బౌలర్లే ప్రభావం చూపిస్తారు. గత ఆరేళ్లలో మూడు వన్డేలే జరగ్గా, అన్నింటిలో తక్కువ స్కోర్లే నమోదయ్యాయి. ఆసీస్ ఇక్కడ ఆడిన మూడూ ఓడింది. మ్యాచ్‌కు స్వల్ప వర్ష సూచన ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, కోహ్లి, శ్రేయస్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్, కుల్దీప్, సిరాజ్, ప్రసిధ్/అర్ష్‌దీప్.

ఆస్ట్రేలియా: మార్ష్ (కెప్టెన్), హెడ్, షార్ట్, రెన్‌షా, ఫిలిప్, ఓవెన్, కనోలీ, స్టార్క్, ఎలిస్, కునెమన్, హాజల్‌వుడ్.

సాక్షి సినిమా



ప్రభాస్

విదేశాల్లో స్పిరిట్

హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ఈ చిత్రంలో 'యానిమల్' సినిమా ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్న తొలి చిత్రం ఇది. డాక్టర్ పాత్రలో త్రిప్తి కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరు చివర్లో లేదా జనవరి ప్రారంభంలో మొదలవుతుందని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా జరుగుతున్నాయట. కాగా ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించిన కొంత భాగాన్ని మెక్సికోలో జరపనున్నట్లు సందీప్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. మరి... తొలి షెడ్యూల్ షూటింగ్ మెక్సికోలోనే జరుగుతుందా? లేక హైదారాబాద్‌లో ప్రారంభం అవుతుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ఈ సినిమా మేజర్ షూటింగ్ విదేశాల్లోనే జరుగుతుందట. ఈ చిత్రం సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ కంపోజ్ చేసిన కొన్ని ట్యూన్స్‌ను సందీప్ ఆల్రెడీ ఫైనలైజ్ చేశారని టాక్. భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించనున్న ఈ 'స్పిరిట్' సినిమా 2026 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రా లతో ప్రభాస్ బిజీగా ఉన్నారు.



ఆది సాయికుమార్

డిసెంబరులో శంబాల

ఆది సాయికుమార్ హీరోగా నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల: ఏ మిస్టికల్ వరల్డ్'. అర్చన అయ్యర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో స్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ కీలక పాత్రల్లో నటించారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లుగా వెల్లడించి, శనివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''పాన్–ఇండియా స్థాయి కంటెంట్ ఉన్న సినిమా ఇది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. సిల్వర్ స్క్రీన్‌పై విజువల్ వండర్‌లా కనిపిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: ప్రవీణ్ కె. బంగారి.



యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం, రాజేశ్, శివ బొమ్మకు, జైన్స్ నాని

పోటీలోనూ వసూళ్లు బాగున్నాయి

- కిరణ్ అబ్బవరం

''ఈ పండక్కి మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వాలని, చిన్న మెసేజ్ ఇవ్వాలని, ఒక వైబ్ క్రియేట్ అవ్వాలని మేం చేసిన ప్రయత్నం 'కె–ర్యాంప్' సినిమా. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తోంది. ఇప్పుడున్న పోటీలో ఇంతమంచి కలెక్షన్స్ రావడం మామూలు విషయం కాదు. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాకు వెళ్తున్నారు. షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయి. స్క్రీన్స్ యాడ్ అవుతున్నాయి. ఈ దీపావళికి 'కె–ర్యాంప్'తో నాకు మంచి సక్సెస్ అందించిన అందరికీ ధన్యవాదాలు'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా, యుక్తీ తరేజా హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'కె–ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం శనివారం విడుదలైంది. శనివారం సాయంత్రం యూనిట్ నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో రాజేశ్ దండ మాట్లాడుతూ– ''ఇలాంటి సినిమాల్లో లాజిక్స్ వెతక్కూడదు. అయితే కొందరు మా సినిమా పట్ల పక్షపాతం చూపిస్తున్నారు. దీపావళికి రిలీజైన సినిమాల్లో ఏ సినిమా కలెక్షన్స్ ఎలా ఉన్నాయో చూసి, నిజాలు తెలుసుకోవాలి'' అని చెప్పారు. 'కె–ర్యాంప్'ను హీరో కిరణ్‌గారు భుజాన వేసుకుని మోశారు కాబట్టి మంచి రిజల్ట్ వచ్చింది. ప్రేక్షకుల స్పందన బాగుంది'' అన్నారు జైన్స్ నాని. 'కె–ర్యాంప్' విజయం పట్ల వీకే నరేశ్, యుక్తీ తరేజా సంతోషం వ్యక్తం చేశారు.

నవల ఆధారంగా...

కన్నడ నటుడు రాజ్ బి. శెట్టి ప్రధాన పాత్రలో నటించనున్న కొత్త సినిమాకు 'జుగారి క్రాస్' అనే టైటిల్ ఖరారైంది. గురుదత్త గనిగ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. రచయిత కేపీ పూర్ణచంద్ర తేజస్వి రాసిన ప్రసిద్ధ నవల 'జుగారి క్రాస్' ఆధారంగా, అదే టైటిల్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. గురుదత్త గనిగ, సప్తగిరి ఫిల్మ్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మించనున్నాయి. తాజాగా ఈ సినిమా ప్రోమోను రిలీజ్ చేశారు మేకర్స్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సచిన్ బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు గురుదత్త దర్శకత్వంలోని మరో సినిమా 'కరావళి'లో కూడా రాజ్ బి. శెట్టి ఓ లీడ్ రోల్‌లో నటించారు. ప్రజ్వల్ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.



రాజ్ బి. శెట్టి

సరికొత్త లవ్‌స్టోరీ



ప్రీతి, సాత్విక్

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వంలో వరలక్ష్మీ పప్పుల సమర్పణలో కనకదుర్గారావు పప్పుల నిర్మించిన ఈ సినిమా నవంబరు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా' వీడియోను ప్రదర్శించారు. అనంతరం భాను మాట్లాడుతూ– ''సరికొత్త బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ చిత్రం ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని చెప్పారు.

ఆ రెండు చిత్రాలకు మించిన ఆదరణ లభిస్తోంది

- ప్రదీప్ రంగనాథన్




నవీన్, కీర్తీశ్వరన్, ప్రదీప్ రంగనాథన్, రవిశంకర్, శశిధర్ రెడ్డి

''డ్యూడ్' సినిమాను అద్భుతంగా రిసీవ్ చేసుకుంటున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. మీరు అందిస్తున్న ప్రేమ మర్చిపోలేనిది. నేను హీరోగా నటించిన 'లవ్ టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు ఆ రెండు చిత్రాలకు మించిన ఆదరణ, అభిమానం 'డ్యూడ్' సినిమాకి చూపిస్తున్నారు. నా గత చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' కంటే తొలి, మలి రోజుల్లోనే నాలుగైదు రెట్లు ఎక్కువ కలెక్షన్స్ 'డ్యూడ్' సినిమాకు వచ్చాయని మా నిర్మాతలు చెబుతుంటే ఆనందంగా ఉంది. ఇందుకు కారణమైన దర్శకుడు, నిర్మాతలకు ధన్యవాదాలు'' అని ప్రదీప్ రంగనాథన్ అన్నారు. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు హీరో హీరోయిన్లుగా, ఆర్. శరత్‌కుమార్ మరో కీలక పాత్రలో నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా 'డ్యూడ్ దివాళి బ్లాస్ట్' పేరిట నిర్వహించిన సమావేశంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ– ''తమిళనాడులోనూ నా గత చిత్రాలకంటే 'డ్యూడ్'కు ఎక్కువ కలెక్షన్స్ వస్తున్నాయి'' అని తెలిపారు. నవీన్ ఎర్నేని మాట్లాడుతూ– ''ప్రదీప్‌గారి గత సినిమాలతో పోల్చుకుంటే కొన్ని ఏరియాల్లో నాలుగైదు రెట్లు ఎక్కువ కలెక్షన్స్ 'డ్యూడ్'కు వస్తున్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 22 కోట్ల గ్రాస్ వచ్చింది. 'డ్యూడ్ దివాళి బిగ్ విన్నర్'' అని చెప్పారు. ''జెన్ జి కాన్సెప్ట్‌తో ఫ్యామిలీ ఎమోషన్స్ బ్లెండ్ అయిన ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు'' అని తెలిపారు వై. రవిశంకర్. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

రెండు ఊళ్ళను కలిపిన మరణం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'బాంబ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఆలోచన... ఓ అణువంత ఆలోచన కూడా పరమాణువంత ఫలితాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఇక ఇదే ఆలోచనకు సృజనాత్మకత తోడైతే వెండితెరకు ప్రేక్షకులు పూర్తిగా కట్టుబడిపోతారు. అదే పంథాలో విడుదలైన సినిమా 'బాంబ్'. ఈ టైటిల్ చూసి ఇదేదో పక్కా క్రైమ్ థ్రిల్లర్ అనుకునేరు! అస్సలు కానే కాదు. ఈ సినిమా ప్రేక్షకుడి అంచనాలకు ఏమాత్రం అందదు. అందుకే ఈ సినిమా ఆలోచన ఓ అద్భుతం. మణికందన్, అభిషేక్‌తోపాటు విశాల్ వెంకట్ అందించిన ఈ కథను విశాల్ వెంకట్ దర్శకత్వం వహించి దృశ్య కావ్యంగా మలిచిన విధానం అభినందనీయం. అంతలా ఈ 'బాంబు'లో ఏముందో ఓసారి చూద్దాం. కాలకమ్మాయిపట్టి అనే ఊరు పెద్ద గాలివాన సమయంలో ఓ బండ పగలడం వల్ల కాలపట్టి, కమ్మాయిపట్టి అని రెండు గ్రామాలుగా విడిపోతుంది. బండ పగిలి ఒకటి చిన్న ముక్కగా, మరొకటి పెద్ద ముక్కగా... రెండు వేరు వేరు ప్రాంతాలలో పడడం వల్ల ఆ ఊరులోని జనాల మధ్య భేదాభిప్రాయాలు రగిలి రెండు ఊళ్ళుగా విడిపోతారు. ఎంతో అన్యోన్యంగా ఉండే ఆ ఊరు ముక్కలవడంతో ఊరిలో పాటించే కట్టుబాట్లతో పాటు జరగబోయే పండగ పబ్బాలు కూడా కళ తప్పుతాయి. ఊరు కలిసున్నప్పటి నుండి ఉంటున్న కదిరవన్ అనే వ్యక్తి రెండుగా విడిపోయిన ఊరుని చూసి బాధతో ఉన్నట్టుండి చనిపోతాడు. కదిరవన్‌నే అంటిపెట్టుకుని ఉండే స్నేహితుడైన మణిముత్తు మాత్రం తను చనిపోలేదనే వాదిస్తుంటాడు. దానికి తోడు చనిపోయిన కదిరవన్ శరీరం నుండి అపానవాయువు వింత వింత శబ్దాలతో ఇంకా వస్తూనే ఉంటుంది. ఇంతలో కదిరవన్ శరీరాన్ని ఊరు మధ్యలో ఉన్న ఓ కుర్చీలో శవంగా కూర్చోపెడతారు. చనిపోయిన కదిరవన్ శరీరం విడిపోయిన రెండు గ్రామాలను ఎలా కలుపుతుందనేది మాత్రం ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న 'బాంబ్' సినిమాలోనే చూడాలి. రాబోయే దీపావళికి చెవులు దద్దరిల్లే శబ్దాలతో ఎన్నో బాంబులు మన చెవులను అదరగొడతాయి. కానీ ఈ సినిమా బాంబు మాత్రం మీ అంచనాలకు అందకుండా ఆహ్లాదపరుస్తుంది. కాబట్టి మీ దీపావళి బాంబులతో పాటు ఈ 'బాంబు'ను కూడా ఓసారి చూసేయండి. వర్త్ టు వాచ్ ఫర్ దిస్ దివాలి.

– హరికృష్ణ ఇంటూరు


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
విజయ్ సేల్స్
దీపావళి శుభాకాంక్షలు
సంతోషం కలిగిస్తాయి
GST భారిగా తగ్గింపు
ixigo
₹5000 వరకు
TELEVISIONS
RANGE AVAILABLE FROM 32 (80 cm) TO 100 (254 cm)
GST ON TELEVISIONS REDUCED FROM 28% TO 18%
UPTO 26% CASHBACK* UPTO ₹26,000
FULL HD | 4K | 8K | OLED | QLED | QNED | NanoCell | Mini LED | Google TV | webOS | TIZEN
VISE SONY Haier LG Panasonic SANSUI mi TCL LLOYD
WIDEST RANGE OF DISHWASHERS
GST ON DISHWASHERS REDUCED FROM 28% TO 18%
STARTING FROM ₹24,990
LG IFB TOSHIBA BOSCH
Midea SIDE BY SIDE REFRIGERATOR (563 LITRES) UPTO 10% CASHBACK* UPTO ₹5,000
Electrolux SIDE BY SIDE REFRIGERATOR (564 LITRES) UPTO 15% CASHBACK* UPTO ₹10,000
LG SIDE BY SIDE REFRIGERATOR (650 LITRES) UPTO 20% CASHBACK* UPTO ₹15,000
SAMSUNG SIDE BY SIDE REFRIGERATOR (653 LITRES) UPTO 20% CASHBACK* UPTO ₹20,000
WIDEST RANGE OF AIR CONDITIONERS
GST ON ACS REDUCED FROM 28% TO 18%
SAVE UPTO ₹5,000
STARTING FROM ₹22,990
Whirlpool TOP LOAD WASHING MACHINE (8 KG) UPTO 10% CASHBACK* UPTO ₹5,000
BOSCH FRONT LOAD WASHING MACHINE (9 KG) UPTO 20% CASHBACK* UPTO ₹10,000
LG FRONT LOAD WASHING MACHINE (12 KG) UPTO 20% CASHBACK* UPTO ₹7,000
SAMSUNG FRONT LOAD WASHING MACHINE (12 KG) UPTO 17.5% CASHBACK* UPTO ₹8,000
iPhone 16
Built for Apple Intelligence.
Starting from ₹62,900*
₹2,788* per month
iPhone 17 PRO
Starting from ₹1,30,900*
₹5,621* per month
iPhone Air
Supersized battery life.
Starting from ₹1,15,900*
₹4,996* per month
WATCH SE 3
Walk it. Track it. Love it.
Starting from ₹23,900*
₹1,079* per month
MacBook Air
Sky high performance with
M4
Starting from ₹80,900*
₹3,788* per month
M2
Starting from ₹73,200*
₹3,258* per month
iPad
Now with the speed of A16 chip and double the starting storage.
Starting from ₹30,500*
₹1,354* per month
AirPods 4
Now with Heart Rate Sensing.
Starting from ₹10,800*
₹513* per month
Up to ₹10,000* instant cashback on credit cards of SBI card | ICICI Bank | IDFC FIRST Bank
+ Exchange Bonus up to ₹10,000*
No Cost EMI schemes available on HDFC BANK | ICICI Bank | IDFC FIRST Bank
Protect+ with AppleCare Services
Great Gifting Ideas
For Corporate Bookings or Bulk Orders in Hyderabad, Please contact Navaneeth - 99482 64111
ICICI Bank INSTANT DISCOUNT UP TO ₹12,500* ON CREDIT CARDS NON EMI, CREDIT & DEBIT CARDS EMI TRANSACTIONS
HDFC BANK FESTIVE TREATS INSTANT DISCOUNT UPTO ₹7,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
HSBC INSTANT DISCOUNT UPTO ₹7,500* ON CREDIT CARDS EMI & NON EMI TRANSACTIONS
UP TO ₹30,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
AMERICAN EXPRESS RBL BANK onecard IndusInd Bank IDFC FIRST Bank YES BANK BOBCARD pnb SBI card FEDERAL BANK HDB FINANCIAL SERVICES kotak
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ । వరంగల్ । విజయవాడ । విశాఖపట్నం । రాజమండ్రి । తిరుపతి । కాకినాడ । ముంబై । ఢిల్లీ । థానే । నవీ ముంబై । పూనే । సూరత్ । వదోదర । అహ్మదాబాద్ । గురుగ్రామ్ । ఫరీదాబాద్ । నోయిడా । ఇందిరాపురం
ఎస్ రావు నగర్ । అత్తాపూర్ । ఔహెచ్ఇఎల్ । చాంద్రాయణ్‌గుట్ట (హఫీజ్ బాబా నగర్ మెయిన్ రోడ్డు) । హస్తినాపురం । హయత్‌నగర్ । జూబ్లీ హిల్స్ । కర్మాన్‌ఘాట్ । కొంపల్లి । కొత్తపేట । కొండాపూర్ । కుకట్‌పల్లి । మలక్‌పేట్ । మదీనాగూడ । మెహదీపట్నం ।
మైలార్‌దేవ్‌పల్లి । నాగారం । నాగోల్ । నల్లకుంట । నాచారం । ప్యారడైజ్ । పంజాగుట్ట । పీర్జాదిగూడ (బోడుప్పల్) । ఆర్ సి పురం । షా అలి బండ । సుచిత్ర క్రాస్ రోడ్ । సన్‌సిటీ । టోలిచౌకి । వనస్థలిపురం । వరంగల్ । హనమకొండ
జూబ్లీ హిల్స్: మెట్రో పిల్లర్ 1684 ఎదురుగా, రోడ్ నం. 36 । ప్యారడైజ్: ఆగ్రానీ హోటల్ పక్కన । పంజాగుట్ట: దిగువ గ్రౌండ్ ఫ్లోర్, జీఎస్ సెంటర్ పాయింట్ (హైదరాబాద్ సెంట్రల్) । కొంపల్లి: రాయల్ ఓక్ ఎదురుగా
SCAN FOR STORES
Scan to Shop Online
www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *Cashback Applicable Select Banks & Cards

నవంబర్ 3 నుంచి సముద్ర మత్స్యకార జనాభా గణన

సాక్షి, అమరావతి: ఐదో జాతీయ సముద్ర మత్స్యకార జనాభా గణన 2025కు రంగం సిద్ధమైంది. నవంబర్ 3 నుంచి డిసెంబర్ 18 వరకు నిర్వహించనున్న ఈ ప్రాజెక్టు నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ) వ్యవహరించనుంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద దేశంలో తొలిసారి జియో రిఫరెన్సింగ్ ద్వారా ఈ జనగణన సర్వే చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా తీర ప్రాంత రాష్ట్రాలతో పాటు లక్షద్వీప్, అండమాన్‌తో సహా కేంద్ర పాలిత ప్రాంతాల్లో నివసించే సముద్ర మత్స్యకారుల గణన కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రక్రియ మొత్తం 'విలేజ్-జెట్టి అప్రైసల్ నావిగేటర్' అనే అనువర్తన యాప్ ద్వారా చేపడతారు. రియల్-టైమ్, జియో-రిఫరెన్స్ డేటా పొందడానికి వీలుగా సీఎంఎఫ్ఆర్ఐ ప్రత్యేకంగా కస్టమ్ బిల్ట్ మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది. 13 తీరప్రాంత రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 4వేల గ్రామాల్లో సుమారు 12 లక్షల మత్స్యకార కుటుంబాల గణన చేపడతారు.

మీ ఆలోచనలే.. దుష్ట చతుష్టయం



అసమాన నాయకత్వ ప్రతిభ కనబరిచే టీమ్ లీడర్‌లు బయటి నుంచి ఎదురయ్యే సవాళ్ల వల్ల కాకుండా.. తమ అపరిమితమైన ఆత్మవిశ్వాసం వల్ల విఫలమవుతుంటారని 'హార్వర్డ్ బిజినెస్ రివ్యూ' (హెచ్.బీ.ఆర్.) తాజా సంచికలోని ఒక వ్యాసం విశ్లేషించింది. ఇందులో ముఖ్యంగా కొన్ని లక్షణాలు.. ఇటు నాయకులు / లీడర్లు / బాస్‌లకే కాదు.. ఇంటిని నడిపే ఇంటి యజమానులకూ వర్తిస్తాయి అంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు. - సాక్షి, స్పెషల్ డెస్క్

'ఇనుమును ఏదీ నాశనం చేయలేదు.. దాని తుప్పు తప్ప. అలాగే ఒక మనిషి పురోగతిని ఆపేసేది తన మనస్తత్వమే తప్ప బయటి వ్యక్తులో, అంశాలో కాదు' - రతన్ టాటా

సంస్థల్లోని నాయకులు లేదా ఇంటికి యజమానిలో అజ్ఞాతంగా ఉండే ఆధిపత్య భావనలు వారి పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేసి, వారి అభివృద్ధికి ఆటంకంగా మారతాయి. మొదట బలాలుగా కనిపించిన ఈ భావనలు క్రమేణా బలహీనతలుగా మారతాయి. బాహ్య అద్దంకుల్లా ఇవి పైకి కనిపించవు. ఎవరికి వారు వీటిని గుర్తించి, సానుకూలంగా మలుచుకుంటే వైఫల్యాలను నివారించవచ్చు. ఎందుకంటే.. నిజమైన నాయకత్వ పురోగతి అంతర్గతంగా ప్రారంభమవుతుంది. ఏమిటీ భావనలు.. వీటి దుష్ఫలితాలేంటి.. వీటిని ఎలా అధిగమించాలి?

ప్రతి పనిలో నేనుండాలి

తమ ముద్ర కనిపించాలి అనే తాపత్రయంతో ప్రతి పనిలో 'నేనుండాలి' అని అనుకుంటారు చాలామంది.

దుష్ఫలితం: అలసట, నిస్సత్తువ పెరుగుతాయి. టీమ్‌లో చొరవ లోపిస్తుంది. 'అన్నీ ఆయన చూసుకుంటాడులే' అనే ధోరణి కింది వారిలో పెరిగిపోతుంది. సృజనాత్మకంగా ఆలోచించడం మానేస్తారు. పిల్లలు పెద్దయ్యాక కూడా చాలామంది తల్లిదండ్రులు వాళ్లను స్వతంత్రంగా పనిచేయనివ్వరు.

ఇలా మార్చుకొని చూడండి: 'నేను ఏదైనా చేయగలను. కానీ ప్రతి పనీ నేనే చేయాల్సిన అవసరం లేదు' అనే ధోరణి మంచిది. అప్పుడు అందరికీ పనిచేసే అవకాశం వస్తుంది. వినూత్నంగా ఆలోచిస్తారు. నాయకుడు అంటే నడిపించాలి కానీ ప్రతి స్థాయిలో ప్రతి పనీ తానే చేయాల్సిన అవసరం లేదు.

వెంటనే పని పూర్తి చేసేయాలి

ప్రాధాన్యతలతో సంబంధం లేకుండా.. ప్రతి పనినీ తక్షణమే పూర్తి చేయాలి. వెంటనే ఫలితాలు కనిపించాలి అనే ధోరణితో చాలామంది ఉంటారు.

దుష్ఫలితం: పిల్లలకు అన్ని అంశాల్లోనూ ఇలాగే చెప్పడం వల్ల వారికి ప్రాధాన్యతలు తెలియవు. బృందం విషయానికొస్తే.. ప్రతి పనిలోనూ 'ఎమర్జెన్సీ' పరిస్థితి ఏర్పడి తప్పులు జరగొచ్చు.

ఇలా మార్చుకొని చూడండి: 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి' అన్నట్టు అవసరమైన పనిపై ముందు దృష్టి పెడతాను అనుకోవాలి. ప్రాధాన్యతలు గుర్తించడమే సగం విజయం. పిల్లలు కూడా రోజువారీ చేసే పనుల్లో ఎక్కువ ఫలితం ఇచ్చే పనికి అధిక ప్రాధాన్యత.. తక్కువ ఫలితం ఇచ్చే దానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం నేర్చుకుంటారు. దానికి తగ్గట్టుగా సమయం, ఆలోచనలు, శక్తిసామర్థ్యాలు వినియోగిస్తారు.

సంస్థల్లో లీడర్లయినా, కుటుంబ పెద్దలైనా ఆలోచనా ధోరణి మార్చుకుంటే మేలు

నేను తప్పులు చెయ్యకూడదు

పనిలో కచ్చితత్వం కోసం తపన పడుతూ ఇలా ఆలోచిస్తుంటారు.

దుష్ఫలితం: వినూత్న విధానాలను ప్రయత్నించే ధైర్యం చేయలేకపోవడం, అతి జాగ్రత్త, ఎప్పుడూ ఫలితంపైనే అధిక శ్రద్ధ.

ఇలా మార్చుకొని చూడండి: 'తప్పులు జరగకుండా చూడటం కాదు, సరిగ్గా పని జరిగేటట్లు చూడాలి' అనే ధోరణి ఏర్పరచుకోవాలి. ఇది కింది వాళ్లను మూస ధోరణిలో కాకుండా కొత్తగా ఆలోచించేలా చేస్తుంది. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్టు ఫలితంపై శ్రద్ధ కాకుండా.. పనిని సరిగ్గా చేయడం అలవాటవుతుంది.

అందరూ నాలాగే పని చెయ్యాలి

ఇంట్లో లేదా ఆఫీసులో అందరూ తమలాగే ఆలోచించాలని, పనిచేయాలని.. ఆలోచిస్తారు, ఆశిస్తారు.

దుష్ఫలితం: వ్యక్తిగత సామర్థ్యాలలోని వ్యత్యాసాలు గుర్తించరు. ఎవరి సామర్థ్యానికి, పనిచేసే ఒడుపునకు తగ్గట్టు వారిని స్వేచ్ఛగా పనిచేయనివ్వరు. ముఖ్యంగా పిల్లల విషయంలో వారి వయసును కూడా ఒక్కోసారి మర్చిపోయి వారిపై ఒత్తిడి పెంచుతుంటారు.

ఇలా మార్చుకొని చూడండి: 'నాలా అందరూ ఆలోచించలేకపోవచ్చు, పనిచేయలేకపోవచ్చు' అనే వాస్తవాన్ని గుర్తించండి. వారి వారి సామర్థ్యాలు, తెలివితేటలకు అనుగుణంగా పనిచేసే వాతావరణం కల్పించండి. ముఖ్యంగా ఇది పిల్లల మానసిక వికాసానికి దోహదపడుతుంది.

వాహ్‌హా.. 'తాజ్'

సాక్షి, అమరావతి: తాజ్‌మహల్ అనగానే ప్రేమకు చిహ్నమైన అపురూప కట్టడం మదిలో మెదులుతుంది. ఈ చారిత్రక అద్భుతాన్ని చూసి అబ్బురపడని మనసు ఉండదంటే అతిశయోక్తి కాదు. స్వదేశీ, విదేశీ పర్యాటకుల మనసు దోచింది తాజ్ మహల్. కేంద్ర పర్యాటక శాఖ 2024-25 సంవత్సరాలకు విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ ఏడాది స్వదేశీ, విదేశీ పర్యాటకుల ఆకర్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆ తరువాత విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో ఆగ్రా పోర్టు రెండో స్థానంలో నిలవగా స్వదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో కోణార్క్ సూర్య దేవాలయం రెండో స్థానంలో నిలిచింది. 2024-25లో తాజ్‌మహల్‌ను 6.45 లక్షల విదేశీ పర్యాటకులు సందర్శించగా స్వదేశీ పర్యాటకులు 62.64 లక్షల మంది సందర్శించారు. కోణార్క్ సూర్య దేవాలయాన్ని 35.71 లక్షల మంది స్వదేశీ పర్యాటకులు సందర్శించారు. ఆగ్రా కోటను 2.24 లక్షల మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. 2024-25లో దేశానికి మొత్తం 95,51,722 మంది విదేశీ పర్యాటకులు వచ్చినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో అత్యధికంగా టాప్ 15 దేశాల నుంచే 76.70 లక్షల మంది విదేశీ పర్యాటకులు దేశానికి వచ్చినట్లు పేర్కొంది. అత్యధికంగా అమెరికా నుంచి తరువాత బంగ్లాదేశ్ నుంచి విదేశీ పర్యాటకులు వచ్చినట్లు గణాంకాలు తెలిపాయి. అంతకు ముందు ఆర్థిక ఏడాదితో పోలిస్తే 2024-25లో విదేశీ పర్యాటకుల సంఖ్య 4.30 లక్షలు పెరిగారు. 2024-25లో భారత దేశానికి 99.51 లక్షల విదేశీ పర్యాటకులు రాకతో రోజూ సగటున 27,000 కంటే ఎక్కువ మంది దేశానికి వచ్చారు.



పర్యాటకుల ఆకర్షణలో నంబర్ వన్ తాజ్ మహల్

6.45 లక్షలు	62.64 లక్షలు	2.24 లక్షలు	35.71 లక్షలు
2024-25లో తాజ్ మహల్‌ను సందర్శించిన విదేశీ పర్యాటకులు	2024-25లో సందర్శించిన స్వదేశీ పర్యాటకులు	2024-25లో ఆగ్రాకోటను తిలకించిన విదేశీ పర్యాటకులు	2024-25లో కోణార్క్ సూర్య దేవాలయానికి వచ్చిన స్వదేశీ పర్యాటకులు

2024-25 లో విదేశీ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ 10 కేంద్ర రక్షిత స్మారక చిహ్నాలు ఇవే

స్మారక కట్టడాలు	విదేశీ పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)
తాజ్ మహల్	6.45
ఆగ్రా కోట	2.24
కుతుబ్ మినార్	2.20
హుమయూన్ సమాధి	1.58
అభనేరి దౌసా వద్ద 5 మెట్ల బావి	1.16
ఫతేపూర్ సిక్రీ	0.97
ఇతిమాద్-ఉద్-దౌలా సమాధి	0.90
తవ్విన అవశేషాలు, నలంద	0.88
రెడ్ ఫోర్ట్ ఢిల్లీ	0.79
సాహెత్ మహేత్	0.73

2024-25లో దేశీయ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ 10 కేంద్ర రక్షిత చిహ్నాలు ఇవే

స్మారక కట్టడాలు	దేశీయ పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)
తాజ్ మహల్	62.64
సూర్య దేవాలయం, కోణార్క్	35.71
కుతుబ్ మినార్	32.04
ఎర్రకోట	28.84
రబీస్ దురానీ సమాధి (బీబీ కా మక్బరా)	20.04
ఎల్లోరా గుహలు	17.39
గోల్కొండ కోట	15.63
ఆగ్రా కోట	15.45
ఎగువ కోట అగ్వాడా	13.58
చార్మినార్	13.43

దేశంలో తగ్గిపోతున్న పిల్లలు

మొత్తం జనాభాలో 0-19 ఏళ్ల మధ్య పిల్లలు 2011లో 40.9 శాతం

2026 నాటికి 32 శాతానికి తగ్గిపోతుంది

సంతానోత్పత్తి రేటు తగ్గుదలే కారణం

భారతదేశంలో పిల్లలు -2025 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి

దేశంలో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. 2011 నుంచి 2026 వరకు మొత్తం జనాభాలో 0-19 ఏళ్ల మధ్య పిల్లల జనాభా 8.9 శాతం తగ్గిపోతోందని దేశంలో పిల్లలు-2025 నివేదిక వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది. 2011లో మొత్తం జనాభాలో పిల్లలు 40.9 శాతం ఉండగా.. 2026 నాటికి 32 శాతానికి తగ్గుతుందని నివేదిక అంచనా వేసింది. ఇందుకు ప్రధాన కారణం సంతానోత్పత్తి రేటు తగ్గడమేనని పేర్కొంది. అన్ని వయసుల పిల్లల జనాభాలో తగ్గుదల ధోరణి కనిపిస్తోందని వేదిక తెలిపింది.



2011లో మొత్తం జనాభాలో వయసుల వారీగా పిల్లల నిష్పత్తి ఇలా

	0-4 ఏళ్లు	5-9 ఏళ్లు	10-14 ఏళ్లు	15-19 ఏళ్లు
మొత్తం	9.9 శాతం	10.4 శాతం	10.6 శాతం	10.1 శాతం
బాలురు	10.0 శాతం	10.5 శాతం	10.8 శాతం	10.3 శాతం
బాలికలు	9.8 శాతం	10.2 శాతం	10.4 శాతం	9.8 శాతం

2026 నాటికి వయసుల వారీగా పిల్లల జనాభా నిష్పత్తి ఇలా

	0-4 ఏళ్లు	5-9 ఏళ్లు	10-14 ఏళ్లు	15-19 ఏళ్లు
మొత్తం	7.6 శాతం	7.9 శాతం	8.2 శాతం	8.2 శాతం
బాలురు	7.8 శాతం	8.1 శాతం	8.5 శాతం	8.3 శాతం
బాలికలు	7.5 శాతం	7.7 శాతం	8.0 శాతం	8.2 శాతం

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

దండకారణ్యంలో
దశాబ్దాలుగా సాయుధ పోరాటం

ఇన్నాళ్లూ భద్రతా దళాలకు
దడ పుట్టించిన మావోలు

కొత్త ఎత్తులతో
దూసుకెళ్తున్న పోలీసు బలగాలు

ఫలితంగా
అనివార్యమైన లొంగుబాట్లు?



తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల వద్ద ఇటీవల స్వాధీనం చేసుకున్న మావోల ఆయుధాల డంప్‌తో తడపల బేస్‌క్యాంప్ భద్రతా దళాలు

ఎత్తులు.. పై ఎత్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్యంలో పట్టు నిలుపుకొనేందుకు ఓ వైపు మావోయిస్టులు.. మరోవైపు భద్రతా దళాలు గడిచిన పదిహేనేళ్లుగా వ్యూహ ప్రతివ్యూహాలను అమలు చేశారు. చివరికి అపరిమితమైన వనరులు కలిగిన భద్రతా దళాల ధాటికి దండకారణ్యంలో మావోలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఎదురైంది. ఇదే చివరకు భారీ లొంగుబాట్లకు దారి తీసిందన్న చర్చ జరుగుతోంది.

రంగంలోకి పారా మిలిటరీ..

దండకారణ్యంలో 1980లో అడుగుపెట్టిన మావోయిస్టులు ఇరవై ఏళ్లకు పైగా అక్కడ తిరుగులేని శక్తిగా మారారు. మరో పదేళ్లకు ఆ పార్టీ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి 12 కంపెనీలు వచ్చి చేరాయి. సాంస్కృతిక విభాగమైన చేతన నాట్యమండలి సభ్యుల సంఖ్య 7 వేలు దాటింది. దండకారణ్యంలో ప్రబల శక్తిగా నానాటికి విస్తరిస్తున్న మావోయిస్టులకు అడ్డుకట్ట వేసేందుకు ముందుగా సల్వాజుడుం, ఆ తర్వాత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను 2009లో ప్రభుత్వం ప్రారంభించింది. సీఆర్‌పీఎఫ్, ఇండో టిబెటన్ పోలీస్, బీఎస్ఎఫ్ తదితర దళాలను రంగంలోకి దించింది. దీంతో మావోయిస్టులే లక్ష్యంగా భద్రతా దళాల కూంబింగ్ పెరిగింది. ఎదురు కాల్పుల్లో ఆ పార్టీ సభ్యులు నష్టపోవడం పెరిగింది.

పారా మిలిటరీని ఎదుర్కొనేలా..

వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లను సమీక్షించిన 'దాదా'లు నాలుగు కిలోమీటర్ల నడక వ్యూహాన్ని అమల్లోకి తెచ్చారు. తమ బస (క్యాంప్) సమాచారం పోలీసులు/భద్రతా దళాలకు చేరాక వారు తమను చుట్టుముట్టేందుకు ఎంత సమయం పడుతుంది, ఈ దాడి నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఎంత సమయం అవసరం, తప్పించుకున్న తర్వాత చెల్లాచెదురైన దళాలు 24 నుంచి 72 గంటల్లోగా ఎక్కడ, ఎలా కలుసుకుంటే మంచిదనే అంశాలపై అధ్యయనం చేశారు. గ్రామం లేదా రోడ్ పాయింట్ (పోలీసులు వాహనాలు వచ్చే స్థలం) నుంచి కనీసం నాలుగు కిలోమీటర్ల పాటు అడవిలో నడిస్తే తప్ప చేరుకోలేనంత దట్టమైన అడవిలోనే క్యాంపులు ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. అంతేకాక తమ వద్దకు వచ్చే భద్రతా దళాలపై అంబూష్‌లు చేసే వ్యూహాలు నేర్చుకున్నారు. దీనికి తోడు రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్ల యుద్ధరీతులను అధ్యయనం చేశాక.. వేగంగా బంకర్లు, బూబీట్రాప్స్ నిర్మించడంపై దళాలకు శిక్షణ ఇచ్చారు. దీంతో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌కు వెళ్లిన బలగాలు అనేకసార్లు మావోయిస్టుల ఉచ్చులో చిక్కుకున్నాయి.

కట్టుదిట్టం చేసినప్పటికీ..

ఆపరేషన్ గ్రీన్‌హంట్ చేపట్టి పదేళ్లు దాటినా సానుకూల ఫలితం రాకపోవడంతో 2017లో ఆపరేషన్ సమాధాన్ (ఎస్ – స్మార్ట్ లీడర్‌షిప్, ఏ – అగ్రెసివ్ స్ట్రాటజీ, ఎం – మోటివేషన్ అండ్ ట్రెయినింగ్, ఏ – యాక్షనబుల్ ఇంటెలిజెన్స్, డీ– డ్యాష్‌బోర్డ్ బేస్డ్ కీ రిజల్ట్ ఏరియా, హెచ్ – హర్నెస్సింగ్ టెక్నాలజీ, ఏ – యాక్షన్ ప్లాన్) తెరపైకి వచ్చింది. మావోయిస్టుల ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టడం, వారి స్థావరాలను కచ్చితంగా కనుక్కోవడం, ఔషధాలు అందకుండా చూడటం, కొత్త రిక్రూట్‌మెంట్లు తగ్గించే పనిపై ప్రభుత్వం, బలగాలు దృష్టి సారించాయి. ఆఖరికి వాయుమార్గాన దాడులకు సైతం తెర తీశారు. ఎన్ని చేసినా 2021 ఏప్రిల్‌లో తెర్రం దగ్గర జరిగిన దాడిలో 22 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోవడం భద్రతా దళాలకు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. అంతేకాక మావోలను ఎదుర్కొనేందుకు మరో కొత్త వ్యూహం భద్రతా దళాలకు అవసరం పడింది.


యాంటీ నక్సల్స్ కూంబింగ్‌లో భద్రతా దళాలు (ఫైల్)

4 కిలోమీటర్ల ప్రణాళిక

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు ఒక పారామిలిటరీ క్యాంప్ ఏర్పాటు చేసే ప్రణాళికకు 2019లో శ్రీకారం చుట్టారు. దీని ప్రకారం అడవిలో క్యాంప్ ఏర్పాటుచేసి 24 గంటలూ జవాన్లు అక్కడే ఉంటారు. ఆ క్యాంప్ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో నిత్యం కూంబింగ్ చేస్తారు. అలా మావోలను మరింతగా అడవి లోపలికి నెట్టేస్తారు. నెల వ్యవధిలోనే ఆ ప్రాంతంపై పట్టు సాధించి అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరాన మరో కొత్త క్యాంప్ ఏర్పాటు చేస్తారు. క్యాంపుతో పాటే భారీ వాహనాలు తిరిగేలా తాత్కాలిక రోడ్లు, మొబైల్ టవర్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. ఇలా రెండేళ్లలోనే 300కి పైగా క్యాంపులు ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ ప్రాంతంపై పట్టున్న డీఆర్‌జీ దళాలు ప్రభుత్వ అమ్ములపొదిలో వచ్చి చేరాయి. దండకారణ్యంలో పరిస్థితులు తమకు అనుకూలంగా మారాయనే నమ్మకం రాగానే 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైంది. దళాల కదలికలపై మానవ, సాంకేతిక నిఘాతో కచ్చితమైన దాడులు చేయడం మొదలైంది. అప్పటి నుంచి ప్రతీ ఎన్‌కౌంటర్ మావోయిస్టులకు భారీ నష్టం చేస్తూ వచ్చింది. చివరకు ఆ పార్టీలో ఓ వర్గం సాయుధ పోరాటానికి సెలవు ప్రకటించి లొంగుబాటుకు సిద్ధం కావాల్సి వచ్చింది.

తీరొక్క బహుమతుల దీపావళి

- కస్టమర్లు, ఉద్యోగులకు మనసుదోచే బహుమతులిస్తున్న కంపెనీలు
- ఖరీదైన స్వీట్స్ నుంచి త్రీడీ ప్రింటెడ్ విగ్రహాల వరకు వైవిధ్య గిఫ్టులు
- తమ బహుమతుల వ్యాపారం 60 శాతం పెరిగినట్లు అమెజాన్ వెల్లడి
- కస్టమర్ల అభిరుచులకు తగిన బహుమతులు సిద్ధం చేసిన ఎఫ్ఎన్‌పీ




సాక్షి, హైదరాబాద్: వెలుగుల పండుగ దీపావళి వస్తోందంటే మనదేశంలో ఎక్కడ లేని ఉత్సాహం కనిపిస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకు తమవైన ప్రత్యేకతలతో దీపావళి పండుగ జరుపుకోవాలని ప్రణాళికలు వేసుకుంటారు. దీపాలు వెలిగించటం, పటాకులు కాల్చటమే కాదు.. దీపావళికి బహుమతులు ఇచ్చిపుచ్చుకొనే సంస్కృతి కూడా దేశంలో వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా అనేక కంపెనీలు తమ ఉద్యోగులు, క్లయింట్లు, భాగస్వాములకు బహుమతులు అందించటాన్ని గౌరవంగా భావిస్తున్నాయి. దీంతో దేశంలో బహుమతుల మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. దీపావళి పండుగకు మరో వారమే సమయం ఉండటంతో కార్పొరేట్ సంస్థలు బహుమతుల అందజేతపై దృష్టి పెట్టాయి. రోజువారీ వ్యవహారాలపై కంపెనీలు ఎంత పకడ్బందీగా కసరత్తు చేస్తాయో.. ఇప్పుడు గిఫ్టింగ్‌కు కూడా అంతే స్థాయిలో వ్యూహాత్మక ఆలోచనతో అడుగులు వేస్తున్నట్టు ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ తెలిపింది. కార్పొరేట్ గిఫ్టింగ్ డిమాండ్‌లో ఈ ఏడాది 60 శాతం పెరుగుదల నమోదైనట్టు వెల్లడించింది.

తీరొక్క బహుమతులు..



- ఢిల్లీకి చెందిన ఖరీదైన (ప్రీమియం) స్వీట్స్ బ్రాండ్ ఖోయా మిఠాయి తన బిజినెస్–టు–బిజినెస్ అమ్మకాల్లో 30–35 శాతం పెరుగుదలను అంచనా వేస్తోంది.
- 'వైట్ చాక్లెట్ ఆమ్ పాపడ్ బర్ఫీ, రోజ్ అండ్ చాక్లెట్ కట్లీ'వంటి ప్రత్యేక ఆఫర్లకు డిమాండ్ బాగా పెరిగింది.
- ఈ సీజన్‌లో కొనుగోలుదారుల అభిరుచికి ప్రాధాన్యమిస్తూ ఖరీదైన బహుమతులను విక్రయించేందుకు ప్రముఖ బహుమతుల విక్రయ సంస్థ ఎస్ఎఫ్‌పీ చర్యలు చేపట్టింది.
- 'కంపెనీలు గౌర్మెట్ డిలైట్స్, సొగసైన పూల అలంకరణలు, మొక్కల ఆధారిత బహుమతులు, వెల్‌నెస్ కిట్లు, టెక్ ఉపకరణాలు, డిజిటల్ ఓచర్లను కలిగి ఉన్న టైలర్డ్ హ్యాంపర్లను ఎంచుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు తాము అందుకున్న అనేక ఆర్డర్లలో ఒకే రకమైన సంప్రదాయ తీపి రుచులతో కూడిన హ్యాంపర్లు, మొక్కలతో జత చేసిన వెల్‌నెస్ కిట్లు ఉన్నాయి'అని ఈ సంస్థ తెలిపింది.
- వినూత్న బహుమతులపై దృష్టి సారించిన 3డీ ప్రింటింగ్ కంపెనీ డబ్ల్యూటీఎల్.. 3డీ పరమశివుడి విగ్రహాలు, 3డీ ప్రింటెడ్ విగ్రహాల ప్రత్యేక శ్రేణిని అందిస్తోంది.
- క్రిప్టో ఎక్స్ఛేంజ్ సంస్థ కాయిన్ డీసీఎక్స్ తన ఉద్యోగులకు ట్రాలీ బ్యాగ్, మెడ దిండు, టెక్ ఆర్గనైజర్ ట్రావెల్ ట్యాగ్‌తో సహా ట్రావెల్ కిట్లను బహుమతులుగా ఇవ్వాలని నిర్ణయించింది.'సరదాగా, క్రిప్టో ప్రేరేపిత ఆలోచనలతో రూపొందించిన ఈ బహుమతులు కొత్త ప్రారంభాలను సూచిస్తాయి'అని ఈ సంస్థ తెలిపింది.
- వెల్‌నెస్ ట్రెండ్‌కు తగ్గట్టుగా మిల్లెట్ మాథిస్, ఖర్జూర స్వీట్స్ వంటి ఆరోగ్యకరమైన వస్తువులను బహుమతులుగా ఇవ్వటం గణనీయంగా పెరిగినట్లు ఎంబ్రేస్ గిఫ్టింగ్ సొల్యూషన్స్ సంస్థ పేర్కొంది.
- ఆన్‌లైన్ గిఫ్టింగ్ ప్లాట్‌ఫామ్ ఐజీపీలో ఈ ఏడాది సగటు హ్యాంపర్ల ధర రూ.1,500 ఉండగా, ప్రీమియం వస్తువుల రేంజ్ ధర రూ.10 వేలకుపైగా ఉంది. 'దీర్ఘకాలిక క్లయింట్ల కోసం ఇటీవల 8 వేల హ్యాంపర్లను ఆర్డర్ చేశాం. ఒక్కొక్కటి 150 గ్రాముల బరువుతో ఆరు రకాల డ్రై ఫ్రూట్స్‌ను కస్టమైజ్డ్ సూట్‌కేసులో ప్యాక్ చేశాం'అని ఐజీపీ తెలిపింది.
- ఫ్యాషన్ వస్తువుల తయారీ సంస్థ టైటాన్ తమ బహుమతులు అర్థవంతంగా, బాధ్యతాయుతంగా, తమతో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని చేరేలా రూపొందించినట్టు పేర్కొంది.


పార్కుగా మారిన లింగాల జైలు ఖానా


లింగాల గ్రామ వ్యూ

లింగాల.. తలెత్తుకునేలా!

- నాటి సెటిల్మెంట్ గ్రామం.. నేడు అభివృద్ధి పథం
- దొంగ లింగాల పేరు చెరిపేసి సమాజంలో సగర్వంగా..
- గ్రామంలో చెక్కుచెదరని నాటి భవనాలు
- జిల్లాలోనే మొదటి పోస్టాఫీస్ ఏర్పాటు

అచ్చంపేట: నాడు చరిత్రకెక్కిన ఆ తెలంగాణ పల్లె నేడు సమాజంలో సగర్వంగా నిలబడింది. నైజాం నవాబులు నేర్పిన గుణపాఠమైతేనేమి.. నేరస్తుల్లో వచ్చిన పరివర్తనైతేనేమి విద్య, ఉద్యోగాలతోపాటు అభివృద్ధికి బాటగా నిలిచి నవసమాజం వైపు పరుగులు తీస్తున్నారు. నాటి సెటిల్మెంట్ గ్రామమైన లింగాల నేడు అన్నిరంగాల్లో విరాజిల్లుతోంది. దొంగలుగా ముద్రపడిన వారు దొరలకు ఏమాత్రం తీసిపోమని.. తల ఎత్తుకొని నిలబడ్డానికి ఆ ఊరివాళ్లు చేసిన ప్రయత్నం చాలా సుదీర్ఘమైంది. స్టువర్టుపురం, కప్పరాళ్లతిప్ప ఎలాగో తెలంగాణలో లింగాల అలాగే.. నిజాం కాలంలో కర్ణాటక ప్రాంతంలోని గుల్బర్గా, రాయచూరు, బళ్లారి ప్రాంతాల్లో ఎరుకల దారి దోపిడీ అధికంగా ఉండేది. నిజాం పాలకుడైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ వీరి అరాచకాలను అరికట్టడానికి చేసిన ప్రయత్నాలు పాలకులకు తలనొప్పిగా మారింది. వీరి ఆగడాలను అరికట్టడానికి ఆయన దగ్గర ఐజీపీగా పనిచేస్తున్న ఇకీంసాబ్‌కు అప్పగించాడు. దొంగల్లో పరివర్తన తేవాలని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఉన్న ఎరుకలందరినీ ఒకచోట ఉంచే ప్రయత్నం చేశాడు. ఆయా ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడే వారిని లింగాలకు తీసుకొచ్చి మార్పు వచ్చేందుకు కృషి చేశారు. దొంగలు ఉండేందుకు ఒక జైలును నిర్మించారు. ఎన్ని కఠోరమైన శిక్షలు విధించినా వారిలో మార్పు రాకపోవడంతో దండన కంటే పాపభీతి, దైవచింతన వీరిని మార్చగలవని భావించి ఇకీంసాబ్ నల్లమల అటవీ ప్రాంతాన్ని ఎంచుకొని ఒక శివలింగాన్ని ప్రతిష్టించి లింగాలగా నామకరణం చేసినట్లు ఆనాటి తరం వారు చెబుతున్నారు. ఇకీంసాబ్ చేసిన ప్రయత్నాలు ఆనాటి దొంగలపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఇది గమనించి వీరిని ఊరికే కూర్చోపెట్టడం మంచిదికాదని భావించి సాగుకు వ్యవసాయ భూములు ఇప్పించి పని కల్పించారు. అప్పటికీ అనుమానం తీరక లింగాల మీద గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంతో అప్పట్లో ఎస్పీ, సీఐలు, ఎస్సైలు, వందలాది మంది పోలీసులను నియమించారు. 1917లో పోలీస్‌స్టేషన్, 1924లో ఇన్‌స్పెక్షన్ బంగ్లా, 1927లో ఎస్పీ కార్యాలయం, పోస్టాఫీసు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొదటి పోస్టాఫీసుగా చెప్పుకుంటారు. ఆనాటి ఎస్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. నైజాం కాలంలో నిర్మించిన భవనంలోనే పోస్టాఫీస్ కొనసాగుతోంది. స్వాతంత్య్ర ఉద్యమం అనంతరం 1955లో సెటిల్‌మెంట్ రద్దయింది. 1957లో గ్రామ పంచాయతీగా గుర్తించారు. ఆదాయ వనరులు పెరగడంతో 1982లో మేజర్ గ్రామపంచాయతీగా ప్రభుత్వం గుర్తించింది. నేడు మండల కేంద్రంగా ఏర్పాటై అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోంది.


లింగాలలో నాలుగు వరుసల సీసీ రోడ్డు, డివైడర్, లైటింగ్


నాటి ఎస్పీ కార్యాలయమే నేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నాడే టౌన్ ప్లానింగ్..

రాత్రివేళ సైరన్ మోగితే ఆ సమయంలో అందరూ హాజరు కావాలి. హాజరు కాని వారు దొంగతనాలకు వెళ్లినట్లుగా భావించి దండించేవారు. ఇకీంసాబ్ దొంగలకు చేతినిండా పని కల్పించాడు. అదే వేపచెట్ల పెంపకం. ప్రతిఒక్కరూ ఒక వేపచెట్టు పెంచాలని ఆదేశించాడు. మొక్క చచ్చిపోయినా శిక్ష విధించేవారు. ఆనాటి కృషి ఫలితంగా నేడు లింగాలలో ఏ రోడ్డు వెంట చూసినా వేపచెట్లు దర్శనమిస్తాయి. రోడ్లు కూడా వంద ఫీట్ల వెడల్పుతో ఉన్నాయి. అలాగే లింగాల ప్రధాన రహదారిని అందంగా తీర్చిదిద్దారు. నాలుగు వరుసల సీసీరోడ్డు, రోడ్డు మధ్యలో డివైడర్, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. నాటి జైలు ఖాజాలో పార్కు, జిమ్ ఏర్పాటు చేసి ఆహ్లాద వాతావరణం నెలకొల్పారు. నేడు ఎంతోమంది ఈ పార్కును ఆస్వాదిస్తూ సేద తీరుతున్నారు.

నిర్బంధ విద్యాఫలం

పరివర్తన ప్రస్తుత తరం కంటే భవిష్యత్ తరంలోనే సులభమని నమ్మిన ఇకీంసాబ్ లింగాలలో నిర్బంధ విద్యను ప్రవేశపెట్టి వారి తలరాతలనే మార్చేసింది. పిల్లల కోసం ఒక ప్రత్యేక వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. హాస్టల్‌కు అవసరమైన కూరగాయల పెంపకం చేపట్టారు. లింగాల ప్రజలు చదువుల్లో అద్భుతంగా రాణించడంతో గత చరిత్రను తుడిచిపెట్టుకుపోయింది. లింగాలలో ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది ఉన్నారు. అధికశాతం ఎస్టీలైన ఎరుకలు ఆ తర్వాత ఎస్టీలైన లంబాడా కులస్తులు ఉన్నారు. లింగాల మేజర్ పంచాయతీలోని 14 వార్డులున్నాయి. మొత్తం జనాభా 12,522 వేలు కాగా ఇందులో పురుషులు 6,745 ఉండగా స్త్రీలు 5,777 ఉన్నారు. ఇందులో ఎస్టీలు 7,250, ఎస్సీలు 350 మంది ఉన్నారు. గ్రామ అక్షరాస్యత 74 శాతంగా ఉంది. వివిధ రంగాల్లో 500 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ఐఆర్ఎస్ పూర్తి చేసిన మోహన్‌బాబు ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తుండగా.. 50మందికి పైగా డాక్టర్లు ఉన్నారు. పోలీసు శాఖలో డీఎస్పీ మొదలుకొని సీఐ, ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లుగా పలువురు పనిచేస్తుండగా.. ఉపాధ్యాయులు, లాయర్లు, పోలీసు శాఖలో ఉన్నత ఉద్యోగాలు, బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ, అటవీ, వైద్యశాఖ ఇలా పలు శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

భాషల్లో తేడాలు..

సెటిల్‌మెంట్ కాలంలో ఈ ప్రాంతానికి తీసుకొచ్చిన ఎరుకలకు వివిధ భాషలు వచ్చేవి. కన్నడ భాషను నేటికీ మాట్లాడుతారు. ఎరుకల, లంబాడా భాషలకు లిపి లేదు. నేటికీ ఈ ప్రాంతంలోని వారికి కర్ణాటక, మహారాష్ట్రతో సంబంధాలు కొనసాగుతున్నాయి.

నిర్బంధ విద్య అమలు



నైజాం కాలంలో నిర్బంధ విద్య అమలు చేశారు. అప్పట్లో అన్నివృత్తుల వారిని ప్రోత్సహించారు. వివిధ వృత్తులను నేర్పించడంతో నేడు పలు కులాల వారు వారివారి వృత్తులను చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. నైజాం కాలంలో కట్టిన కట్టడాలు నేడు లింగాలలో కనిపిస్తుంటాయి.

– కంప నర్సింహులు, మాజీ సైనికుడు లింగాల

ఎంతో మార్పు వచ్చింది



లింగాలకు గతంలో ఉన్న చరిత్రను చెరిపి నేడు ఈ ప్రాంత ప్రజలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యావంతులు పలు రంగాల్లో రాణిస్తూ మార్పు దిశగా ప్రయాణిస్తున్నారు. ఉద్యోగ, రాజకీయ రంగాలు, రక్షణ శాఖలో పనిచేస్తూ ఉన్నత స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

– కోనేటి తిరుపతయ్య, మాజీ సర్పంచ్ లింగాల

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డాక్టర్‌నయ్యా..



లింగాలకు ఘన చరిత్ర ఉంది. కష్టపడి పరివర్తన చెంది నేడు ఘన కీర్తి చాటుతున్నాం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డాక్టర్‌నయ్యా. బీదరికంతో కష్టపడి చదివిన నాకు వైద్యవృత్తికి సార్థకత చేకూర్చడమే ప్రథమ లక్ష్యం. తిరుపతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేయడం ఆ తర్వాత నల్లమల ప్రాంతంలోని లింగాల, అంబట్‌పల్లి పీహెచ్‌సీలో మొదట వైద్యసేవలు అందిచా. అది నాకు సంతృప్తినిచ్చింది.

– డాక్టర్ సురేశ్‌బాబు, లింగాల

ఓవర్ వసూళ్లు జాప్యం

టోల్ ప్లాజాల వద్ద లారీలకు ఓవర్ లోడ్ పేరుతో అదనపు వసూళ్లు

- చెల్లింపు ప్రక్రియ ఆలస్యం
- కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు
- వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు
- రూ.లక్షల్లో ఓవర్ లోడ్ రుసుం వసూలు
- పట్టించుకోని అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న టోల్ ప్లాజా యాజమాన్యం


టంగుటూరు టోల్ ప్లాజా వద్ద నెల్లూరు వైపు నిలిచిన వాహనాలు

జాతీయ రహదారులపై రయ్..రయ్ మంటూ వెళుతున్న వాహనాదారులకు టోల్ ప్లాజాల వద్ద చుక్కలు కనిపిస్తున్నాయి. యాజమాన్యాలు తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు, నిర్లక్ష్యం ఫలితంగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఓవర్ లోడ్ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తుండడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. పలు సందర్భాల్లో టోల్ దాటాలంటే అరగంటకు పైగా సమయం పడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టంగుటూరు:

జాతీయ రహదారి–16పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ ప్లాజాల వద్ద ఎలాంటి జాప్యం జరగకుండా ఫాస్ట్ ట్యాగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద బిల్లింగ్ కేంద్రాలతో సంబంధం లేకుండా వెళ్లే సౌకర్యం ఉంది. కానీ, ఇటీవల కాలంలో కొన్ని టోల్ ప్లాజాల నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలు వాహనదారులను అవస్థలపాలుజేస్తోంది. విజయవాడ–నెల్లూరు మధ్య సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఎక్కడా లేని విధంగా వీటిల్లో పెద్ద వాహనాలకు ఓవర్ లోడ్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఓవర్ లోడ్ వసూలు చేసే సమయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పలు అంబులెన్సులు, ఎమ్మెల్యేల వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. కనీసం అంబులెన్సు ఉన్న సమయంలో కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టోల్ ప్లాజాల వద్ద ప్రతి రోజూ ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు, బస్సుల్లో కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రులకు పోయే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టోల్ ప్లాజా వద్ద వాహనం 10 సెకన్ల కంటే ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తే టోల్ చెల్లించాల్సిన అవసరం లేదని నిబంధన ఉంది. దీనిని నిర్వాహకులు పట్టించుకుంటున్న దాఖల్లాల్లేవు.

ఓవర్ లోడ్ పేరుతో ఓవరాక్షన్...

టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాల్లో ఓవర్ లోడ్ పేరుతో ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ రూ.లక్షల్లో ఓవర్ లోడ్ ఫీజు వసూలు చేస్తూ తమ ఖజానా నింపుకుంటున్నారు. వాస్తవానికి రవాణా శాఖ అధికారులు విధించాల్సిన ఓవర్ లోడ్ ఫీజు టోల్ ప్లాజాల్లో వసూలు చేస్తూ వాహనదారుల జేబుకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వంగానీ, ఇటు అధికారులుగానీ పట్టించుకోవడం లేదు.

సమయం వృథా అవుతోంది



చేప పిల్లల లోడు లారీతో నెల్లూరు వైపు వెళ్తుంటాను. టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాల యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజాలో ఓవర్ లోడ్ టన్ను ఉందంటూ ఒక్కో ప్లాజాలో అరగంట పాటు లారీ ఆపుతున్నారు. ఓవర్ లోడ్ డబ్బులు రూ.280 వసూలు చేస్తున్నారు, మళ్లీ కాటా పెడితే పాసింగు ఉందని, తిరిగి డబ్బులిస్తున్నారు. దీంతో సమయం వృథా అవుతోంది. చేప పిల్లల లోడుకు ఆక్సిజన్ ఉంటుంది. ఏదైనా తేడా పడి చేప పిల్లలు చనిపోతే రూ.లక్షల్లో నష్టం వస్తుంది. టోల్ ప్లాజాకు ఇరువైపులా ఉన్న కాటాలు తేడాగా ఉన్నాయి. అధిక లోడు చూపిస్తోంది. తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించాలి.

– వీర్ల సత్యనారాయణ, లారీ డ్రైవర్, గుడివాడ


టోల్ ప్లాజా వద్ద ఓవర్ లోడ్‌కు పెనాల్టీ చెల్లిస్తున్న కంటైనర్

వాహనదారులకు అందని సేవలు...

టోల్ ప్లాజాల్లో వాహనదారులకు సేవలందించేందుకు టోల్ ఫ్రీ నంబరు 1033 ఉంది. దానికి వాహనదారులు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించరు. టోల్ ప్లాజా పెట్రోలింగు వాహనం ఎక్కడ ఉంటుందో తెలియదు. వారి పర్యవేక్షణ కొరవడటంతో రాత్రి పూట లారీ డ్రైవర్లు రోడ్డు పక్కన పెట్టుకుని నిద్రపోతూ ఉంటారు. ఆ సమయంలో ఆయిల్ దొంగలు అదే అదునుగా చూసుకుని లారీ ట్యాంకుల్లో డీజిల్ కాజేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే జాతీయ రహదారి అంబులెన్సుల్లో ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు ఉండవు. అధికారులు ఇస్తున్నా ఆంబులెన్సు సిబ్బంది అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయాల్సిన వైద్యులు, సిబ్బంది లేరని, వాటిని అలంకార ప్రాయంగా సింగరాయకొండలోని కలికవాయి వద్ద ఉంచుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.


సింగరాయకొండ వద్ద అలంకారప్రాయంగా ఉన్న జాతీయ రహదారి అంబులెన్సు


ప్రతిరోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్...

టోల్ ప్లాజా యాజమాన్యం ఓవర్ లోడ్ పేరుతో నగదు వసూళ్లు చేస్తుండటంతో ప్రతిరోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ తీరు ఒక రోజు అర రోజు కాదు.. నిత్యం కొనసాగుతోంది. ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న వాహనదారుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రతిరోజూ వాహనదారులు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తుండటంతో వారు వచ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేస్తున్నారు. అది కూడా కొంత సమయమే. మళ్లీ పరిస్థితి మొదటికొస్తోంది.


ఒంగోలు వైపు భారీగా నిలిచిన వాహనాలు

సోమశిలలో పుష్పరాజ్‌లు

- నందలూరులో ఎర్రచందనం స్మగ్లర్లు
- యథేచ్ఛగా దుంగల అక్రమ రవాణా
- చిత్తూరులో పట్టుబడిన స్మగ్లర్..
- తీగ లాగితే కదిలిన డొంక
- పోలీసులు అదుపులో కొందరు, మరికొందరి కోసం గాలింపు


సోమశిల బ్యాక్‌వాటర్ వెంబడి ఎర్రచందనం చెట్లు ఉన్న ప్రాంతం

రాజంపేట: సోమశిల బ్యాక్‌వాటర్ ప్రాంతాలు పుష్పాలకు నిలయంగా మారాయి. తాజాగా పోలీసులు పట్టుకున్న స్మగ్లర్లు అన్నమయ్య జిల్లాలోని నందలూరు మండలానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఏడాది మే 12న ఎర్రచందనం స్మగ్లింగ్‌లో తగ్గేదేలా శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఇప్పుడు ఈ కథనం నిజమనడానికి పోలీసుల అదుపులో ఉన్న పుష్పరాజ్‌లే నిదర్శనమని సోమశిల ముంపువాసులు చెబుతున్నారు.

తీగలాగితే.. తీగలాగితే డొంక కదిలినట్లు చిత్తూరు జిల్లా పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన ఓ స్మగ్లర్ ఇచ్చిన సమాచారం మేరకు నందలూరులోని కొమ్మూరు, కోనాపురం, ఈదరపల్లె, నందలూరు, చాపలవారిపల్లె, చుక్కాయపల్లె, చింతకాయలపల్లె తదితర గ్రామాలకు చెందిన కొంతమంది ముఠాలుగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ పాల్పడుతున్నారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇందులో టీడీపీకి చెందిన ఓ స్థానిక సంస్థ ప్రజాప్రతినిధితోపాటు ఆపార్టీ సానుభూతిపరులు ఉన్నారని తెలుస్తోంది. స్మగ్లర్ల ఫోన్‌ల ద్వారా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో విచారణ జరుగుతోంది. ఒక సామాజిక వర్గానికి చెందిన వారే స్మగ్లర్లుగా ఉన్నారనే సమాచారంతో, ఆ సామాజిక వర్గానికి చెందిన కొందరు పెదవి విరుస్తున్నారు.

- రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన ఓ స్మగ్లర్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు. అతనికి దాదాపు రూ.3కోట్ల పైగా ఆస్తి ఉంది. ఈ విధంగా నందలూరు మండలంలోని ముంపుగ్రామాలకు చెందిన వారు ఎర్రచందనంతో రూ. కోట్లు సంపాదించి, ఇతర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, ఇళ్లు, భూములును కొనుగోలు చేసి, స్థానికంగా మాసిపోయిన పంచలు, చొక్కాలతో కనిపిస్తున్నారు.

తిరుపతి, రేణిగుంటల్లో..

ఎర్రచందనం స్మగ్లింగ్‌తో ముంపుగ్రామాలకు చెందిన కొందరు తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినట్లు, విలాసవంతమైన జీవితాలను గుడుపుతుండటం గమనార్హం. నందలూరులో ఎర్రచందన స్మగ్లర్ల తాకిడి అధికం కావడానికి సోమశిల బ్యాక్‌వాటర్ కారణంగా చెప్పవచ్చు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడే కీ పర్సన్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

గుట్టుచప్పుడుగా.. బ్యాక్ వాటర్‌లో..

సోమశిల బ్యాక్‌వాటర్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ గుట్టుచప్పుడుగా కొనసాగుతోంది. అటవీశాఖ డీఎఫ్‌ఓగా శ్రీనివాసులరెడ్డి ఉన్నపుడు బ్యాక్‌వాటర్‌లో దాచిపెట్టిన ఎర్రదుంగలడంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్టవేశారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడంలేదు. సోమశిల ముంపు గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు చెందిన కొందరితో స్మగ్లింగ్ మళ్లీ యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా అటవీశాఖ చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.

చేపలవేట ముసుగులో...

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేపల వేట ముసుగులో ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోంది. ముంపు గ్రామాలకు చెందిన ఇద్దరిని ఇటీవల ఇతర ప్రాంతంలో పట్టుకొని కేసు కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది. అటవీ చెక్‌పోస్టులు ఉన్నా.. నామమాత్రమే అన్న విమర్శలు వెలువడుతున్నాయి.

ఐలాండ్‌గా పల్లాగట్టు ..

పల్లాగట్టు ప్రాంతం 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వెలుగులోకి రాని ఈ ఐలాండ్‌లో చట్టవ్యతిరేక కార్యకలపాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లర్లు పల్లాగట్టును తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలు న్నాయి. గుండ్లమాడతోపాటు సోమశిల వెనుకజలాల వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి అక్రమరవాణాకు బ్యాక్‌వాటర్‌ను అడ్డాగా వాడుకుంటున్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో బ్యాక్‌వాటర్ ద్వారానే బాలెలో తరలించి పొత్తపి ద్వారా ఓబలికి తరలిస్తున్నారు.

ఈజీ మనీ కోసం..

ఈజీ మనీ కోసం కోనాపురం, కొమ్మూరు, చాపలవారిపల్లె, చుక్కాయపల్లె, ఈదరపల్లె, నందలూరు, చింతకాయపల్లె తదితర గ్రామాల యువకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అలవాటుపడుతున్నారు. జనజీవనం లేని ముంపు గ్రామాల్లో అర్ధరాత్రి వేళలో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. నేరుగా బ్యాక్‌వాటర్ ఉన్న ప్రాంతాల వద్దకు చేరుకొని, అక్కడి నుంచి అక్రమరవాణా మొదలవుతుంది. అటవీశాఖ పట్టించుకోకపోవడం వల్లనే ఇటీవల ఎర్రచందనం స్మగ్లర్లు అధికమయ్యారు.



జనసంచారంలేని ప్రాంతాలే టార్గెట్..

అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికి వాటిని జనసంచారం లేని ముంపు గ్రామాల శివార్లకు చేర్చి, అక్కడి నుంచి అనుమానం రాకుండా అనుకున్న గమ్యాలకు తరలించేస్తున్నారు. గుట్టుచప్పుడుగా సాగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారం గురించి ముంపుగ్రామాల్లో ఏ ఒక్కరిని కదిలించినా చెబుతారు. పల్లాగట్టు, గుండ్లమడలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి వాటిని నాటుబోట్లలో గట్టుకు చేర్చి అక్రమంగా మెయిన్‌రోడ్డుకు ఎక్కిస్తున్నారు.

యువత గం'జాయ్'



జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

- మారుమూల ప్రాంతాల్లోనూ లభిస్తున్న సరుకు
- పెన్నులు, చాక్లెట్ల రూపంలో అమ్మకాలు
- నిత్యం మత్తులో తూగుతున్న యువత
- ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో అఘాయిత్యాలు
- గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారిలో యువకులే అధికం

పుట్టపర్తి శివారు ప్రాంతాల్లో చీకటి పడగానే యువత ఓ చోటకు చేరుతున్నారు. గంజాయిని గుప్పగుప్పమంటూ పీలుస్తూ మత్తులో తూలిపోతున్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంతో పాటు సాయినగర్‌లో విచ్చలవిడిగా గంజాయి వినియోగిస్తున్నట్లు తెలిసింది. చిత్రావతి రోడ్డులోని చాలామంది యువత గంజాయికి బానిసలైనట్లు సమాచారం. ఇక హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లోనూ గంజాయి మత్తుకు చాలామంది బానిసలయ్యారు.

సాక్షి, పుట్టపర్తి

శ్రీ సత్యసాయి జిల్లా యువత 'దమ్మారో దమ్' అంటూ గంజాయి మత్తులో తూలుతోంది. ఇన్నాళ్లూ పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గంజాయి.. ఇప్పుడు పల్లెలకూ పాకింది. దీంతో గంజాయి విక్రయిస్తున్న.. వినియోగిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గుడి, బడి తేడా లేకుండా అన్ని చోట్ల గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని ఈ ఏడాది ఆగస్టు 22న అదుపులోకి తీసుకున్న కదిరి పోలీసులు (10 కిలోల గంజాయి, మూడు బైక్‌ల స్వాధీనం)

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి..

గంజాయి ఎక్కువగా ఒరిసా, కర్ణాటక నుంచి జిల్లాకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గంజాయి.. తొలుత పెనుకొండ చేరుకుంటుంది. అక్కడక్కడా నిల్వ చేసి చాక్లెట్లు, పెన్నుల్లో నింపి విక్రయిస్తున్నారు. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో కొనేవారు కూడా రూ.100 చెల్లిస్తే రోజుకు కావాల్సినంత మత్తు వచ్చే గంజాయి లభిస్తోంది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని బడాబాబుల అండదండలతో కొందరు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఎక్కడ పడితే అక్కడ గంజాయి దొరుకుతుండటంతో యువత, విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది.

మత్తులో నేరాలకు పాల్పడుతూ..

గంజాయి అలవాటు పడిన వారు రోజూ సాయంత్రం కాగానే సరుకు గురించి ఆరా తీస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల సమాచారం ఆధారంగా గంజాయి దొరికే ప్రాంతానికి వెళ్లి మత్తులో మునిగిపోతున్నారు. అయితే గంజాయి విక్రేతలు రోజుకో ప్రాంతాన్ని ఎంపిక చేయడం... అంతదూరం వెళ్లి గంజాయి తాగిన వారు తిరిగి వచ్చే సమయంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కొందరైతే హత్యలకూ వెనుకాడటం లేదు. ఇటీవల పుట్టపర్తి మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లిలో ఓ హత్య కేసులోని నిందితులు ఘటన సమయంలో గంజాయి మత్తులో ఉన్నట్లు తెలిసింది. ఇక చిత్రావతి రోడ్డులో ఓ విదేశీయుడు గంజాయి మత్తులో భవనం పైనుంచి పడి చనిపోయిన ఘటన నెల క్రితం వెలుగు చూసింది. ఇక గతేడాది విజయదశమి రోజున చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి వద్ద అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం చేసిన వారందరూ గంజాయి మత్తులో ఉన్నట్లు తెలిసింది. వారిపై గతంలోనూ గంజాయి కేసులున్నాయి.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు



గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. గంజాయి విక్రేతలు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు. యువత కూడా మత్తుకు దూరంగా ఉండాలి. భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. దాడులు చేసి నిందితులను పట్టుకుంటాం.

– సతీశ్‌కుమార్, ఎస్పీ

హైదరాబాద్‌లో షూటింగ్స్ సందడి

కొందరు సెట్స్‌లో... కొందరు నేచురల్ లొకేషన్స్‌లో... ఇలా హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తూ ఈ వారం అంతా బిజీ బిజీగా గడిపారు కొందరు స్టార్స్. ఆదివారం, దీపావళికి సోమవారం బ్రేక్ తీసుకోనున్న స్టార్స్ కొందరైతే... హాలిడే లేకుండా షూట్‌లో పాల్గొననున్న స్టార్స్ కూడా ఉన్నారు. ఇక గత ఆరేడు రోజులుగా హైదరాబాద్‌లో ఏయే సినిమాల షూటింగ్స్ జరి గాయో తెలుసుకుందాం.


చిరంజీవి


మహేశ్ బాబు


పవన్ కల్యాణ్


అఖిల్ · నాగచైతన్య · రామ్


నాని


విజయ్ సేతుపతి

సెట్‌లో శంకరవరప్రసాద్...

చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండక్కి వస్తున్నారు' అనేది ఉపశీర్షిక. వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' (2025) వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఈ మూవీలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'సైరా: నరసింహారెడ్డి' చిత్రం తర్వాత చిరంజీవి, నయనతార జోడీగా కలిసి నటిస్తున్న సినిమా ఇది. అయితే 'గాడ్‌ఫాదర్' సినిమాలో చిరంజీవికి చెల్లెలుగా నయనతార నటించిన సంగతి తెలిసిందే. 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రంలో హీరో వెంకటేశ్, హీరోయిన్ కేథరిన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం కీలక షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. అన్నపూర్ణ సెవన్ ఎకర్స్ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో చిరంజీవి, నయనతార, కేథరిన్, నటుడు సచిన్ ఖేడేకర్‌లతో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు అనిల్ రావిపూడి. చాలా గ్యాప్ తర్వాత చిరంజీవి నటిస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఇది. ఈ మూవీలో చిరంజీవి-నయనతార భార్యాభర్తలుగా నటిస్తు న్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వం వహించిన 'విశ్వంభర' సినిమా 2026 వేసవిలో రిలీజ్ కానుంది.

ఆర్‌ఎఫ్‌సీలో అడ్వెంచర్

మహేశ్‌బాబు హీరోగా అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్). రామ్‌చరణ్, ఎన్టీఆర్‌లతో 'ఆర్ఆర్ఆర్' (2022) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రధారులు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం మహేశ్ బాబు పొడవాటి హెయిర్ స్టైల్, గెడ్డంతో ప్రత్యేకంగా మేకోవర్ అయిన సంగతి తెలిసిందే. ఆయన లుక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నుంచి ఇప్పటివరకూ మహేశ్‌బాబుకి సంబంధించిన ఎలాంటి లుక్ అధికారికంగా చిత్రయూనిట్ విడుదల చేయలేదు. అయితే చిత్రీకరణ సమయంలోని కొన్ని ఫొటోలు లీక్ అయిన సంగతి తెలిసిందే. అమేజాన్ అడవుల నేపథ్యంలో భారీ అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఈ మూవీ కోసం ప్రత్యేకంగా వేసిన సెట్‌లో మహేశ్ బాబుతో పాటు ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారట రాజమౌళి. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా ఇండస్ట్రీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రాన్ని దాదాపు రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో పాన్ వరల్డ్ రేంజ్‌లో నిర్మిస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటివరకు ఏ భారతీయ సినిమాకీ లభించని ఘనత 'ఎస్ఎస్ఎమ్‌బీ 29'కి దక్కనుందని టాక్. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత కెన్యా దేశంలో ఈ సినిమా చిత్రీకరణని ప్లాన్ చేశారు రాజమౌళి. ఇప్పటికే ఆయన అక్కడి లొకేషన్స్‌ని కూడా పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించిన మొదటి బిగ్ రివీల్ ఈ నవంబరులో రానుండటంతో అందరిలో ఎంతో క్యూరియాసిటీ నెలకొంది.

యాక్షన్ ఎంటర్‌టైనర్...

పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' (2012) తర్వాత హీరో పవన్ కల్యాణ్-డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రమిది. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్ గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సీన్స్‌ని తెరకెక్కిస్తున్నారట హరీష్ శంకర్. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా దాదాపు పూర్తి కావొచ్చిందట. నవంబరు చివరికల్లా చిత్రీకరణ మొత్తం పూర్తవుతుందని ఫిల్మ్‌నగర్ టాక్.

హిట్ కాంబినేషన్‌లో...

హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరిలది హిట్ కాంబినేషన్ అని చెప్పొచ్చు. వీరి ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' (2023) మూవీ బ్లాక్‌బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ హిట్ కాంబోలో వస్తున్న ద్వితీయ చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. ఈ మూవీ కోసం వేసిన ప్రత్యేకమైన సెట్స్‌లో చిత్రీకరిస్తున్నారు. నానితో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోందట. ఈ చిత్రంలో నాని పాత్ర పేరు జడల్. గతంలో విడుదల చేసిన స్టిల్‌లో నాని రెండు జడలు వేసుకుని, పక్కా మాస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. హీరో లుక్, స్టోరీ, టేకింగ్... ఇలా ప్రతిదీ వైవిధ్యంగా ఉండేలా తెరకెక్కిస్తున్నారట శ్రీకాంత్. 'దసరా' వంటి హిట్ కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' పై ఇండస్ట్రీలో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో 2026 మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ఇప్పటికే ప్రకటించింది.

ఓ వీరాభిమాని కథ

రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో 'మిస్టర్ బచ్చన్, కింగ్‌డమ్' చిత్రాల ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇటీవల రామోజీ ఫిల్మ్ సిటీలోని రైల్వేస్టేషన్‌లో హీరో రామ్‌పై కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు మహేశ్‌బాబు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. రామ్‌తో పాటు ఇతర ప్రధాన తారాగణంపై పలు సన్నివేశాలను తీస్తున్నారట దర్శకుడు. ఈ సినిమాలో ఉపేంద్ర ఓ స్టార్ హీరోగా నటిస్తుండగా ఆయన వీరాభిమాని పాత్రలో రామ్ పోతినేని నటిస్తున్నారు. తన అభిమాన హీరో కోసం ఈ వీరాభిమాని ఏం చేశాడు? అన్నది తెలియాలంటే నవంబరు 28 వరకు వేచి ఉండాలి. ఈ చిత్రం అదే రోజు విడుదల కానుంది.

అల్యూమినియం ఫ్యాక్టరీలో...

హీరో నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్సీ 24' (వర్కింగ్ టైటిల్). 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు తొలి సారి వంద కోట్ల క్లబ్‌లో చేరారాయన. 'తండేల్' వంటి హిట్ మూవీ తర్వాత 'విరూపాక్ష' (2023) మూవీ ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో నాగచైతన్య నటిస్తున్న 'ఎన్సీ 24' చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. నాగచైతన్య, మీనాక్షీ చౌదరితో పాటు ఇతర నటీనటులు ఈ చిత్రీకరణలో పాల్గొంటున్నారట. 'తండేల్'లో ఫుల్ మాస్ లుక్‌లో కనిపించిన నాగచైతన్య 'ఎన్సీ 24'లో స్టైలిష్‌గా సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. అదే విధంగా మీనాక్షీ చౌదరి కూడా సరికొత్త పాత్రలో కనిపిస్తారు.

రాయలసీమ నేపథ్యంలో...

అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. కిరణ్ అబ్బవరం హీరోగా 'వినరో భాగ్యము విష్ణుకథ' వంటి విజయవంతమైన సినిమా తెరకెక్కించిన మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ 'లెనిన్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని బూత్ బంగ్లాలో జరుగుతోంది. అఖిల్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు మురళీ కిశోర్. రాయలసీమ నేపథ్యంలో సాగే రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా కోసం పొడవాటి హెయిర్, గెడ్డంతో మాస్ లుక్‌లోకి మారిపోయారు అఖిల్. ఈ సినిమాలో తొలుత శ్రీలీల హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. అయితే ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. శ్రీలీల స్థానాన్ని 'మిస్టర్ బచ్చన్, కింగ్‌డమ్' సినిమాల ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే రీప్లేస్ చేశారట. అయితే హీరోయిన్ విషయంపై అధికారిక ప్రకటన చేయలేదు మేకర్స్.

యాక్షన్... ఎమోషన్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'పూరిసేతుపతి' (వర్కింగ్ టైటిల్) అనే పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. టబు, విజయ్ కుమార్, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జేబీ నారాయణ రావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్ గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. విజయ్ సేతుపతి, సంయుక్త, టబు, విజయ్‌కుమార్, బ్రహ్మాజీలతో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట పూరి జగన్నాథ్. తనదైన మాస్, కమర్షియల్ స్టయిల్‌లో ఒక యునిక్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారట పూరి. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ముచ్చింతల్‌లో మహాకాళి

'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హను-మాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో 12 సూపర్ హీరోస్ సినిమాలను తెరకెక్కించనున్నట్లు గతంలో ప్రకటించారు ప్రశాంత్ వర్మ. అందులో భాగంగా ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. అమ్మవారి చుట్టూ అల్లుకున్న కథతో బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. నటీనటుల వివరాలను మేకర్స్ ఇప్పటివరకూ అధికారికంగా ప్రకటించలేదు. అయితే అసురుల గురువు శుక్రాచార్యుడిగా బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నట్లు ప్రకటించి, ఆయన ఫస్ట్ లుక్‌ని మాత్రం ఇటీవల రిలీజ్ చేశారు మేకర్స్. ఇదిలా ఉంటే.. 'మహాకాళి' సినిమా షూటింగ్ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. నటీనటులపై కీలక సన్నివేశాలు తీస్తున్నారు మేకర్స్. డిసెంబరు నెలాఖరుకి ఈ సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది.



పైన పేర్కొన్న సినిమాలే కాదు... మరి కొన్ని చిత్రాలు కూడా ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్నాయి.

- డేరంగుల జగన్ మోహన్

ఎమోషనల్‌గా కనెక్ట్ కావడమే స్టార్‌డమ్

- షారుక్ ఖాన్

"స్టార్ అనే ట్యాగ్ మాకు నచ్చదు. మా ఇంట్లో మేం అందరిలానే ఉంటాం. మాతో కలిసి పని చేసిన దర్శకులు, రచయితలు, నిర్మాతలు, ప్రేక్షకుల ఆదరణ వల్లే ప్రస్తుతం మేం ఈ స్థాయిలో ఉన్నాం" అని సల్మాన్ ఖాన్ అన్నారు. సౌదీ అరేబియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్, షారుక్ ఖాన్ పాల్గొని, సందడి చేశారు. ఈ వేడుకలో ఈ ఖాన్ త్రయం వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను షేర్ చేసుకున్నారు. "నాకు, ఆమిర్ ఖాన్‌కు సినీ నేపథ్యం ఉంది. కానీ షారుక్ మాత్రం ఢిల్లీ నుంచి వచ్చి, ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ప్రతిభతోనే ఇండస్ట్రీలో ఎదిగాడు" అని సల్మాన్ మాట్లాడగా, ఇదే విషయంపై షారుక్ స్పందించారు. "సల్మాన్, ఆమిర్‌ల కుటుంబ సభ్యుడిగా నన్ను నేను భావిస్తాను. ఈ విధంగా నాకు ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నట్లే" అని షారుక్ చెప్పారు. అలాగే అభిమానులతో ఎమోషనల్‌గా కనెక్ట్ కావడమే స్టార్‌డమ్ అని కూడా షారుక్ తెలిపారు.

అది సాధ్యమే: సల్మాన్ ఖాన్

షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్ సిరీస్‌లో సల్మాన్, ఆమిర్, షారుక్ ఖాన్ గెస్ట్ రోల్స్ చేశారు. మంచి కథ కుదిరితే ఆమిర్, షారుక్‌లతో కలిసి సినిమా చేయడానికి తాను రెడీ అని సల్మాన్ చెప్పారు. కానీ మా ముగ్గుర్నీ భరించడం మేకర్స్‌కి సులభం కాదని సరదాగా అన్నారు సల్మాన్ ఖాన్.


సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్, షారుక్ ఖాన్

డేట్ ఫిక్స్


'పతీ పత్నీ ఔర్ వో దో'లో....


రకుల్ ప్రీత్ సింగ్

ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'పతీ పత్నీ ఔర్ వో దో'. ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించారు. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, రేణు రవి చోప్రా నిర్మించారు. కాగా, ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 4న విడుదల చేయనున్నట్లుగా శనివారం మేకర్స్ ప్రకటించారు. ఫ్యామిలీ డ్రామా, కామెడీ, ఓ సస్పెన్స్ ఎలిమెంట్‌తో రూపొందిన సినిమా ఇది. ఈ సినిమాలో రకుల్‌ప్రీత్ సింగ్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పాత్రలో రకుల్ కనిపిస్తారని బాలీవుడ్ టాక్. ఇక కార్తీక్ ఆర్యన్ హీరోగా, భూమి ఫడ్నేకర్, అనన్య పాండే హీరోయిన్లుగా నటించిన సక్సెస్‌ఫుల్ మూవీ 'పతీ పత్నీ ఔర్ వో' (2019) సినిమాకు సీక్వెల్‌గా 'పతీ పత్నీ ఔర్ వో దో' చిత్రం రూపొందిన సంగతి తెలిసిందే.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ. 19,611 కోట్లు



- క్యూ2లో 10 శాతం అప్
- మెరుగుపడిన ఎన్‌పీఏల నిష్పత్తి

ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సానుకూల ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గత క్యూ2తో పోలిస్తే బ్యాంకు నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సుమారు 10 శాతం పైగా పెరిగి రూ. 19,611 కోట్లకు చేరింది. స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం సుమారు 11 శాతం పెరిగి రూ. 18,641 కోట్లుగా నమోదైంది. ఇక రుణాల్లో 10 శాతం వృద్ధి దన్నుతో నికర వడ్డీ ఆదాయం 4.8 శాతం ఎగిసి రూ. 31,550 కోట్లకు చేరింది. అయితే, నికర వడ్డీ మార్జిన్ (నిమ్) మాత్రం 3.5 శాతం నుంచి 3.27 శాతానికి నెమ్మదించింది. రాబోయే ఒకటి రెండేళ్లలో ఇది స్థిరంగా కొనసాగవచ్చని, లేదా మరింతగా పెరగొచ్చని బ్యాంకు తెలిపింది. సమీక్షాకాలంలో వడ్డీయేతర ఆదాయం 25 శాతం పెరిగి రూ. 21,730 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.36 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గింది.

లక్ష్యాల వైపు ముందుకు..

క్రెడిట్–డిపాజిట్ నిష్పత్తిని 96 శాతానికి పరిమితం చేసుకోవడం, రుణ వృద్ధిని మెరుగుపర్చుకోవడం లాంటి గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా ముందుకు వెళ్తున్నట్లు బ్యాంకు ఎండీ శశిధర్ జగదీశన్ తెలిపారు. 2027 ఆర్థిక సంవత్సరం నుంచి బ్యాంకింగ్ వ్యవస్థకు మించి రుణ వృద్ధి సాధించగలమని, మార్కెట్ వాటాను పెంచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జీఎస్‌టీ క్రమబద్ధీకరణ, ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు, ఆర్‌బీఐ రేట్ల కోత తదితర పాలసీలపరమైన అంశాల దన్నుతో క్షేత్ర స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడుతున్నాయని, దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వ్యాపార వృద్ధికి గణనీయంగా అవకాశాలు లభించగలవని జగదీశన్ తెలిపారు. కంపెనీల కొనుగోళ్ల లావాదేవీలకు నిధులు సమకూర్చేలా (ఎక్విజిషన్ ఫైనాన్స్) బ్యాంకులకు అనుమతి లభించడం ఇటు బ్యాంకర్లకు, అటు రుణగ్రహీతలకు మేలు చేసే విషయమని సీఈవో శ్రీనివాసన్ వైద్యనాథన్ తెలిపారు. దీనితో కార్పొరేట్లకు లావాదేవీల వ్యయాల భారం తగ్గుతుందన్నారు. తాము కూడా ఎక్విజిషన్ ఫైనాన్స్ కార్యకలాపాలు చేపట్టే దిశగా తుది మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నామని వైద్యనాథన్ వివరించారు. ఉద్యోగాలపై జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం ఉంటుందని భావించడం లేదని ఆయన చెప్పారు. కొత్త టెక్నాలజీల రాకతో కొందరు సిబ్బంది బ్యాక్ ఎండ్ నుంచి ఫ్రంట్ ఎండ్‌కి మారొచ్చని తెలిపారు. జనరేటివ్ ఏఐ సహా వివిధ టెక్నాలజీలపై బ్యాంకు అంతర్గతంగా కొన్ని ప్రయోగాలు చేస్తోందన్నారు.

మరిన్ని విశేషాంశాలు..

- సమీక్షాకాలంలో బ్యాంక్ స్థూల స్లిపేజీలు రూ. 7,400 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో రూ. 1,100 కోట్లు వ్యవసాయ రుణాలున్నాయి.
- మొత్తం ప్రొవిజన్లు రూ. 2,700 కోట్ల నుంచి రూ. 3,500 కోట్లకు పెరిగాయి. అయితే, అంతకు ముందు త్రైమాసికంలో నమోదైన రూ. 14,441 కోట్లతో పోలిస్తే తగ్గాయి.
- రిటైల్ రుణాలు 7.4 శాతం పెరిగాయి. స్మాల్, మిడ్ మార్కెట్ సంస్థలకు రుణాలు 17 శాతం, కార్పొరేట్..హోల్‌సేల్ రుణాలు 6.4 శాతం పెరిగాయి.
- వడ్డీయేతర ఆదాయం 25 శాతం పెరిగి రూ. 21,730 కోట్లకు చేరింది. నిర్వహణ వ్యయాలు 6.4 శాతం పెరిగి రూ. 17,980 కోట్లుగా నమోదయ్యాయి.

బిజినెస్ రీల్

ఇక్సిగోలో ప్రోజస్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: గ్లోబల్ టెక్నాలజీ ఇన్వెస్టర్ ప్రోజస్ తాజాగా ట్రావెల్ అగ్రిగేటర్ లే ట్రావెన్యూస్ టెక్నాలజీలో ఇన్వెస్ట్ చేయనుంది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా ప్రోజస్‌కు 10.1 శాతం వాటా విక్రయించనున్నట్లు ఇక్సిగో బ్రాండ్ కంపెనీ పేర్కొంది. దాదాపు రూ. 1,296 కోట్లకు 4,62,70,092 షేర్లు జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ తదుపరి ఇవి చెల్లించిన వాటా మూలధనంలో 10.1 శాతం వాటాకు సమానమని తెలియజేసింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా ప్రోజస్ సంస్థ ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీకి ఒక్కో షేరుకీ రూ. 280 ధరలో ప్రతిపాదిత ఈక్విటీని కేటాయించనున్నట్లు వెల్లడించింది. గత 10 రోజుల సగటు ధరతో పోలిస్తే ఇది స్వల్ప ప్రీమియంకాగా.. ఇందుకు బోర్డు అనుమతించినట్లు ఇక్సిగో తెలియజేసింది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ ఆదాయం రూ. 601 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో ఏజీఐ గ్రీన్‌ప్యాక్ ఆదాయం రూ. 599 కోట్ల నుంచి రూ. రూ. 601 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో లాభం రూ. 72 కోట్ల నుంచి రూ. 76 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 515 కోట్ల నుంచి రూ. 505 కోట్లకు తగ్గాయి.

గోద్రేజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో సెంట్రల్ బ్యాంక్ జట్టు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గోద్రేజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో కో లెండింగ్ (80:20 నిష్పత్తిలో) భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇరు సంస్థలు కలసి ఉమ్మడిగా రుణాలు ఇవ్వనున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికానికి బలమైన పనితీరు నమోదు చేసింది. బ్యాంకుల రుణ ఆస్తుల నాణ్యత కూడా బలపడింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 33 శాతం వృద్ధితో రూ.1,213 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో బ్యాంక్ ఆర్జించిన లాభం రూ.913 కోట్లుగానే ఉంది. బ్యాంక్ మొత్తం వ్యాపారం విలువ సెప్టెంబర్ చివరికి 14 శాతానికి పైగా పెరిగి రూ.7.38 లక్షల కోట్లకు చేరింది. బ్యాంక్ మొత్తం రుణాల్లో వసూలు కాని స్థూల మొండి బాకీలు (ఎన్‌పీఏలు) క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 4.59% నుంచి 3.01 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు (కేటాయింపుల అనంతరం) సైతం ఇదే కాలంలో 0.69% నుంచి 0.48 శాతానికి దిగొచ్చాయి. క్యాపిటల్ అడెక్వసీ రేషియో 17.34 శాతంగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-10-2025

విశాఖ	545-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

ఆర్‌బీఎల్ బ్యాంకులో ఎన్‌బీడీకి మెజారిటీ వాటాలు

- రూ. 26,853 కోట్లతో 60 శాతం కొనుగోలు ప్రతిపాదన
- ఆర్థిక రంగంలోనే భారీ ఎఫ్‌డీఐ డీల్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంకులో మెజారిటీ 60 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు యూఏఈకి చెందిన ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ ప్రతిపాదించింది. ఇందుకోసం రూ. 26,853 కోట్లు ఆఫర్ చేసింది. విలువపరంగా దేశీ ఆర్థిక రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి సంబంధించి ఇది అత్యంత భారీ డీల్ కానుంది. ఇటీవలే జపాన్‌కి చెందిన ఎస్ఎంబీసీ మరో దేశీ ప్రైవేట్ బ్యాంక్ యస్ బ్యాంకులో 24.9 శాతం వాటాలను రూ. 16,333 కోట్లతో కొనుగోలు చేసిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆమోదించిన సందర్భంగా ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ నుంచి రూ. 26,853 కోట్ల సమీకరణకు కూడా తమ బోర్డు ఆమోదముద్ర వేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఆర్‌బీఎల్ బ్యాంకు తెలిపింది. ఈ డీల్‌తో రెండు బ్యాంకుల భాగస్వాములకు ప్రయోజనం చేకూరగలదని ఆర్‌బీఎల్ బ్యాంక్ ఎండీ ఆర్ సుబ్రమణియకుమార్ తెలిపారు.

ప్రిఫరెన్షియల్ ఇష్యూ ..

ఒక్కొక్కటి రూ. 10 ముఖ విలువ చేసే 95.90 కోట్ల వరకు ఈక్విటీ షేర్లను రూ. 228 రేటు చొప్పున ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంకునకు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన కేటాయించేందుకు బోర్డు ఆమోదించింది. ఇది 60 శాతం వాటాకు సమానం. ప్రిఫరెన్షియల్ ఇష్యూ అనంతరం ఆర్‌బీఎల్ బ్యాంకుపై ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్‌నకు నియంత్రణ లభిస్తుంది. అటుపైన దాన్ని ప్రమోటరుగా వ్యవహరిస్తారు. ఆర్‌బీఎల్ బ్యాంకును విదేశీ బ్యాంక్ అనుబంధ సంస్థగా వర్గీకరిస్తారు. ప్రిఫరెన్షియల్ ఇష్యూ కారణంగా ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఆర్‌బీఎల్ బ్యాంక్ షేర్‌హోల్డర్లకు ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి వస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంకు నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 223 కోట్ల నుంచి రూ. 179 కోట్లకు క్షీణించింది.

జీఎస్‌టీ ప్రయోజనాల పూర్తి బదలాయింపు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: ధరల తగ్గింపు రూపంలో వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) రేట్ల కోత ప్రయోజనాలు వినియోగదారులకు పూర్తిగా బదిలీ అవు తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రోజువారీ వినియోగించే 54 ఉత్పత్తుల ధరలను ప్రభుత్వం సమీక్షిస్తోందని జీఎస్‌టీ బచత్ ఉత్సవ్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె చెప్పారు. వీటి వివరాలను ఎప్పటికప్పుడు జోనల్ ఏరియాల నుంచి తెప్పించుకుంటున్నామని మంత్రి వివరించారు. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్‌టీ రేట్లను నిర్దిష్టంగా 2 శ్లాబుల కింద (5%, 18%, అల్ట్రా లగ్జరీ ఉత్పత్తులపై ప్రత్యేకంగా 40% రేటు) సవరించిన సంగతి తెలిసిందే. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో కొనుగోళ్లు పెరిగాయని ఆమె పేర్కొన్నారు. షాంపూ, పౌడరు, ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిపై రేట్లు తగ్గాయని వివరించారు. జీఎస్‌టీ రేట్ల కోతకు తగ్గట్లుగా ధరలు తగ్గించలేదంటూ వినియోగదారుల వ్యవహారాల విభాగానికి 3,169 ఫిర్యాదులు రాగా 3,075 ఫిర్యాదులు నోడల్ ఆఫీసర్లకు బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

రెండు నెలల్లో సింగిల్ డిజిట్‌కి లాజిస్టిక్స్ వ్యయాలు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: ఎక్స్‌ప్రెస్‌వేలు, ఆర్థిక కారిడార్‌లను వేగవంతంగా విస్తరించిన నేపథ్యంలో దేశీయంగా లాజిస్టిక్స్ వ్యయాలు వచ్చే రెండు నెలల్లో సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గుతాయని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటికే ఇది 16 శాతం నుంచి 10 శాతానికి తగ్గినట్లు ఐఐటీ చెన్నై, ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు రూపొందించిన నివేదికలో వెల్లడైందని పేర్కొన్నారు. డిసెంబర్ కల్లా ఇది 9 శాతానికి దిగి వస్తుందని అసోచాం వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయాలు తగ్గడం వల్ల అంతర్జాతీయంగా మన ఎగుమతిదారులు మరింతగా పోటీపడేందుకు వీలవుతుందన్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల్లో లాజిస్టిక్స్ వ్యయాలు 12 శాతంగా ఉండగా, చైనాలో 8–10 శాతంగా ఉన్నాయని మంత్రి చెప్పారు.




మరోవైపు, వచ్చే అయిదేళ్లలో భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దాలని నిర్దేశించుకున్నట్లు ఆయన తెలిపారు. తాను రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ రూ. 14 లక్షల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం రూ. 22 లక్షల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. పరిశ్రమ 4 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తోందని, కేంద్ర..రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధికంగా జీఎస్‌టీ కడుతోందని గడ్కరీ చెప్పారు. ప్రస్తుతం అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ రూ. 78 లక్షలకోట్లుగా, చైనా మార్కెట్ రూ. 47 లక్షల కోట్లుగా తొలి రెండు స్థానాల్లో ఉండగా, భారత్ మూడో స్థానంలో ఉంది. శిలాజ ఇంధనాల దిగుమతులపై భారత్ ఏటా రూ. 22 లక్షల కోట్లు వెచ్చించాల్సి వస్తోందని, దేశం పురోగమించాలంటే వీటికి ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధనాలను వినియోగించడం కీలకమని మంత్రి తెలిపారు.

అల్ట్రాటెక్ రూ. 10,255 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 22.8 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) మేర పెంచుకునే దిశగా రూ. 10,255 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ వెల్లడించింది. ఈ పెట్టుబడులు పూర్తయ్యే నాటికి మొత్తం సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 240.76 ఎంటీపీఏకి చేరుతుందని పేర్కొంది. ప్రస్తుతం ఇది 192.26 ఎంటీపీఏగా ఉంది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ. 1,238 కోట్లుగా, రూ. 19,607 కోట్లుగా నమోదైంది. జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు పూర్తిగా బదలాయించినట్లు సంస్థ తెలిపింది.

ఐడీబీఐ బ్యాంకు నికరలాభం రెట్టింపు



న్యూఢిల్లీ: నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ(ఎన్ఎస్‌డీఎల్)లో వాటా విక్రయం ద్వారా వచ్చిన లాభంతో కలుపుకొని, ఐడీబీఐ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.3,627 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. ఎన్ఎస్‌డీఎల్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.22 కోట్ల ఈక్విటీలు(11.11% వాటాకు సమానం) జారీ చేసి రూ.1,698.96 కోట్లు ఆర్జించినట్లు బ్యాంకు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో ఆర్జించిన రూ.1,836 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది రెట్టింపు. ఇదే క్యూ2లో నిర్వహణ లాభం 17% వృద్ధి చెంది రూ.3,006 కోట్ల నుంచి రూ.3,523 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.3,875 కోట్ల నుంచి రూ.3,285 కోట్లకు దిగివచ్చింది. స్థూల ఎన్‌పీఏ రేషియో 3.68% నుంచి 2.65 శాతానికి మెరుగుపడింది. నికర ఎన్‌పీఏ స్వల్పంగా 0.20% నుంచి 0.21 శాతానికి పెరిగింది. మొత్తం వ్యాపార వార్షిక వృద్ధి 12% పెరిగి రూ.5,33,730 కోట్లకు చేరింది. సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకు మొత్తం డిపాజిట్ల విలువ రూ.3 లక్షల కోట్లకు చేరుకుంది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్స్ రూ.1,39,036 కోట్లుగా, కాసా రేషియో 45.81% నమోదైందని పేర్కొంది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 3 శాతం అప్

- రెండో త్రైమాసికంలో రూ. 13,357 కోట్లు
- రూ. 914 కోట్లకు తగ్గిన ప్రొవిజనింగ్



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 3.2 శాతం పెరిగి (కన్సాలిడేటెడ్) రూ. 13,357 కోట్లకు చేరింది. ప్రొవిజనింగ్ తగ్గడమనేది మార్జిన్ క్షీణత ప్రభావాలను అధిగమించేందుకు తోడ్పడింది. స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం రూ. 11,746 కోట్ల నుంచి 5 శాతం వృద్ధితో రూ. 12,359 కోట్లకు చేరింది. మరోవైపు, 10.6 శాతం రుణాల వృద్ధి దన్నుతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 7.4 శాతం పెరిగి రూ. 21,529 కోట్లకు చేరింది. అయితే, నికర వడ్డీ మార్జిన్ మాత్రం 4.36 శాతం నుంచి 4.30 శాతానికి పరిమితమైంది. రాబోయే రోజుల్లో నికర వడ్డీ మార్జిన్లు స్థిర శ్రేణిలో తిరుగాడవచ్చని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ గానీ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గిస్తే ఇది మెరుగుపడొచ్చని, పోటీ తీవ్రత వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. చిన్న వ్యాపార సంస్థల రుణాల నాణ్యత దిగజారే అవకాశాలపై స్పందిస్తూ.. బిజినెస్ బ్యాంకింగ్ సెగ్మెంట్లో రుణాల పరిస్థితి మెరుగ్గానే ఉందని బాత్రా చెప్పారు. అందుకే ఆ విభాగానికి రుణాలను పెంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రిటైల్ రుణాలు సహా క్రెడిట్ వృద్ధి పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశీ కార్పొరేట్ల వద్ద పుష్కలంగా నిధులున్నాయని, రుణాలను సమకూర్చుకునేందుకు ఇతరత్రా మార్గాలు కూడా ఉన్నాయని బాత్రా చెప్పారు.

ఆర్థిక ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు..

- క్యూ2లో వార్షిక ప్రాతిపదికన రూ. 1,233 కోట్ల నుంచి, త్రైమాసికాలవారీగా రూ. 1,815 కోట్ల నుంచి ప్రొవిజనింగ్ రూ. 914 కోట్లకు తగ్గింది. స్థూల మొండిబాకీలు (జీఎన్‌పీఏ) రూ. 5,073 కోట్ల నుంచి స్వల్పంగా రూ. 5,034 కోట్లకు తగ్గాయి. జీఎన్‌పీఏ నిష్పత్తి 1.97 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గింది. డిపాజిట్ వృద్ధి 9.1 శాతంగా ఉంది.
- రిటైల్ రుణాలు 6.6 శాతం పెరిగాయి. మొత్తం లోన్ బుక్‌లో వీటి వాటా 52.1 శాతంగా ఉంది. బిజినెస్ బ్యాంకింగ్ పోర్ట్‌ఫోలియో 24.8 శాతం వృద్ధి చెందింది. కార్పొరేట్ రుణాలు 3.5 శాతం పెరిగాయి.
- క్యాపిటల్ అడెక్వసీ 17.31 శాతంగా ఉంది.
- ట్రెజరీ లావాదేవీలు మినహా వడ్డీయేతర ఆదాయం 13.2 శాతం పెరిగి రూ. 7,356 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ ఆదాయం మాత్రం రూ. 680 కోట్ల నుంచి ఏకంగా రూ. 220 కోట్లకు పడిపోయింది.

క్యూ2 ఫలితాలు

యస్ బ్యాంక్ లాభం 18 శాతం జూమ్

రెండో త్రైమాసికంలో రూ. 654 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ నికర లాభం రూ. 654 కోట్లకు చేరింది. గత క్యూ2లో నమోదైన రూ. 553 కోట్లతో పోలిస్తే 18 శాతం పెరిగింది. ఇక లోన్‌బుక్ 6.4 శాతం వృద్ధి చెందడంతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 0.10 శాతం మెరుగుపడి 4.6 శాతానికి చేరింది. ఇతర ఆదాయం 16.9 శాతం పెరిగి రూ. 1,644 కోట్లుగా నమోదైంది. తాజా స్లిప్పేజీలు అంతక్రితం త్రైమాసికంలో ఉన్న రూ. 1,458 కోట్ల నుంచి రూ. 1,248 కోట్లకు దిగివచ్చాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి పెద్దగా మార్పు లేకుండా 1.6 శాతం స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 శాతం స్థాయి రుణ వృద్ధి సాధించాలని నిర్దేశించుకున్నట్లు బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ చెప్పారు. ఇకనుంచి నికర వడ్డీ మార్జిన్లు మరింత మెరుగుపడగలవని ఆయన పేర్కొన్నారు. జపాన్ దిగ్గజం ఎస్ఎంబీసీ 24 శాతం పైగా వాటాను కొనుగోలు చేసినప్పటికీ, తక్షణమే వ్యాపార ప్రణాళికల్లో మార్పులేమీ ఉండబోవని కుమార్ వివరించారు. భవిష్యత్ ప్రణాళికలను నిర్దేశించే వార్షిక సర్వసభ్య సమావేశం యథాప్రకారంగానే జరుగుతుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 80 శాఖలను ప్రారంభించే ప్రణాళికలు ఉన్నట్లు వివరించారు.

ఫెడరల్ బ్యాంకుకు ప్రొవిజన్ల పోటు

నవంబర్ 24న బోర్డు సమావేశం



ముంబై: మొండి బకాయిలకు కేటాయింపులు(ప్రొవిజన్లు) పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో ఫెడరల్ బ్యాంకు నికరలాభం 9% క్షీణించింది. గడిచిన క్యూ2లో రూ.1,096 కోట్ల లాభాన్ని ప్రకటించగా, ఈసారి రూ.991.94 కోట్లకు పరిమితమైంది. లోన్‌బుక్ 6.23% వృద్ధితో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 5.4% పెరిగి రూ.2,495 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ స్వల్పంగా 0.06% తగ్గి 3.06 శాతానికి దిగివచ్చింది. ఇతర ఆదాయం 12.26% పెరిగి రూ.1,082 కోట్లకు చేరింది. కొత్త స్లిపేజీలు రూ.428 కోట్ల నుంచి రూ.579 కోట్లకు చేరాయి. స్లిపేజీల నిష్పత్తి 0.79% నుంచి 0.94 శాతానికి ఎగిసింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.09 శాతం నుంచి 1.83 శాతానికి మెరుగుపడింది. మొత్తం ప్రొవిజన్లు రూ.196.14 కోట్ల నుంచి రూ.397.44 కోట్లకు ఎగసి బ్యాంకు నికరలాభం క్షీణించేందుకు ప్రధాన కారణమయ్యాయి. డిపాజిట్ల వృద్ధి 7.36 శాతంగా నమోదైంది. నిధుల సమీకరణపై చర్చించేందుకు బ్యాంకు బోర్డు నవంబర్ 24న సమావేశమవుతుంది. ‘‘కార్పొరేట్ రుణాల డిమాండ్ అంతంత మాత్రంగానే ఉంది. రిటైల్ రుణ విభాగంపైనే అధిక దృష్టి ఉంటుంది. మైక్రోఫైనాన్స్, వ్యక్తిగత రుణ విభాగాలపై ఆచితూచి వ్యవహరిస్తాము. ప్రస్తుత క్వార్టర్‌లో గృహరుణాలు 1% క్షీణించాయి. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం బ్యాంకు రుణ వృద్ధి 10–12% లక్ష్యంగా పెట్టుకున్నాము’ అని బ్యాంకు ఎండీ కేవీఎస్ మణియన్ తెలిపారు.

పీఎన్‌బీ లాభం 14 శాతం అప్

క్యూ2లో రూ. 4,904 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 4,904 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ2లో నమోదైన రూ. 4,303 కోట్లతో పోలిస్తే ఇది 14 శాతం అధికం. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 36,214 కోట్లుగా, ప్రథమార్ధంలో రూ. 73,445 కోట్లుగా నమోదైంది. ప్రథమార్ధంలో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ. 20,993 కోట్ల నుంచి రూ. 21,047 కోట్లకు చేరింది. అటు సెప్టెంబర్ ఆఖరు నాటికి గతేడాది సెప్టెంబర్ గణాంకాలతో పోలిస్తే స్థూల మొండిబాకీల (ఎన్‌పీఏ) నిష్పత్తి 103 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 4.48 శాతం నుంచి 3.45 శాతానికి చేరింది. నికర ఎన్‌పీఏల నిష్పత్తి 10 బేసిస్ పాయింట్లు మెరుగై 0.46 శాతం నుంచి 0.36 శాతానికి దిగివచ్చింది. ప్రతి శాఖపై వ్యాపారం రూ. 240.72 కోట్ల నుంచి రూ. 263.06 కోట్లకు చేరింది.

హావెల్స్ లాభం అప్

క్యూ2లో 318 కోట్లు



న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 318 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 268 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇతర ఆదాయంతో కలిపి మొత్తం టర్నోవర్ 5 శాతం వృద్ధితో రూ. 4,866 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 4 శాతం పైగా పెరిగి రూ. 4,456 కోట్లను తాకాయి. స్విచ్‌గేర్ల బిజినెస్ 8 శాతం పుంజుకుని రూ. 596 కోట్లకు, కేబుల్ బిజినెస్ 12 శాతం బలపడి రూ. 2,028 కోట్లకు చేరాయి. ఈ బాటలో లైటింగ్, ఫిక్చర్స్ విభాగం 8 శాతం అధికంగా రూ. 428 కోట్ల ఆదాయం సాధించింది. అయితే ఎలక్ట్రికల్ కన్జూమర్ డ్యూరబుల్స్ ఆదాయం 2 శాతం నీరసించి రూ. 842 కోట్లకు పరిమితమైంది. లాయిడ్ విభాగం మరింత అధికంగా 18 శాతం క్షీణించి రూ. 482 కోట్లుగా నమోదైంది. ఇక పంపులు, వాటర్ ప్యూరిఫయర్స్, మోటార్లు తదితర విభాగం ఆదాయం 18 శాతం జంప్‌చేసి రూ. 403 కోట్లను తాకింది.

ర్యాలీస్ మిశ్రమ పనితీరు

రూ.102 కోట్ల లాభం



ముంబై: సస్య సంరక్షణ ఉత్పత్తుల్లోని టాటా గ్రూప్ సంస్థ ర్యాలీస్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) మిశ్రమ పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.98 కోట్ల నుంచి 4 శాతం వృద్ధితో రూ.102 కోట్లకు చేరింది. ఇదే కాలంలో లాభం మాత్రం 7 శాతం క్షీణతతో రూ.928 కోట్ల నుంచి రూ.861 కోట్లకు పరిమితమైంది. అసహజ వర్షాలతో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాగు కార్యకలాపాలకు విఘాతం ఏర్పడడం కంపెనీ అమ్మకాలను ప్రభావితం చేసింది. ‘‘వర్షాలు దీర్ఘకాలం పాటు కొనసాగడం, రెండో త్రైమాసికంలో క్షేత్రస్థాయిలో సాగు కార్యకలాపాలపై ప్రభావం చూపించింది. ఇలాంటి సమస్యాత్మక తరుణంలోనూ మా లాభదాయకత స్థిరంగా ఉంది. ఎగుమతులు పుంజుకోవడం, వ్యయ నియంత్రణ చర్యలు, విత్తన వ్యాపారంలో మార్జిన్లు మెరుగుపడడం అనుకూలించింది’’అని కంపెనీ ఎండీ, సీఈవో జ్ఞానేంద్ర శుక్లా తెలిపారు.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. ఫర్వాలేదు

క్యూ2లో 9% పెరిగిన ఆదాయం



న్యూఢిల్లీ: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (2025–26 క్యూ2) రూ.561 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.571 కోట్లతో పోల్చి చూస్తే 2 శాతం తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో 9 శాతం వృద్ధితో రూ.2,857 కోట్లుగా నమోదైంది. ప్రధానంగా వ్యయాలు 11 శాతం ఎగసి రూ.1,647 కోట్లకు చేరడం లాభాలపై ప్రభావం చూపించింది. వసూలు కాని మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) చేసిన కేటాయింపులు 29 శాతం పెరిగి రూ.481 కోట్లుగా ఉన్నాయి. క్యూ2లో డిపాజిట్లు 21 శాతం పెరిగి రూ.1.32 లక్షల కోట్లకు చేరాయి. సంజయ్ అగర్వాల్‌ను ఎండీ, సీఈవోగా మరో మూడేళ్ల కాలానికి కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. వాటాదారులు, ఆర్‌బీఐ ఆమోదం తెలిపితే 2026 ఏప్రిల్ 19 నుంచి 2029 ఏప్రిల్ 18 వరకు ఎండీ, సీఈవోగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.

జియో ఫైనాన్షియల్ లాభం అక్కడక్కడే

రూ.695 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (ముకేశ్ అంబానీకి చెందిన) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి (2025–26లో క్యూ2) రూ. 695 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ. 689 కోట్లతో పోల్చితే 0.9% పెరిగింది. క్యూ2లో మొత్తం ఆదాయం రూ.981 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ. 694 కోట్లు గా ఉంది. అంటే ఆదా యం 40% వృద్ధి చెందింది. వడ్డీ ఆదా యం దాదాపు రెట్టింపు రూ.392 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.205 కోట్లుగానే ఉంది.



షమీ సూపర్ స్పెల్

- ఉత్తరాఖండ్‌పై బెంగాల్ ఘనవిజయం
- రంజీ ట్రోఫీలో శుభారంభం

కోల్‌కతా: టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీ సత్తా చాటడంతో... రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో బెంగాల్ జట్టు శుభారంభం చేసింది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా శనివారం ఉత్తరాఖండ్‌తో ముగిసిన పోరులో బెంగాల్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 165/2తో శనివారం ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్... చివరకు 96.4 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ కునాల్ చండేలా (235 బంతుల్లో 72; 8 ఫోర్లు), వికెట్ కీపర్ ప్రశాంత్ చోప్రా (163 బంతుల్లో 82; 10 ఫోర్లు) హాఫ్‌సెంచరీలు చేశారు. బెంగాల్ బౌలర్లలో షమీ 38 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, ఆకాశ్‌దీప్, ఇషాన్ పొరేల్ చెరో 2 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన షమీ... రెండో ఇన్నింగ్స్‌లో కీలక సమయంలో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. ఫలితంగా బెంగాల్ ముందు 156 పరుగుల లక్ష్యం నిలవగా... ఆ జట్టు 29.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేజ్ చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (82 బంతుల్లో 71 నాటౌట్; 6 ఫోర్లు) అజేయ అర్ధ శతకంతో జట్టును గెలిపించాడు. ఫిట్‌నెస్ కారణాలతో ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కాలేకపోయిన షమీ... రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు.

తమిళనాడు ఓటమి

బ్యాటర్లు విఫలమవడంతో... రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తమిళనాడు జట్టు పరాజయం పాలైంది. కోయంబత్తూర్ వేదికగా జరిగిన పోరులో జార్ఖండ్ ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో తమిళనాడును మట్టికరిపించింది. ఓవర్‌నైట్ స్కోరు 52/3తో శనివారం ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు... 79 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటైంది. ఆండ్రె సిద్ధార్థ్ (180 బంతుల్లో 80; 12 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు. జార్ఖండ్ బౌలర్లలో రిషవ్ రాజ్ 4, అనుకూల్ రాయ్ 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 419 పరుగులు చేయగా... తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే పరిమితమై ఫాలోఆన్ ఆడింది. భారీ సెంచరీతో కదం తొక్కిన జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ముంబై ఘనవిజయం

ఆల్‌రౌండర్ షమ్స్ ములానీ అదరగొట్టడంతో ముంబై జట్టు రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో బోణీ కొట్టింది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన పోరులో ముంబై 35 పరుగుల తేడాతో జమ్మూ కశ్మీర్‌ను చిత్తుచేసింది. శ్రీనగర్ వేదికగా జరిగిన పోరులో 243 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 21/1తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ కశ్మీర్ చివరకు 64.4 ఓవర్లలో 207 పరుగులకే పరిమితమైంది. ఖమ్రాన్ ఇక్బాల్ (107 బంతుల్లో 56; 5 ఫోర్లు) అర్ధ శతకం సాధించగా.. కెప్టెన్ పారస్ డోగ్రా (29), అఖీబ్ నబీ (37), సాహిల్ లోత్రా (29) తలా కొన్ని పరుగులు చేశారు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ 7 వికెట్లతో విజృంభించాడు. అంతకుముందు ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులు చేయగా... జమ్మూకశ్మీర్ 325 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులు చేసిన ముంబై... ప్రత్యర్థి ముందు 243 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 132 పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు పడగొట్టిన ముంబై ఆల్‌రౌండర్ షమ్స్ ములానీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

- టీమిండియా ప్లేయర్లు హనుమ విహారి, విజయ్ శంకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న త్రిపుర జట్టు... ఎలైట్ గ్రూప్ 'సి' మ్యాచ్‌లో సర్వీసెస్ చేతిలో ఇన్నింగ్స్ 20 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సర్వీసెస్ బౌలర్ అర్జున్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇదే గ్రూప్‌లో భాగంగా అస్సాం, గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.
- ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో బరోడా జట్టు 7 వికెట్ల తేడాతో ఒడిశాపై గెలుపొందింది. కటక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టిన బరోడా బ్యాటర్ శివాలిక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.
- తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసి ప్రత్యర్థిని భయపెట్టిన గోవా జట్టు... ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో చండీగఢ్‌పై ఇన్నింగ్స్ 75 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇదే గ్రూప్‌లో భాగంగా మహారాష్ట్ర, కేరళ జట్ల మధ్య తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. మధ్యప్రదేశ్, పంజాబ్ మధ్య మ్యాచ్ కూడా 'డ్రా' కాగా... మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పాటీదార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.
- రంజీ ట్రోఫీలో ఎలైట్ గ్రూప్‌ల్లో మొత్తం 32 జట్లు... నాలుగు గ్రూప్‌లుగా పోటీపడుతున్నాయి. మ్యాచ్ గెలిచిన జట్టుకు 6 పాయింట్లు, ఇన్నింగ్స్ తేడాతో నెగ్గిన జట్టుకు 7 పాయింట్లు కేటాయించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జట్టుకు 3 పాయింట్లు దక్కాయి. 'డ్రా' చేసుకున్న జట్టుకు ఒక పాయింట్ దక్కింది.

మానవ్ మాయాజాలం



రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ స్పిన్నర్ మానవ్ సుతార్ (8/42) అదరగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి బ్యాటర్లకు అర్థంకాని బంతులతో విజృంభించి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. ఓవర్‌నైట్ స్కోరు 64/4తో శనివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్ చివరకు 49.3 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌటైంది. ఆయుశ్ పాండే (27), సంజీత్ దేశాయ్ (24) తలా కొన్ని పరుగులు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మానవ్ సుతార్ 22.3 ఓవర్లలో 42 పరుగులిచ్చి 8 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన సుతార్... రెండో ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ బ్యాటర్లను క్రీజులో నిలవనివ్వలేదు. అనంతరం 56 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్తాన్ 11.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 58 పరుగులు చేసింది. మహిపాల్ లోమ్రర్ (35 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్ 332 పరుగులు చేయగా... రాజస్తాన్ 386 పరుగులు చేసింది.



రింకూ సింగ్ అజేయ సెంచరీ

కాన్పూర్: టీమిండియా ప్లేయర్ రింకూ సింగ్ (273 బంతుల్లో 165 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. ఫలితంగా రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 470 పరుగులు చేయగా... ఓవర్‌నైట్ స్కోరు 294/6తో శనివారం ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరప్రదేశ్ జట్టు చివరకు 169 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 471 పరుగులు చేసింది. చివరి వరుస బ్యాటర్ల అండతో... రింకూ సింగ్ సూపర్ సెంచరీ సాధించాడు. టి20 ఫార్మాట్‌లో ధనాధన్ షాట్‌లకు పెట్టింది పేరైన రింకూ సింగ్... ఈ మ్యాచ్ ద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తన అత్యధిక స్కోరు నమోదు చేసుకున్నాడు. విప్రాజ్ నిగమ్ (119 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ శర్మ (136 బంతుల్లో 38; 5 ఫోర్లు), శివమ్ మావి (20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అతడికి అండగా నిలిచారు. ఆంధ్ర బౌలర్లలో పృథ్వీ రాజ్, రికీ భుయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా... శశికాంత్, సౌరభ్ కుమార్, సత్యనారాయణ రాజు, షేక్ రషీద్ తలా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నారు. రింకూ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు దక్కింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఉత్తర ప్రదేశ్ జట్టుకు 3 పాయింట్లు లభించగా... ఆంధ్ర జట్టుకు ఒక పాయింట్ దక్కింది.

ఆధిక్యం కోల్పోయిన హైదరాబాద్...

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా... హైదరాబాద్ వేదికగా ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌ను హైదరాబాద్ జట్టు 'డ్రా'గా ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 400/7తో శనివారం నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ మరో 11 పరుగులు మాత్రమే జోడించి... మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు ఢిల్లీ జట్టు 529/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడంతో... పర్యాటక జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఢిల్లీ... 42 ఓవర్లలో 3 వికెట్లకు 138 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ డబుల్ సెంచరీ హీరో, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సనత్ సాంగ్వాన్ (105 బంతుల్లో 56; 6 ఫోర్లు), యశ్ ధుల్ (71 బంతుల్లో 53; 7 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్, వరుణ్ గౌడ్, హిమతేజ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన ఢిల్లీ జట్టుకు 3 పాయింట్లు దక్కగా... హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభించింది.

పాక్ దాడిలో క్రికెటర్లు బలి

ముక్కోణపు సిరీస్‌నుంచి తప్పుకున్న అఫ్గానిస్తాన్

కాబూల్: పాకిస్తాన్ వేదికగా వచ్చే నెల 17 నుంచి జరగాల్సిన ముక్కోణపు టి20 సిరీస్‌నుంచి అఫ్గానిస్తాన్ తప్పుకుంది. ఈ రెండు జట్లతో పాటు శ్రీలంక మూడో టీమ్‌గా ఉంది. తమ దేశంపై పాకిస్తాన్ సైన్యం చేసిన వైమానిక దాడిని ఖండిస్తూ అఫ్గన్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాకిస్తాన్ ఈ దాడులకు పాల్పడింది. అఫ్గానిస్తాన్‌లోని అర్గున్, బర్మల్ జిల్లాలపై పాక్ సైన్యం చేసిన దాడిలో ముగ్గురు వర్ధమాన క్రికెటర్లు కబీర్ ఆగా, సిబ్గతుల్లా, హారూన్ చనిపోయారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన అఫ్గన్ బోర్డు...పాక్ గడ్డపై క్రికెట్ ఆడేది లేదని తేల్చి చెప్పింది. ఈ విషయంలో బీసీసీఐ, ఐసీసీ కూడా అఫ్గన్‌కు అండగా నిలిచాయి. యువ క్రికెటర్లపై మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ అఫ్గన్ పట్ల తమ సంఘీభావాన్ని ప్రకటించాయి.

హైదరాబాద్ మూడో విజయం



సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తమ ఖాతాలో మూడో విజయం వేసుకుంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ 3–2 (13–15, 15–10, 18–16, 14–16, 15–11)తో బెంగళూరు టార్పెడస్‌పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 3–1 (12–15, 15–7, 15–12, 21–10)తో ముంబై మెటియోర్స్‌పై గెలుపొందింది. తొలి గేమ్‌లో ఓడిన అహ్మదాబాద్ ఆ తర్వాత... వరుసగా మూడు గేమ్‌ల్లో విజృంభించింది. డిఫెండర్స్ తరఫున రాణించిన నందగోపాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సీజన్‌లో ముంబైకి ఇదే తొలి పరాజయం. లీగ్‌లో భాగంగా ఆదివారం ఢిల్లీ తూఫాన్స్‌తో గోవా గార్డియన్స్, కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో కాలికట్ హీరోస్ తలపడనున్నాయి.

ప్లే ఆఫ్స్‌కు చేరిన తెలుగు టైటాన్స్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 40–31 పాయింట్ల తేడాతో పట్టిక అగ్రస్థానంలో ఉన్న పుణేరి పల్టన్‌పై గెలిచి ముందంజ వేసింది. టైటాన్స్ తరఫున భరత్ 11, విజయ్ మాలిక్ 10 పాయింట్లు సాధించారు. ఈ సీజన్‌లో టైటాన్స్ 16 మ్యాచ్‌లాడి 9 విజయాలు, 7 పరాజయాలతో 18 పాయింట్లతో నిలిచింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33–23 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. ఈ విజయంతో బెంగళూరు బుల్స్ కూడా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఇంకో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 38–30 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది.

పాక్, కివీస్ మ్యాచ్ వర్షార్పణం

- సెమీ ఫైనల్లో దక్షిణాఫ్రికా



కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో కొలంబో వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లను వరుణుడు వీడటం లేదు. వాన కారణంగా ఇప్పటికే ఇక్కడ మూడు మ్యాచ్‌లు రద్దు కాగా... ఇప్పుడు ఆ జాబితాలో మరో మ్యాచ్ చేరింది. శనివారం కొలంబో వేదికగా పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య జరిగిన పోరు భారీ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా సెమీస్ చేరగా... ఇప్పుడు సఫారీ జట్టు రెండో బెర్త్ దక్కించుకుంది. ఇక మిగిలిన రెండు స్థానాలు తేలాల్సి ఉంది. శనివారం పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 25 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. ఆలియా రియాజ్ (52 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు), మునీబా అలీ (22; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. లీ తహూహు 2 వికెట్లు పడగొట్టింది. ఈ దశలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించగా... సుదీర్ఘ నిరీక్షణ అనంతరం వర్షం కాస్త తెరిపినివ్వగా... మ్యాచ్‌ను 36 ఓవర్లకు కుదించారు. అయితే మరోసారి వర్షం ముంచెత్తడంతో... మ్యాచ్‌ను నిలిపి వేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.

రిషాద్ 'సిక్సర్'



మీర్‌పూర్: ఇటీవల టీమిండియాతో టెస్టు సిరీస్‌లో 'వైట్ వాష్'కు గురైన వెస్టిండీస్ జట్టు... బంగ్లాదేశ్ పర్యటనను కూడా పరాజయంతోనే ప్రారంభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య బంగ్లాదేశ్ 74 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. తౌహిద్ హృదయ్ (90 బంతుల్లో 51; 3 ఫోర్లు) అర్ధశతకం సాధించగా... మహిదుల్ ఇస్లామ్ (46), నజ్ముల్ హుసేన్ షంటో (32) ఫర్వాలేదనిపించారు. విండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్ 3 వికెట్లు పడగొట్టగా... రోస్టన్ చేజ్, జస్టిన్ గ్రీవ్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సులభతర లక్ష్యఛేదనలో కరీబియన్ జట్టు విఫలమైంది. బ్యాటర్లంతా తేలిపోవడంతో చివరకు 39 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. బ్రాండన్ కింగ్ (60 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో రిషాద్ హుసేన్ 35 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. అతడి ధాటికి విండీస్ టాపార్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టింది. బ్యాటింగ్‌లోనూ 13 బంతులు ఎదుర్కొని ఒక ఫోర్, 2 సిక్స్‌ల సాయంతో 26 పరుగులు చేసిన రిషాద్... బౌలింగ్ అదరగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు. ఇరు జట్ల మధ్య మంగళవారం ఇక్కడే రెండో వన్డే జరగనుంది.

సెమీస్‌లో సహజ జోడీ ఓటమి



న్యూఢిల్లీ: భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి... ఎబిర్టో టాంపికో డబ్ల్యూటీఏ-125 టోర్నమెంట్ డబుల్స్ సెమీఫైనల్లో పరాజయం పాలైంది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో శనివారం జరిగిన సెమీఫైనల్లో సహజ (భారత్)–జెస్సికా హినోజోసా గోమెజ్ (మెక్సికో) జంట 0-6, 2-6తో మూడో సీడ్ కేలా క్రాస్ (కెనడా)–అమెలియా రాజెస్కి (బ్రిటన్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. ప్రత్యర్థి జోడీ 3 ఏస్‌లు సంధించగా... సహజ ద్వయం 4 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. టోర్నీ ఆరంభం నుంచి చక్కటి సమన్వయంతో సాగిన సహజ–జెస్సికా... సెమీస్‌లో అదే జోరు కనబర్చడంలో విఫలమయ్యారు.

భారత్‌కు రజత పతకం

ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి ● సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్


జొహోర్ బారు (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు రజత పతకం దక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో రోహిత్ సారథ్యంలోని మూడు సార్లు చాంపియన్ టీమిండియా 1-2 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. చివరి నిమిషంలో ప్రత్యర్థికి గోల్ చేసే అవకాశం ఇవ్వడంతో పాటు... పెనాల్టీ కార్నర్ అవకాశాలను వృథా చేసుకొని పరాజయం వైపు నిలిచింది. భారత్ తరఫున అన్‌మోల్ ఎక్కా (17వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... ఆస్ట్రేలియా తరఫున ఇయాన్ గ్రాబెలార్ (13వ, 59వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరిశాడు. తొలి క్వార్టర్‌లో ఆస్ట్రేలియా గోల్ చేసి ఆధిక్యం సాధించగా... రెండో క్వార్టర్‌లో అన్‌మోల్ గోల్‌తో భారత్ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ చేయలేకపోయాయి. అయితే మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా... వచ్చిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని ఆస్ట్రేలియా సద్వినియోగం చేసుకొని ఆధిక్యం రెట్టింపు చేసుకుంది. గత మూడు ఫైనల్స్‌లో ఓడిన ఆస్ట్రేలియాకు ఇది నాలుగో ట్రోఫీ. భారత జట్టుకు చివరి నిమిషంలో ఏకంగా ఆరు పెనాల్టీ కార్నర్ అవకాశాలు దక్కగా... వాటిలో ఒక్కదాన్ని కూడా గోల్‌గా మలచలేకపోయింది. ఆస్ట్రేలియా గోల్ కీపర్ మాగ్నస్ మెక్‌కాస్లాండ్ చక్కటి ప్రదర్శన కనబర్చాడు. గత రెండు పర్యాయాలు కాంస్య పతకాలు సాధించిన భారత జట్టు... ఈసారి రజతం గెలుచుకుంది.




దీపాల పండుగ


ఢిల్లీలోని ఘాజీపూర్ పూల మార్కెట్‌లో మాలలు కడుతున్న మహిళలు


శనివారం జమ్మూలోని ఓ కాగితం పూల దుకాణంలో మహిళల సందడి


కర్ణాటకలోని చిక్కమగళూరులో ప్రమిదలు విక్రయిస్తున్న మహిళ


ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద దీపోత్సవం లేజర్ షో


ధన్‌తెరాస్ వేళ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని ఓ నగల షోరూంలో పోటెత్తిన కొనుగోలు దారులు

48 ఏళ్ల తర్వాత చిక్కిన ప్రేమ పావురం

తాతా! ఈ జన్మకి టైం కుదిరింది! కోర్టుకి రా!

ప్రియురాలిని పొడిచిన కేసులో పట్టుబడ్డ పెద్దాయన	బెయిల్‌పై దర్జాగా వెళ్లిపోయిన 81 ఏళ్ల నిందితుడు	నానమ్మ కాలం నాటి కేసుకి మోక్షం

ఏదో చిన్నచితకా కేసు కాదు.. ఏకంగా తన ప్రేయసిని **కత్తితో పొడిచి చంపడానికి** ప్రయత్నించిన **కేసు! మన** హీరో చంద్రశేఖర్ మధు**కర్ కాలేకర్.. ఈ** సాహసం చేసింది 1977లో**. అప్పుడు ఆయన** వయసు కేవలం 23 ఏళ్లే**. రక్తంలో** ప్రేమ, అపనమ్మకం, యవ్వనం.. **అన్నీ ఉప్పొంగుతున్న** సమయం. ఈ ల**వర్ బాయ్‌కి.. తన** లవర్ క్యారెక్టర్‌పై తెగ అ**నుమానం వచ్చేసింది**. అంతే.. కోపంతో ఊగి**పోయాడు.. ముంబై**లోని కొలాబాలో **ప్రియురాలిపై కత్తి** దూశాడు. పాపం ఆ రోజుల్లోనే ఇంత కసితో ప్రేమించిన మొనగాడున్నాడంటే.. మామూలు విషయం కాదు!. కుర్రాడిని ఎలాగోలా పోలీసులు పట్టేసుకున్నారు, కోర్టు బెయిల్ ఇచ్చింది. అంతే! ఆ బెయిల్ పత్రాన్ని అందుకున్నారో లేదో, మన కాలేకర్ గారు 'ట్రయల్ బై ఎస్కేప్' అనే కొత్త రూల్ కనిపెట్టి, మాయమైపోయారు. దాదాపు ఐదు దశాబ్దాలు (48 ఏళ్లు) ఎక్కడా కనిపించకుండా, దొరక్కుండా, సన్యాసిలా జీవితం గడిపారు! కోర్టు విచారణ లేకుండా 48 ఏళ్లు బతికారంటే.. తన జీవితంపై ఆయనకు ఎంత నమ్మకమో కదా!. ముంబై పోలీసులు పాపం చాలా వెతికారు. అడ్రస్ మారడం, ఆ నివసించిన భవనం కూల్చేయడం... ఇలా సకల కారణాల వల్ల అతన్ని పట్టుకోలేకపోయారు. కోర్టు నాన్ - బెయిలబుల్ వారెంట్ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఇక కేసు మూలనపడింది అనుకుంటున్న టైమ్‌లో.. మిరాకిల్!

దొరికిపోయాడోచ్..

తాజాగా దర్యాప్తు మొదలుపెట్టిన కొలాబా పోలీసులు, ఈ పాత కేసు ఫైల్‌ని దుమ్ము దులుపుతుండగా.. ఓ చిన్న క్లూ దొరికింది. అదేంటంటే.. 2015లో రత్నగిరి జిల్లాలోని దాపోలి పోలీస్ స్టేషన్‌లో ఓ ప్రమాదం కేసులో కాలేకర్ పేరు నమోదైంది! అంటే, పారిపోయి ప్రశాంతంగా ఉన్నా, ప్రమాదం రూపంలో కర్మ ఆయనను వెతుక్కుంటూ వచ్చింది! ఆ దెబ్బతో, పోలీసులు వెతికి పట్టుకున్నారు.

పోలీసు అంకుల్స్‌కి హ్యాట్సాఫ్!.

48 ఏళ్ల క్రితం 23 ఏళ్ల యువకుడిని.. ఇప్పుడు గుర్తు పట్టడం అంటే మాటలా? అంతా సవాలే. కానీ పాత ఫొటోలు చూసి, ఇంటరాగేషన్ చేయగా.. మన 81 ఏళ్ల తాతగారు తప్పనిసరి పరిస్థితుల్లో తన తప్పును ఒప్పుకున్నారు! ఇంతకాలం గుర్తు పెట్టుకుని ఉండాలంటే.. ఎంత ఘోరమైన అటాక్ అయి ఉంటుందో!.

ఇప్పటికింకా ఈయన వయసు నిండా 81 ఏళ్లే..

కోర్టులో అడ్వకేట్ సునీల్ పాండే ఆయన తరపున వాదించారు. 'సార్! నా క్లయింట్ వయసు 81 ఏళ్లు, బోలెడన్ని వ్యాధులు ఉన్నాయి. అసలు చార్జిషీట్ ఫైల్ చేశాక నోటీస్ ఇవ్వలేదు! 2010లో ఆయన గుడిసె పడిపోయింది, ఆ తర్వాత ఆసుపత్రిలో చేరారు.. అందుకే కోర్టుకు రాలేకపోయారు'.. అంటూ 48 ఏళ్ల తప్పిదానికి సరదాగా కవర్ డ్రైవ్ ఇచ్చారు!

జాలి పడ్డ జడ్జి గారు!

ప్రభుత్వ తరపు న్యాయవాది ఆనంద్ సుఖదేవే గారు మాత్రం 'అయ్యో! ఇదో పెద్ద నేరం, 48 ఏళ్ల ట్రయల్‌ని ఆలస్యం చేసింది ఈయనే! మళ్లీ పారిపోవచ్చు!' అని గట్టిగా అభ్యంతరం చెప్పారు. కానీ, న్యాయమూర్తి అవినాష్ పి.కులకర్ణి గారు.. మన తాతగారి వయసు, ఆయన 'కచ్చితంగా కోర్టుకు వస్తాను' అని ఇచ్చిన హామీని చూసి జాలి పడ్డారు. చివరికి, బెయిల్ మంజూరు చేసేశారు!

తాతగారు హ్యాపీస్..

ప్రేమించి, పొడిచి, పారిపోయి... **వయసు** మీరి పట్టుబడిన చం**ద్రశేఖర్ మధుకర్** కాలేకర్ గారు, **ఇప్పుడు బెయిల్**‌పై దర్జాగా ఉన్నారు. **48 ఏళ్ల తర్వాత**.. ఇన్నాళ్లకు ఇప్పుడు **ఆయనపై విచారణ** మొదలవుతుం**ది! ఈ కేసులో** సాక్ష్యం చెప్పడానికి ఆ **రోజుల నాటి** పోలీసులు, సాక్షులు **ఎవరైనా బతికి** ఉన్నారో లేదో?, అసలు ఆ ప్రేయసి ఏమైందో.. దేవుడికే తెలియాలి! ఇంతకాలం ఈ కేసును ఫైల్లోంచి తీయకుండా ఉంచిన ఆ న్యాయస్థానం సిబ్బందికి మాత్రం భారత న్యాయవ్యవస్థ చరిత్రలో మంచి స్థానం దక్కుతుంది!

మరి, ఈ ట్రయల్ ఇంకో 48 ఏళ్లు సాగకుండా ఉంటుందా? మీరేమంటారు?

– సాక్షి, నేషనల్ డెస్క్

మాతో సంప్రదించకుండానే ఎలా నియమిస్తారు?

- గూర్ఖాలతో చర్చకు కేంద్రం దూతను నియమించడంపై అభ్యంతరం
- ప్రధాని మోదీకి మమతా బెనర్జీ లేఖ

కోల్‌కతా: గూర్ఖాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ ఐపీఎస్ పంకజ్ కుమార్ సింగ్‌ను నియమించడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభ్యంతరం తెలిపారు. తమను సంప్రదించకుండా చేపట్టిన ఈ నియామకాన్ని రద్దు చేయాలంటూ ఆమె శనివారం ప్రధాని మోదీకి రాసిన లేఖలో డిమాండ్ చేశారు. సహకార సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఉన్న ఈ నియామకంపై తాము ఆశ్చర్యానికి, షాక్‌నకు గురయ్యామని సీఎం మమత పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ హిల్స్, తెరాయ్, దోఆర్స్ ప్రాంతాల్లోని గూర్ఖాల కోసం స్వయం పాలిత గూర్ఖాల్యాండ్ టెరిటోరియల్ అడ్మినిస్ట్రేషన్ (జీటీఏ) 2011లో ఏర్పాటవడం తెల్సిందే. ఇందుకు సంబంధించిన త్రైపాక్షిక ఒప్పందంపై గూర్ఖాల ప్రతినిధులతోపాటు బెంగాల్ సీఎం, కేంద్ర హోం మంత్రి సంతకాలు చేశారు. పాలన, శాంతిభద్రతలు, పరిపాలనకు సంబంధించిన అంశాలు జీటీఏ పరిధిలోనివే అయినప్పటికీ, అది బెంగాల్ ప్రభుత్వంలోని స్వతంత్ర విభాగమని మమతా బెనర్జీ ప్రధానికి రాసిన లేఖలో గుర్తు చేశారు. ఈ విషయంలో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలు ఆ ప్రాంత శాంతి, సామరస్యాలకు భంగం కలిగిస్తాయని హెచ్చరించారు.

బెంగాల్‌లో టీఎంసీ ఎంపీ సవాల్

కేంద్ర మంత్రి సుకాంత బైక్ ర్యాలీ

కోల్‌కతా: కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ శనివారం పశ్చిమబెంగాల్‌లోని శ్రీరాంపూర్‌లో బైక్ ర్యాలీ చేపట్టారు. తను ప్రాతినిథ్యం వహిస్తున్న శ్రీరాంపూర్ నియోజకవర్గానికి చేతనైతే రావాలంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శుక్రవారం చేసిన సవాల్‌కు సమాధానంగా ఆయనీ ర్యాలీ చేపట్టడం గమనార్హం. త్వరలో రాష్ట్రంలో చేపట్టే ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఇద్దరు నేతల మధ్య శుక్రవారం మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఎస్ఐఆర్ చేపట్టే సమయంలో అశాంతి సృష్టించేందుకు యత్నించిన పక్షంలో కేంద్ర బలగాలను మోహరించడంతోపాటు అవసరమైతే కాల్పులు కూడా జరుగుతాయని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత వ్యాఖ్యానించడం మాటల దాడికి దారి తీసింది. బదులుగా కల్యాణ్ బెనర్జీ 'ధైర్యం ఉంటే శ్రీరాంపూర్‌కు రా..ఎలా తిరిగి ఇంటికి వెళతావో చూస్తా..'అని సవాల్ విసిరారు. దీంతో, శనివారంటాయన స్వయంగా మోటారు సైకిల్ నడుపుతూ ముందుండగా ద్విచక్ర వాహనాలపై బీజేపీ కార్యకర్తలు అనుసరించారు. ఈ సందర్భంగా కార్యకర్తల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి హింసా రాజకీయాలపై విశ్వాసం లేదన్నారు. ఒక వేళ కల్యాణ్ బెనర్జీ ఆడుకోవాలని ఉత్సాహంగా ఉంటే, ఆటాడుకోవాలని మా కార్యకర్తలకు కూడా చెబుతా'అని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర హోదా కోసం బీజేపీతో జత కట్టను

జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదాను సాధించుకునేందుకుగాను బీజేపీతో మాత్రం పొత్తుపెట్టుకోబోమని సీఎం ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఇతరులు గతంలో పాల్పడిన తప్పులను తాము పునరావృతం చేయాలనుకోవడం లేదని తెలిపారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోరుతూ వేసిన పిటిషన్‌లో తాము కూడా కక్షిదారులుగా మారాలనుకుంటున్నామన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి ఇచ్చే విషయంలో కేంద్రానికి సుప్రీంకోర్టు ఈ నెల 10వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా నాలుగు వారాల గడువివ్వడం తెల్సిందే. రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయం బీజేపీపైనే ఆధారపడి ఉన్నట్లయితే, తమకు అధికారమిస్తే ఆ హామీని నెరవేరుస్తామని ప్రకటించడం ద్వారా కాషాయ దళం తన నిజాయతీని నిరూపించుకోవాలని సీఎం ఒమర్ వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే రాష్ట్ర హోదా ఇస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో సహా ఎక్కడా చెప్పలేదని ఆయన తెలిపారు. ఒక వేళ ఆవిధంగా చెప్పిన పక్షంలో ఏం చేయాలో తాము నిర్ణయించుకుంటామన్నారు. బీజేపీతో తాము పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. 2015లో ఈ పొరపాటు చేసిన పీడీపీ ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉందని పేర్కొన్నారు.

పాక్-అఫ్గాన్ యుద్ధాన్ని చిటికెలో ఆపగలను: ట్రంప్

వాషింగ్టన్: పాకిస్తాన్-అఫ్గనిస్తాన్ మధ్య పెరుగుతున్న ఘర్షణలపై అమెరికా అధ్యక్షుడు తనదైన శైలిలో స్పందించారు. ఆ రెండు దేశాల మధ్య ఘర్షణను ఆపటం తనకు చిటికెలో పని అని తెలిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో శుక్రవారం మధ్యాహ్నం ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్‌పై జరుగుతున్న దాడి, అఫ్గనిస్తాన్‌పై పాక్ జరుపుతున్న దాడి గురించి నాకు అర్థమవుతోంది. నేను గనుక పరిష్కరించాలని అనుకుంటే ఆ రెండు దేశాల మధ్య జరుగుతున్న ఘర్షణను ఆపటం చాలా తేలిక. ప్రజలను చంపే ఘర్షణలను ఆపటం అంటే నాకు చాలా ఇష్టం. నేను లక్షల మంది ప్రజల ప్రాణాలు కాపాడాను. ఈ యుద్ధాన్ని ఆపటంలో కూడా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది'అని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా పాక్-అఫ్గాన్ మధ్య సైనిక ఘర్షణ జరుగుతున్న విషయం తెలిసిందే.

సోమవారం నుంచి తెరుచుకోనున్న రఫా క్రాసింగ్

కైరో: గాజాకు తిరిగి వచ్చే పాలస్తీనియన్ల కోసం సోమవారం నుంచి రఫా క్రాసింగ్ పాయింట్‌ను తెరిచి ఉంచుతామని పాలస్తీనా దౌత్య కార్యాలయం తెలిపింది. గాజాకు తిరిగి వెళ్లేందుకు తమ వద్ద పేర్లు నమోదు చేయించుకున్న పాలస్తీనియన్ల సంఖ్య భారీగా ఉందని శనివారం పేర్కొంది. అయితే, ఎందరనే విషయం స్పష్టం చేయలేదు. ఈ ప్రకటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పందించలేదు. యుద్ధానికి ముందు ఇజ్రాయెల్ నియంత్రణలో లేని బయటి ప్రపంచానికి గాజాకు ఉన్న ఏకైక మార్గం ఈ క్రాసింగ్. గాజాను నియంత్రణ తీసుకున్న తర్వాత 2024 మే నుంచి ఇజ్రాయెల్ దీనిని మూసివేసింది. ఇలా ఉండగా, ఇజ్రాయెల్- హమాస్ మధ్య జరిగిన యుద్ధంలో మృతుల సంఖ్య 68 వేలు దాటిపోయిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. వారం క్రితం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత మరణాల సంఖ్య పెరిగిందని పేర్కొంది. శిథిలాల తొలగింపు సందర్భంగా మృతదేహాలు బయటపడుతున్నట్లు వెల్లడించింది.



గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం

ఫతేగఢ్ సాహిబ్: అమృత్‌సర్- సహర్సా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ బోగీలో మంటలు చెలరేగాయి. పంజాబ్‌లోని సిర్‌హింద్ రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. జీ–19 ఏసీ బోగీలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒక మహిళకు స్వల్ప గాయాలైనట్లు రైల్వే బోర్డు తెలిపింది. ప్రమాదానికి కారణాలను వెల్లడించలేదు. బోగీ నుంచి మంటలు రావడంతో గమనించిన ప్రయాణికుడొకరు చెయిన్ లాగి అధికారులను అప్రమత్తం చేశారని, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దించామని వివరించింది. ఆ బోగీ పూర్తిగా కాలిపోగా, మరో రెండు బోగీలకు స్వల్పంగా నష్టం జరిగిందని రైల్వే బోర్డు వెల్లడించింది. ఈ మూడు బోగీలను రైలు నుంచి వేరు చేసి, ఫైర్ సిబ్బందికి అధికారులు సమాచారమిచ్చారని పేర్కొంది.

బ్రెజిల్‌లో బస్సు బోల్తా

15 మంది ప్రయాణికుల మృత్యువాత

సావ్‌పావ్‌లో: బ్రెజిల్‌లో అర్ధరాత్రి ప్రయాణం కొందరు బస్సు ప్రయాణికులకు కాళరాత్రిగా మారింది. 30 మంది ప్రయాణికులతో బహియా రాష్ట్రం నుంచి బయల్దేరిన బస్సు పెర్నాంబుకో రాష్ట్రంలోని సలోవా సిటీలో ఘోర ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు ఆవలి వైపునకు దూసుకెళ్లి రాళ్లను ఢీకొట్టి మళ్లీ ఇవతలి వైపునకు వచ్చి బోల్తాపడింది. దీంతో బస్సులో నలిగిపోయి 15 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కొందరు ఎలాగోలా బయట పడ్డారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రుల్లో చేర్పించారు. ఈ ఘటనలో డ్రైవర్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

రాయల్ టైటిల్ వదులుకున్న ప్రిన్స్ ఆండ్రూ



లండన్: బ్రిటన్ రాజు చార్లెస్–3 తమ్ముడు ప్రిన్స్ ఆండ్రూ(65) తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. ఇకపై అన్ని రాచ బిరుదులను, మర్యాదలను సైతం వదిలేసుకుంటున్నట్లు ఆండ్రూ ఎక్స్ వేదికగా ప్రకటించారు. అమెరికాను కుదిపేసిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంతో ప్రిన్స్ ఆండ్రూకు సంబంధాలున్నట్లు ఇటీవల తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాజ కుటుంబం నుంచి వస్తున్న ఒత్తిడుల మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన హిజ్ రాయల్ హైనెస్ (హెచ్‌ఆర్‌హెచ్)ను వాడటం ఆపేశారు.

బిహార్ ఎన్నికల్లో జేఎంఎం సొంతంగా పోటీ

రాంచీ: బిహార్ ఎన్నికల వేళ ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)బాంబు పేల్చింది. పక్క రాష్ట్రం బిహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రంగా ఆరు సీట్లలో పోటీ చేయనున్నట్లు జేఎంఎం శనివారం ప్రకటించింది. అదేవిధంగా, ప్రస్తుతం జార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కొనసాగుతున్న పొత్తుపై బిహార్ ఎన్నికల అనంతరం సమీక్షిస్తామని కూడా స్పష్టం చేసింది. జేఎంఎం జనరల్ సెక్రటరీ సుప్రియో భట్టాచార్య మీడియా సమావేశంలో ఈ విషయాలను ప్రకటించారు. బిహార్‌లో తమకు 12 సీట్లు కేటాయించాలని ఇండియా కూటమిని జేఎంఎం కోరింది. స్పందన లేకపోవడంతో స్వయంగా పోటీకి దిగాలని నిర్ణయించుకున్నామన్నారు.

స్థితిమంతురాలైన భార్యకు భరణమా?

విడాకుల కేసులో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్థికంగా స్వతంత్రంగా ఉండి, స్థిరమైన ఆదాయం కలిగిన జీవిత భాగస్వామికి భరణం ఇవ్వజాలమని ఢిల్లీ హైకోర్టు తేల్చి చెప్పింది. శాశ్వత భరణం సామాజిక న్యాయం కోసం ఉద్దేశించినదే తప్ప, ఆర్థికంగా సమర్థులైన ఇద్దరు వ్యక్తుల మధ్య సంపదను సమానం చేయడానికి కాదని స్పష్టం చేసింది. భరణం కోరే వ్యక్తికి తనకు నిజంగా ఆర్థిక సాయం అవసరమని నిరూపించాల్సిన బాధ్యత ఉందని నొక్కి చెప్పింది. ఈ మేరకు జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌ల ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఓ జంట విడాకుల కేసులో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. భర్తకు క్రూరత్వం ఆధారంగా విడాకులు మంజూరు చేసిన కుటుంబ న్యాయస్థానం, భార్యకు శాశ్వత భరణం ఇచ్చేందుకు నిరాకరించడం సరైందేనని స్పష్టం చేసింది.

2010 జనవరిలో వివాహబంధంతో ఒక్కటైన ఈ జంట 14 నెలల్లోనే విడిపోయింది. భర్త లాయర్ కాగా, భార్య రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్టీఎస్) గ్రూప్ 'ఎ'అధికారి. భార్య తనను మానసికంగా, శారీరకంగా హింసించిందని, దూషణ పదజాలం వాడిందని, అవమానకరమైన మెసేజీలు పంపిందని, వైవాహిక హక్కులను నిరాకరించిందని, వత్తిపరమైన, సామాజిక వర్గాల్లో తనను అవమానించిందని భర్త ఆరోపించారు. ఈ ఆరోపణలను భార్య ఖండించింది, భర్తే తనను హింసించాడంటూ ప్రత్యారోపణలు చేసింది. కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు, భర్త ఆరోపణల్లో వాస్తవం ఉందని తేలడంతో విడాకులు మంజూరు చేసింది. అంతేకాకుండా, రూ.50 లక్షలిస్తేనే విడాకులకు ఒప్పుకున్నానంటూ భార్య డిమాండ్ చేయడాన్ని గుర్తించిన ఫ్యామిలీ కోర్టు భరణం అభ్యర్థనను తిరస్కరించింది.

ఉన్నది ప్రేమ కాదు.. ఆర్థిక ప్రయోజనాలే..

ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ భార్య హైకోర్టును ఆశ్రయించింది. పరిశీలించిన ధర్మాసనం, కింది కోర్టు తీర్పులో తప్పులేదని అభిప్రాయపడింది. 'విడాకులను వ్యతిరేకిస్తున్నట్లు చెబుతూనే, భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేయడం.. ఆ బంధాన్ని నిలబెట్టుకోవాలనే ప్రేమ, ఆప్యాయతతో కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసమేనని స్పష్టమవుతోంది. భార్య వైఖరిలో స్పష్టమైన ఆర్థిక కోణం ఉందని ఫ్యామిలీ కోర్టు తేల్చడం సమంజసమే'అని ధర్మాసనం పేర్కొంది.

నేపాల్ రాజకీయాల్లోకి జెన్ జెడ్ విద్యార్థి సంఘం

వచ్చే ఎన్నికల్లో పోటీచేసే ఛాన్స్

కఠ్మాండు: నేపాల్‌లో ఇటీవల ఉవ్వెత్తున ఎగసిపడి విద్యార్థి ఉద్యమానికి సారథ్యంవహించి ప్రభుత్వాన్ని గద్దె దించిన జెన్ జెడ్ విద్యార్థుల బృందం అధికారపీఠంపై కన్నేసినట్లు స్పష్టమవుతోంది. వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తాము రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నట్లు జెన్ జెడ్ గ్రూప్ శనివారం ప్రకటించింది. జెన్ జెడ్ ఉద్యమ నేతల్లో ఒకరైన మిరాజ్ ధున్‌గన శనివారం కఠ్మాండులో మీడియా సమావేశంలో తమ బృంద అజెండాను వెల్లడించారు. అయితే తమ కీలక రెండు డిమాండ్లు నెరవేర్చేదాకా ఎన్నికల్లో పోటీచేయబోమని ఈ గ్రూప్ కొత్త మెలిక పెట్టడం గమనార్హం. కార్యనిర్వాహక వ్యవస్థను నేరుగా ఎన్నుకోవడం, విదేశాల్లోని నేపాలీ పౌరులకు ఓటింగ్ హక్కు కల్పించడం వంటి రెండు డిమాండ్లు నెరవేర్చాలని తాత్కాలిక ప్రభుత్వానికి మిరాజ్ డిమాండ్‌చేశారు. జెన్ జెడ్ ఉద్యమంలో కొనసాగిన యువతను దేశవ్యాప్తంగా ఏకంచేయాలంటే రాజకీయపార్టీ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

రష్యా నుంచి భారత్ ఇకపై చమురు కొనదు

ట్రంప్ నోట మళ్లీ అదే మాట

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయటాన్ని ఆపాలని భారత్‌ను బెదిరించేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే పాట పాడారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ ఇప్పటికే తగ్గించిందని, త్వరలో కొనుగోళ్లు పూర్తిగా ఆపేస్తుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో శుక్రవారం మధ్యాహ్నం ద్వైపాక్షిక చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రష్యా నుంచి ఇకముందు చమురును భారత్ కొనటం లేదు. వాళ్లు ఇప్పటికే కొనుగోలును తగ్గించారు. పాక్షికంగా లేదా పూర్తిగా ఆపేశారు. వాళ్లు వెనక్కు తగ్గుతున్నారు. గతంలో 38 శాతం చమురు కొనేవారు (రష్యా నుంచి). ఇకపై అలా చేయబోరు'అని ట్రంప్ వెల్లడించారు. మూడు రోజుల క్రితమే ట్రంప్ ఈ అంశంపై మాట్లాడారు. భారత ప్రధాని తనకు ఫోన్ చేసి రష్యా నుంచి చమురు కొనుగోలును ఆపేస్తున్నట్లు తెలిపారని వెల్లడించారు. అయితే, ట్రంప్ ప్రకటనను భారత్ గురువారం ఖండించింది. ట్రంప్‌కు మోదీ ఫోనే చేయలేదని స్పష్టం చేసింది. చమురు కొనుగోళ్ల విషయంలో తమ అవసరాలను బట్టే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

విమానాల కొనలు ఢీ

షికాగో: అమెరికాలో వ్యోమింగ్ రాష్ట్రంలోని ఎయిర్‌పోర్ట్‌లో నేలపై ఉన్న రెండు విమానాల రెక్కలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కానీ ఒక విమానం రెక్క స్వల్పంగా దెబ్బతినడంతో దానిలోని 113 మంది ప్రయాణికులు దిగిపోవాల్సి వచ్చింది. ఒహారే ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్–737 విమానం ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరేందుకు సిద్ధమైంది. అదే సమయంలో పార్కింగ్ స్థలానికి వెళ్లేందుకు యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 767 విమానం అటుగా వచ్చింది. దీని రెక్క బోయింగ్737 విమాన రెక్కకు బలంగా తగులుకుంటూ వెళ్లింది. దీంతో 737 రెక్క పాక్షికంగా దెబ్బతింది. ప్రయాణ మార్గమధ్యంలో ముప్పు వాటిల్లవచ్చనే అంచనాతో బోయింగ్737 విమానంలోని 113 మంది ప్రయాణికులను కిందకు దించేశారు.

అసోంలో ఎన్డీయేలో చేరిన బీపీఎఫ్

గౌహతి: అసోంలోని బోడోల్యాండ్ టెరిటోరియల్ కౌన్సిల్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్(బీపీఎఫ్) అధికార ఎన్డీయేలో చేరింది. దీంతో, ఈ పార్టీకి చెందిన ఎమ్మెల్యే చరణ్ బోరోను సీఎం హిమంత బిశ్వ శర్మ మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చరణ్ బోరోతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణం చేయించారు. బీపీఎఫ్ ఇప్పటి వరకు ఎన్డీయేకు వెలుపలి నుంచి మద్దతిచ్చింది. కాగా, తాజా చేరికతో అసోం కేబినెట్‌లో బీజేపీకి చెందిన సీఎం సహా 15 మంది, అసోం గణ పరిషత్(ఏజీపీ), యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్(యూపీపీఎల్), బీపీఎఫ్‌కు చెందిన ఒక్కొక్కరు ఉన్నట్లయింది.

ఏ పాఠశాలలోనైనా ప్రవేశం

కేరళ బాలికకు మంత్రి మద్దతు

తిరువనంతపురం: కొచ్చిలోని చర్చి ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక ప్రైవేట్ పాఠశాలలో హిజాబ్ ధరించకుండా అడ్డుకోవడంతో చదువుకు దూరమైన బాలికకు.. ఆమె కోరుకున్న ఏ ఇతర విద్యాసంస్థలోనైనా ప్రవేశం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేరళ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి హామీ ఇచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బాలిక ప్రభుత్వాన్ని సంప్రదిస్తే, ఈ మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. కాగా ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమిలో కీలక భాగస్వామి అయిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్.. హిజాబ్ వివాదంపై విద్యా శాఖ మంత్రి తీసుకున్న వైఖరికి శనివారం మద్దతు తెలిపింది.

అరెస్టయిన పంజాబ్ డీజీపీ సస్పెన్షన్

చండీగఢ్: లంచం కేసులో ఇటీవల అరెస్టయిన పంజాబ్ డిప్యూటీ ఐజీ(రోపార్ రేంజ్) హర్‌చరణ్ సింగ్ భుల్లార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వివిధ ఆరోపణలపై 48 గంటలకు మించి కస్టడీలో ఉన్న అధికారిని సస్పెండ్ చేయవచ్చంటూ అఖిల భారత సర్వీసుల నిబంధనలు చెబుతున్నాయని పంజాబ్ హోం శాఖ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం 48 గంటల గడువు ముగిసినందున సస్పెండ్ చేస్తున్నట్లు వివరించింది. గురువారం రూ.8 లక్షలు లంచం తీసుకున్న ఆరోపణలపై మరో వ్యక్తితోపాటు భుల్లార్‌ను సీబీఐ అరెస్ట్ చేయడం తెల్సిందే. శుక్రవారం సీబీఐ కోర్టు ఆయన్ను జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించింది. సీబీఐ అధికారులు భుల్లార్ నివాసంలో సోదాలు జరిపి రూ.7.50 కోట్ల నగదు, 2.50కిలో బంగారు ఆభరణాలు, రోలెక్స్, ర్యాడో వంటి 26 ఖరీదైన గడియారాలు తదితరాలను స్వాధీనం చేసుకోవడం తెల్సిందే. సిర్‌హింద్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారిపై 2023లో నమోదైన కేసు మాఫీ చేసినందుకు దళారీ ద్వారా ఈయన లంచం తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది.

భారత దేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించింది ఎవరు?


సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం

1. భారతదేశంలోని రాజ్యాధికారానికి మూలం?
   1) ప్రభుత్వం 2) ప్రజలు
   3) సార్వభౌమాధికారం 4) భూభాగం
2. భారతీయులు స్వయంగా తమ రాజ్యాంగాన్ని తామే రూపొందించుకోవాలనే భావనను తొలిసారిగా 1934లో తన అభిప్రాయాన్ని తెలియజేసింది ఎవరు?
   1) ఎం.ఎన్. రాయ్ 2) గాంధీజీ
   3) అంబేడ్కర్ 4) నెహ్రూ
3. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) 1942లో క్రిప్స్ కమిషన్ రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేస్తామని తొలిసారిగా ప్రతిపాదించింది
   బి) 1946లో కేబినెట్ కమిషన్ సిఫార్సు మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటైంది.
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) ఏదీకాదు
4. కింది వారిలో 1946లో కేబినెట్ కమిషన్ సభ్యులు కాని వారు ఎవరు?
   1) పెతిక్ లారెన్స్ 2) స్టాఫర్డ్ క్రిప్స్
   3) ఎ.వి. అలెగ్జాండర్ 4) లార్డ్ అట్లీ
5. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు సంబంధించి కింది మార్గదర్శక సూత్రాల్లో సరైంది ఏది?
   ఎ) రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల ఎన్నిక పరోక్ష ఎన్నిక
   బి) ప్రతి పది లక్షల జనాభాకు ఒక రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు ప్రాతినిధ్యం వహించాలి
   1) ఎ సరైంది
   2) బి సరైంది
   3) ఎ, బి రెండూ సరైనవి కాదు
   4) ఎ, బి రెండూ సరైనవే
6. కింది వాటిలో రాజ్యాంగ పరిషత్తు నిర్మాణానికి సంబంధించి సరైంది?
   ఎ) రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు 1946 జూలై - ఆగస్టులో జరిగాయి
   బి) రాజ్యాంగ పరిషత్తు ప్రారంభంలో సభ్యుల సంఖ్య 389
   సి) 389 మందిలో బ్రిటిష్ పాలిత రాష్ట్రాల నుంచి 292 మంది
   డి) స్వదేశీ సంస్థానాల నుంచి - 93
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, సి
7. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యులకు సంబంధించి సరైంది ఏది?
   1) స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల సంఖ్య - 299
   2) బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు - 229
   3) స్వదేశీ సంస్థానాల నుంచి ఎన్నికైనవారు-70
   4) పైవన్నీ సరైనవే
8. కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్‌కు బెంగాల్ నుంచి ఎంపికయ్యారు
   బి) దేశ విభజన ఫలితం అంబేడ్కర్ తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు
   సి) బాంబే రాష్ట్రం నుంచి రాజ్యాంగ పరిషత్‌కు అంబేడ్కర్ నామినేట్ అయ్యారు
   డి) అంబేడ్కర్ రాజ్యాంగ రచన కమిటీకి ఛైర్మన్‌గా పనిచేశారు
   1) ఎ 2) సి, డి
   3) బి, డి 4) ఎ, బి, సి, డి
9. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) గాంధీజీని 'బాపూజీ' అని తొలిసారిగా నెహ్రూ సంబోధించారు
   బి) గాంధీజీని 'జాతిపిత' అని తొలిసారిగా సుభాష్ చంద్రబోస్ సంబోధించారు
   సి) గాంధీజీని 'మహాత్మ' అని రవీంద్రనాథ్ ఠాగూర్ సంబోధించారు
   డి) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను గాంధీజీ 'గురుదేవ్' లేదా 'గురూజీ' అని పిలిచారు
   1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
   3) బి, సి 4) ఎ, సి, డి
10. కింది వారిలో రాజ్యాంగ పరిషత్తులో ఉన్న ప్రముఖ మహిళలు ఎవరు?
    1) శ్రీమతి సరోజినీ నాయుడు
    2) విజయలక్ష్మి పండిట్
    3) హంసా మెహతా
    4) పైవారందరూ
11. రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికైన వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన వారిలో సరైన జత ఏది?
    జాబితా-I
    i) ఆంగ్లో ఇండియన్లు
    ii) పార్శీలు iii) సిక్కులు
    iv) అఖిల భారత షెడ్యూల్డ్ కులాలు
    జాబితా-II
    a) ఫ్రాంక్ ఆంథోని
    b) హెచ్.పి. మోడీ
    c) బల్‌దేవ్ సింగ్
    d) డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-c, ii-b, iii-a, iv-d
12. రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది.
    బి) మొదటి సమావేశానికి 211 మంది హాజరయ్యారు.
    సి) రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడిగా డాక్టర్ సచ్చిదానంద సిన్హాను ఎన్నుకున్నారు
    డి) ఫ్రాంక్ ఆంథోని ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు
    1) ఎ, బి 2) ఎ, డి



    3) బి, సి 4) ఎ, బి, సి, డి
13. 1946 డిసెంబర్ 11న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా ప్రతిపాదించిందెవరు?
    1) హెచ్.సి. ముఖర్జీ 2) వి.టి.కృష్ణమాచారి
    3) జె.బి. కృపలానీ 4) జవహర్‌లాల్ నెహ్రూ
14. రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారు ఎవరు?
    1) బెనగల్ నరసింగ రావు
    2) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
    3) మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్
    4) ఫ్రాంక్ ఆంథోని
15. రాజ్యాంగ పరిషత్‌లో వివిధ అంశాల పరిశీలనకు మొత్తం ఎన్ని కమిటీలను ఏర్పాటు చేశారు?
    1) 11 2) 22 3) 33 4) 44
16. డ్రాఫ్టింగ్ కమిటీలో అధ్యక్షుడితో సహా మొత్తం సభ్యుల సంఖ్య ఎంత?
    1) 5 + 1 = 6 2) 6 + 1 = 7
    3) 1 + 7 = 8 4) 4 + 1 = 5
17. కింది వారిలో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులు కాని వారు ఎవరు?
    1) కృష్ణస్వామి అయ్యంగార్
    2) కె.ఎం.మున్షీ
    3) గోపాలస్వామి అయ్యంగార్
    4) గాంధీజీ
18. రాజ్యాంగ పరిషత్.. రాజ్యాంగ ముసాయిదాను ఎప్పుడు ఆమోదించింది?
    1) 1948 నవంబర్ 26
    2) 1949 నవంబర్ 26
    3) 1947 నవంబర్ 26
    4) 1950 నవంబర 26
19. రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన సమయం?
    1) 2 సంవత్సరాల 10 నెలల 11 రోజులు
    2) 3 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
    3) 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
    4) 1 సంవత్సరం
20. భారత రాజ్యాంగ పరిషత్ 1950 జనవరి 24న జరిగిన చివరి సమావేశానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య 284
    2) భారత గణతంత్ర ప్రథమ అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను పరిషత్ ఎన్నుకొంది
    3) జాతీయ గీతాన్ని, గేయాన్ని ఆమోదించింది
    4) పైవన్నీ సరైనవే
21. జతపరచండి.
    కమిటీలు:
    i) రాజ్యాంగ సారథ్య సంఘం
    ii) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
    iii) రాజ్యాంగ సలహా సంఘం
    iv) నిబంధనల కమిటీ
    అధ్యక్షుడు:
    a) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    b) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
    c) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    d) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-a, ii-b, iii-c, iv-d
    4) i-c, ii-a, iii-d, iv-b
22. రాజ్యాంగ పరిషత్‌లో సబ్‌కమిటీలను జతపరచండి.
    జాబితా-I
    i) ప్రాథమిక హక్కుల ఉపసంఘం
    ii) ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ
    iii) మైనారిటీల సబ్ కమిటీలు
    iv) ప్రత్యేక ప్రాంతాల కమిటీ
    జాబితా-II
    a) జె.బి కృపలానీ
    b) గోపినాథ్ బోడోలాయ్
    c) హెచ్.సి. ముఖర్జీ d) ఎ.వి. టక్కర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-b, ii-c, iii-a, iv-d
23. రాజ్యాంగ పరిషత్ చిహ్నం ఏది?
    1) ఐరావతం 2) సింహం
    3) పులి 4) నెమలి
24. ఏ వ్యక్తిని రాజ్యాంగ పరిషత్‌కు స్నేహితుడు, మార్గదర్శిగా, తత్త్వవేత్తగా పేర్కొంటారు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
    2) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    3) నెహ్రూ 4) డాక్టర్ బి.ఎన్. రావు
25. 'భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాలన్నింటినీ కొల్లగొట్టి రూపొందించిందిగా వర్ణిస్తే నేను గర్వపడతాను. ఎందుకంటే మంచి ఎక్కడున్నా గ్రహించడం తప్పేమీ కాదు' అని పేర్కొంది ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
    2) బాబూ రాజేంద్రప్రసాద్
    3) జవహర్‌లాల్ నెహ్రూ
    4) కె. ఎం. మున్షీ
26. భారత రాజ్యాంగాన్ని 'న్యాయవాదుల స్వర్గం, సుదీర్ఘమైంది,దివ్యమైంది'అని వర్ణించిందెవరు?
    1) సర్ ఐవర్ జెన్నింగ్
    2) గ్రాన్‌విల్ ఆస్టిన్
    3) విన్‌స్టన్ చర్చిల్ 4) ఎవరూ కాదు
27. రాజ్యాంగ రచనలో సమన్వయ పద్ధతి కంటే సర్దుబాటు పద్ధతికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నదెవరు?
    1) ఒ.పి. గోయల్ 2) జవహర్‌లాల్ నెహ్రూ
    3) రాజేంద్రప్రసాద్ 4) విన్‌స్టన్ చర్చిల్
28. భారత రాజ్యాంగానికి నకలుగా కింది ఏ చట్టాన్ని పేర్కొంటారు?
    1) 1919 చట్టం
    2) 1935 భారత ప్రభుత్వ చట్టం
    3) 1947 భారత స్వాతంత్ర్య చట్టం
    4) ఏదీకాదు
29. కింది వాటిలో భారత రాజ్యాంగంలో బ్రిటన్ రాజ్యాంగం నుంచి స్వీకరించని అంశం?
    1) పార్లమెంటరీ ప్రభుత్వ విధానం
    2) ఎన్నికల వ్యవస్థ, ఏక పౌరసత్వం
    3) సమన్యాయ పాలన
    4) రాష్ట్రపతి ఎన్నిక విధానం
30. అమెరికా రాజ్యాంగం నుంచి భారత రాజ్యాంగంలోకి స్వీకరించిన అంశాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
    ఎ) రాష్ట్రపతిని తొలగించే పద్ధతి మహాభియోగ తీర్మానం
    బి) న్యాయ సమీక్షాధికారం,ప్రాథమిక హక్కులు
    సి) రాజ్యాంగ ప్రవేశిక
    డి) లిఖిత రాజ్యాంగం
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
    3) సి, డి 4) బి, సి
31. జతపరచండి.
    జాబితా-I
    i) ఉమ్మడి జాబితా
    ii) రాజ్యాంగ సవరణ పద్ధతి
    iii) ప్రాథమిక విధులు
    iv) న్యాయ సమీక్ష
    జాబితా-II
    a) ఆస్ట్రేలియా b) దక్షిణాఫ్రికా
    c) రష్యా d) అమెరికా
    1) i-d, ii-c, iii-a, iv-b
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-a, ii-c, iii-d, iv-b
32. కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) భారత రాజ్యాంగంలోని ప్రారంభంలో 395 ఆర్టికల్స్, 8షెడ్యూళ్లు, 22 భాగాలు ఉన్నాయి
    బి) ప్రస్తుతం 12 షెడ్యూళ్లు ఉన్నాయి
    సి) ఐదో షెడ్యూల్‌లో షెడ్యూల్ ప్రాంతాల పరిపాలనా వివరాలు ఉన్నాయి
    డి) ఏడో షెడ్యూల్‌లో కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఉంది
    1) ఎ మాత్రమే 2) డి మాత్రమే
    3) ఎ, బి, సి, డి 4) ఎ, బి
33. 8వ షెడ్యూల్‌కు సంబంధించి సరైంది?
    ఎ) గుర్తింపు పొందిన అధికార భాషల గురించి పేర్కొంటుంది
    బి) రాజ్యాంగం అమలు నాటికి గుర్తింపు భాషలు - 14
    సి) ప్రస్తుతం రాజ్యాంగం గుర్తించిన భాషలు- 22
    డి) 92వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గుర్తించిన భాషలు బోడో,డోంగ్రి,సంతాలి, మైథిలీ
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
    3) ఎ, సి 4) సి, డి
34. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించిన షెడ్యూల్ ఏది?
    1) 1వ షెడ్యూల్ 2) 3వ షెడ్యూల్
    3) 7వ షెడ్యూల్ 4) 10వ షెడ్యూల్
35. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఏ ప్రధానమంత్రి కాలంలో అమల్లోకి వచ్చింది?
    1) జవహర్‌లాల్ నెహ్రూ
    2) పి.వి. నరసింహారావు
    3) రాజీవ్ గాంధీ
    4) మన్మోహన్ సింగ్
36. భారత దేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించింది ఎవరు?
    1) పాల్ ఆఫ్ బీ 2) కె.సి. వేర్
    3) డి.ఎన్. బెనర్జీ 4) మోరిస్ జోన్స్
37. భారత రాజ్యాంగాన్ని 'సహకార సమాఖ్య' అని అభివర్ణించింది ఎవరు?
    1) గ్రాన్‌విల్ ఆస్టిన్, డి.ఎన్. బెనర్జీ
    2) పాల్ ఆఫ్ బీ
    3) కె.సి. వేర్ 4) ఐవర్ జెన్నింగ్స్


సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 4	5) 4
6) 2	7) 4	8) 4	9) 1	10) 4
11) 1	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 4	18) 2	19) 3	20) 4
21) 3	22) 1	23) 1	24) 4	25) 1
26) 1	27) 1	28) 2	29) 4	30) 1
31) 2	32) 3	33) 1	34) 4	35) 3
36) 2	37) 1			

'తీన్‌మూర్తి భవన్ ' ఎవరి నివాసం?

మాదిరి ప్రశ్నలు

1. గాంధీ ఏ ఉద్యమం సందర్భంగా 'ఈ క్షణం నుంచి ప్రతి ఒక్కరు తమను తాము స్వతంత్రులుగా పరిగణించాలి. వ్యవహరించాలి' అని వ్యాఖ్యానించారు?
   1) ఖిలాఫత్ ఉద్యమం
   2) సహాయ నిరాకరణోద్యమం
   3) శాసనోల్లంఘనోద్యమం
   4) క్విట్ ఇండియా ఉద్యమం
2. హిందూ మహాసభను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1915 2) 1917 3) 1919 4) 1922
3. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) కాదంబినీ గంగూలీ - ఐఎన్‌సీ మొదటి మహిళా గ్రాడ్యుయేట్ ప్రతినిధి (కలకత్తా)
   2) దాదాభాయ్ నౌరోజీ-1866లో లండన్‌లో ఈస్టిండియా అసోసియేషన్ స్థాపన
   3) జవహర్‌లాల్ నెహ్రూ- 1929 లాహోర్ ఐఎన్‌సీకి అధ్యక్షుడు
   4) రవీంద్రనాథ్ ఠాగూర్-చౌరీచౌరా సంఘటనతో తన నైట్‌హుడ్ బిరుదు త్యజించాడు
4. విక్టోరియా మహారాణి ప్రకటనను లార్డ్ కానింగ్ ఎక్కడ నుంచి ప్రకటించాడు?
   1) అహ్మదాబాద్ 2) ఢిల్లీ
   3) అలహాబాద్ 4) లాహోర్
5. ఇల్బర్ట్ బిల్లు ఎప్పుడు రూపొందించారు?
   1) 1881 2) 1882 3) 1883 4) 1884
6. 'భారత జాతీయోద్యమానికి బైబిల్'గా దేన్ని పేర్కొంటారు?
   1) ఆనంద్ మఠ్ 2) గీతాంజలి
   3) భవానీ మందిర్ 4) బంధీ జీవన్
7. ఎల్ఫిన్‌స్టన్ కళాశాల(1834)ను ఎక్కడ స్థాపించారు?
   1) మద్రాస్ 2) కలకత్తా
   3) బొంబాయి 4) కటక్
8. జతపరచండి.
   జాబితా - I
   i) 1916 ii) 1913
   iii) 1922 iv) 1946
   v) 1928
   జాబితా - II
   ఎ) నెహ్రూ నివేదిక రూపకల్పన
   బి) రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు
   సి) గదర్ పార్టీ స్థాపన
   డి) లక్నో ఒప్పందం
   ఇ) చౌరీచౌరా సంఘటన
   1) i-ఇ, ii- డి, iii- సి, iv-బి,v-ఎ.
   2) i- సి, ii- ఎ, iii- డి, iv-ఇ,v-బి.
   3) i- డి, ii- సి, iii- ఇ, iv-బి,v-ఎ.
   4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
9. ఇల్బర్ట్ బిల్లు వివాద సమయంలో బ్రిటన్ ప్రధాని ఎవరు?
   1) పామిర్‌స్టోన్ 2) గ్లాడ్‌స్టన్
   3) నైవెలీ చాంబర్లీన్ 4) డేవిడ్ లాయిడ్ జార్జి
10. జలియన్ వాలాబాగ్ దురంతంపై విచారణకు నియమించిన కమిటీ ఏది?
    1) సర్ మాక్ డొనాల్డ్ కమిటీ
    2) హంటర్ కమిటీ 3) ఫ్రేజర్ కమిటీ
    4) రిచర్డ్స్ స్ట్రాచీ కమిటీ
11. సహాయ నిరాకరణోద్యమాన్ని ఆమోదించిన నాగ్‌పూర్ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి (1920) అధ్యక్షుడు ఎవరు?
    1) లాలాలజపతిరాయ్
    2) సి. విజయ రాఘవాచారి
    3) మహాత్మా గాంధీ 4) చిత్తరంజన్ దాస్
12. సుభాష్ చంద్రబోస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కళాశాల ఏది?
    1) బెంగాల్ నేషనల్ కాలేజ్
    2) మదనపల్లి నేషనల్ కాలేజ్
    3) మచిలీపట్నం నేషనల్ కాలేజ్
    4) గుజరాత్ విద్యాపీఠ్
13. కింది వాటిలో సరైన జత ఏది?
    1) 1922 ఫిబ్రవరి 12 - సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల
    2) 1911 డిసెంబర్ 11 - బ్రిటిష్ ఇండియా రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చడం
    3) 1928 ఫిబ్రవరి 3 - సైమన్ కమిషన్ బొంబాయిలో అడుగు పెట్టింది
    4) పైవన్నీ సరైనవే
14. జతపరచండి.
    జాబితా - I
    i) డా.బి.ఆర్. అంబేడ్కర్
    ii) ఇ.వి. రామస్వామి నాయకర్
    iii) బాలగంగాధర తిలక్
    iv) స్వామి వివేకానంద
    v) కె.కె.మిత్రా
    జాబితా - II
    ఎ) ఉద్బోధన్ బి) సంజీవని
    సి) మరాఠీ డి) మూక్ నాయక్
    ఇ) కుడి అరసు
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి, v- ఇ
    2) i- డి, ii- ఇ, iii- సి, iv-ఎ, v- బి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v- ఇ
    4) i- సి, ii- డి, iii- ఇ, iv-బి, v- ఎ
15. 'భారతదేశ బిస్మార్క్' అని ఎవరిని పిలుస్తారు?
    1) దాదాభాయ్ నౌరోజీ
    2) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    3) గోపాలకృష్ణ గోఖలే
    4) లాలాలజపతి రాయ్
16. కాశ్మీర్‌ను స్వతంత్ర భారత్‌లో విలీనం చేసింది ఎవరు?
    1) హరిసింగ్ 2) మార్తాండ వర్మ
    3) రతన్‌సింగ్ 4) చైత్‌సింగ్
17. హైదరాబాద్‌లో జాయిన్ ఇండియా ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
    1) 1947 ఆగస్టు 7 2) 1946 సెప్టెంబర్ 6
    3) 1948 సెప్టెంబర్ 13 4) 1947 ఆగస్టు 16
18. జతపరచండి.
    జాబితా - I
    i) బ్రహ్మర్షి ii) మహర్షి
    iii) సరిహద్దు గాంధీ iv) రాజర్షి
    v) దేశబంధు
    జాబితా - II
    ఎ) పురుషోత్తందాస్ టాండన్
    బి) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ మెథడ్స్

    సి) చిత్తరంజన్ దాస్
    డి) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    ఇ) బులుసు సాంబమూర్తి
    1) i- ఇ, ii- డి, iii- సి, iv-బి, v-ఎ.
    2) i- డి, ii- ఇ, iii- బి, iv-ఎ, v-సి.
    3) i- సి, ii- ఎ, iii- డి, iv-ఎ, v-బి.
    4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v-ఇ.
19. 1954 ఏప్రిల్ 29న పంచశీల ఒప్పందం భారత్ చైనాల మధ్య ఏ ప్రాంతంలో జరిగింది?
    1) బీజింగ్ 2) పెకింగ్
    3) షాంగై 4) షాన్సీ
20. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి తెలుగువ్యక్తి?
    1) భోగరాజు పట్టాభి సీతారామయ్య
    2) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
    3) పి. ఆనందాచార్యులు
    4) ఆచార్య ఎన్.జి. రంగా
21. 1946 సెప్టెంబర్ 2న ఏర్పడిన నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో ఆర్థికమంత్రి ఎవరు?
    1) లియాఖత్ అలీ 2) సయ్యద్ జహీర్
    3) మహ్మద్ అలీ జిన్నా 4) రహ్మత్ అలీ చౌదరి
22. 'తీన్‌మూర్తి భవన్ ' ఎవరి నివాసం?
    1) జవహర్‌లాల్ నెహ్రూ
    2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    3) చిత్తరంజన్ దాస్ 4) దాదాభాయ్ నౌరోజీ
23. మంత్రిత్రయ రాయబారం(1946) భారత్ లో పర్యటించిన కాలంలో అప్పటి వైస్రాయి ఎవరు?
    1) లార్డ్ లిన్‌లిత్ గో 2) లార్డ్ వెవేల్
    3) లార్డ్ విల్లింగ్‌టన్ 4) లార్డ్ మౌంట్ బాటెన్
24. భారత స్వాతంత్ర్య చట్టం ఎప్పుడు రాజ సమ్మతి పొందింది?
    1) 1947 ఆగస్టు 14 2) 1947 ఆగస్టు 15
    3) 1947 ఆగస్టు 6 4) 1947 జూలై 18
25. భారత్‌కు స్వాతంత్ర్యం లభించే బిల్లును బ్రిటిష్ పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
    1) 1947 జూలై 4 2) 1947 జూలై 14
    3) 1947 జూలై 16 4) 1947 జూలై 17
26. దీపావళి ప్రకటన చేసిన వైస్రాయ్?
    1) లార్డ్ రీడింగ్ 2) లార్డ్ ఇర్విన్
    3) లార్డ్ లిన్‌లిత్‌గో 4) లార్డ్ వెవేల్
27. గదర్ పార్టీ తొలి అధ్యక్షుడు ఎవరు?
    1) కర్తార్ సింగ్ శరభా 2) గులాబ్ కౌర్
    3) సోహన్ సింగ్ భక్నా 4) రాస్ బిహారీ బోస్
28. 'స్టాలిన్‌గ్రాడ్ ఆఫ్ ఇండియా' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
    1) అహ్మదాబాద్ 2) బొంబాయి
    3) కాన్పూర్ 4) కలకత్తా
29. లీడర్ పత్రిక స్థాపకుడు ఎవరు?
    1) దర్శి చెంచయ్య 2) మదన్‌మోహన్ మాలవ్య
    3) లాలా హరదయాళ్ 4) మోతీలాల్ నెహ్రూ
30. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మధుశాల- హరివంశరాయ్ బచ్చన్
    2) డిస్కవరీ ఆఫ్ ఇండియా- మోతీలాల్ నెహ్రూ
    3) సావిత్రి - అరవింద ఘోష్
    4) హింద్ స్వరాజ్ - ఎం.కె. గాంధీ
31. ఇండియన్ సివిల్ సర్వీస్‌కు ఎంపిక అయిన తొలి భారతీయుడు?
    1) దేవేంద్రనాథ్ ఠాగూర్
    2) సి. సుబ్రమణ్యం అయ్యర్
    3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) వి.పి. మీనన్
32. బాలశాస్త్రి జంబేకర్ స్థాపించిన పత్రిక ఏది?
    1) దర్పణ్ 2) అమృతబజార్
    3) సంవాద కౌముది 4) కేసరి
33. రాజకీయ సంస్కరణలు కావాలని ఉద్యమించిన తొలి భారతీయుడు?
    1) బంకించంద్ర ఛటర్జీ
    2) రాజా రామ్మోహన్ రాయ్
    3) ఆనందమోహన్ బోస్
    4) ఫిరోజ్ షా మెహతా
34. లార్డ్‌రిప్పన్ విద్యాకమిషనర్‌గా విలియం హంటర్‌ను ఎప్పుడు నియమించారు?
    1) 1880 2) 1881 3) 1882 4) 1883
35. 'స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా'ను వ్యవస్థీకరించిన వైస్రాయి ఎవరు?
    1) లార్డ్ మేయో 2) లార్డ్ డఫ్రిన్
    3) లార్డ్ కానింగ్ 4) లార్డ్ వెవేల్
36. కింది వాటిలో సరైన జత ఏది?
    1) జెన్మిలు-మోప్లా ప్రాంత జమీందారులు
    2) పాబ్నా ఉద్యమం- తూర్పు బెంగాల్
    3) జనతా వారపత్రిక - బి.ఆర్. అంబేడ్కర్
    4) పైవన్నీ సరైనవే
37. కేరళలో ప్రథమ ఆధునిక నవల 'ఇందులేఖ' రచయిత ఎవరు?
    1) చందర్ మీనన్ 2) ఎమ్.పద్మనాభ పిళ్లై
    3) కె.రామకృష్ణ పిళ్లై 4) సి.వి. రామన్ పిళ్లై
38. స్వరాజ్ అనే పదాన్ని తొలిసారి ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఉపయోగించారు?
    1) 1885 - బొంబాయి 2) 1886 - కలకత్తా
    3) 1906- కలకత్తా 4) 1907- సూరత్
39. జన్మభూమి (ఇంగ్లిష్) పత్రికాధినేత?
    1) కాశీనాథుని నాగేశ్వరరావు
    2) పి. ఆనందాచార్యులు
    3) భోగరాజు పట్టాభి సీతారామయ్య
    4) అయ్యదేవర కాళేశ్వరరావు
40. 1908 ఆలిండియా ముస్లిం లీగ్ మొదటి సమావేశానికి అధ్యక్షుడు ఎవరు?
    1) మహమ్మద్ అలీ జిన్నా
    2) సర్ సయ్యద్ అలీ ఇమాం
    3) మౌలానా అబుల్ కలాం ఆజాద్
    4) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
41. కింది వారిలో రవీంద్రనాథ్ ఠాగూర్‌ను 'గురుదేవ్' అని తొలిసారి పిలిచిందెవరు?
    1) గోపాలకృష్ణ గోఖలే
    2) మహాత్మాగాంధీ 3) నేతాజీ బోస్
    4) జవహర్‌లాల్ నెహ్రూ
42. భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు గాంధీజీని జాతి నాయకుడిగా ఏ సమావేశంలో గుర్తించారు?
    1) 1916- లక్నో 2) 1920- నాగ్‌పూర్
    3) 1925-కాన్పూర్ 4) 1929 -లాహోర్
43. జతపరచండి.
    నినాదం
    i) డివైడ్ అండ్ క్విట్ ii) జైహింద్
    iii) బోధించు, సమీకరించు, పోరాడు
    iv) స్వరాజ్యం నా జన్మహక్కు v) జై జగత్
    ప్రముఖుడు
    ఎ) ఆచార్యా వినోబాబావే
    బి) లోకమాన్య తిలక్
    సి) మహమ్మద్ అలీ జిన్నా
    డి) డా.బి.ఆర్. అంబేడ్కర్
    ఇ) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    1) i-ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
    2) i- ఇ, ii- డి, iii- బి, iv-ఎ,v-సి.
    3) i- సి, ii- ఇ, iii- డి, iv-బి,v-ఎ.
    4) i- డి, ii- సి, iii- ఎ, iv-ఇ,v-బి.
44. కింది వాటిలో సరైన జత ఏది?
    1) భారత కోకిల - సరోజినీ నాయుడు
    2) క్విట్ ఇండియా ఉద్యమరాణి - అరుణా అసఫ్ అలీ
    3) ఇండియన్ జోన్ ఆఫ్ ఆర్క్ - ఝాన్సీ లక్ష్మీబాయి
    4) పైవన్నీ సరైనవే
45. మదన్ మోహన్ మాలవ్య ప్రపంచవ్యాప్తం చేసిన సూక్తి ఏది?
    1) సత్యమేవ జయతే
    2) సత్యం శివం సుందరం
    3) శీలేన శోభతే విద్య 4) స్పర్ధయా వర్ధతే విద్య
46. భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశానికి హాజరైన హైదరాబాద్ ముస్లిం నాయకుడు?
    1) సయ్యద్ బిల్‌గ్రామి 2) బద్రుద్దీన్ త్యాబ్జీ
    3) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
    4) మౌల్వీ మహ్మద్ ముర్తజ్
47. 1948 ఆపరేషన్ పోలో కాలంలో నిజాం సైన్యాలకు ఎవరు నాయకత్వం వహించారు?
    1) ఎల్‌డ్రూస్ 2) విలియం పామర్
    3) లాయక్ అలీ 4) కాశీం రజ్వీ
48. 'జోడేఘాట్ జ్వాల' అని ఎవరిని పిలుస్తారు?
    1) దొడ్డి కొమరయ్య
    2) కొమురం భీం 3) రాంజీ గోండ్
    4) సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
49. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను ఎప్పుడు స్థాపించారు?
    1) 1936 2) 1938 3) 1941 4) 1943
50. కింది వాటిలో సరైంది ఏది?
    1) సురవరం ప్రతాపరెడ్డి-గోల్కొండ పత్రిక
    2) షోయబుల్లాఖాన్ - ఇమ్రోజ్ పత్రిక
    3) ఆంధ్రపత్రిక-కాశీనాథుని నాగేశ్వరరావు
    4) పైవన్నీ సరైనవే
51. 'నీల్ దర్పణ్' గ్రంథకర్త ఎవరు?
    1) బంకించంద్ర ఛటర్జీ 2) దీనబంధు మిత్ర
    3) ముల్కరాజ్ ఆనంద్ 4) మున్షీప్రేమ్ చంద్
52. భారత్‌లో తొలి వితంతు వివాహం చేసుకున్న బెంగాల్ వాసి?
    1) శ్రీష్‌చంద్ర విద్యారత్న
    2) గౌతంఘోష్ 3) కృష్ణకుమార్ మిత్ర
    4) హరీష్ చంద్ర ముఖర్జీ
53. చివరి కాశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఏ వంశానికి చెందినవారు?
    1) కార్కోట 2) డోగ్రా
    3) చౌహాన్ 4) సేన
54. మహా భారతాన్ని బెంగాలీలోకి అనువదించిందెవరు?
    1) శంభునాథ్ పండిట్ 2) మోతీలాల్ రాయ్
    3) కాళీ ప్రసన్న సింగ్ 4) శిశిర్ కుమార్ ఘోష్
55. భారతదేశపు ఛార్లెస్ డికెన్స్ అని కీర్తి పొందినవారు?
    1) ముల్కరాజ్ ఆనంద్ 2) ఆర్.కె.నారాయణ్
    3) మున్షీ ప్రేమ్‌చంద్ 4) దీనబంధు మిత్రా
56. 1893లో గాంధీజీ ఏ భారతీయ వ్యాపారవేత్తకు న్యాయసలహాదారుగా దక్షిణాఫ్రికా వెళ్లాడు?
    1) జమ్నాలాల్ బజాజ్ 2) దాదా అబ్దుల్లా
    3) రాజ్‌కుమార శుక్లా 4) ప్రమోద్ మిట్టర్
57. జి.ఎం.ఛటర్జీ స్థాపించిన సంస్థ ఏది?
    1) ఫ్రీ ఇండియా సొసైటీ
    2) భారత్ మాతా సొసైటీ
    3) అఖిలభారత హోంరూల్ లీగ్
    4) అనుశీలన్ సమితి

సమాధానాలు

1) 4	2) 1	3) 4	4) 3	5) 3
6) 1	7) 3	8) 3	9) 2	10) 2
11) 2	12) 1	13) 4	14) 2	15) 2
16) 1	17) 1	18) 2	19) 2	20) 3
21) 1	22) 1	23) 2	24) 4	25) 1
26) 2	27) 3	28) 1	29) 2	30) 2
31) 3	32) 1	33) 2	34) 3	35) 1
36) 4	37) 1	38) 3	39) 3	40) 2
41) 2	42) 2	43) 3	44) 4	45) 1
46) 3	47) 1	48) 2	49) 2	50) 4
51) 2	52) 1	53) 2	54) 3	55) 1
56) 2	57) 2			

‘గేట్‌వే ఆఫ్ శ్రీనగర్’ అని పిలిచే కనుమ ఏది?

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిని జతపరచండి?
జాబితా-I జాబితా-II
i) మాక్‌డోక్ డింపెప్ లోయ a) పశ్చిమ బెంగాల్
ii) నుబ్రాలోయ b) మేఘాలయ
iii) కులులోయ c) జమ్మూ కశ్మీర్
iv) కాలింపాంగ్ d) హిమాచల్ ప్రదేశ్
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-b, ii-c, iii-d, iv-a
4) i-d, ii-b, iii-a, iv-c

2. కింది వాటిని జతపరచండి.
జాబితా-I
i) కచార్ కొండలు
ii) డాప్లా కొండలు
iii) లుషాయి కొండలు
iv) జయంతియా కొండలు
జాబితా-II
a) మేఘాలయ b) మిజోరాం
c) అరుణాచల్ ప్రదేశ్ d) అసోం
1) i-a, ii-c, iii-d, iv-b
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-c, ii-a, iii-d, iv-b
4) i-d, ii-c, iii-b, iv-a

3. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జస్కార్ పర్వత శ్రేణి, కారకోరం పర్వత శ్రేణికి ఉత్తరంగా విస్తరించి ఉంది.
బి) లడఖ్, జస్కార్ శ్రేణుల మధ్య సింధూనది ప్రవహిస్తోంది.
సి) కారకోరం పర్వతశ్రేణి ట్రాన్స్ హిమాలయాల్లో ఒక భాగం
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

4. కింది వాటిలో సరికానిది ఏది?
1) ‘కనుమ’ అంటే రెండు కొండల మధ్య ఏర్పడే సహజ రహదారి
2) అంతర్వేది అంటే రెండు నదుల మధ్య ఉన్న సారవంతమైన ప్రాంతం
3) అనేక నదులకు జన్మస్థానమైన ‘మానస సరోవరం’ హిమాలయ పర్వత శ్రేణిలో ఉంది.
4) ‘డూన్‌లు’ అంటే హిమాచల్, శివాలిక్ పర్వత శ్రేణుల మధ్య ఉన్న సన్నని సమదైర్ఘ్య లోయలు

5. నేపాల్ హిమాలయాలు ఏ రెండు నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
1) కాళీ , తీస్తా నదులు
2) తీస్తా, సట్లెజ్ నదులు
3) సట్లెజ్, కాళీ నదులు
4) తీస్తా, బ్రహ్మపుత్ర నదులు

6. కింది వాటిలో సరికానిది ఏది?
1) హిమాలయాలు అతితరుణ ముడత పర్వతాలు
2) ఇవి కేంబ్రియన్ మహాయుగంలో ఏర్పడ్డాయి.
3) ఇవి ప్రపంచంలో ఎత్తైన పర్వత శ్రేణులు 4) ఇవి సుమారు 5లక్షల చ.కి.మీ.ల వైశాల్యం కలిగి ఉన్నాయి.

7. కింది వాటిలో సరికాని జత ఏది?
1) నామ్చాబర్వా- అరుణాచల్ ప్రదేశ్
2) అన్నపూర్ణ - ఉత్తరాఖండ్
3) నంగప్రభాత్ - జమ్మూ కశ్మీర్
4) మకాలు - నేపాల్

8. కిందివాటిలో సరైంది ఏది?



ఎ) శివాలిక్ పర్వత శ్రేణులు గ్రేటర్ హిమాలయాలకు దక్షిణంగా విస్తరించి ఉన్నాయి.
బి) లెస్సర్ హిమాలయాలు బాహ్య హిమాలయాలకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
సి) శివాలిక్ హిమాలయాలు మయోసిన్ యుగంలో ఏర్పడ్డాయి.
1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
3) ఎ, బి 4) బి, సి

9. జతపరచండి.
జాబితా-I
i) కైలాస కొండలు
ii) సులేమాన్ పర్వతాలు
iii) కున్‌లున్ పర్వతాలు
iv) హిందుకుష్ పర్వతాలు
జాబితా-II
a) ఆఫ్ఘనిస్తాన్ b) చైనా
c) పాకిస్తాన్ d) టిబెట్
1) i-c, ii-d, iii-a, iv-b
2) i-d, ii-a, iii-b, iv-c
3) i-d, ii-c, iii-b, iv-a
4) i-b, ii-c, iii-d, iv-a

10. ‘ఆసియా ఖండానికి వెన్నెముక’ అని ఏ పర్వత శ్రేణిని పిలుస్తారు?
1) లడఖ్ శ్రేణి
2) జస్కార్ శ్రేణి
3) కైలాస కొండలు
4) కారకోరం పర్వతశ్రేణి

11. కింది వాటిలో హిమాలయ పర్వత శ్రేణిలో లేని శిఖరం ఏది ?
1) కాంచన గంగా 2) గాడ్విన్ ఆస్టిన్
3) మకాలు 4) ధవళగిరి

12. కింది వాటిలో సరికానిది ఏది?
1) ‘గేట్ వే ఆఫ్ శ్రీనగర్’ అని బనిహాల్ కనుమను పిలుస్తారు
2) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం ‘సియాచిన్’
3) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రెండో శిఖరం కాంచనగంగ
4) భారతదేశంలో ఎత్తైన కనుమ ఖార్దుంగ్లా కనుమ

13. జతపరచండి.
జాబితా-I
i) నిథులా కనుమ ii) షిప్కిలా కనుమ
iii) జోజిలా iv) నాథులా
జాబితా-II
a) సిక్కిం
b) ఉత్తరాఖండ్
c) హిమాచల్ ప్రదేశ్
d) జమ్మూకశ్మీర్
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-a, ii-b, iii-c, iv-d
4) i-d, ii-c, iii-b, iv-a

14. షిప్కిలా కనుమ ద్వారా భారతదేశంలో ప్రవేశించే నది ఏది?
1) సింధూనది 2) జీలం
3) బ్రహ్మపుత్ర 4) సట్లెజ్

15. శివాలిక్ పర్వత శ్రేణులకు సంబంధించి సరైంది ఏది?
ఎ) ఇవి దిగువ ప్లిస్టోసీన్ యుగంలో ఏర్పడ్డాయి.
బి) ఇవి ఇసుక, గ్రావెల్ కంగ్లా మరేట్ వంటి శిలలతో ఏర్పడ్డాయి.
సి) ఈ పర్వత శ్రేణుల్లో శృంగాకారపు అడవులు విస్తరించి ఉన్నాయి.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

16. హిమాచల్ పర్వత శ్రేణులకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ఇవి వేసవి విడిది కేంద్రాలకు ప్రసిద్ధి చెందాయి.
బి) ఇవి గ్రానైట్, నీస్ వంటి శిలలతో ఏర్పడ్డాయి.
సి) ఇవి సుమారు 14 మిలియన్ సంవత్సరాల కాలంలో ఏర్పడ్డాయి.
డి) ఇవి హిమాద్రి శ్రేణులకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

17. గంగా - సింధు మైదానం ఏయే దేశాల్లో విస్తరించి ఉంది?
1) భారత్, బంగ్లాదేశ్ , మయన్మార్
2) భారత్, బంగ్లాదేశ్ , పాకిస్తాన్
3) భారత్, నేపాల్ , పాకిస్తాన్
4) భారత్, పాకిస్తాన్ , చైనా

18. చోస్ అంటే ఏమిటి?
1) చిత్తడి ప్రదేశం 2) నీటి గుంటలు
3) బురద దిబ్బలు 4) ఇసుక దిబ్బలు

19. జతపరచండి.
జాబితా-I
i) బారిదోబ్ ii) ఛాజ్
iii) రేచన iv) బిస్త్
జాబితా-II
a) బియాస్- రావి నదుల మధ్య
b) చీనాబ్- జీలం నదుల మధ్య
c) రావి- చీనాబ్ నదుల మధ్య
d) బియాస్- సట్లెజ్ నదుల మధ్య
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-c, ii-d, iii-b, iv-a
3) i-d, ii-c, iii-b, iv-a
4) i-a, ii-b, iii-c, iv-d

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

20. కింది వాటిలో సరికానిది ఏది?
1) త్రియాన్ అంటే కదిలే ఇసుక దిబ్బలు
2) రన్స్ అంటే ఉప్పునీటి కయ్యలు
3) రోహి అంటే సారవంతంకాని భూములు
4) కోల్స్ అంటే బురద దిబ్బలు

21. ప్రస్తుతం ఉన్న హిమాలయాలు ఏ ఫలకలు ఢీకొట్టడం వల్ల ఏర్పడ్డాయి?
1) ఆస్ట్రేలియా ఫలక, ఉత్తర అమెరికా ఫలక
2) యురేషియా ఫలక, ఆఫ్రికా ఫలక
3) యురేషియా ఫలక, ద్వీపకల్ప ఫలక
4) ఆస్ట్రేలియా ఫలక, ద్వీపకల్ప ఫలక

22. ‘కాయల్స్’ ప్రధానంగా ఏ తీరంలో కనిపిస్తాయి?
1) మలబారు తీరం 2) కోరమండల్ తీరం
3) కొంకణ్ తీరం 4) వంగ తీరం

23. జతపరచండి.
జాబితా-I
i) చిల్కా సరస్సు
ii) కొల్లేరు సరస్సు
iii) అష్టముడి సరస్సు
iv) వెంబనాడ్ సరస్సు
జాబితా-II
a) కేరళ మైదానం b) మలబార్ తీరం
c) సర్కార్ తీరం d) ఉత్కళ తీరం
1) i-c, ii-a, iii-d, iv-b
2) i-d, ii-a, iii-b, iv-c
3) i-b, ii-a, iii-d, iv-c
4) i-d, ii-c, iii-b, iv-a

24. కిందివాటిలో పశ్చిమ కనుమలకు చెందనివి ఏవి?
1) గాలి కొండలు
2) ఫళని కొండలు
3) కార్డమమ్ కొండలు
4) ఇలైమలై కొండలు

25. కింది వాటిలో సరికాని జత ఏది?
1) దూప్‌ఘర్ శిఖరం-సాత్పూరా పర్వతాలు
2) అమరకంటక్ శిఖరం-వింధ్యాపర్వతాలు
3) గురుశిఖర్- నీలగిరి పర్వతాలు
4) అనైముడి - పశ్చిమ కనుమలు

26. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ద్వీపకల్ప పీఠభూమి ప్రాక్- కేంబ్రియన్ కాలంలో ఏర్పడింది.
బి) ఇది సుమారు 16లక్షల చ.కి.మీ విస్తరించి ఉంది.
సి) ఇది భారతదేశంలో కెల్లా అతిపెద్ద భూస్వరూపం
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

27. జతపరచండి.
జాబితా-I
i) భోరట్ పీఠభూమి
ii) కథియవార్ పీఠభూమి
iii) భాఘల్‌ఖండ్ పీఠభూమి
iv) బస్తర్ పీఠభూమి
జాబితా-II
a) గుజరాత్ b) రాజస్తాన్
c) ఛత్తీస్‌గఢ్ d) మధ్యప్రదేశ్
1) i-c, ii-a, iii-d, iv-b
2) i-b, ii-a, iii-c, iv-d
3) i-d, ii-a, iii-c, iv-b
4) i-b, ii-a, iii-d, iv-c

28. మాల్వా పీఠభూమిని, దక్కన్ పీఠభూమిని వేరుచేసే నది ఏది?
1) మహానది 2) తపతి
3) నర్మద 4) గోదావరి

29. కింది వాటిలో సరికానిది ఏది?
1) మాల్వా పీఠభూమికి ఈశాన్యంగా రాజమహల్ కొండలు సరిహద్దుగా ఉన్నాయి.
2) వింధ్యాపర్వతాలు, మాల్వా పీఠభూమికి దక్షిణ సరిహద్దుగా ఉన్నాయి.
3) కర్బి అంగ్‌లాంగ్ పీఠభూమి మేఘాలయ లో ఉంది.
4) పరుష్‌నాథ్ శిఖరం అండమాన్ దీవుల్లో విస్తరించి ఉంది.

30. లావా పీఠభూమికి ఒక ఉదహరణ?
1) మహారాష్ట్ర పీఠభూమి
2) చోటా నాగపూర్ పీఠభూమి
3) షిల్లాంగ్ 4) బుందేల్‌ఖండ్

31. సాత్పూరా పర్వత శ్రేణులు ఏ నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
1) సోన్, నర్మదా 2) నర్మదా, గోదావరి
3) గోదావరి, తపతి 4) తపతి, నర్మదా

32. జతపరచండి.
జాబితా-I
i) రాజ్‌పిప్లా కొండలు ii) మహాదేవ కొండలు
iii) జవధి iv) అన్నామలై
జాబితా-II
a) కేరళ b) తమిళనాడు
c) మహారాష్ట్ర d) మధ్యప్రదేశ్
1) i-d, ii-c, iii-b, iv-a
2) i-c, ii-d, iii-b, iv-a
3) i-b, ii-c, iii-d, iv-a
4) i-b, ii-d, iii-c, iv-a

33. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ద్వీపకల్ప పీఠభూమిలో రెండో ఎత్తైన శిఖరం అనైముడి
బి) నీలగిరి పర్వతాలలో ఎత్తైన శిఖరం దొడబెట్ట శిఖరం
సి) వేసవి విడిది కేంద్రమైన ఉదక మండలం నీలగిరి పర్వతాల్లో ఉంది
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

34. ‘ఏనుగు ఎల్లమ్మ కొండలు’ ఏ పర్వత శ్రేణుల్లో భాగంగా విస్తరించి ఉన్నాయి?
1) పశ్చిమ కనుమలు
2) వింధ్యా పర్వతాలు
3) తూర్పు కనుమలు
4) ఆరావళి పర్వతాలు

35. కింది వాటిని దక్షిణం నుంచి ఉత్తరానికి అమర్చండి?
ఎ) పాల్‌ఘాట్ బి) బోర్‌ఘాట్
సి) థాల్‌ఘాట్
1) బి, సి, ఎ 2) బి, ఎ, సి
3) ఎ, బి, సి 4) సి, ఎ, బి

36. జతపరచండి.
జాబితా-I
i) మహేంద్రగిరి కొండలు
ii) సహ్యాద్రి పర్వతాలు
iii) షెవరాయ్ పర్వతాలు
iv) యాలకుల పర్వతాలు
జాబితా-II
a) ఒడిశా
b) మహారాష్ట్ర
c) తమిళనాడు
d) కేరళ
1) i-c, ii-a, iii-d, iv-b
2) i-b, ii-a, iii-d, iv-c
3) i-d, ii-a, iii-c, iv-b
4) i-a, ii-b, iii-c, iv-d

37. కింది వాటిలో సరికానిది ఏది?
1) పశ్చిమ కనుమలు సుమారు 1600 కి.మీ.ల పొడవున విస్తరించి ఉన్నాయి.
2) భారతదేశంలో కెల్లా అతిపెద్ద భూస్వరూపం గంగా సింధూ మైదానం
3) ద్వీపకల్ప పీఠభూమి వాలు తూర్పు దిశగా వాలి ఉంది
4) ద్వీపకల్ప పీఠభూమి దేశంలో కెల్లా అతిపురాతనమైన భూస్వరూపం

38. అరకాన్‌యోమా పర్వతాలు ఏ దేశంలో విస్తరించి ఉన్నాయి?
1) భారత్ 2) పాకిస్తాన్
3) భూటాన్ 4) మయన్మార్

39. కింది వాటిని ఉత్తరం నుంచి దక్షిణానికి అమర్చండి?
1) సాత్పురా పర్వతాలు, వింధ్య పర్వతాలు, ఆరావళి పర్వతాలు, నీలగిరి పర్వతాలు
2) వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు, ఆరావళి పర్వతాలు, నీలగిరి పర్వతాలు
3) ఆరావళి పర్వతాలు, వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు, నీలగిరి పర్వతాలు
4) నీలగిరి పర్వతాలు, సాత్పుర పర్వతాలు, వింధ్య పర్వతాలు, ఆరావళి పర్వతాలు,

40. కింది వాటిలో సరికాని జత ఏది?
1) జిందగాడ -పశ్చిమ కనుమలు
2) జోగ్ జలపాతం- బాబాబుడాన్ కొండలు
3) కలహట్టి జలపాతం- నీలగిరి పర్వతాలు
4) కొడై కెనాల్ - ఫళని కొండలు

41. మనదేశంలో భౌగోళికంగా గంగా- సింధూ మైదానం ఎక్కడ విస్తరించి ఉంది?
1) హిమాచల్ పర్వతాలకు ఉత్తరంగా
2) శివాలిక్ పర్వతాలకు దక్షిణంగా
3) ద్వీపకల్ప పీఠభూమికి దక్షిణంగా
4) హిమాద్రి శ్రేణులకు ఉత్తరంగా

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 3	5) 1
6) 2	7) 2	8) 2	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 1
16) 1	17) 2	18) 2	19) 4	20) 3
21) 3	22) 1	23) 4	24) 1	25) 3
26) 4	27) 4	28) 3	29) 4	30) 1
31) 4	32) 2	33) 2	34) 3	35) 3
36) 4	37) 2	38) 4	39) 3	40) 1
41) 2				

No healthier than do people exercising

BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Halt an escalation of current tensions (1)/ and preventing mass atrocities from happening in Sudan again will require (2)/ cutting off the goods and services that combatants need (3)/ to perpetrate further violence. (4)/ No error (5)
2. Acquiring material wealth or rejecting its attractions (1)/ has often been (2)/ the base upon which writers (3)/ had developed interesting plots. (4)/ No error (5)
3. Science plays a significant role (1)/ in the origin of superhero stories precisely because (2)/ that stories are really an extension (3)/ of science fiction as a genre. (4)/ No error (5)
4. The article on the subject of Colombian drug lords (1)/ published in The Economist this morning neither alludes nor specifically describes (2)/ the methods that the police employ (3)/ in the fight against crime. (4)/ No error (5)
5. During the alumni meet, (1)/ the old students reflected (2)/ on the time (3)/ they have spent in college. (4)/ No error (5)

Directions (Q.No. 6- 8): Choose the set of words which are closest in meaning to the word provided.

6. Generic
1) general, basic 2) cheap, vital
3) fresh, pure4) elderly, cheaply
5) standard, novice
7. Educe
1) demand, stipulate
2) elicit, extract
3) ideal, idyllic
4) unlawful, illicit
5) prohibit, proscribe
8. Appall
1) delirious, rambling
2) covered, exposed
3) dismay, consternation
4) confuse, scandalize
5) perplex, doubt

Directions (Q.No.9- 10): Choose the set of words which are opposite in meaning from the five options given in each question.

9. 1) rotund, plump 2) brazen, defiant
3) pique, soothe 4) peaked, ruddy
5) nadir, apex
10. 1) supercilious, meek
2) approbate, sanction
3) demur, hesitate
4) fatuous, foolish
5) quiescent, repose

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Foods that are rich in salt, likes potato chip, cheese and sauces contain high level of sodium levels that may lead to heart attacks and stroke.
1) liked potato chip, cheese and sauces
2) like potato chips, cheese and sauce
3) like potato chips, cheese and sauces
4) like potato chip, cheeses and sauce
5) No correction required
12. Poor reading skills among students of inner-city schools have not resulted from failures in teaching but insufficiently supportive home environments.
1) resulted not from failures in teaching but from
2) resulted from failures not in teaching but
3) resulted from failures not in teaching but have stemmed from
4) resulted not from failures in teaching but have stemmed from
5) No correction required
13. In a recent survey, *Physical Fitness Weekly* found that people exercising daily consider themselves no healthier than do people exercising three to five times a week.
1) not any healthier than do people exercising
2) not any healthier than do people who exercise
3) no healthier than are people who are exercising
4) not as healthy as are people who exercise
5) No correction required
14. Many people discover a need for glasses in middle age, a consequence from sitting too close to the television screen for long periods of time.
1) of sitting too close
2) which resulted from sitting too close
3) damaged from sitting too near
4) damaged because they sat too close to
5) No correction required
15. At one stage it appeared as if Indians will lost the match against Hongkong.
1) will be losing the match
2) will lost a match
3) would lose the match
4) would be losing the match
5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Shortages of canned food in the British Army in 1917 led to the government issuing cigarettes and amphetamines to soldiers to suppress their appetites.
B) But by 1916, widespread boredom with cheap canned food amongst soldiers resulted in militaries purchasing better-quality food to improve morale and the complete meals in a can began to appear.
C) Demand for canned food skyrocketed during World War I, as military commanders sought vast quantities of cheap, high-calorie food to feed their millions of soldiers, which could be transported safely, survive trench conditions, and not spoil in transport.
D) After the war, companies that had supplied military canned food improved the quality of their goods for civilian sale.
E) Throughout the war, soldiers generally subsisted on low-quality canned foodstuffs, such as the British "Bully Beef" (cheap corned beef), pork and beans, canned sausages, and Maconochies Irish Stew.
F) In 1917, the French Army began issuing canned French cuisine, such as coq au vin, Beef Bourguignon and Vichyssoise while the Italian Army experimented with canned ravioli, spaghetti bolognese, Minestrone and Pasta e fagioli.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C
4) D 5) F

Directions (Q.No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Residents can donate clothes, household items and other goods to the ____ store. The store then sells them and donates the amount to ____.
1) Thrift, charities
2) waft, aid 3) fluster, gifts
4) heterogeneous, relievers
5) assorted, donations
22. Everything about S. Russell Groves is just so, from his style of dress to his choice of words; nothing is ____.
1) Lumber 2) superfluous
3) garner 4) renovate
5) encumber
23. The MLA was charged with criminal attempt to ____ a minor and criminal attempt to ____ the morals of a minor on Thursday.
1) Entice, impair
2) ambidextrous, blight
3) ostentation, prejudice
4) qualm, weaken
5) worse, impeach
24. In order to consistently prevail you must be agreeable, amenable, and ____. These characteristics make it possible to gain trust, show compromise, and___deals.
1) Contrite, reform
2) malleable, restructure
3) frenetic, simplify
4) impugned, adjust
5) remorseful, sort
25. There is a buzz about the sudden death of one of the artists, which cast a ____ on the opening ceremonies, ____, briefly.
1) Attraction, though
2) wither, although
3) pall, albeit
4) gloom, notwithstanding
5) shadow, almost

KEY

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 1	7) 2	8) 3	9) 3	10) 1
11) 3	12) 2	13) 5	14) 1	15) 3
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 1	24) 2	25) 3